# రాయలసీమలోని
# ప్రసిద్ధ దేవాలయాలు

రచయిత

**శ్రీ పి. కృష్ణమూర్తి**

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి**

**2024**

**RAYALASEEMALONI PRASIDDHA DEVALAYALU**

*By*
**P. Krishnamurthy**

*Editor*
**Dr. Akella Vibhishana Sarma**
Special Officer
Publications Division

T.T.D. Religious Publications Series No. 1474
© All Rights Reserved
First Edition : 2024
Copies : 250

*Published by*
**Sri J. Syamala Rao,** I.A.S.,
Executive Officer
Tirumala Tirupati Devasthanams
Tirupati - 517 507.

***DTP***
Publications Division
T.T.D, Tirupati.

*Printed at*
Tirumala Tirupati Devasthanams Press
Tirupati - 517 507.





# ముందుమాట

ధార్మిక, ఆధ్యాత్మిక, భక్తి తత్త్వానికి భారతావని పెట్టింది పేరు. అనాది నుండి ఈ పుణ్యభూమిపై ప్రజల మధ్య ధార్మిక, ఆధ్యాత్మిక, భక్తి సంబంధాలు కొనసాగుతున్నాయి. భక్తుడిని భగవంతుని అనుసంధానం చేసే పవిత్ర ప్రదేశమే దేవాలయం. దేవతలకు నిలయమైనది దేవాలయం. మానసిక శాంతికి, ఆత్మవిశ్వాసానికి భగవదారాధన, ధర్మాచరణాలు సన్మార్గాలు. భగవదారాధనలో భాగంగా మానసిక ప్రశాంతతను, శారీరక ఆరోగ్యాన్ని పొందేందుకు ఎంచుకున్న పవిత్ర స్థలాలే దేవాలయాలు. దేవాలయాలు భావితరాలకు సాంస్కృతిక ప్రసార వారధులు. కలియుగంలో దేవాలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలుగా, సంస్కార కేంద్రాలుగా, విద్యావిజ్ఞాన కేంద్రాలుగా కూడా విరాజిల్లుతున్నాయి.

'రాయలసీమలోని ప్రసిద్ధ దేవాలయాలు' అనే ఈ గ్రంథలో చిత్తూరు, కడప, కర్నూలు మరియు అనంతపురం జిల్లాలలోని దేవాలయాల గురించి, వాటి చరిత్ర, నిర్మాణాలు, ఉత్సవాల గురించి క్షుణ్ణంగా వివరించబడింది.

ప్రాయికంగా దేవాలయాలలోను గాలిగోపురం, ప్రధానద్వారం, వైకుంఠద్వారం, ధ్వజస్తంభం, గర్భగుడి, ద్వారపాలకులు, వంటశాల మొదలైన విభాగాలుంటాయి. కొన్ని స్వయంవ్యక్త స్థలాలైతే, కొన్ని దివ్యస్థలాలు, కొన్ని సిద్ధస్థలాలు అంటే మహర్షులు తపస్సుచేసి సిద్ధి పొందినవారు ప్రతిష్ఠించినవి, మరికొన్ని పురాణాలలో ప్రసిద్ధిగాంచినవి. ఇంకొన్ని రాజులచేత, భక్తుల చేత ప్రతిష్ఠించబడ్డవి.

చిత్తూరు జిల్లాలో తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం, తిరుపతి గోవిందరాజస్వామి దేవాలయం, శ్రీ కోదండరామస్వామి దేవాలయం, శ్రీనివాసమంగాపురం కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయం, తిరుచానూరు పద్మావతీ అమ్మవారి దేవాలయం మున్నగు వైష్ణవాలయాలు, కపిలతీర్థం, శ్రీకాళహస్తి, సురుటుపల్లి, కాణిపాకం మొదలైన శైవాలయాలతో పాటు ఇతర సుప్రసిద్ధ ఆలయాల చరిత్రలు కూడా ఉటంకించబడ్డాయి.

కడప జిల్లాలో ఒంటిమిట్ట కోదండరామాలయం, దేవుని కడప శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం, నందలూరు చెన్నకేశవస్వామి ఆలయం, గండి వీరాంజనేయస్వామి ఆలయం మొదలైన సుప్రసిద్ధ ఆలయాల చరిత్రలు వివరించబడ్డాయి.

కర్నూలు జిల్లాలో శ్రీశైలం భ్రమరాంబికామల్లికార్జునస్వామి దేవాలయం, అహోబిలం నవనారసింహస్వామి ఆలయాలు, మహానందిలో మహానందీశ్వర స్వామి ఆలయం, యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయం, మద్దిలేటి నరసింహస్వామి ఆలయం, కొలనుభారతి సరస్వతీదేవి ఆలయం మొదలైన అనేక ప్రాచీన ఆలయాల చరిత్రలు విశదీకరించబడ్డాయి.

అనంతపురం జిల్లాలో కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం, గోరంట్ల మాధవరాయస్వామి ఆలయం, లేపాక్షి వీరభద్రస్వామి ఆలయం, పెన్నహోబిలం నరసింహస్వామి ఆలయం, కాసాపురం (నెట్టికంటి) ఆంజనేయస్వామి ఆలయం మొదలైన సుప్రసిద్ధ ఆలయాల చరిత్రలు ఇందులో వివరించబడ్డాయి.

రాయలసీమలోని దేవాలయాల గురించి పరిశోధనాదృక్పథంతో శ్రమించి, విషయాన్ని సంగ్రహించి మనకు అందించిన రచయిత శ్రీ పి.కృష్ణమూర్తి గారిని అభినందిస్తూ శ్రీనివాసుని అనుగ్రహం కలగాలని ఆకాంక్షిస్తున్నాను.

ఈ మంచి గ్రంథాన్ని ఎంపిక చేసి చక్కగా ముద్రాపింపజేసిన ప్రచురణల విభాగం ప్రత్యేకాధికారి డా॥ ఆకెళ్ళ విభీషణశర్మ గారికి శుభాభినందనలు.

సదా శ్రీ వేంకటేశ్వరస్వామి సేవలో

శ్రీ కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

## విషయసూచిక


1. తిరుమల - శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం
2. తిరుపతి - గోవిందరాజస్వామి ఆలయం
3. తిరుపతి - కోదండరామాలయం
4. తిరుపతి - కపిలేశ్వరాలయం
5. శ్రీనివాసమంగాపురం - కల్యాణ వేంకటేశ్వరాలయం
6. తిరుచానూరు - పద్మావతి అమ్మవారి దేవాలయం
7. నాగలాపురం - శ్రీ వేదనారాయణస్వామి దేవాలయం
8. నారాయణవనం - అగస్త్యేశ్వరాలయం
9. నారాయణవనం - అవనిజాక్షి అమ్మ దేవాలయం
10. అప్పలాయగుంట - ప్రసన్న వేంకటేశ్వరాలయం
11. తొండమనాడు - శ్రీ కోదండరామాలయం
12. కార్వేటినగరం - వేణుగోపాలస్వామి ఆలయం
13. శ్రీకాళహస్తి - శ్రీకాళహస్తీశ్వరాలయం
14. సోంపాలెం - చెన్నకేశవ ఆలయం
15. గుడిమల్లం - పరశురామేశ్వరాలయం
16. కాణిపాకం - వరసిద్ధి వినాయకస్వామి దేవాలయం
17. సురుటుపల్లి - నీలకంఠేశ్వరాలయం
18. ఒంటిమిట్ట - కోదండరామాలయం
19. కడప - ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం
20. పాలకొండ - రాయస్వామి ఆలయం
21. నందలూరు - సౌమ్యనాథస్వామి ఆలయం
22. గండి - శ్రీ వీరాంజనేయస్వామి ఆలయం

23. పుష్పగిరి క్షేత్రము - చెన్నకేశవస్వామి ఆలయం,
సంతాన మల్లేశ్వరాలయం, ఉమామహేశ్వరాలయం
24. రాయచోటి - శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయం
25. శ్రీశైలం - భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయం
26. అహోబిల - నరసింహస్వామి ఆలయం
27. మహానంది - మహానందీశ్వరాలయం
28. యాగంటి - ఉమామహేశ్వరస్వామి ఆలయం
29. ఊరుకొండ - లక్ష్మీనరసింహస్వామి దేవాలయం
30. మద్దిలేటి - నరసింహస్వామి ఆలయం
31. శివపురం - కొలను భారతీదేవి ఆలయం
32. కదిరి - లక్ష్మీనరసింహస్వామి
33. గోరంట్ల - మాధవరాయస్వామి
34. లేపాక్షి - వీరభద్రాలయం
35. తాడిపత్రి - బుగ్గ రామలింగేశ్వరాలయం
చింతల వేంకటరమణాలయం
36. పామిడి - భోగేశ్వరాలయం
37. పెన్నహోబిలం - లక్ష్మీనరసింహ దేవాలయం
38. నెట్టికంటి - ఆంజనేయస్వామి ఆలయం
39. హేమమతి - సిద్ధేశ్వరస్వామి ఆలయం
40. శ్రీ మాలకొండస్వామి ఆలయం
41. మార్కాపురం - చెన్నకేశవస్వామి ఆలయం

* * *

# తిరుమల - శ్రీ వేంకటేశ్వరాలయము

**వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన ।**
**వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి ॥**
**'కలౌ వేంకటనాయకః (కలియుగమునకు వేంకటనాయకుడు)**



భారతదేశములో ఆసేతుహిమాచల పర్యంతము, సర్వమతాలు, సర్వజనావళికి ఆరాధ్యదైవము తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు. అందుచేతనే ఈ క్షేత్రమును కలియుగ వైకుంఠమంటారు. ఈ క్షేత్రమును గురించి, ఇచ్చట వెలసిన శ్రీనివాసుని గురించి పురాణాలలో, మత, సాహిత్య గ్రంథాలలో అనేక కథలు ప్రచారమందున్నవి. ఇందులోని కొన్ని కథలు 'వేంకటాచల మాహాత్మ్య' మనే గ్రంథమందు చోటుచేసుకొన్నవి. మొదట ఋగ్వేదమునందు ఈ స్థలప్రసక్తి పేర్కొనబడినది. ఆపై మహాభారతమందలి మౌసలపర్వమందు శ్రీకృష్ణుడు కలియుగమందు వేంగడముపై శిలారూపమును ధరించి భక్తులకు దర్శనభాగ్యము కలిగిస్తానని తెలిపినాడు. అంతేకాక వరాహపురాణము, బ్రహ్మాండపురాణము, పద్మపురాణము, స్కాందపురాణము, భవిష్యోత్తరపురాణములందు వేంకటనాథుని గురించిన కథలు చోటుచేసుకొన్నవి.

**శేషాచలవాసుడు**

శ్రీమహావిష్ణువు వైకుంఠమును వదలి, భూలోకములో నివసించవలయునని సంకల్పించి తన యుద్దేశమును నారదమునీంద్రునికి

తెలియజేయగా, ఆతడు మేరుపర్వతమందలి శేషాచలము శ్రీనివాసుని వాసమునకు అనువైన ప్రదేశమని వచించినాడు. ఈ సమయమునందే ఆదిశేషునికి, వాయుదేవునికి తమలో ఎవరు బలవంతులు అనే విషయముపై వివాదమేర్పడి, బలపరీక్షకై శేషుడు మేరుపర్వతమును తన శరీరముతో చుట్టి, శక్తి వున్నట్లయితే తన్ను కదిలించమని వాయువుతో సవాలు చేసినాడు. వాయుదేవుడు ఎంత ప్రయత్నించినా సర్పమును కదిలించలేక చింతాక్రాంతుడైయున్న సమయమున, శేషుడు గాలిపీల్చడానికై నోరు తెరవగా, సమయము కోసం కాచియున్న వాయువు సర్పము నోటిద్వారా దాని వుదరమునందు ప్రవేశించి, కొండను కదిలించసాగినాడు. కొండ కొంతదూరము కదిలివెళ్ళగా, మేరువు వాయుదేవుని తన్ను కదిలించవద్దని ప్రార్థించినది. ఈ ఓటమికి సిగ్గుపడి ఆదిశేషుడు శ్రీమహావిష్ణువును గురించి తపస్సు చేయగా, శ్రీపతి ప్రత్యక్షమై వరమును కోరుకొమ్మనగా, తన్ను కొండ ఆకారముగా మార్చి, దానిపై శ్రీనివాసుని స్థిరనివాస మేర్పరచుకోమని వరముకోరెను. భక్తుని కోరిక ప్రకారము నారదమునీంద్రుడు సూచించిన మేరుపర్వత ముఖద్వారమున శేషుని కొండరూపముగా మార్చి, శేషాచలమనే ఆ కొండపైన శ్రీహరి శిలారూపమున స్థిరనివాసమేర్పరచుకొన్నాడు.

ఇంకొక కథనము ప్రకారము కలియుగారంభమునకు పూర్వము దేవ ఋషులనేకమంది యజ్ఞం చేయడానికి గంగానదీతీరమందు సమావేశమైయుండగా నారదుడు ఋషులను వారు యజ్ఞమును ఏ దేవుని ప్రీతికోసము సంకల్పించినారో తెలిసికొనుటకు ప్రయత్నించగా ఋషుల వద్దనుండి సరైన సమాధానము లభించకపోవుటచే భృగుమహర్షి వద్దకెళ్ళి తిరిగి తన సందేహమును వెలిబుచ్చగా, భృగువు ఆలోచించి త్రిమూర్తులను పరీక్షించి, వారిలో ఎవరు అర్హులో నిర్ణయించిన తరువాత వారి సంతృప్తికోసం యజ్ఞము జరిపించెదమని పలికెను.

భృగువు త్రినాథులను పరీక్షించుటకై మొదట బ్రహ్మవద్దకు వెళ్ళగా, వాచస్పతి ఒకనోటితో వేదాలు వల్లిస్తూ, రెండవదానితో నారాయణ మంత్రమును జపిస్తూ, మూడవ నోటిని కదిలించకుండా కండ్లతో అర్ధాంగి వాణి ముఖారవిందమును తనివితీర వీక్షిస్తూ, భృగుమహర్షి రాకను గమనించలేని పరిస్థితిలో వున్నాడు. అసంతృప్తుడైన భృగువు సదాశివుని పరీక్షించుటకై కైలాసమునకు వెళ్ళగా, పార్వతీదేవితో రాసక్రీడలాడుచుండిన సదాశివుడు మహర్షిరాకను గుర్తించలేదు. విసుగు చెందిన భృగువు కడపటి ప్రయత్నముగా శ్రీహరి దర్శనార్థమై వైకుంఠమునకు వెళ్ళగా మహావిష్ణువు శ్రీదేవితో సరస సల్లాపములందు మునిగియుండి మునీంద్రుని రాకను గమనించలేదు. ముక్కోపియైన మునీంద్రుడు తనను త్రిమూర్తులు అవమానము చేసినారని తలపోసి, శ్రీహరియనికూడ ఎంచక, లక్ష్మీదేవి సన్నిధిలోనే మహావిష్ణువుఛాతీపై కాలితో తన్నినాడు. నటనసూత్రధారి భృగుమహర్షి చెంతకుచేరి తన యెదను తాకినందువల్ల పాదమునకు నొప్పి కలిగియుండునని, ఋషీశ్వరుని పాదములొత్తుచూ, అతని గర్వమునకు కారణమగు అతడి పాదమున ఉన్న మూడవ కంటిని నలిపివేసినాడు. పశ్చాత్తాపంతో భృగువు యజ్ఞము మహావిష్ణువుప్రీతికోసమే అని నిర్ణయించినాడు.

ఐతే, తన నివాసమైన శ్రీహరి వక్షఃస్థలమును తన్నిన భృగువును శిక్షించక, అరికాళ్ళను పట్టి వత్తుట అవమానముగా భావించి, అలిగి శ్రీమహాలక్ష్మి వైకుంఠమును వదలి భూలోకమునందలి కొల్హాపురము చేరినది. సతీవియోగమును భరించలేని శ్రీహరి, భూలోకముచేరి శేషాచలమందు నివాసమేర్పరచుకొన్నాడని భవిష్యోత్తరపురాణము తెలుపుతూ వున్నది.

**వేంకటాచలవాసుని ఆలయనిర్మాణము**

పూర్వమొక చోళరాజు వద్ద పెద్ద ఆవులమంద వుండేదట! వాటిలో ఒక ఆవు అడవికి మేతకు వెళ్ళినపుడు ఒక పుట్టలో తన పొదుగునందలి



పాలను వదిలేది. ఆవు చాలా రోజులనుండి పాలను ఇచ్చుటలేదని తెలుసుకొన్న రాజుగారు, ఆ ఆవు నొకకంట కనిపెట్టి వుండమని పశువుల కాపరిని హెచ్చరించినాడు. మరుసటిరోజు పశువులకాపరి ఆ ఆవువెంటనే వెళ్ళుతుండగా, అది యథాప్రకారము పుట్టవద్దకెళ్ళి పాలను విడువసాగినది. పశువుల కాపరి కోపమునాపుకోలేక చేతినున్న గొడ్డలిని ఆవుపైకి విసిరినాడు. ఆ దెబ్బ ఆవుకు తగలక, పుట్టలోనుండి పాలను త్రాగుచుండిన శ్రీనివాసునికి తగిలి రక్తముకారగా, ఆ దృశ్యమును చూచి ఆ గొల్లడు అచ్చుటికచ్చుటే మరణించాడు. విషయమును విన్న రాజుగారు పుట్టవద్దకు వెళ్ళి స్వామిని చూచి, తన అజ్ఞానానికి దుఃఖించి పాపపరిహారము కోసము తన ముద్దులబిడ్డ పద్మావతిని స్వామికిచ్చి వివాహము జరిపించినాడట. స్వామివారికి మొదట చిన్న ఆలయమును నిర్మించి ఆయనకు కిరీటమును సమర్పించినాడు. ఈనాడు కూడా ప్రతి శుక్రవారము స్వామివారి శిరస్సు నలంకరించే కిరీటమదే. ఆ కిరీటమును సమర్పించిన రాజుగారే ఆకాశరాజని స్థలపురాణము పేర్కొనుచున్నది.

## శ్రీనివాసకల్యాణము

శ్రీ మహావిష్ణువు ఒకరోజు వేటగాని వేషము ధరించి వేంకటాచల పర్వతమునకు వేటకువెళ్ళి, అచ్చట ఒక ఏనుగును తరుముతూండగా తోటలో పూవులు కోయుచున్న ఒక రాజకుమార్తె ఆమె చెలికత్తెలు కంటబడినారు.

ఆమె ఆకాశరాజు చక్రవర్తి ముద్దుల కుమార్తె. ఈమె ఆకాశరాజు గారికి భూమి దున్నుచుండగా పద్మములో పరుండి లభించిన కారణంగా "పద్మావతి" అని పేరు పెట్టినారు. ఆమె అందానికి ముగ్ధుడైన శ్రీనివాసుడు ఆమెకు తన ప్రేమను వెల్లడించగా ఆమె నిరాకరించినది. శ్రీహరి దుఃఖితుడైయుండగా తనకు సపర్యలు చేయుచున్న వకుళాదేవి, స్వామి మనస్తాపమునకు కారణము తెలుసుకొని రాజుగారి వద్దకు రాయబారము వెళ్ళినది. వకుళ రాజుగారి వద్దకు చేరకపూర్వమే శ్రీనివాసుడు ఎరుకలసాని వేషములో రాణివాసము చేరి పద్మావతితో అడవిలో కనిపించిన శ్రీనివాసుని పరిణయమాడమనినది. వకుళ రాజుగారి వద్దకెళ్ళి, విషయము వివరించగా, రాజు తన కుమార్తెను శ్రీనివాసునికిచ్చి వివాహము జరిపించగా, ఆ కళ్యాణమహోత్సవానికి సకల దేవతలు అరుదెంచినారు. ఆకాశరాజు మరణానంతరము ఆతని కుమారులు స్వామివారికి ఆలయము నిర్మించి అనేక ఆభరణములను సమర్పించినారు.

## రంగదాసువృత్తాంతము

పూర్వము దక్షిణదేశమందు గోపినాథుడనే బ్రాహ్మణుడు శ్రీకృష్ణుని ప్రార్థించి, మోక్షము ప్రసాదించమని వేడగా అతడు వేంకటాచలమందు శ్రీనివాసుని ప్రార్థించమనగా గోపినాథుడు, రంగదాసనే శూద్రుని సహాయముతో కొండ ఎక్కి అచ్చట పుట్టలోనున్న మహావిష్ణువు విగ్రహమును వెలికి తీసి వెదురుదబ్బలతో మండపము నిర్మించి, అందున స్వామిని ప్రతిష్ఠించి, ప్రతిదినము భక్తితో స్వామిని పూలమాలతో అలంకరించి పూజ చేసేవాడు. ఒకరోజు రంగదాసు పూలకెళ్ళి, అచ్చట గంధర్వుల కామక్రీడలను గమనిస్తూ, కామావేశాన్ని నిగ్రహించుకోలేక ఇంద్రియస్ఖలనము చేసినాడట! ఆపై తన తప్పును తెలిసికొని కొలనులో స్నానమాచరించి తిరిగి మాలను కట్టి గోపినాథుని వద్దకు వెళ్ళగా అతడు ఆలస్యమునకు కారణమేమిటని ప్రశ్నించగా రంగదాసు బదులుపలుకలేదు. అప్పుడు అశరీరవాణి రంగదాసునితో 'నీ మనస్థితి సక్రమంగా లేదు. నీవు దైవకార్యము

నిర్విఘ్నముగా నెరవేర్చలేదు. మరుజన్మలో నీవు రాజుగా జన్మించెదవు. అప్పుడు నీవు కోరిన ప్రాపంచిక సుఖములననుభవిస్తూ స్వామివారి విగ్రహం చుట్టూ ఆలయము నిర్మించి జన్మసార్థకం చేసుకో' అన్నది. ఆ విధముగానే రంగదాసు నారాయణవనరాజ్యమందు జన్మించి, రాజరికమును స్వీకరించి, రోజూ నరసింహబిలముద్వార తిరుమలకేతెంచి స్వామిని సేవిస్తూ, స్వామికి గోపుర ప్రాకారముతో నిండిన ఆలయాన్ని నిర్మించి, అనేక ఆభరణములు చేయించినాడు. ఒకమారు శత్రురాజులు నారాయణవనముపైకి దండెత్తగా, శ్రీనివాసుడు తన భక్తుడైన రాజునకు తన శంఖ, చక్రములను ప్రసాదించగా, ఆ ఆయుధములతో రాజు శత్రుసంహారము కావించినాడు. అందుచేతనే రామానుజాచార్యుల కాలం వరకు స్వామివారికి శంఖచక్రాలు లేవని తెలుస్తున్నది.

మరొక కథనము ప్రకారము పూర్వము 'శంఖ' అనేరాజు తన పేరు భూమిపై శాశ్వతముగా నుండేటట్లు ఏదైనా మంచికార్యము చేయవలయునని తలంచి వసిష్ఠమహర్షి సలహాను కోరగా, ఆయన వేంకటాద్రిపైని స్వామిని ప్రార్థించమన్నాడు. 'శంఖ' ఆ విధముగా స్వామిని కొంతకాలము సేవించగా, శ్రీహరి ఒక బంగారు విమానములో ప్రత్యక్షమై, అటువంటి విమానమును నిర్మించి అందు తన విగ్రహమును ప్రతిష్ఠించమన్నాడు. స్వామి కోరికమేరకు 'శంఖ' తన కీర్తి ఆచంద్రతార్కముండే విధముగా ఈనాటి 'ఆనందనిలయ' విమానమును నిర్మించినాడు.

పూర్వము చోళదేశమును తొండమాను చక్రవర్తి పాలించుచుండగా పశువుల కాపరులు అడవిలోని ఆవులనుండి పాలను పితికి నగరమునకు తెచ్చుచుండగా ప్రతిరోజూ ఒక పుట్టవద్దకు రాగానే పాలకుండ పగిలి, పాలన్ని పుట్టలోనికి వెళ్ళేవి. ఆ విషయము విన్న రాజు, ఆ వింతను గురించే తీవ్రముగా ఆలోచించుచుండగా, రాజుగారి కలలో ఒక నీలమేఘవర్ణుడు కనిపించి, 'శ్రీనివాసుడు వేంకటాద్రిపై దేవీసమేతముగా నివసిస్తూ ఉన్నాడు.

నీవు వెళ్ళి ఆయనను దర్శించి, పూజించు'మనగా రాజుగారు శేషాచలమునకు వెళ్ళి పుట్టలోనున్న స్వామిని దర్శించినాడు. అప్పుడచ్చట శబరుడనే వ్యక్తి కనబడి, 'ప్రభూ నేను ఈ అడవియందు నివసిస్తూ, ప్రియంగు చెట్లను పెంచి వాటి ఫలాలను కొన్నింటిని స్వామికి సమర్పిస్తూ కొన్నింటిని నేను భుజిస్తూ వుంటాను. ఒకమారు నేను తేనె తీయడానికి వెళ్ళుతూ నా కుమారుని పండ్లు కోయమనగా అక్కడికి ఒక శ్వేతవరాహము వచ్చి కొన్ని పండ్లను తిని మిగిలిన పండ్లను నా కుమారుడు భుజించినాడు. నాకు కోపమువచ్చి నా కొడుకును చంపబోగా, అశరీరవాణి 'బాలునికంటే మునుపే స్వామి వరాహరూపమున వచ్చి పండ్లను తిన్నాడని' చెప్పినది. అని రాజుగారికి తెలుపగా, రాజు వేయి కుండలలో పాలను తెచ్చి శబరుని వెంట వెళ్ళి, అతడు చూపించిన పుట్టపై పాలను పోయించగా, పుట్ట కరిగి శంఖచక్రములను ధరించిన దివ్యమంగళకరమైన స్వామివిగ్రహము బయటపడినది. రాజుగారు స్వామిని స్తోత్రముచేసి అచ్చట స్థిరనివాసమేర్పరచుకోమనగా, స్వామి అందులకంగీకరించి, శేషాచలముపై వేంచేసినాడు. రాజు స్వామికి ఆలయము నిర్మించి, పూజలు చేస్తూ, పూజా సమయములో దేవునితో మాట్లాడేవాడు. స్వామివారి ఆలయనిర్మాణమునకు చెందిన యిలాంటి కథలు వందలు, వేలసంఖ్యలో ప్రచారమునందున్నవి.

వేంకటాచల పర్వతమను ఈ కొండకు అనేక యితర నామములు కూడా ప్రచారమునందున్నవి. మునుపు ఈ కొండపై వృషభాసురుడు తపస్సు చేసినందువల్ల 'వృషభాద్రి' అని, నారాయణుడు అనే బ్రాహ్మణుడు తపమాచరించి స్వామి సాక్షాత్కారమును పొందుటచే 'నారాయణాద్రి' యని, అంజనాదేవి హనుమంతుని ఈ పర్వతముపై ప్రసవించుటచే 'అంజనాద్రి' యని, శ్రీనివాసుని వాహనమైన 'గరుడుడు' ఇచ్చట నివాసమేర్పరచుకొన్నందువల్ల 'గరుడాద్రి' యని, వేంకటేశ్వరుని నిలయమై యుండుటచే 'వేంకటాద్రి' అని, కొండపై వరాహ క్షేత్రముండుటచే 'వరాహాద్రి' అని,

కొండలు స్వర్ణమయముగానుండుటచే 'కనకాద్రి' అని, శ్రీనివాసుడు కొండపై కొలువైయున్నందున 'శ్రీనివాస' మని, వందలకొలది తీర్థములు జన్మించుటచే 'తీర్థాద్రి' అని ప్రసిద్ధికెక్కినది.

తిరుపతి కొండమీదను, దిగువ తిరుపతియందును అనేక తీర్థములున్నవి. వాటిలో స్వామి పుష్కరిణి, పాపవినాశనము, గోగర్భతీర్థము, తుంబురతీర్థము, ఆకాశగంగ, వైకుంఠతీర్థము, సనకసనందన తీర్థము, కపిలతీర్థము ప్రముఖమైనవి. మహావిష్ణువు శ్రీగిరిపై నివాసమేర్పరచుకోగా, గరుత్మంతుడు సృష్టిలోని సర్వ తీర్థములకు జన్మస్థలమై, సర్వపాప విముక్తిదాయకమైన స్వామి పుష్కరిణిని భూమిపైకి కొనివచ్చి, స్వామిచెంత నెలకొల్పినాడు. ఇందు స్నానమాచరించినచో ఇష్టసిద్ధి కలుగుతుంది. రామలక్ష్మణులు రావణ సంహారమునకై వెళ్ళుచున్న తరుణమందును, పాండవులు అరణ్యావాసమందు, ఈ పుష్కరిణియందు స్నానమాచరించి ఇష్టసిద్ధిని పొందినారు.

పాపవినాశనము స్వామి పుష్కరిణికి మూడుమైళ్ళ దూరమున ప్రశాంత వాతావరణమందున్న జలపాతము. అనాదినుండి ఎందరో మహర్షుల తపస్సులకీ తీర్థము కేంద్రము. ఈ తీర్థమందు స్నానమాచరించినచో దుష్టశక్తులచే పీడింపబడువారు విముక్తులగుటేగాక, దీర్ఘవ్యాధులనుండి విముక్తులయ్యెదరు.

ఆకాశగంగ మరొక పవిత్ర తీర్థము. స్వామి అర్చనకు రోజు ఈ తీర్థమునుండి మూడు బిందెల నీళ్ళుతెచ్చి ఉపయోగిస్తారు. గోగర్భము స్వామి ఆలయమునకు మైలు దూరమున యున్నది. తిరుమలకొండపై నీటిఎద్దడి తీర్చుటకు, ఈ తీర్థముయొక్క ముఖద్వారమున ఆనకట్ట నిర్మింపబడినది. ఈ తీర్థమందు 'క్షేత్రపాలగుండు' అనే బండరాయి వున్నదట! ఆలయసిబ్బంది (అర్చకులు) యందు తగాదాలు వస్తే, ఈ బండరాయి వద్దకు వచ్చి

ప్రమాణమాచరిస్తారు. ఇచ్చట అసత్యము పలికినవారు అపవాదులపాలై, హరించుకుపోతారని ప్రజల విశ్వాసము.

తిరుపతియందున్న ఆళ్వారుతీర్థం, దానినే కపిలతీర్థమని, చక్రతీర్థమని పిలుస్తారు. ఇచ్చట పూర్వము కపిలముని అనే మహర్షి కపిలేశ్వరలింగమును ప్రతిష్ఠించినాడట. మునుపు ఈ తీర్థము నుండి స్వామివారి ఆలయమువరకు సొరంగమార్గముండెడిదట. ఈ తీర్థము నందు ఆళ్వారులు తీర్థమాడి స్వామిని నిత్యము సేవించెడివారు. ఇచ్చటే దేవేంద్రుడు స్నానమాచరించి, అహల్యా సంగమపాతకము నుండి విముక్తుడైనాడట! అచ్యుతరాయలు పట్టాభిషేక మహెూత్సవమునకు ముందు ఈ తీర్థమునందే స్నానమాడి విజయనగర చక్రవర్తిగా ప్రకటించుకొన్నాడు.

తిరుపతిలో మరొక పేరెన్నికగన్న తీర్థము నరసింహతీర్థము దీనిని 'మంచినీళ్ళగుంట' అనికూడా పిలుస్తారు. ఇందలి నీరు ప్రశస్తమై యుండుటచేతనే గోవిందరాజస్వామి అభిషేకమునకు రోజూ ఆలయ మర్యాదలతో నీటిని తీసికెళ్ళుతారు. తీర్థముగట్టుమీద గొప్ప అనంతశాయి విగ్రహమున్నది. ఎంతటి కరువుకాటకములందు కూడ ఈ తీర్థము ఎండిపోదు. కొంతమంది సనాతను లీనాడుకూడ ఈ కోనేటి నీటినే త్రాగుటకుపయోగిస్తూ ఉన్నారు.

### వరాహక్షేత్రము

భృగుమహర్షి శ్రీహరి వక్షఃస్థలముపై తన్నగా, రమాదేవి తన నివాసమైన వక్షాన్ని తన్నిన ఋషిని శపించలేదని, వైకుంఠము వదలి భూలోకములోని కరివీరపురము (కొల్హాపురి) చేరినది. దేవీవిరహముతో స్వామి భూలోకమునకేతెంచి, వరాహక్షేత్రమందు విహరించుచుండగా, వరాహస్వామి శ్రీనివాసుడు వైకుంఠమును వదలి వచ్చిన కారణమును తెలుసుకొని, శ్రీహరితలపై గొల్లని గొడ్డలిచేత తగిలిన గాయమును చూచి,

ఆతనికి సపర్యలు చేయుటకు తన వంటమనిషి వకుళాదేవిని పంపినాడు. అప్పుడు స్వామి వరాహునితో 'నేను కలియుగాంతము వరకు ఇచ్చటనే ఉండదలచాను. నా నివాసమునకై కొంత స్థలమివ్వు'మనగా, ధనమిచ్చి స్థలమును కొనమన్నాడు వరాహుడు. శ్రీనివాసుడు నావద్ద ధనము లేదని, నన్ను చూడడానికి వచ్చెడి భక్తులు ముందుగా నీ దర్శనము చేసుకొనేటట్లు ఏర్పాటు చేసెదనన్నాడు. ఆ యొడంబడిక ప్రకారము స్వామి నివసించు క్షేత్రమునకు వరాహక్షేత్రమని, స్వామివారి దర్శనానికై వచ్చెడివారు ముందుగా వరాహస్వామి దర్శనము చేసికోవలయునని నియమము ఏర్పడినది.

## వేంకటేశ్వరుడు ఏ మతానికి సంకేతము

తిరువేంగడనాథుని జైనులు 'ఆదిమూలు'డని, శైవులు 'మహాదేవు'డని, దేవి వుపాసకులు 'బాలాత్రిపురసుందరి' యని, వైష్ణవులు 'మహావిష్ణువు' అని వాదిస్తున్నారు. వారి వాదనములకు స్వామివారి అలంకరణ, పూజావిధానములు, అంగసౌష్ఠవములే కారణములు. శ్రీనివాసుని ఆలయము జనసంచారమునకు దూరముగా కొండ లోయలలో ప్రశాంతమైన వాతావరణమున నెలకొనియున్నందునను, స్వామివారి కుడి వక్షఃస్థలముపై శ్రీవత్సముండుటచేతను, ఆలయమందు సింహనికేతనములుండుటచేతను, స్వామికి ఆదిమూలుడని పేరుండుట చేతను, ఇవన్నియు జైనమత సంకేతములు కావున, స్వామివారు జైనుడని, జైనమతము విచ్ఛిన్నమైన తర్వాత వైష్ణవులు ఆ విగ్రహమును విష్ణుమూర్తిగా రూపుదిద్దుకొన్నారని అభిప్రాయపడుచున్నారు.

శైవులు స్వామివారికి రోజూ షడక్షరీమంత్రము పఠనము గావించుట చేతను, స్వామికి శ్రీవత్సముండుటచేతను, నాగాభరణుడగుటచేతను, స్వామివారికి 'ధనుర్' మాసమందు బిల్వార్చన, స్వామివారికున్న జటాజూటము, యాత్రికులు తలనీలాలు సమర్పించే ఆచారము, గర్భాలయమందు, వైష్ణవాలయములవలె స్వామివిగ్రహము గోడను అంటి

లేక, శైవాలయములందువలె మధ్యభాగమున వుండుటచేత, శివరాత్రి పర్వదినాన స్వామికి అభిషేకము చేయుట, ప్రతి మంగళవారము స్మార్తశైవులు స్వామికి పొంగలి నైవేద్యము పెట్టుట, వినాయకచవితిరోజు స్వామికి కుడుములు నైవేద్యము చేయుట, స్వామివారి ఆలయప్రాంగణమునందు 'నంది' మరియు దైవమత శిల్పములెక్కువగా వుండుటచేత, శైవమత సాంప్రదాయమున స్మార్తులు స్వామికి అలంకరణ, అభిషేకము కావించుటచేత, అన్నిటికిమించి స్వామివారికి 'విరూపాక్షుడు' అని పేరుండుటచేత స్వామి శివుని ప్రతిరూపమని వారి నమ్మకము.

స్వామి బ్రహ్మచారిగా, 'స్వామిపుష్కరిణి' ప్రక్కన ఏకాంతవాస ముండుటచే, ఇతనిని 'కుమారస్వామి' అనికూడా తలపోయుచున్నారు. దేవీ ఉపాసకులు, స్వామి వక్షఃస్థలము ఉబ్బెత్తుగా స్త్రీ వక్షఃస్థలమును పోలియున్నదని, జుట్టు వొత్తుగా, పొడవుగా నుండుటచేతను, స్వామి గర్భాలయము నాలుగువైపుల దేవి వాహనమైన సింహప్రతిమలుండుట చేతను, స్వామి బ్రహ్మోత్సవములు కన్యామాసమందు, దేవి నవరాత్రుల కాలమందు జరుగుటచేతను, స్వామివారికి పసుపునీటితో ప్రతి శుక్రవారము అభిషేకము చేయుటచేతను, బ్రహ్మోత్సవములు ముగిసిన వెంటనే, స్వామికి ఎర్రటి అన్నమును వేపాకులో పెట్టి సమర్పించుటచేతను, ఉత్తర భారతీయులు స్వామిని "బాలాజీ, బాలాత్రిపురసుందరిగా" వ్యవహరించుటచేతను, గురువారమందు స్వామికి చీరలాంటి వస్త్రం వక్షఃస్థలము నానుకొని పొడవాటి కత్తి వుండుటచేతను స్వామిని "శక్తిస్వరూపిణి" యనుచున్నారు.

క్రీస్తుశకము 12వ శతాబ్దమందు శైవులకు, వైష్ణవులకు స్వామి విగ్రహము విష్ణువుదా, లేక మహేశ్వరునిదా? అనే వాదోపవాదమేర్పడగా, ఆనాటి మతాధికారులమధ్య వివాదమును పరిష్కరించుటకు నారాయణవన రాజ్యపాలకుడైన యాదవరాయలు, బంగారు శంఖ, చక్రములను తయారు చేయించి, ఉభయవర్గములవారి సమ్మతితో, స్వామివారి ముందువుంచి,

గుడి తలుపులకు తాళములు బిగించి, తెల్లవారి తలుపులు తెరిపించగా, శంఖ, చక్రములు స్వామి భుజములను అలంకరించినవట. అందుచేత స్వామి విష్ణువే అని నిర్ధారణ చేయబడినది.

తిరుమలేశుడు హరి, హరుల కలయిక అని నమ్మి, అటు శైవులు, ఇటు వైష్ణవులు నేడు పూజిస్తున్నారు. తుట్టతుదకు మహమ్మదీయులు కూడా స్వామిని పూజించినట్లు ఆలయమందు ప్రతిష్ఠింపబడిన తోడర్‌మల్లు, అతడి తల్లి, భార్యల విగ్రహాలు సాక్ష్యాన్నిస్తున్నాయి. మహమ్మదీయులకు స్వామి అల్లుడట! 'బీబీ నాంచారమ్మ'ను వివాహమాడిన తర్వాత ఆమె స్వామివెంట తిరుమలకేతెంచి, తన మతస్థులెవరు కానరాకపోవుటచే చింతాక్రాంతురాలై వుండగ, అది గమనించిన శ్రీనివాసుడు " దేవీ నీవారెవరు ఇచ్చటికి రారని దిగులుపడవద్దు. వచ్చేటప్పుడు నా వాళ్లైతే, వెళ్ళేటప్పుడు వాళ్ళు నీవాళ్ళు" అన్నాడట! అందుకే కొండమీదికి వచ్చిన యాత్రికులు మహ్మదీయులవలె జుట్టు గీయించుకొంటారట! ''వేంకట'' అనే పదము సర్వపాప నివారణోపాయము "వేం" అనగా పాపము, "కట" అనగా నివారణ, "వేంకట" అనగా పాపనివారణకర్త అని సర్వప్రాణికోటి సేవిస్తున్నది.

**ఆలయనిర్మాణము**

వేంకటేశ్వరాలయము వంచిపట్టిన ధనస్సు ఆకారముతో కొండమధ్యన విశాలమైన ఆవరణమందు నిర్మాణమైనది. ఆలయము తూర్పు పడమరలుగా 414' అ. ఉత్తరదక్షిణములుగా 263' అ. కొలతలను కలిగియున్నది. ఆలయముచుట్టూ పెద్ద పెద్ద రాతిబండలు ఒకదానిపై ఒకటిగా అమర్చి నిర్మించిన ప్రాకారమున్నది. ఆలయప్రవేశమునకు తూర్పువైపున ఉన్న ఒకే ఒక గోపురమును పడికావలి గోపురము అంటారు. గోపురపైభాగము మహంతుల పాలనాకాలమందు నిర్మితమైనది. గోపురానికి లోపలివైపున నున్న మండపమును సంపంగి మండపమంటారు. ఈ మండపము ఉత్తరం వైపున పంచలోహములతో తయారు చేసిన విజయనగర చక్రవర్తి

శ్రీకృష్ణదేవరాయలు, చిన్నాదేవి, తిరుమలదేవుల నిలువెత్తు విగ్రహములున్నవి. సంపంగి మండపానికి సమీపమందు 18 స్తంభాల సాయముతో నిర్మించిన రంగమండపమున్నది. రంగమండపమునకు పశ్చిమమున తిరుమలరాయ మండపమున్నది. దీనికి "ఊంజల్" మండపమనికూడా వ్యవహరిస్తారు. మండపం వెనుకభాగమును క్రీ.శ. 1473వ సంవత్సరమందు సాళువ నరసింహరాయలు, ముందుభాగమును 17 వ శతాబ్దమునందు ఆరవీటి తిరుమలరాయలు నిర్మించినారు. మండప మధ్యభాగమున నల్లటి రాతితో ఈ మండపము చెక్కిన అందమైన 'నాలుగుకాళ్ళ మండప' మున్నది. ముందుభాగమున లాలాఖేమరామ్ (తోడర్మల్). అతని తల్లి మాత మోహనది మరియు ఆతడి భార్య పితా బీబి లోహపు విగ్రహములున్నవి. వీరు ముకుళిత హస్తములతో స్వామికి అంజలి ఘటిస్తున్నారు.

సంపంగి ప్రదక్షిణమునందు ధ్వజస్తంభమునకు కుడివైపున 'ఐనామహల్' లేక అద్దాలమేడ యున్నది. ఇది 38' × 43' కొలతలను కల్గి ముఖమండపమును కలిగియున్నది. ఈ మండపం లోపలిభాగము మొత్తము అద్దాలతోను, రంగురంగుల విద్యుత్ దీపాలతోను అలంకరించబడి కన్నులకు పండువు చేయుచున్నది.

ఐనామహల్ వెనుకభాగమునందే పూలబావి యున్నది. దేవునికి అలంకరించిన పుష్పములను ఈ బావిలో పడవేయుటచే దీనికి పూలబావి అని పేరు కల్గినది. ఈ ఆచారము రామానుజాచార్యుల కాలము నుండి ఆచరణమందున్నది. 'వేంకటేశ ఇతిహాసమాల' గ్రంథమందు ఈ బావి ప్రస్తావింపబడినది. తొండమాను చక్రవర్తిపైకి ఒకమారు శత్రువులు దండెత్తగా అతడు బిలమార్గమున రాత్రికిరాత్రే తిరుమల చేరినాడట. ఆ సమయమందు శ్రీనివాసుడు శ్రీదేవి, భూదేవులతో క్రీడించుచుండగా, చక్రవర్తి రాకను గమనించి శ్రీదేవి స్వామి వక్షఃస్థలమందు దాగుకొనగా, భూదేవి రంగదాసునిచే త్రవ్వబడిన పూలబావిలో దాగుకొన్నదట! ఈ కథను విన్న రామానుజాచార్యులు, బావి మెట్లపై శ్రీదేవి, భూదేవి విగ్రహములను చెక్కించి

పూజానంతరము స్వామికి అలంకరించి తీసివేసిన పుష్పములను ఈ బావిలో వేయమన్నాడు. పూలబావి ప్రస్తావన వరాహపురాణమందు కూడా ప్రస్తావించబడినది.

**ధ్వజస్తంభమండపము**

ఆలయప్రవేశమునకు రెండవ గోపురము ముందుభాగమున పది స్తంభముల సహాయంతో నిర్మించిన మండపమున్నది. ఈ మండప స్తంభములపైన త్రిమూర్తి, షణ్ముఖ, యోగనరసింహ, చిలుకను చేతినందుంచుకొన్న దిగంబర స్త్రీమూర్తి, గోపికావస్త్రాపహరణ, ఆంజనేయ మొదలగు శిల్పములున్నవి. ఈ మండప మధ్యభాగమునందే ధ్వజస్తంభము, బలిపీఠము వున్నవి. ధ్వజస్తంభము బంగారు పూతపూసిన రాగిరేకులతో కప్పబడియున్నది. ఈ రేకులపై కాళీయమర్దన కృష్ణ, గరుడ, ఆంజనేయ, గోవర్ధనగిరిధారి, నవనీత కృష్ణ శిల్పములున్నవి. ఈ ధ్వజస్తంభము, బలిపీఠము మొదట ప్రధానాలయము లోపల స్థాపింపబడి, మధ్యకాలము నందెప్పుడో, రెండవ గోపురము వెలుపలికి తేబడి యుండవచ్చును.

రెండవ గోపుర ద్వారముగుండా విమానప్రదక్షిణము చేరగానే ఎడమవైపున 20' × 15' అ. కొలతలుగల కంచి వరదరాజస్వామి మందిరమున్నది. ఢిల్లీసుల్తానులు కాంచీపురమును కొల్లగొట్టుటకురాగ పూజారులు వరదరాజస్వామి మూలవిరాట్టును తిరుమలకు తెచ్చి ఈ మందిరమునందు భద్రపరచినారట. ఈ మండపము ఉత్తరవైపు గోడ యందు హరిహరరాయల కాలమునకు (క్రీ.శ. 18-1-1388) చెందిన ఆరవ శాసనమున్నది. ఈ మండపమునకు ముందుభాగమున 'పోటుగదు' లున్నవి. ఈ గది ముఖద్వారమున వకుళాదేవి శిల్పమున్నది.

**బంగారుబావి**

పోటుగది కెదురుగా బంగారు బావి యున్నది. రామానుజాచార్యుల కాలమునుండి స్వామివారి అభిషేకమునకు, వంటకు ఈ బావిలోని నీటినే

వాడుతున్నారు. ఈ బావిచుట్టూ వున్న రాతిగోడకు బంగారు పూతపూసిన రాగితొడుగు నమర్చినారు. తొడుగుపై విజయనగర రాజముద్రిక యున్నది.

**కళ్యాణమండపము**

కళ్యాణమండపము 29 స్తంభాలతో 80' అ. పొడవు, 36' అ. వెడల్పు కొలతలతో నిర్మింపబడిన కట్టడము. ఈ మండపము చేరడానికి తూర్పువైపున సోపానములమర్చబడినవి. కళ్యాణమండపస్తంభములపై అనేక శిల్పములున్నవి. వాటిలో పేర్కొనదగినవి, కోలాటదృశ్యము, పదహారు చేతులున్న ఉగ్ర నరసింహస్వామి, త్రివిక్రమ, బోయదంపతుల శృంగార క్రీడ, నృత్యవిష్ణువు, నృత్య కృష్ణశిల్పములు. మండపము పడమటివైపున నాలుగు నల్లటి రాతి స్తంభములతో చెక్కిన వేదికగలదు. దీని స్తంభములపైన అతి సున్నితముగా చెక్కిన శ్రీనివాస, రామ, సత్య, రుక్మిణీ సమేత కృష్ణ, లక్ష్మీ శిల్పములున్నవి. ఈ స్తంభములను మీటితే సంగీతము వినబడుతుంది. ఈ కళ్యాణమండపనిర్మాణము క్రీ.శ. 1586వ సంవత్సరమునందు, చెన్నప్ప నాయకుడనే విజయనగరసర్దారు జరిపించాడు.

ఆలయము చుట్టూ (కళ్యాణమండపము నుండి) స్తంభముల సాయముతో నిర్మించిన మండపమున్నది. దీనిలో పడమటివైపున యాగశాల, వాహనమండపము వున్నవి. ఉత్తరమువైపున దీపాలగది, వంటవాళ్ళగది, పల్లకిగది, తాళ్ళపాకవారి అర, 'సభై' అర వున్నవి. ఇచ్చటనుండే విమాన వేంకటేశ్వర విగ్రహమును చూడవచ్చును. సభైఅర పక్కన క్రీ.శ. 1476వ సం॥మందు నిర్మించినట్లు తెలుపుతున్న రామానుజమండపమున్నది. ఈ మండపము ప్రక్కనే యోగనరసింహ ఆలయమున్నది.

**ప్రధానాలయము**

వేంకటేశ్వరుని ప్రధానాలయము అనేక మందిరాల కలయిక. తూర్పున తిరుమామణి మండపము, పడమర గర్భగృహము, ఆలయముచుట్టూ వైకుంఠప్రదక్షిణము ఉన్నవి. ఆలయము ముందుభాగమున

పదహారు స్తంభాలతో నిర్మించిన తిరుమామణి మండపము లేక, 'తిరువిలన్కోయిల్' అనబడే మండపము వున్నది. ఇచ్చటే స్వామివారి హుండి, దేవుని గంటలు, గరుడ మండపములు వున్నవి. ఇక్కడ నేడు 'పరకామణి' జరుగుతుంది. ఈ మండపాన్ని క్రీ.శ. 1339 సం॥ చంద్రగిరి నివాసి మల్లన్న నిర్మించినాడు. స్తంభముల పైన విష్ణువు, అంగుళీయకమును సీతకు సమర్పిస్తున్న ఆంజనేయ, ప్రసన్న వరాహమూర్తి, రామపట్టాభిషేక, ఉగ్ర నరసింహ, ఎగిరే గుఱ్ఱముపై నెక్కిన కలిపురుష శిల్పములున్నవి. ఈ మండపమునందు భోగ శ్రీనివాసుని కొలువు ఏర్పాటు చేయబడుతుంది. అంతేగాక, స్వామివారి సుప్రభాతముకూడ చదువబడుతుంది. ఈ మండపము పడమటి వైపున స్వామివారి బంగారు (ప్రధాన) వాకిలియున్నది. ఈ వాకిలి కిరువైపుల ఆయుధపాణులైన ద్వారపాలకుల (జయ, విజయుల) విగ్రహములున్నవి. బంగారువాకిలి దాటగానే నాలుగు స్తంభములతో నిర్మింపబడ్డ స్నపనమండపమున్నది. దీని తరువాత 10 అ. వెడల్పు, 22 అ. పొడవు గల చిన్న మండపమున్నది. దీనిని 'రామర్ మేడై' (రాములవారి మండపము) వున్నది. ఈ మండపముల వుత్తరవైపునవున్న అరుగులపై అంగదుడు, హనుమంతుడు, దీపకన్య విగ్రహములు వుంచబడినవి. 'రామర్మేడై' చుట్టూ ముక్కోటి ప్రదక్షిణము వుండెడిది. ప్రదక్షిణ ద్వారములు మూసివైచి, ప్రస్తుతము ద్వారము తిరువలిన్ కోయిల్ నుండి ఏర్పాటు చేసినారు. రామర్ మందిరము దాటగానే స్వామివారి శయనమండపము 18' 6' అ.(చతురస్రము)వున్నది. ఏకాంత సమయములందు స్వామిని ఇచ్చటే నిద్రపుచ్చుతారు.

శయనమండపము (అంతరాళము) దాటగానే 12' (చదరము) గర్భగృహమున్నది. దీనిపైన వేసరజాతికి చెందిన ద్వితల విమానము, శిఖరముపై ఎత్తైన కలశమున్నది. విమానము నాలుగువైపుల సింహపు ప్రతిమలున్నవి. విమానము మొత్తము బంగారు తొడుగును కలిగియున్నది.

ఈ విమానమునే 'ఆనందనిలయవిమానము' అంటారు. గర్భగృహమునందు నడుమ భాగమున కన్నుల పండుగచేసే, కలియుగదైవమైన వేంకటేశ్వరుని దివ్యమంగళకరమగు విగ్రహమున్నది. స్వామివారి పాదపద్మముల క్రింద గంగానదీ సమానమైన పవిత్ర 'విరజా'నది పారుతూంది. స్వామివారికి ముందుభాగమున ఉత్సవ విగ్రహమున్నది. స్వామివారి పై రెండు చేతులందు శంఖ, చక్రములు, క్రింది కుడిచేయి వరదముద్రలోను, ఎడమచేయి కట్యవలంబిత ముద్రలోను కలదు. స్వామి కొలువైయున్న గర్భగృహమును పూర్వము కోయిల్ ఆళ్వార్ అనెడివారు.

వేంకటేశ్వరస్వామిని క్రీ.శ. 400–800 సం॥ మధ్యకాలమందు పొయిగై ఆళ్వారు, తిరుమంగై ఆళ్వారు, కులశేఖర ఆళ్వారు అనే వైష్ణవభక్తులు స్తోత్రముచేసినారు. వీరు పాడిన పాటలు నాలాయిర ప్రబంధము పేర ప్రచారమందున్నవి. వీరు వేంగడ దర్శనముతోనే సర్వపాపములు నశించిపోతాయని, అర్జునుని అజ్ఞానమును పోగొట్టి, శంఖువు పూరించిన కృష్ణుడే వేంకటేశ్వరుడని, అసురులు శిరస్సులను పోగొట్టుకొన్నట్లు చేసిన మోహిని అవతారమని కొందరు, క్షీరసాగరమందు పవ్వళించిన నారాయణుడని ఇంకొందరు, ప్రపంచమును కొలిచినట్టి త్రివిక్రముడు స్వామియని మరికొందరు, అశ్వము నోటిని చీల్చిన శ్రీకృష్ణునిగాను, ఈ దేవదేవుణ్ణి బ్రహ్మ, ఇంద్ర, మహేశ్వరులు నిత్యమూ పూజిస్తూ వుంటారని, దేవుని హృదయపీఠముపై అలివేలుమంగమ్మ ఆసీనమై వుంటుందని ఆళ్వారులు స్తుతించినారు.

## వైష్ణవ ఆళ్వారులు

### నాథముని ఆచార్యులు

ఇతడు క్రీ.శ. 10వ శతాబ్దమందు తిరుమల వేంకటేశ్వరుని దర్శించి, ఆలయమందు కొన్ని వైష్ణవపూజావిధులను ప్రవేశపెట్టినాడు. అయితే ఇతడిని గురించి వివరములు ఎక్కువగా తెలియుటలేదు. ఈతడి జ్ఞాపకార్థము

తిరుపతిలో ఏర్పడింది. ఆ వీధి చివరన నాథముని ఆలయము కూడా వున్నది.

నాథముని మనుమడు ఆళవందార్, తిరుమలకేతెంచి స్వామిని దర్శించి, ఆలయమందు సక్రమమైన పూజావిధులు లేనందున తన మనుమడు తిరుమలనంబిని తిరుమలపై నివాసమేర్పరచుకొమ్మనగా, తిరుమలనంబి తన చెల్లెళ్ళను వెంటబెట్టుకొని తిరుమలకెళ్ళి, పూలతోటను పెంచి, రోజూ స్వామికి పూలను సమర్పిస్తూ, ఆకాశగంగ తీర్థము నుండి నీటిని తెచ్చి స్వామికి అభిషేకము చేసేవాడట! తిరుమలనంబి చెల్లెళ్ళలో ఒకామె 'భూపిరెట్టి'ని శ్రీ పెరుంబుదూరునందలి కేశవ సోమయాజుల కిచ్చి వివాహము జరిపించగా, వారికి ప్రపంచ ప్రఖ్యాతిగన్న వైష్ణవమతాచార్యుడైన రామానుజాచార్యుడు (క్రీ.శ. 1017) జన్మించినాడు.

## రామానుజాచార్యులు

భారతదేశమందలి ప్రధాన వైష్ణవమతాచార్యులలో పేరెన్నికగన్నవాడు శ్రీ రామానుజుడు. ఇతడు క్రీ.శ. 1017 సం॥ జన్మించి దాదాపు 120 సంవత్సరాలు జీవించి 1137వ సంవత్సరమందు పరమపదించినాడు. ఇతడి కాలమందు దక్షిణ భారతదేశము శైవప్రభావమును వదలి, వైష్ణవ ప్రభావమునకు లోనైనది. శ్రీ రామానుజాచార్యులవారు తిరుమల, తిరుపతి ఆలయముల చరిత్రలో ప్రముఖస్థానమాక్రమించినారు. ఇతడు బాల్యమునందే తిరుమల కేతెంచి, మేనమామ తిరుమలనంబి యొద్ద రామాయణము నభ్యసించినాడు.

క్రీ.శ. 12వ శతాబ్దమందు తిరుమల వేంకటేశ్వరాలయమందు వైఖానస అర్చకులు పూజావిధులను సక్రమముగా నిర్వర్తించక, నిర్లక్ష్యముగానుండుట గమనించి వారిని నారాయణవనప్రభువు యాదవరాయలు శిక్షించినాడట. అందుచేత అర్చకులు తిరుమలను వదలిపెట్టిపోగా, శ్రీకాళహస్తివాసులైన కొంతమంది శైవాచార్యులు

ఆలయమునాక్రమించి, స్వామివారు శైవుడని నిర్ధారణ చేయగా, వైష్ణవులు చేయునదిలేక, యాదవరాయలవారికి విన్నవించుకోగా, రాజువారి వివాదమును పరిష్కరించుటకై, రామానుజాచార్యులవారిని శ్రీరంగము నుండి పిలిపించినాడు. రామానుజుడు శైవ, వైష్ణవులను రాజుగారి సమక్షమందు, ఆలయములో సమావేశముకావించి, వేంకటేశ్వరుడు శ్రీమహావిష్ణువని తన వాక్చాతుర్యముతో మెప్పించి, స్వామికి నేడున్న శంఖ, చక్రములను అమర్చి, నుదుట నామమును పెట్టి, విష్ణువుగా రూపుదిద్దుటయేగాక, ఆలయములో పూజావిధులను కూడా వైష్ణవమత సాంప్రదాయముననే జరుగులాగున ఏర్పాట్లు చేసినాడు.

రామానుజుని కాలముననందే తిరుమలయందు నివసించే ప్రజలు ఆచరించవలసిన కొన్ని నియమాలను ఏర్పాటు చేసినారు. అందులో ముఖ్యమైనవి తిరుమలలో నివసించు ప్రజలు తమ ఇండ్లయందు తోటలు పెంచరాదు, జీవహింస, వేట, మాంసభక్షణ చేయరాదు. కపిలతీర్థమునుండి, స్వామి పుష్కరిణివరకు ఎవరు ఏ దేవతకు ఆలయనిర్మాణము చేయరాదు, పూజారులు తప్ప తక్కినవారు తిరుమలయందు స్థిరనివాసముండరాదు. తిరుమల కేతెంచువారు వాహనములపై పోరాదు. కాళ్ళకు పాదరక్షలుండరాదు, తిరుమలయందు నివసించువారు ఆలయమునుండి లభ్యమగు ఆహారమునే తినవలయును, స్త్రీలు పుష్పములను ధరించరాదు, బహిష్టు సమయములో తిరుమలయందు వుండరాదు, ప్రసవమునకు ముందే తిరుమలను వదలి రావలయును.

ఈ నియమ నిబంధనలను, ఆలయములోని పూజావిధులను సక్రమముగా నిర్వర్తించుటకు ఆలయ అధికారిగా 'జియ్యంగారు' అనే సన్యాసిని నియమించి అతడికి ఆలయ పరిపాలనా విషయములో సర్వాధికారములను కలిగించినాడు. క్రీ.శ. 1843 సం॥నందు జియ్యంగారు స్థానముననందే ఆలయపాలనకు 'తూర్పు ఇండియా కంపెనీ' వారు

మహంతులను నియమించినారు. క్రీ.శ. 1933వ సంవత్సరమందు ఆంగ్లేయ ప్రభుత్వము, మహంతుల పాలనను తొలగించి, తిరుమల, తిరుపతి దేవాలయముల పాలనకై ఒక చట్టమును రూపొందించి, ఆలయపరిపాలనను ప్రభుత్వముచే నియమింపబడిన 'ధర్మకర్తల మండలి'కి అప్పగించబడినది.

## అన్నమయ్య

వైష్ణవమతాచార్యులవలననే తిరుమలేశుని స్తుతించి, ప్రసన్నుని కావించుకొన్న మహాభక్తుడు తాళ్ళపాక అన్నమాచార్యుడు. ఇతడు చిన్ననాటినుండే స్వామిభక్తుడై తిరుమలకేతెంచి, స్వామిని దర్శించి, ఆయనపై అనేక పదములను రచించి, 'పదకవితా పితామహు'డని బిరుదు వహించినాడు. ఇతడి రచనలు ఆంధ్రదేశము నందలి ఆబాలగోపాలమునకు చిరపరిచితములే. ఇతడు కొన్ని వేల పదములను రాగిరేకులపై లిఖించి, తిరుమల ఆలయమునందు తాళ్ళపాకవారి అరయందు భద్రపరచినాడు. పోయినవి పోగా మిగిలినవి లభ్యమై ఈనాడు పుస్తకరూపమును సంతరించుకొన్నవి. అన్నమయ్య వంశములోనివారైన పెదతిరుమలాచార్యుడు, కొడుకు తిరువేంగళనాథుడు (చిన్నన్న), తాళ్ళపాక తిమ్మక్క వేంకటేశ్వరుని భక్తులే.

అన్నమయ్యవలెనే తిరుమలేశుని ధ్యానించి ముక్తినిపొందిన వారిలో ప్రముఖుడు త్యాగరాజు, ''వేంకటేశ! నినుజూడ పదివేల కన్నులు కావలెనయ్యా!'' అని భక్తిపారవశ్యముతో స్వామిని స్తుతించినాడు. అలాగే స్వామిని సేవించిన మరొక మహాభక్తుడు పురందరదాసు. ఇతడు కూడా స్వామిపై అనేక రచనలు కావించినాడు. అట్లే తరిగొండ వేంగమాంబ తిరుమలేశుని సేవించి, తన కావ్యకుసుమాలతో అర్చించి తరించినది. ఆ కవయిత్రి రచించిన ''శ్రీ వేంకటాచలమాహాత్మ్యము'' మధుర కవితామహితము.

* * *

## తిరుపతి - గోవిందరాజస్వామి దేవాలయం

తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయమునకు, తక్కిన ఆలయములవలె స్థలపురాణములు గాని, ఇతిహాసములు గాని కానరావు. ప్రస్తుతపు గోవిందరాజస్వామి ఆలయములో మొదట వుండినది పార్థసారథిస్వామి ఆలయమే. ఈ ఆలయము క్రీ.శ. 12వ శతాబ్దము నాటికే పూజాపునస్కారములతో అలరారుచుండినది. క్రీ.శ. 12, 13వ శతాబ్దములందు చోళరాజ్యము మొదటి కుళోత్తుంగుని పాలనలోనికి వచ్చినది. అతడు పరమ శివభక్తుడు. శివునికంటే మించిన దైవములేదని అతని వాదన. అతడు చిదంబరేశ్వరాలయమందలి గోవిందరాజస్వామి విగ్రహమును సముద్రము నందు పడవేయమన్నాడట! ఆ విషయము విన్న వైష్ణవ భక్తులు ఆలయమునకు తాళాలు వేసి గోవిందరాజ స్వామి ఉత్సవ విగ్రహమును తిరుపతికి తీసుకొనివచ్చి కపిలతీర్థమునకు సమీపమున వున్న కొత్తూరు గ్రామమందు దాచినారు.



రామానుజాచార్యులు వైష్ణవమతప్రచారము కావిస్తూ తిరుపతికి వేంచేసి, ఈ ప్రదేశము వైష్ణవమతాభివృద్ధికి అనువైందని తలపోసి పార్థసారథి ఆలయములోనే ఉత్తరపువైపున ఒక మండపము నేర్పాటుచేసి అందులో గోవిందరాజస్వామి తాత్కాలిక మూలబేరమును ఉత్సవమూర్తిని ప్రతిష్ఠించి, ఆలయమునకు చుట్టూ నాలుగు వీధులను నిర్మించి వాటికి 'మాడ' వీధులని, గ్రామమునకు గోవిందరాజపట్టణమని నామకరణముచేసినాడు. ఈ ఆలయ చరిత్రకు సంబంధించిన అనేక శాసనాలు ఆలయము చుట్టూ వున్న

విశాలమైన ప్రహరీగోడలమీదను, తిరుమల వేంకటేశ్వరాలయమందును లభ్యమగుచున్నవి. ఈ ఆలయమందలి మొదటి శాసనము మూడవ రాజరాజచోళ ప్రభువు వేయించినది. (క్రీ.శ.1235) ఆలయములోని అనేక శాసనములు, ఆలయమునందలి ఉత్సవములను, వాటికయ్యెడి ఖర్చులను, ఆ యుత్సవములను ప్రవేశపెట్టిన ప్రభువుల కీర్తిని, ఉత్సవములు ఏయే దినములందు (నక్షత్రములు) జరిగెడివో విశదముగా తెలియజేయుచున్నవి. వీటిలో ముఖ్యముగా పేర్కొనదగిన విషయములు, గోవిందరాజస్వామి శ్రీదేవి, భూదేవి అభిషేకములకు చక్రతీర్థమునుండి నీటిని తెచ్చేవారు. అలాగే కార్తిక మాసమందు కృత్తికా నక్షత్రమురోజున ఉత్సవమునకు తిరుమల ఆలయము నుండి నూనె, తమలపాకులు వేంకటేశ్వరునికి సమర్పించిన తరువాత గోవిందరాజుల వారికి పంపబడేవి. ఈ నైవేద్యములు తిరుపతికి తెచ్చినపుడు 'సూడికొడుత్త నాచ్చియార్' స్వాగతము పలికెడివాడట.

విజయనగరప్రభువుల కాలములో తిరుపతి గ్రామము, గోవిందరాజస్వామి ఆలయము ఎంతో అభివృద్ధి చెందినవి. ఈ కాలమునందు ఆలయమందలి చిన్న చిన్న గుడులు, మండపములు నిర్మింపబడుటయేగాక, అనేక క్రొత్త ఉత్సవములను ఏర్పాటు చేసినారు. క్రీ.శ. 1513వ సంవత్సరమందు 'తిరుక్కోనేరి' (గోవిందరాజ పుష్కరిణి) లేదా కృష్ణరాయ కోనేరు నిర్మితమైనట్లు ఆలయమందలి ఒక శాసనము వలన తెలియుచున్నది. 1533వ సంవత్సరమునాటి శాసనము బ్రహ్మోత్సవములందు గోవిందరాజులవారు ఉత్తరమాడ వీధియందు దేవదాసి నాట్యాలను తిలకించేవారని పేర్కొంటున్నది. క్రీ.శ. 1539 సంవత్సరము నందు మహాప్రధాని సాళువ తిమ్మరుసు తమ్ముడు సాళువు గోవిందయ్య తెప్పోత్సవమును ఏర్పాటు చేసినట్లు, మరొక శాసనము ఆలయమందలి గజ, తురగ వాహనములను మట్ల అనంతరాయలు చేయించినట్లు తెలియజేయుచున్నవి.

### ఆలయనిర్మాణము

వాస్తుశాస్త్రమునకు విరుద్ధమైన అనేక కట్టడములు ఈ ఆలయమునందు చోటుచేసికొనుటే ఈ ఆలయ ప్రత్యేకత. ప్రధానాలయమునందు రెండు గర్భగృహములున్నవి. దక్షిణ భాగమందు పార్థసారథి (కృష్ణ) మందిరము, ఉత్తరమున గోవిందరాజస్వామి మందిరము యున్నవి. (పార్థసారథిస్వామి ఆలయము కొన్ని శతాబ్దములు మూసి ప్రస్తుతము పూజలందుకొనుచున్నది.) దక్షిణ భాగమందున్న పార్థసారథిస్వామి మందిరమునకు నేరుగా (ఎదురుగా) ఆలయ ప్రధాన ప్రవేశద్వారమున్నది. ఆలయము చేరడానికి మూడు గోపురద్వారములను దాటి రావలసియున్నది. మొదటి గోపురము ఎనిమిది అంతస్తులు కలిగియున్నది. దీనిని క్రీ.శ. 1624వ సంవత్సరము మట్ల అనంతరాయలు నిర్మించినాడు. ఈ గోపుర నిర్మాణమును గురించి ఉత్సుకతను కలిగించే ఒక కథ ప్రచారమందున్నది.

మట్ల అనంతభూపాలుడు కడప జిల్లా రాయచోటికి సమీపాన మట్ల గ్రామమును రాజధానిగా రాజ్యము నేలుచుండిన చిన్నరాజు. ఇతడు తిరుపతిలో గోపుర నిర్మాణము తలపెట్టి 'స్థపతి' (ఆలయశిల్పి)ని ఏర్పాటుచేసి, కావలసిన ధనమును ఎడ్లబండ్లుమీద వేయించి తిరుపతికి పంపగా, శిల్పాచార్యుడు రాజుగారి ఆర్థిక స్తోమతను పరీక్షించుటకు బండ్లమీదయున్న నాణ్యపు సంచులకు రంధ్రములువేసి, ధనమంతటిని రాలునట్లుచేసి, రాజుకు ధనమంతయు మార్గమధ్యములోనే కారిపోయినదని తెల్పగా, అతడు ఏమాత్రము దిగులుచెందక, గోపురనిర్మాణమును అనుకొన్నవిధముగా ప్రారంభించమన్నాడట! ఈ గోపురములోపలి అధిష్ఠానపు గోడలమీద గోపుర నిర్మాత మట్ల అనంతరాయలు, అతడి దేవేరులు, అతడి తల్లిదండ్రుల శిల్పములు చెక్కబడి ఉన్నాయి. గోపుర అధిష్ఠానముపై పలు జంతువులు, పక్షులు, మిథున స్త్రీ, పురుష మరియు అనేక వైష్ణవశిల్పములు

చోటుచేసికొన్నవి. ఈ గోపురము దాటగానే, వేదాంతదేశిక, లక్ష్మీదేవి, మణవాళముని మరియు ఆళ్వారుల మండపములు ఆలయ ప్రవేశద్వారమునకిరువైపులా వున్నవి.

మట్లవారి గోపురము దాటగానే ఆలయప్రాంగణములోనికి ప్రవేశించుటకు ఉత్తర, దక్షిణ మాడవీధులనుండి మెట్లవరుసలతో నిర్మించిన ప్రవేశ ద్వారములున్నవి. ద్వారముల నుండి ఆలయముచుట్టూ, ఉత్తర, దక్షిణ, పడమరవైపుల వున్న ప్రాకారము నిర్మించబడినది. రెండవ గోపురము సమీపమునందు విజయనగరరాజుకాలమందు నాలుగు స్తంభముల సాయముతో నిర్మింపబడిన లక్ష్మీదేవి మందిరమున్నది. లక్ష్మీదేవి, ఆళ్వారుల మండపముల మధ్యన రెండవ గోపురమున్నది. గోపుర ప్రవేశ ద్వారమందలి అధిష్ఠానము గోడలపై రామాయణ (సప్తతాళ భంజనము), భాగవత, గోపికా వస్త్రాపహరణ, కోలాటశిల్పాలు అత్యంత మనోహరముగా చెక్కబడియున్నవి. గోపురము లోపలిభాగమున ఉత్తరపువైపు గోడలపై హిరణ్యకశిపుని సంహరిస్తున్న నరసింహస్వామి శిల్పము, మరొక శిల్పమందు నరసింహస్వామి ప్రక్కన శ్రీదేవి, భూదేవి ఆసీనులైయున్నారు. దక్షిణ భాగమందలి అధిష్ఠాన కుడ్యముపై పూతనచనుబాలు త్రాగుచున్న చిన్నికృష్ణుని, వాహనారూఢుడైన నరసింహస్వామి శిల్పములున్నవి. అధిష్ఠానపు చివరి వరుసలో మిథున శిల్పములున్నవి.

రెండవ గోపురము దాటగానే, మూడవ ప్రవేశ గోపురము వరకు దక్షిణవైపున అనేక మందిరములు, ఉత్తరమువైపున కొన్ని మండపములున్నవి. వాటిలో మొదటిది చక్రత్తాళ్వార్ మందిరము. ఇది రెండంతస్తులను కలిగి చోళ స్తంభముల సాయముతో నిర్మింపబడినది. ఇందులో చక్రత్తాళ్వార్ (సుదర్శన) శిల్పమున్నది. ఈ మండపమునకు ప్రక్కన శాలైనాచ్చియార్ మందిరమున్నది. దీనిలో గర్భగృహము, అంతరాళము, ముఖమండపము

(వసారా) లున్నవి. వసారామండప స్తంభములయందు ఒకదానిపై భూదేవిని తొడపై కూర్చొండబెట్టుకొని నాట్యమాడుతున్న వరాహ శిల్పమున్నది. గర్భగృహమునందు లక్ష్మీదేవి లేదా పుండరీకవళ్ళి (శాలైనాచ్చియార్) విగ్రహము కలదు. పద్మపీఠముపై ఆసీనురాలైన ఈ దేవి పై చేతులందు పద్మములు, క్రింది రెండు చేతులు కుడిచేయి అభయ, ఎడమచేయి వరదముద్రలో ఉన్నాయి. ఈ మందిరమునందలి స్తంభములు, చోళ, విజయనగర శిల్పరీతులను కలిగియున్నవి. ఈ మందిరమునకు కుడివైపున విశాలమైన మరొక మండపమునందు గోవిందరాజ, పార్థసారథిస్వాముల వాహనములు కొలువు చేయబడియున్నవి. ఈ వాహనమండపము ప్రక్కన నమ్మాళ్వారు, తిరుమలిశై ఆళ్వారు, కూరత్తాళ్వారుల మందిరము కలవు. ఈ ఆళ్వారుల మందిరములకు ఆవల రామానుజమందిరమున్నది. మందిర గర్భగృహమునందు తిరుమలైనంబి విగ్రహమున్నది.

ప్రధాన ఆలయప్రవేశము మూడవ గోపురమునుండే చేయవలయును. ఈ గోపుర అధిష్ఠానముపై విజయనగర రాజముద్రిక శిల్పాంకితమైయున్నది. ఈ అధిష్ఠానముపైననే హిరణ్యకశిపుని సంహరిస్తున్న నరసింహస్వామి, శంఖ, చక్రములను ధరించిన నరసింహుడు, భూదేవి, శ్రీదేవులు తిలకిస్తూండగా, విష్ణువు ఒక రాక్షసునితో పోరాడుతున్న శిల్పములున్నవి. మరొక శిల్పమునందు పూతనవద్ద పాలు త్రాగుతున్న శ్రీకృష్ణుడు, సింహారూఢుడైన నరసింహ శిల్పములున్నవి. మొదటి, రెండవ గోపురములతో పోల్చినచో, ఈ గోపురము శిల్పసంపదల యందు తీసికట్టుగానున్నది.

**ప్రధానాలయము**

మూడవ గోపురము దాటగానే, విశాలమైన ఆవరణమందు పార్థసారథిస్వామి, గోవిందరాజస్వామి ఆలయములున్నవి. ఈ ఆలయములకు దక్షిణవైపున దీర్ఘచతురస్రాకారములో నిర్మింపబడిన

కళ్యాణమండపమున్నది. ఈ మండపమునందు విజయనగర వాస్తువుకు చెందిన మూడు రకములైన శిల్పములున్నవి. వాటిలో కొన్నింటిపై కోలాటమాడుతున్న స్త్రీ శిల్పములున్నవి. మండపము పడమటి దిక్కులో నల్లటి 'గ్రానైట్' రాతితో మలచిన వేదిక, వేదిక చుట్టూ అలంకారప్రాయమైన నాలుగు స్తంభములు యున్నవి. ఈ వేదిక అధిష్ఠానముపై అద్భుతమైన శిల్పాలు, స్తంభముల పైభాగమును, మానవ, దేవత కోలాట, కపోత ప్రస్తరములతో అలంకరించబడినవి. కళ్యాణమండపములోని కొన్ని స్తంభములపై మానవశరీరములపై నాట్యమాడుతున్న విష్ణుమూర్తి మరియు శ్రీనివాస, వేంకటేశ్వర, రామ, లక్ష్మణ, హనుమంత, లక్ష్మి, వేణుగోపాల, లక్ష్మీనరసింహ, కాళీయమర్దన, యోగనరసింహ, గజేంద్రమోక్ష, అనంతశాయి, త్రివిక్రమ శిల్పములున్నవి. ఈ మండపము చివరన మరో చిన్న మందిరము, అందులో వేంకటేశ్వరుని విగ్రహము ఉన్నవి.

### గోవిందరాజస్వామి ఆలయము



గోవిందరాజస్వామి, పార్థసారథిస్వామి మందిరాలు నాలుగు గోడల మధ్యన నిర్మింపబడి, ఒకే మందిరముగా నున్నది. ఒక్కొక్క మందిరమునకు ప్రత్యేకముగా స్తంభాల సాయముతో నిర్మించిన వసారా, తూర్పువైపున రెండు అంతస్తులుగా నిర్మించిన ముఖ మండపములున్నవి. ముఖ మండపానికి క్రింది అంతస్తు నందు గరుడ మందిరము కలదు. ఈ ముఖమండపము

నందలి స్తంభములు కొన్ని చోళశిల్పరీతిని, కొన్ని విజయ నగర వాస్తురీతిని కలిగియున్నవి.

గర్భగుడిలో గారతో చేసిన శయనమూర్తి (అనంతశాయి) విగ్రహము గోవింద రాజుపేరిట ప్రతిష్ఠింపబడియున్నది. స్వామికి తలక్రింద తలగడ (కుంచెము) పాదముల చెంత శ్రీదేవి, భూదేవిల విగ్రహములున్నవి. వేంకటేశ్వరుడు పద్మావతితో తన వివాహమునకై కుబేరుని వద్ద తీసుకొన్న అప్పును తిరిగి చెల్లించునపుడు, గోవిందరాజస్వామి ధనమును కొలచి కొలచి అలసిపోయి కుంచెమును అలాగే తలక్రింది పెట్టుకొని నిద్రించినాడని స్థానిక ప్రజలు, పూజారుల కథనము. గోవిందరాజస్వామి మందిర గర్భగృహముపైన ఆయతాస్త్ర శిఖరము, ఐదు బంగారుపూత పూసిన కలశములున్నవి. స్వామివారి ఉత్సవ విగ్రహము శ్రీకృష్ణుడు.

గోవిందరాజస్వామి మందిరమునకు దక్షిణపు దిక్కున పార్థసారథి స్వామి మందిరమున్నది. ఈ మందిరము అతి పురాతనమైనదగుటచే, గోడల పైన ఎటువంటి శిల్పములు కానరావు. ఈ మందిరమందు గర్భగృహము, అంతరాళము, ప్రదక్షిణాపథము, 16 స్తంభములు కల్గిన ముఖమండపములు కలవు. గర్భగృహమునందు రుక్మిణీ, సత్యభామా సమేత పార్థసారథిస్వామి ఆసీన విగ్రహమున్నది. స్వామి పై రెండు చేతులయందు శంఖ, చక్రములు, క్రింది కుడిచేయి అభయముద్రలోను, ఎడమచేయి సుఖతుండముద్రలోను యున్నవి.

**ఆండాళ్ మందిరము**

పార్థసారథి మందిరమునకు తూర్పువైపున వున్న చిత్రకూట మండపమునందు ఆండాళ్ మందిరమున్నది. ఈ మందిరమునందు లభ్యమగుచున్న శాసనమునుబట్టి ఇది క్రీ.శ. 1308వ సంవత్సరమునందు నిర్మింపబడినదని చెప్పవచ్చు. గర్భగృహమందు నిలువెత్తు ఆండాళ్ విగ్రహము ప్రతిష్ఠింపబడియున్నది.

ఈ గోవిందరాజస్వామి ఆలయచరిత్రలో గమనించతగ్గ ముఖ్య విషయము, విజయనగర చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు దక్షిణ భారతదేశము నందలి ప్రతి ముఖ్య ఆలయమునకు ఏవో కొన్ని దానధర్మములు కావించినాడు. అటువంటి పరమ భాగవతోత్తముడైన ప్రభువు తిరుమల వేంకటేశ్వర ఆలయమును ఎనిమిదిమార్లు దర్శించిననూ, తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయమునకు ఒక మారుకూడా రాకపోవుట, ఈ ఆలయమునకు కించిత్తు దానమును చేయకపోవుట ఈనాటికి కూడా ప్రాజ్ఞులకు అంతుదొరకని విషయము.

* * *

## తిరుపతి - కోదండ రామాలయం

తిరుపతి పట్టణం నడిబొడ్డున అత్యంత ప్రశాంత వాతావరణంలో నిర్మింపబడిన కోదండరామాలయం, రాయలసీమలోనే అతిప్రాచీన రామాలయం. ఈ ఆలయాన్ని క్రీ.శ. 15వ శతాబ్దంలో విజయనగర ప్రభువులు నిర్మించారు. స్థానికులీ ఆలయాన్ని 'చిన్నగుడి' అని, గోవిందరాజస్వామి ఆలయాన్ని 'పెద్దగుడి' అంటారు. ఈ ఆలయనిర్మాణ కాలంలోనే చంద్రగిరి గ్రామంలో రామాలయనిర్మాణం జరిగింది.

తిరుపతి కోదండరామాలయాన్ని గురించి తెలుసుకోవడానికి తిరుమల, తిరుపతి గోవిందరాజస్వామి ఆలయం, కోదండరామాలయాలలో దాదాపు 20 శాసనాలు లభ్యమౌతున్నాయి. కోదండరామాలయం వెలుపలిగోడలపైన అచ్చటచ్చట శాసనాలు వున్న గుర్తులున్నా, అవి చదవలేనంతగా చెదిరిపోయాయి. ఐతే గోడలపైన అచ్చటచ్చటా శ్రీకృష్ణుని శిల్పాలు, కొన్ని రేఖాచిత్రాలు, తేరుమండపం సమీపంలో గోడపైన విజయనగరకాలంలో ప్రముఖంగా కానవచ్చే సప్తతాళబంధనం, వాలి, సుగ్రీవుల యుద్ధ దృశ్యాలు శిల్పాంకితమైనాయి. శాసనాలు ఈ ఆలయమందలి స్వామిని శ్రీరామ, పెరియరఘునాథ, రఘునాథ, కోదండరామ అంటూన్నాయి. క్రీ.శ. 1480–81 సం॥ మందు తిరుపతికి చెందిన శఠగోపదాసర్ నరసింహరాయ మొదలి అనే వ్యాపారి, నాటి విజయనగర చక్రవర్తి సాళువనరసింహరాయల గౌరవార్థం ఈ ఆలయాన్ని నిర్మించాడు. క్రీ.శ. 1530 సం॥మందు, స్వామి ఉత్సవాలలో ప్రధానంగా ఉపయోగించే 'కొయ్యతేరు'ను, అచ్యుతరాయల గౌరవార్థం కుమార రామానుజ అయ్యర్ నిర్మించి, ఆలయానికి బహూకరించినట్లు, తేరుపై ఉన్న శాసనం తెలుపుతూ ఉంది. క్రీ.శ. 1547 సం॥ నాటి శాసనం, సదాశివరాయలు ఆలయనిర్వహణకై ఎన్నో దానధర్మాలు చేసినట్లు తెలుపుతూ ఉంది.

**ఆలయవర్ణన**



శ్రీ కోదండరామాలయం విశాలమైన ఆవరణలో నిర్మితమై వుంది. ప్రస్తుతం ఆలయం భూమట్టానికి దాదాపు 3 అ. క్రిందుగా వుంది. ఆలయం అరుదుగా కనుపించే, పశ్చిమం వైపు ముఖద్వారాన్ని కలిగివుంది. ఇలా ఎందుకు నిర్మింపబడిందో ఈనాటికి తెలుసుకోలేకపోతున్నారు. ఆలయంచుట్టూ ఎత్తైన ప్రహరీ నిర్మితమైంది. ప్రహరీలో పడమరదిశలో మధ్యన ఆలయ ప్రవేశద్వారం, పైన మూడంతస్థుల రాజగోపురం వుంది. గోపుర అధిష్ఠానంపైన విజయనగర శిల్పాలు, పైన ఇటుకలతో నిర్మితమైన మూడంతస్థుల రాజగోపురం, కూట, శాల, పంజర, అలంకారాలు, గోపురంపైని మూడు ద్వారాలకిరువైపులా గదాధారులైన ద్వారపాలకులు, చుట్టూ అనేక దేవతాశిల్పాలున్నాయి. గోపురంపైన, నిలువాటి శిఖరం, పైన 7 కలశాలు ప్రతిష్ఠింపబడ్డాయి. ఐతే ఈ గోపురం, గోవిందరాజస్వామి ఆలయ గోపురంవలె బలిష్ఠంగా, హృద్యంగా కానరాదు. గోపురద్వారందాటి ఆలయం ప్రవేశించగానే బలిపీఠం, ధ్వజస్తంభం, గర్భాలయంలోని స్వామికి ఎదురుగా ప్రతిష్ఠింపబడ్డాయి.

కోదండరామ ప్రధాన ఆలయం, గర్భగృహం, అంతరాళం, ముఖమండపం, మహామండపాలను కలిగి ఎత్తైన అధిష్ఠానంపై నిర్మింపబడినాయి. మహామండపప్రవేశానికి, రెండు ద్వారాలున్నాయి.

ఆలయసముదాయంలో అపురూపనిర్మాణం మహామండపం. ఇది నాలుగు వరుసలు, వరుసకు 5 స్తంభాల చొప్పున 20 స్తంభాల సాయంతో నిర్మితమైంది. మండపస్తంభాలు ఫక్తు విజయనగరశైలిలో, క్రింద, పైన చతురస్రాకారంలోను, మధ్యన గుండ్రముగా మలచబడి, బాలకృష్ణ, ఆంజనేయ, బలరామ, లక్ష్మి, వాలి, సుగ్రీవ, పద్మం, ఆసీనసింహ శిల్పాలను కలిగివున్నాయి. మండపం గోడపైన విజయనగరరాజ ముద్రిక వుంది. మహామండపం, ముందుభాగాన (పశ్చిమంవైపు) గర్భాలయంలోని స్వామికి ఎదురుగా గరుడమండపం, అందులో అంజలి ఘటిస్తూ నిలుచుని ఉన్న గరుత్మంతుడు ఉన్నాడు.

మహామండపానికి ముందు వైపు (తూర్పు) 4' స్తంభాల సాయంతో నిర్మించిన ముఖమండపం వుంది. మండపస్తంభాలు వైవిధ్యంతో మూడు భాగాలుగా మలచబడి, గోపాలకృష్ణ, యోగనరసింహ, గోవర్ధనగిరిధారి, వటపత్రశాయి, గోపికావస్త్రాపహరణ, ఆంజనేయ, మహావిష్ణు శిల్పాలున్నాయి. మండపం ఉత్తరదిశలో విష్వక్సేనులవారి మండపం వుంది. ఇది 12' అ. చతురస్రాకారం కలిగి, మధ్యన ఆసీనముద్రలో అంజలి ఘటిస్తూన్న విష్వక్సేనులవారి శిల్పం ఉంది. మండపంపైన గుండ్రని శిఖరం, పైన కలశం వున్న గోపురం ఉంది. మండపముఖద్వారంపైన గజలక్ష్మి, గోడలపైన విజయ నగర రాజులముద్రిక అలంకరింపబడ్డాయి. ముఖమండపంలో దక్షిణం వైపు, పైమండపానికి ఎదు



రుగా ఇదే నమూనాలో నిర్మించబడిన రామానుజమండపం ఉంది. మండపం మధ్యన అంజలి ఘటిస్తూన్న ఆసీనరామానుజుల శిల్పం ఉంది. మండపంలోని 'ఉడైయవర్' (రామానుజులు) విగ్రహాన్ని క్రీ.శ. 1497 సం॥ మందు పెరియపెరుమాళ్ దాసర్ అనే ఏకాంగి ప్రతిష్ఠించి, ఉత్సవాలకు నిత్య ఆరాధనకు 1200 పణాలను సమకూర్చినట్లు శాసనాలు పేర్కొంటున్నాయి.

ముఖమండపం ముందు భాగాన, 2' అ. ఎత్తులో అంతరాళం, గర్భగృహాలున్నాయి. అంతరాళం 16' అ. వైశాల్యంతో నిర్మింపబడి, గోడలు స్తంభపలకాలతో అలంకరింపబడింది. ఈ మండపం ద్వారాల కిరువైపుల గదాధారులైన ద్వారపాలకులున్నారు. అంతరాళం ముందున దాదాపు 20' అ. చతురస్రపు గర్భాలయం, మధ్యన కన్నుల పండువ చేసే అపురూపమైన శ్రీరామ (రఘునాథ) స్వామికి, కుడివైపున సీతాదేవి, ఎడమవైపు లక్ష్మణుల నిలువెత్తు శిలావిగ్రహాలున్నాయి. రామలక్ష్మణులు కోదండాలను కలిగివున్నారు. ఈ విగ్రహప్రతిష్ఠాపనలో విశేషం, సీతాదేవి స్వామికి ఎడమవైపునగాక, కుడివైపుగా వుండడం. ఈ మూలవర్లకు ముందున, స్వామిని సేవిస్తూన్నట్లున్న, ఆంజనేయ మరియు సీతా, రామ, లక్ష్మణ, (చక్రత్తాళ్వార్) పంచలోహ విగ్రహాలున్నాయి. గర్భాలయంపైన వేసరపద్ధతిలో నిర్మితమైన గుండ్రని శిఖరము, నాలుగువైపులా అంజలి ఘటిస్తూన్న గరుడ శిల్పాలు, పైన కలశం వున్నాయి. అంతరాళం, గర్భగృహాల చుట్టూ 14' స్తంభాల సాయంతో నిర్మితమైన ప్రదక్షిణాపథం ఉంది. ఇచ్చట కూడ విజయనగరరాజుల రాజముద్రిక వుంది.

ప్రధానాలయం దక్షిణదిశలో 4 స్తంభాల సాయంతో నిర్మించిన ఉయ్యాలమండపం, పైన శిఖరము, కలశం ఉన్నాయి. ఈ మండపానికి ఎదురుగా, దక్షిణదిశలో ఆలయవంటశాల ఉంది.

## ఆంజనేయ ఆలయం

కోదండరామాలయం ముందు, రాజగోపురానికి 50 గజాలదూరంలో ప్రధానాలయాన్ని చూస్తూ (తూర్పుముఖంగా) నిర్మించిన ఆంజనేయ ఆలయం వుంది. ఈ ఆలయం 12 స్తంభాలతో నిర్మితమైంది. స్తంభాలు శ్రీకృష్ణ పద్మ, ఆంజనేయ, శ్రీరామ శిల్పాలతో అలంకరింపబడ్డాయి. ఇచ్చటి దక్షిణవైపు గోడపైన అపురూపమైన దోగాడే బాలకృష్ణుని శిల్పం ఉంది. మండపం వెనుక చిన్నగుడి, అందులో దాదాపు 6' అ. ఎత్తున ప్రధానాలయంలోని సీతారామ లక్ష్మణులను సేవిస్తూ, అంజలి ఘటిస్తూన్న ఆంజనేయుల విగ్రహం ఉంది. ఈ చిన్నగుడిపైన గుండ్రని శిఖరం, పైన కలశం వున్నాయి. ఆంజనేయమండపం ఎదురుగా, 20 అ॥ ఎత్తున ధ్వజస్తంభం వుంది. స్తంభం క్రింద ఫలకాలపై శ్రీకృష్ణ, ఆంజనేయ, సుదర్శన చక్రం శిల్పాలున్నాయి. స్తంభంపైన దీపస్తంభం, చుట్టూ 4 గంటలు ఏర్పాటు చేశారు. ఆంజనేయమండపం ప్రధానాలయం మధ్యన పట్టణ ప్రధాన రహదారి వుంది.

ఆంజనేయమండపం వెనుక పెద్ద కోనేరు వుంది. దీనిని రామచంద్రగుంట అంటారు. ఒకప్పుడీ సరస్సులో రంగరంగ వైభవంగా స్వామివారి తెప్పోత్సవాలు జరిగేవి. ఒకప్పుడు 'మేకతెప్ప' కూడా జరిగేది. ప్రస్తుతం కోనేరు శిథిలావస్థలో ఉంది. కోనేటి గట్టున ఏనాడో నిర్మించిన పారువేట మండపం ఉంది. మార్గశిరమాసంలో (జనవరి) గోవిందరాజస్వామి ఆస్థానానికి వేంచేస్తారు.

## ఉత్సవాలు

ఆలయం ఎప్పుడూ వేదపారాయణంతో, పూజాపునస్కారాలతో అలరారుతూ వుంటుంది. ఆలయంలో జరిగే ఉత్సవాల్లో డిసెంబరు 16 నుండి, జనవరి 14 వరకు జరిగే 'ఆండాళ్ తిరుప్పావై' ఉత్సవం పేర్కొనదగ్గది.

ఆలయనిర్మాణం, విగ్రహాల ప్రతిష్ఠాపనవలెనే, ఈ ఆలయంలో జరిగే బ్రహ్మోత్సవాల్లో వైవిధ్యముంది. మామూలుగా రామాలయాల్లో శ్రీరామనవమితో ఉత్సవాలు ప్రారంభమౌతాయి. ఐతే ఇచ్చట శ్రీరామ నవమికి 2 రోజులముందే ఉత్సవాలు ముగుస్తాయి. ఉత్సవాలు 9 రోజులు అంగరంగ వైభవంగా జరిగి రథోత్సవంతో ముగుస్తాయి. ఉత్సవాల్లో భక్తులు వేల సంఖ్యలో పాల్గొంటారు. ఉత్సవాల నాటినుండి, దాదాపు 4 రోజుల వరకు, ఆ ఉత్సవాల్లో విక్రయించే వస్తువులు, వాటి ప్రదర్శనలను ఇచ్చట చూచి, పూర్వవైభవాన్ని, నాటి ఆచారాల్ని పూర్వం రాయలసీమలో జరిగే, తిరునాళ్ళు, జాతరలను గుర్తుకు తెచ్చుకోవచ్చు. చుట్టుపక్కల అరుదుగా లభ్యమయ్యే కొయ్యబొమ్మలను, బుడిగెలను, భరిణెలను, మట్టి గాజులను, విసనకర్రలను, ముఖ్యంగా మంచినీటికి కుండలను కొనడానికి స్థానికులు, చుట్టుపట్ల గ్రామాల ప్రజలు వేలసంఖ్యలో వచ్చి బారులు తీరి, కొనుగోలు చేస్తారు.

ఆంధ్రదేశంలో ఉన్న రామాలయాల్లో నేటికీ సాంప్రదాయబద్ధంగా ఉత్సవాలు నిర్వహించేది తిరుపతి కోదండరామాలయంలోనే అని ఖచ్చితంగా చెప్పవచ్చు. ఈ ఘనత తిరుమల తిరుపతి దేవస్థానాల వారిదే!

* * *

## తిరుపతి - కపిలేశ్వరాలయం



తిరుపతి యావద్భారతదేశ మందే ప్రసిద్ధవైష్ణవ పుణ్యక్షేత్రం. ఇచ్చట గోవిందరాజస్వామి ఆలయం, కోదండ రామస్వామి ఆలయం, తిరుమల వేంకటేశ్వర ఆలయాలు ప్రసిద్ధ వైష్ణవా లయాలు. ఐతే తిరుపతిలో శేషాద్రి పర్వతపాదంలో ఒకే ఒక శివాలయం ఉంది. దీనినే కపిలేశ్వరస్వామి ఆల యం అంటారు. ఈ ఆలయ ప్రాంతాన్ని కపిలతీర్థం అనికూడా అంటారు. ఇది ప్రకృతిరమణీయతకు ప్రసిద్ధి చెందినది. ఎంతో దూరం నుంచి పరవళ్ళు త్రొక్కి ప్రవహిస్తూ, కొండపైనుంచి క్రిందికి బుసలుకొట్టుతూ దూకే ఈ జలపాతం యాత్రికులకు నయనానందకరంగా కనిపిస్తుంది.

కపిలతీర్థానికి మరో పేరు 'ఆళ్వార్ తీర్థం'. ఈ తీర్థ ప్రస్తావన వరాహ, వామన మొదలగు పురాణాలలో కనిపిస్తుంది. శ్రీవేంకటేశ్వర 'అష్టోత్తర శతనామావళి'లో కూడా కపిలేశ్వరస్వామి ప్రస్తావన కలదు.

పూర్వం కపిలముని అనే ఋషి ఇచ్చట నివసిస్తూ పరమేశ్వరుని పూజించుటచేత, ఇచ్చటి స్వామి కపిలేశ్వరుడని పిలువబడినాడు. కపిలతీర్థం కొండను ఆనుకొని ఆలయం నిర్మింపబడింది. ఈ ఆలయంలో అనేక మందిరాలు గోపురాలు ఉన్నాయి. వాటిలో కొన్ని శిథిలావస్థలో వుండగా, మరికొన్ని ఉన్నతస్థాయిలో ఉన్నాయి. ఆలయప్రవేశద్వారం దక్షిణదిశలో ఉంది. ఆలయం సమీపించగానే పడమర వైపుగా గోపుర ద్వారమున్న ఆళ్వార్ గుడి ఉంది. ఈ గుడి మొత్తం శిథిలావస్థలోనికి చేరుకొంటూ ఉండడంచేత, తరచూ గుడివాకిళ్ళు తెరవరు.

ఆలయం ప్రవేశించగానే దర్శనమిచ్చేది కపిలతీర్థం కోనేరు. ఈ కోనేటిలోనికి నీరు తిరుమలగిరులపై నుంచి జలపాతంద్వారా వస్తూ వుంటుంది. ఈ జలపాతం చుట్టూ అనేక మండపాలున్నాయి. ఈ మండపాలను దాటగానే తూర్పువైపున మెట్లవరుసలున్నాయి. ఇచ్చటే రెండంతస్తులతో నిర్మించిన పెద్దహాలు, దానిమధ్యన ప్రధాన ఆలయం కలవు. ఆలయమందు గర్భగృహం, ప్రదక్షిణ అంతరాళము లున్నాయి. గర్భాలయమందు గంభీరమైన శివుడు లింగరూపము దాల్చి కపిలేశ్వరస్వామి పేరున పూజలందుకొంటూ వున్నాడు. ఈ ఆలయమందు చంద్రశేఖర, సూర్య, ఉత్సవమూర్తులున్నారు. ప్రధానాలయంతో బాటు సుబ్రహ్మణ్య, సూర్యనారాయణ, ఉమామహేశ్వర, చండికేశ్వర మండపాలు, వినాయక, నవగ్రహ, నాగదేవతా ప్రతిష్ఠలు కలవు. ఆలయ ప్రాంగణమందు కుమారస్వామి, దక్షిణామూర్తి, కామాక్షిశిల్పాలు ఎంతో మనోహరంగా ఉన్నాయి. దక్షిణామూర్తి నాలుగు హస్తాలను కలిగి పై కుడిచేతిలో సర్పాన్ని, ఎడమచేతిలో త్రిశూలాన్ని పట్టియున్నాడు. సూర్యభగవానుడు తన చేతులందు కలువలను ధరించియున్నాడు. ఈ శిల్పాలు చోళవాస్తు పద్ధతిలో మలచబడినాయి.

పూర్వం కపిలమహర్షి ఈ తీర్థంనుండి బిలమార్గముద్వారా రోజూ తిరుమల వెళ్ళి వేంకటేశ్వరుని పూజించేవాడట! చాలాకాలం ఈ తీర్థం నీటినే తిరుపతి గోవిందరాజస్వామిఅభిషేకానికి ఉపయోగించేవారు. తిరుపతిలో 'నరసింహతీర్థం' (మంచినీళ్ళగుంట) తవ్విన తరువాత స్వామి అభిషేకానికి ఆ నీటిని వాడుతూ ఉన్నారు. పూర్వం తిరుమలను దర్శించే యాత్రికులు తప్పనిసరిగా కపిలతీర్థంలో స్నానంచేసి అచటినుంచి ప్రారంభమయ్యే కాలిబాట ద్వారా తిరుమల వెళ్ళేవారు. తిరుపతి పరిసర ప్రజలు, ముఖ్యంగా స్త్రీలు ధనుర్మాసమందు ఈ తీర్థంలో స్నానంచేసి స్వామిని దర్శించి పునీతులౌతూ ఉంటారు. కపిలతీర్థమందు కార్తీక దీపం, మరియు శివరాత్రి రోజున గొప్ప ఎత్తున ఉత్సవాలు జరుగుతాయి. శనిత్రయోదశి రోజు ఇచ్చట పూజలు చేయిస్తే నవగ్రహబాధలన్నీ తొలగిపోతాయట!

కపిలేశ్వరస్వామి ఆలయంలో చోళ, విజయనగర వాస్తుశిల్పాలు కనిపిస్తాయి. ఇచ్చట ఒక శాసనమందు 'రాయన్ రాజేంద్రచోళన్' అనే రాజు ఇచ్చటి నిర్మాణాలను చేపట్టినట్లు తెలుపుతూంది. ఇతడు కొత్తూరు నివాసి. పూర్వం కపిలతీర్థాన్ని ఆనుకొని కొత్తూరు అనే గ్రామం ఉండేది. దీనినే ఆనాడు 'అచ్యుతరాయపురం' అని కూడా అనేవారు. ఇచ్చటి ప్రజలు తరుచూ వ్యాధిగ్రస్తులై మరణించడం చేత వారు తిరుపతిలోని ఒకవీధిలో నివాసం ఏర్పరచుకొన్నారు. కొత్తూరు ప్రజలు నిర్మించుకొన్నవీధి కాబట్టి దీనికి 'కొత్తవీధి' అనే పేరు వచ్చిందట!

శ్రీకృష్ణదేవరాయలు మరణించిన తరువాత చంద్రగిరిలో కారాగారమందున్న అచ్యుతరాయలు విడుదలై, కపిలతీర్థమందు స్నానం చేసి, తిరుమలలో స్వామిని దర్శించి పట్టాభిషేకం జరిపించుకొన్నాడట! అతడే కపిలతీర్థం కోనేటి మెట్లు, సంధ్యావందనమండపం, కోనేటికి మూడువైపులా రెండంతస్తుల మండపాలు నిర్మించాడు. అలాగే 1544 సంII మందు విజయనగరరాజు సదాశివరాయల కాలంనాటి శాసనం తాళ్ళపాక పెద తిరుమలయ్య ఆలయానికి చేసిన సేవలను కొనియాడుతూ ఉంది. అలాగే 1563 సంII నాటి శాసనం 'రాచవీటి నాయకన్' అనే అతను ఆలయంలో ప్రాకారం, వంటశాల మొదలగు నిర్మాణాలను పునర్నిర్మించినట్లు తెలుపుతూంది. 'సెవ్వసాని' అనే దేవదాసి విజయనగరం నుండి వచ్చి ఆలయానికి ఎంతో సేవ చేస్తూ, ఆలయమందు గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించినట్లు మరో శాసనం తెలుపుతుంది. ఐతిహ్యం ప్రకారం, పద్మావతి శ్రీనివాసుల వివాహ నిశ్చితార్థముహూర్తం ఇచ్చటే జరిగినదట!

క్రీ.శ. 1865 సంII మహంతు ధర్మదాసు కోనేటిమెట్లను, మండపాలను పునరుద్ధరించినట్లు శాసనం వేయించాడు. ఈ పవిత్రక్షేత్రం తిరుమల తిరుపతి దేవస్థానంవారి నిర్వహణలో ఉంది.

* * *

## శ్రీనివాసమంగాపురం - కళ్యాణ వేంకటేశ్వరాలయం



తిరుపతి పట్టణానికి 7 మైళ్ళ దూరాన అతిప్రాచీనమైన వేంకటేశ్వరా లయం ఉంది. ఈ ఆలయం తిరుమల వేంకటేశ్వరాలయం వెలసిన తిరుమల గిరుల పాదాలచెంత వుండడం గమనించతగిన విషయం. ఈ స్వామి వెలసిన గ్రామాన్ని శ్రీనివాస మంగాపురం అంటున్నారు. ఈ గ్రామం స్వర్ణముఖీనదికి ఉపనదియైన కళ్యాణినది గట్టుపైవుంది. కళ్యాణినది గట్టుపై వెలసిన స్వామి కాబట్టి ఈయనను కళ్యాణ వేంకటేశ్వరుడు అన్నారేమో? కాని ఐతిహ్యం ప్రకారం శ్రీనివాసుడు నారాయణ వనపాలకుడైన ఆకాశరాజు కుమార్తె పద్మావతీదేవిని పరిణయమాడి, తన నివాసమైన తిరుమల కొండకు వెళ్ళుతూ సువర్ణముఖి నది గట్టున తపమాచరిస్తూ కాలం వెళ్ళబుచ్చుతున్న అగస్త్య మునీంద్రుని దర్శించి అతడి దీవెనలు పొందినాడు. మహర్షి కొత్తదంపతులు పసుపుగుడ్డలతో తిరుమలకు వెళ్ళరాదని, 6 మాసాలు కొండకిందనే కాలం వెళ్ళబుచ్చ మన్నాడట! శ్రీనివాసుడు విధిలేక శ్రీనివాసమంగాపురంలో కళ్యాణి నది గట్టున 6 మాసాలు కొత్తకాపురం గడిపి తరువాత తిరుమల చేరుకున్నాడట! కాబట్టి స్వామి కాపురముండిన చోటు కళ్యాణినదిగట్టున శ్రీనివాసునికి ఆలయం నిర్మించినారు.

శ్రీనివాసమంగాపురమందలి కళ్యాణవేంకటేశ్వరాలయాన్ని ఎవరు ఎప్పుడు నిర్మించారో చెప్పలేము. ఈ ఆలయం ఎన్నోమార్లు శిథిలమైపోగా, పునర్నిర్మాణం కావించినట్లు తెలుస్తూవుంది. ఉదా॥ క్రీ.శ. 1540 సం॥ మందు తాళ్ళపాక అన్నమాచార్యుల వంశీకుడైన చిన్న తిరుమలయ్య

జీర్ణోద్ధారణ కావించినట్లు, అతడు వేయించిన శాసనాలవల్ల తెలుస్తూ వుంది. అంతేగాక అతడే ఆలయమందు వేంకటేశ్వర, నాచ్చియార్ (దేవేరి), అనంత, గరుడ, విష్వక్సేన, ఆళ్వారులు, ఉడైయవర్లు, పూర్వాచార్యులు, అన్నమాచార్యుల విగ్రహాలను ప్రతిష్ఠించినాడట! శ్రీనివాసమంగాపురం ఆలయంలో వేదపారాయణం చేసే బ్రాహ్మణులకు అగ్రహారం ఉండేది. తాళ్ళపాకవంశీకులే ఆలయంలో అనాదిగా వేదపారాయణం చేసేవారేమో! అందుచేతనే తాళ్ళపాక తిరుమలయ్య, తమ దేవాలయం క్షీణదశలో ఉండగా జీర్ణోద్ధారణ కావించి యుండవచ్చు.

శ్రీనివాసమంగాపురం ఆలయం ఆనాడు తిరుమలకు కాలిబాటన (శ్రీవారిమెట్టు) వెళ్ళే యాత్రికులకు వాకిలిగా వుండేది. (దీనినే రాయలవారి త్రోవ అని కూడా అనేవారు) తిరుమలకు వెళ్ళే యాత్రికులు మొదట పెళ్ళి కుమారుడైన కళ్యాణ వేంకటేశ్వరుని దర్శించి వెళ్ళేవారు. అయితే కాలగమనంలో ఈ ఆలయం తన ప్రాచీనవైభవాన్ని కోల్పోయి, దాదాపు మూతపడిపోయి, ముండ్ల పొదలకు, పుట్టలకు ఆలవాలమైంది. ఇటీవలి కాలంలో, ఈ కళ్యాణ వేంకటేశ్వరుడు కాంచీపురానికి చెందిన కృష్ణస్వామి అనే భక్తునికి కలలోకనబడి, తన ఆలయానికి వెళ్ళి యథావిధిగా పూజాపునస్కారాలు జరిపించమన్నాడట! ఆ భక్తుడు శ్రీనివాసమంగాపురం వచ్చి, స్వామివారి ఆలయ పరిసరాలను శుభ్రపరచి పూజలు జరిపించుచుండగా, మెల్లమెల్లగా ఆలయానికి ప్రాముఖ్యత సంతరించింది. తిరుపతి నుంచి కొంతమంది భక్తులు ముఖ్యంగా ప్రముఖ పాత్రల వ్యాపారులైన మలిశెట్టి గోవిందయ్య సోదరులు ప్రతి శనివారం శ్రీనివాసమంగాపురం వెళ్ళి స్వామివారిని పూలమాలలతో అలంకరించి స్వామివారికి పూజలు జరిపించి వచ్చేవారు.

శ్రీనివాసమంగాపురం ఆలయం కొంతకాలం భారతీయ పురావస్తు శాఖవారి అధీనంలో యుండేది. కొంతకాలం క్రిందట తిరుమల తిరుపతి

దేవస్థానం పరిపాలనాధికారి మొగిలి చంద్రమౌళిరెడ్డిగారు చొరవ తీసుకొని ఆలయాన్ని టి.టి.డి. అధీనంలోకి తీసికొని ఆలయాన్ని, ఆలయ రాజగోపురాన్ని పునరుద్ధరించి, తిరుమల ఆలయంలో జరిగేటటువంటి అన్ని ఉత్సవాలను ఈ ఆలయంలో ప్రవేశపెట్టారు. ఆలయనిర్మాణం రోజున ఎంతటి ఉన్నతస్థాయిలో వుండినదో ఆ స్థాయికి చేరుకుంది.

**ఆలయనిర్మాణం**

శ్రీనివాసమంగాపురం వేంకటేశ్వరాలయం, తూర్పుముఖంతో నిర్మింపబడింది. ఆలయం చుట్టూ ఎత్తైన ప్రహరీ వుంది. ఆలయ ప్రవేశద్వారం పైన 5 అంతస్తుల రాజగోపురం వుంది. ప్రవేశద్వారం కుడివైపు రాతిదిమ్మపై అన్నమయ్య శిల్పం ఉంది. గోపురం అధిష్ఠానం రాతితోను, పై అంతస్తులు ఇటుకలతోను నిర్మించారు. గోపురం మొత్తం అనేక వైష్ణవ పురాణశిల్పాలతో అలంకరింపబడి ఉంది. రాజగోపురం దాటగానే విశాలమైన ఆవరణలో మధ్యభాగాన ప్రధాన ఆలయం నిర్మితమై వుంది. ఆలయమందు గర్భగృహం, అంతరాళం, ముఖమండపం, మహామండపాలున్నాయి. చతురస్రంగా వున్న గర్భాలయం మధ్యన కన్నులపండుగ చేసే కళ్యాణ వేంకటేశ్వరస్వామి విగ్రహం ఉంది. ఈ స్వామి తిరుమలలో వేంచేసిన వేంకటేశ్వరుని విగ్రహం కంటే పెద్దదంటారు. గర్భాలయంపైన ద్రవిడపద్ధతిని నిర్మించిన ద్వితల విమానం, వేసరశిఖరం, పైన కలశము ఉన్నాయి. ఈ విమానం మొదటి అంతస్తు, నాలుగు వైపులా సింహపు ప్రతిమలున్నాయి.

గర్భాలయం ముంగిట రెండు భాగాలుగా ఉన్న అంతరాళం ఉంది. ఒక భాగంలోని వేదికపైన విష్వక్సేన, మరోవేదికపై శ్రీరామానుజ విగ్రహాలున్నాయి. ఇంకోభాగంలో గంభీరమైన శేషశయనుడైన రంగనాథస్వామి విగ్రహం ఉంది. ఇచటే లక్ష్మీనారాయణశిల్పం కూడా

ప్రతిష్ఠింపబడి ఉంది. అంతరాళం ముంగిట 4 స్తంభాల సాయంతో చతురస్రంగా నిర్మించిన ముఖమండపం నిర్మింపబడింది. ముఖమండప ద్వారాని కిరువైపులా సాయుధపాణులైన ద్వారపాలకులున్నారు.

ఆలయమందు ప్రముఖ ఆకర్షణ మహామండపం. ఈ మండపం భూమికి 5' అ. ఎత్తున 40' స్తంభాల సాయంతో నిర్మింపబడింది. అధిష్ఠానం మొత్తం శిల్పాలంకరణతో నిండివుంది. మండపంలోని 40 స్తంభాలలో 18 స్తంభాలు మండపం చుట్టూ, మిగిలిన 22 స్తంభాలు మండపం మధ్యన ఉన్నాయి. మండపం మధ్య ఉన్న స్తంభాలు, చుట్టూ వున్న స్తంభాలు వైవిధ్యాన్ని కలిగి, అనేక వైష్ణవ శిల్పాలతో అలంకరింపబడివున్నాయి. ఈ స్తంభాలన్నీ విజయనగరవాస్తుశైలిలో మలచబడినాయి. ఈ మండపం తూర్పువైపున చిన్నమండపం, అందులో అంజలిఘటిస్తు స్వామిని చూస్తూవున్న గరుడ శిల్పమున్నది ఈ మహామండపానికి ఒంటిమిట్టలోని కోదండరామస్వామి ఆలయానికి నిర్మాణంలో దగ్గర పోలికలున్నాయి. మహామండపానికి, రాజగోపురానికి మధ్యన ధ్వజస్తంభం, బలిపీఠం నిర్మితమైయున్నాయి.

ఆలయం చుట్టూ దాదాపు 100 మీటర్లు వరకు ఆలయానికి చెందిన అనేక విడి రాతిస్తంభాలు, పలకలు పడివున్నాయి. ఇవి ఆలయాన్ని ధ్వంసంచేసి పడవేసినారా! లేక ఆలయనిర్మాణానికి తయారు చేసిన పిదప ఆలయనిర్మాణం ఆగిపోయిందా! చెప్పలేము.

* * *

## తిరుచానూరు - పద్మావతీ అమ్మవారి ఆలయం

తిరుచానూరు (అలిమేలు మంగాపురము) గ్రామము తిరుపతికి మూడుమైళ్ళ దూరమున కలదు. తిరుమల, తిరుపతి పుణ్యక్షేత్రములకంటే తిరుచానూరు అతి ప్రాచీనమైనది. పూర్వమీ గ్రామమును తిరుశుకనూరు, 'శ్రీశుకపురి' అనే పేర్లతో పిలిచెడివారు. పూర్వమీ గ్రామమందు 'శుకమహర్షి' ఆశ్రమమును నిర్మించుకొని తపస్సుచేయుటచే, దేశము నలుమూలలనుండి మునులు వచ్చి ఇచ్చట నివాసమేర్పరచుకొన్నారట! శుకమహర్షి నివసించిన వూరు కావున 'తిరుశుకనూరు' అని, ఈ గ్రామము వెలుపల మునులు నివసించిన ప్రదేశమును 'మునులపూడి' అని వ్యవహరిస్తారు. ఈ మునుల పూడిలోనే శుకమహర్షి తాత పరాశరుని పేరున 'పరాశరేశ్వరాలయం" నిర్మించబడినది.

క్రీ.శ. 8వ శతాబ్దమునాటికి తిరుచానూరు వైష్ణవమత ప్రధాన కేంద్రముగా రూపుదాల్చినది. అప్పటికి తిరుమలకొండ ప్రాధాన్యతను సంపాదించినప్పటికి, యాత్రికులు స్వామి దర్శనము చేసికొనుట కష్టసాధ్యముగా నుండుటచే, తిరుమలలోని వేంకటేశ్వరస్వామి విగ్రహము



వెండినమూనా విగ్రహమును తిరుచానూరు 'తిరువిలాన్ కోవిల్' యందలి 'తిరుమంత్రశాలై' యందు ప్రతిష్ఠించి, ఆలయ అధికారులు యాత్రికులకు స్వామి దర్శనపు ఏర్పాట్లు కావించినారు. ఈ విగ్రహాన్ని సామవై (సమావయై) అనే పల్లవరాణి ప్రతిష్ఠించినది. నేడు తిరుచానూరుయందు, తిరువిలాన్ కోవిల్, కృష్ణాలయము, పరాశరేశ్వర ఆలయము, వరదరాజ ఆలయము,

అలివేలుమంగ తాయారు (పద్మావతీదేవి) ఆలయములున్నవి. తిరుచానూరులో నిర్మింపబడిన మొట్టమొదటి ఆలయము 'తిరువిలాన్కోయిల్'. ఈ ఆలయములో దంతివర్మ పల్లవరాజు క్రీ.శ. 826వ సంవత్సరమునాటి శాసనమున్నది. కట్టకడపటి శాసనము మూడవ చోళరాజ రాజుది. ఆలయమందు మొత్తము ముప్పదిరెండు శాసనములున్నవి. ఈ ఆలయమందే పూర్వము వేంకటేశ్వరుని వెండి విగ్రహము ప్రతిష్ఠింపబడియుండినది. ఈ తిరువిలాన్కోయిల్ నేటి పద్మావతి ఆలయమందు ఏ ప్రదేశము నందుండినది ఇదమిత్థముగా చెప్పలేము. ఈ ఆలయమునకు చెందిన శాసనములన్నియు నేడు పద్మావతీదేవి ఆలయములో చోటుచేసికొన్నవి.

## కృష్ణాలయము

ఈ ఆలయమును 'అళగియపెరుమాళ్ ఆలయ'మని కూడా పేర్కొనబడినది. ఇది పద్మావతీదేవి ఆలయ మధ్యభాగమున మహద్వార గోపురమునకు ఎదురుగా వున్నది. ఈ ఆలయము పదకొండవ శతాబ్దమునందే ఉన్నతస్థాయిలో వున్నట్లు ఆలయమందు లభ్యమయ్యేడి పది శాసనములు తెల్పుచున్నాయి. కృష్ణాలయములో గర్భగృహము పై భాగమున ద్వితల విమానము, వేసరజాతి గుండ్రని శిఖరము, దానిపై కలశము వున్నవి. విమానము నాలుగు వైపులా సింహప్రతిమలున్నవి. గర్భగృహమునందు మధ్యభాగమున కృష్ణ (అళగియ పెరుమాళ్) విగ్రహమున్నది. కృష్ణుని రెండు చేతులు వరదముద్రలో వున్నవి. స్వామి పద్మాసీనుడైయున్నాడు. కొందరీ స్వామిని పార్థసారథి అంటారు. స్వామికి కుడివైపున బలరాముని విగ్రహము, మరొకవైపున కాళీయమర్దన కృష్ణ, లక్ష్మీనరసింహస్వామి విగ్రహములున్నవి. కృష్ణాలయమునకు కుడివైపున వరదరాజ (సుందరరాజ) స్వామి ఆలయమున్నది. ఆలయములో గర్భగృహము, అంతరాళము, ముఖమండపము, మహామండపములున్నవి. గర్భగృహముపై వేసరజాతికి చెందిన రెండంతస్తుల ఆయతాస్త్ర విమానము, దానిపైన శిఖరము ఉన్నది. గర్భగృహమందు సమభంగరీతిలో నిలబడియున్న

వరదరాజస్వామి విగ్రహమున్నది. స్వామికి వున్న నాలుగు చేతులలో పై రెండు చేతులందు శంఖ, చక్రములు, క్రింది కుడిచేయి వరద ముద్రలోను, ఎడమచేయి క్రిందికి వదలబడియున్నది. మూలబేరానికి ఇరువైపుల శ్రీదేవి, భూదేవి ప్రతిమలు వున్నవి. అంతరాళప్రవేశమునకిరువైపుల ద్వారపాలకులు వున్నారు. ముఖమండపము, మహామండపస్తంభములు విజయనగర వాస్తుపద్ధతికి చెందియున్నవి.

**పద్మావతీదేవి (అలివేలుమంగ) ఆలయము**

తిరుచానూరులో నేడు ప్రసిద్ధి వహించినది పద్మావతీదేవి ఆలయమే. ఈ ఆలయము కృష్ణాలయమునకు ఉత్తరదిశలో ప్రాకారకుడ్యమునకు సమీపమునందున్నది. అలివేలుమంగమ్మను తిరుమలలోని వేంకటేశ్వరస్వామి సతీమణిగా పురాణములు పేర్కొనుచున్నవి. తిరుపతి గోవిందరాజస్వామి ఆలయనిర్మాణరీతికి, పద్మావతీదేవి ఆలయనిర్మాణరీతికి అనేక పోలికలున్నవి. ఆలయములో గర్భగృహము, అంతరాళము, ముఖమండపము, ఇంకొక స్తంభముల మండపము వున్నవి. గర్భగృహము పైభాగమున ఏకతల విమానము, శిఖరము, పద్మములపై ప్రతిష్ఠించిన కలశము ఉన్నవి. గర్భగృహ మధ్యభాగమున పద్మాసనాసీనురాలైన అలివేలు మంగమ్మ దివ్యమంగళరూప విగ్రహమున్నది. దేవి రెండు చేతులందు పద్మములున్నవి. క్రింది చేతులు అభయముద్రలో వున్నవి.



అంతరాళముయొక్క ముఖద్వారమున కిరువైపుల ద్వారపాలికల విగ్రహములున్నవి. ముఖమండపములో చిన్నచిన్న గుడులు నిర్మింపబడినవి. ఉత్తరవైపునవున్న చిన్న మందిరములో రామానుజ విగ్రహము, దక్షిణవైపున 'గరుడ', 'విష్వక్సేన' ప్రతిమలున్నవి. ఈ మండప సమీపమునందే ధ్వజస్తంభము, బలిపీఠములున్నవి. ఆలయమందలి మండపాలలో చోళరీతిస్తంభములు, విజయనగర వాస్తురీతిస్తంభములు ఉన్నవి.

ఆలయమునకు వెనుకవైపున, తూర్పుదిశలో 'పద్మసరోవర' మనే పవిత్రమైన కోనేరున్నది. పురాతన కాలమునుండి ఈ సరోవరము అత్యంత ప్రసిద్ధిగాంచినది. పూర్వము యాత్రికులు ఈ కోనేరునందు స్నానమాచరించిన తరువాతనే తిరుమలకు వెళ్ళేవారట. ఐతిహ్యము ప్రకారము మహాలక్ష్మి మహావిష్ణువుపై కోపగించి, భూలోకమునకరుదెంచి ఎచ్చటనో దాగుకొన్నదట. దేవి ఎడబాటును సహించలేని శ్రీహరి భూలోకమునకేతెంచి ఎచ్చటెచ్చటనో తిరిగి లక్ష్మీదేవి కానరాకపోవుటచే నేటి తిరుచానూరు ప్రాంతమందు ఒక కోనేరును త్రవ్వి, దానిగట్టుపై సూర్యభగవానుని విగ్రహమును ప్రతిష్ఠించి, కొన్నేండ్లు తపస్సుచేయగా, భర్త అగచాట్లను గమనించిన లక్ష్మీదేవి కోనేటిలోని ఒక పద్మముపైనుండి వెలుపలికి వచ్చి స్వామిలో లీనమైనది. ఈ భార్యాభర్తల కలయికను, బ్రహ్మ, మహేశ్వర, ఇంద్ర, వరుణ మొదలగు సర్వదేవతలు తిలకించినారట. లక్ష్మీదేవి (పద్మావతి) జన్మస్థలమగుటచే తిరుచానూరునందు ఆమెకు ఆలయాన్ని నిర్మించినారు. లక్ష్మీదేవి కమలమునుండి ఈ సరస్సులో జన్మించుటచే దీనికి పద్మసరోవరమని శ్రీమహావిష్ణువు పేరుపెట్టి అందులో స్నానమాచరించినవారు సకల పాపములనుండి విముక్తి చెందెదరని దీవించినాడు. తిరుచానూరు పద్మావతీదేవి ఆలయము క్రీ.శ. 18వ శతాబ్దమందు మహమ్మదీయుల దండయాత్రకు గురియై నేలమట్టము చేయబడినది. ఆలయమందలి మూలవిరాట్టునకు అంగవైకల్యము కలుగజేసినారు. ఆలయములోని అర్చకులు ఎంతో శ్రద్ధతో, శ్రమకోర్చి, ఉత్సవ విగ్రహమును తిరుపతిలోని 'నమ్మాళ్వారు' ఆలయములో

భద్రపరచినారు. ఆపై తూర్పు ఇండియా కంపెనీవారి పాలనలో ఆలయము తిరిగి నిర్మించబడినది.

## పరాశరేశ్వర ఆలయము

ఈ ఆలయము తిరుచానూరుకు కడు సమీపంలో సువర్ణముఖీనది గట్టున జోగిమల్లవరం అనే గ్రామములో నిర్మింపబడినది. ఈ ఆలయము క్రీ.శ. 10వ శతాబ్దమునాటికే నిర్మాణమై యుండినది. అళగియ పెరుమాళ్, పద్మావతీదేవి ఆలయముల నిర్మాణముతో పరాశరేశ్వర ఆలయమునకు ప్రాముఖ్యత తగ్గిపోయినది. ఈ ఆలయమందు పదకొండు శాసనములు లభ్యమైనవి. ఆలయమందు గర్భగృహము, అంతరాళములున్నవి. ఈ రెండు ఒకే అధిష్ఠానముపై తూర్పుముఖంగా నిర్మింపబడినవి. అంతరాళము గోడల పైన భూతగణములున్నవి. గర్భగృహము దక్షిణవైపు గోడపై, దక్షిణామూర్తి శిల్పమున్నది. గర్భగృహముపై విమానము, గుండ్రని శిఖరముపై కలశము వున్నవి. గర్భగుడి మధ్యభాగమున లింగము, లింగమునారాధించుచున్నట్లు చెక్కబడిన ఒక ఋషీశ్వరుని శిల్పమున్నది. ఈ ఋషి శుకమహర్షి తాతగారైన పరాశరేశ్వరుడు.

ఆలయగోడలపైన ఆసీన గణపతి, సప్త మాతృకలు, కుమారస్వామి, విష్ణు, దక్షిణామూర్తి, చండి, బ్రహ్మ, బాలసుబ్రమణ్య, కామాక్షి, శుకమహర్షి, సోమస్కంద, పార్వతీపరిణయ, కంకాళమూర్తుల శిల్పములు చెక్కబడినవి. తిరుచానూరు ఆలయములలోనే పరాశరేశ్వరస్వామి ఆలయము కలికితురాయిలాంటిది. ఆలయము చోళనిర్మాణరీతులకు, శిల్పములకు వాసికెక్కినది.

* * *

# నాగలాపురం -
# శ్రీ వేదనారాయణస్వామి దేవాలయం

చిత్తూరుజిల్లాయందలి దేవాలయములలో తిరుపతి, తిరుమల, శ్రీకాళహస్తి దేవాలయముల తర్వాత పేర్కొనదగినది నాగలాపురం నందలి వేదనారాయణస్వామి ఆలయము. ఈ దివ్యపుణ్యక్షేత్రము తిరుపతికి 45 మైళ్ళ దూరాన సత్యవేడు తాలూకాలో మద్రాసు, తిరుపతి మార్గమధ్యమున నెలకొని యున్నది. ఈ ఆలయమందు విష్ణువుయొక్క మత్స్యావతార రూపము, ఇరువైపుల శ్రీదేవి, భూదేవులతో వేదనారాయణస్వామి పేరిట పూజలందుకొనుచున్నాడు. ఈ ఆలయము విజయనగరవాస్తుశిల్పమునకు మచ్చుతునక.

**ఐతిహ్యము**

కలియుగ అవతరణమునకు పూర్వము ప్రళయముచేత ప్రపంచ మంతయు నీటిలో మునిగిపోగా, సృష్టికర్త బ్రహ్మ నిద్రావస్థలో నుండుట కనిపెట్టిన హయగ్రీవుడను (సోమకాసురుడు లేక హిరణ్యాక్షుడు) రాక్షసుడు సృష్టికర్త వద్దగల వేదముల నపహరించుకొని వెళ్ళగా ఈ విషయమును తెలిసికొన్న శ్రీమహా విష్ణువు మత్స్యరూపమును ధరించి, రాక్షసుని సంహరించి వేదములను బ్రహ్మకిచ్చినాడు. ఈ ఐతిహ్యమంతయు ఈ ఆలయమునందు శిల్ప రూపమున గలదు.



**ఆలయనిర్మాణము**

వేదనారాయణస్వామి ఆలయము విజయనగరాధీశుడైన శ్రీకృష్ణదేవరాయలు తన మాతృమూర్తి నాగలాంబ పేరిట నిర్మించినట్లు చరిత్రకారుల భావన. ఇతడు దక్షిణ దిగ్విజయయాత్రను పూర్తిగావించి కుంభకోణము నుండి తిరిగివచ్చునపుడు తన తల్లి జన్మస్థానమైన నాగలాపురమును దర్శింప వచ్చినపుడు, ఒక రాత్రి కలలో శ్రీహరి వేదనారాయణరూపమున కనపడి నాగలాపురమందు తనకు సప్త ప్రాకారములతో కూడిన ఆలయము నిర్మింపుమన్నాడట! కృష్ణరాయలు నాగలాపురము చేరిన వెంటనే స్వామిఆజ్ఞమేరకు ఆలయనిర్మాణమునకు పూనుకొని ఆ బాధ్యతను 'వడమాల' అనే హరిదాసునకు అప్పగించి ఆలయములో పూజావిధులకయ్యేడి ఖర్చులకై హరిదాసునకు 'హరికండాపురము' అను గ్రామమును దానమొసంగినాడు. నేటి నాగలాపురమే నాటి హరికండాపురము.

వేదనారాయణస్వామి ఆలయము చుట్టూ పెద్ద పెద్ద రాతిదిమ్మలతో నిర్మించిన మూడు ప్రాకారములున్నవి. ఆలయములోనికి ప్రవేశించుటకు



మొదటి ప్రాకారమునందు నాలుగువైపుల నాలుగు ప్రవేశద్వారములున్నవి. మొదటి ప్రాకారమునందలి ద్వారములపై గోపురములున్నవి. నేడు ఆలయ ముఖద్వారముగానున్న పడమటి ద్వారముపై మిగతవాటికన్నా ఎత్తైన గోపురమున్నది. కాని ఈ గోపుర నిర్మాణము పూర్తికాలేదు. గోపుర అధిష్ఠానము పెక్కు లతలు, లతాం గులు, అష్టదిక్పాలకులు మొదలగు

శిల్పములతో అలరారుచున్నది. తూర్పు, ఉత్తరము, దక్షిణ గోపుర ద్వారములు నేడు మూతబడినవి. ఆలయములోనికి ప్రవేశించగానే మొదటి ఆవరణమునందు దక్షిణమున, ఉత్తరవైపున రెండు బావులున్నవి. ఇచ్చటనున్న ఒక మండపము గోడలపై, మత్స్యావతారగాథ శిల్పమునందు చూపబడినది. ఈ శిల్పములందు విష్ణువు రాక్షసుని చంపు శిల్పము, బ్రహ్మ వేదములను శ్రీహరి నుండి స్వీకరించు శిల్పములు అత్యంత సుందరముగా మలచబడినవి.

రెండవ ప్రాకారములో దక్షిణంవైపు మాత్రమే గోపురముతో అలంకరించిన ప్రవేశద్వారమున్నది. ఈ ద్వారము దాటగానే వీరాంజనేయ, లక్ష్మీనరసింహ, కోదండరామ మందిరములున్నవి. ఈ రెండవ ప్రాంగణము నందే తూర్పుముఖముగా దేవి (వేదవల్లి) ఆలయమున్నది. ఈ ఆలయము మహామండపము, ముఖమండపము, అంతరాళము, గర్భగృహములను కలిగియున్నది. గర్భగృహమందు మంగళకరమైన వేదవల్లితాయారు విగ్రహమున్నది.

రెండవ ప్రాంగణము నుండి గోపుర పరివేష్ఠితమైన ద్వారము ద్వారా ప్రధానాలయము చేరవచ్చును. ఈ ప్రవేశగోపురము ముందుభాగమున బలిపీఠము, ధ్వజస్తంభము కల మండపమున్నది. ప్రధానాలయము పశ్చిమాభిముఖముగా నిర్మింపబడినది. దీనిలో గర్భగృహము, అంతరాళము, ముఖమండపము, మహామండపము అను భాగములు కలవు. గర్భగృహము, అంతరాళము, ముఖమండపముల చుట్టూ స్తంభముల సాయముతో నిర్మించిన మండపము, ప్రదక్షిణాపథము వున్నది. ఈ మండపమునందే త్రివిక్రమ, లక్ష్మి, వేణుగోపాల, వరాహమూర్తి, హయగ్రీవ, లక్ష్మీనారాయణ, విష్ణు, భూదేవి, త్రిమూర్తి విగ్రహములున్నవి. వీనిలో ప్రస్తుతింపదగినది త్రిమూర్తి విగ్రహము. ఈ విగ్రహమును మీటిన సప్తస్వరాలు పలుకును. మహామండపమున కిరువైపుల స్థానక గణపతి, దుర్గ విగ్రహములున్నవి. మండపమునందు ఇరువది నాలుగు స్తంభములు (నాలుగు వరుసలలో వరుసకు ఆరు) ఉన్నవి. మండపము పై కప్పులో రాసలీలా శిల్పములు

చెక్కబడినవి. ముఖమండపమునందు రామానుజ, శంకర, ఆంజనేయ, విష్వక్సేన, ఆళ్వారుల యొక్క లోహపు విగ్రహములున్నవి.

గర్భగృహమునందు మత్స్యావతారరూపమున శ్రీ మహావిష్ణువు, భూదేవి, శ్రీదేవి విగ్రహములు ప్రతిష్ఠింపబడియున్నవి. స్వామి ఉత్సవ విగ్రహము శ్రీకృష్ణునిది. ప్రధానాలయములందలి గోడలయందలి గూడులందు వీణాధర దక్షిణామూర్తి, స్థానక గణపతి, దుర్గ, భూవరాహ, బ్రహ్మ మొదలగు విగ్రహములున్నవి. స్వామికి తైలాభిషేకము ఆచారము.

వేదనారాయణస్వామి ఆలయమునందు ప్రతి సంవత్సరము మార్చినెలలో జరుగు 'సూర్యసేవ' అతిపవిత్రమైనది. ఈ ఉత్సవ సమయమునందు (మార్చి 26, 27, 28 తేదీలయందు) సూర్యకిరణాలు మహాద్వారగోపురము నుండి స్వామి గర్భాలయములోనికి ప్రవేశించి మొదటి దినము స్వామి పాదాలపైన, రెండవ దినము నాభిపైన, మూడవ దినము మోముపైన ప్రసరించును. ఈ వింత ఆనాటి శిల్పులయొక్క వాస్తుశాస్త్ర నైపుణ్యానికి నిదర్శనము.

ఆలయనిర్మాణమునకు సంబంధించిన తెలుగు, తమిళ, కన్నడ భాషలలో వేయించిన కొన్ని శాసనములున్నవి. వాటిలో ముఖ్యమైనది కృష్ణరాయలకు శ్రీమహావిష్ణువు కలలో కనబడి, తనకు నాగలాపురమందు ఆలయము నిర్మింపమని తెలియజేసెడిది. అట్లే కృష్ణరాయలు ఆలయ నిర్వహణకై హరిగండాపురమును అగ్రహారముగా ఏర్పాటు చేసినట్లు తెలుపు శాసనము కూడ ఆలయచరిత్రను తెలిసికొనుటకెంతగానో తోడ్పడుచున్నది.

ప్రస్తుత మీ ఆలయము (29 ఏప్రిల్ 1967 నుండి) తిరుపతి, తిరుమల దేవస్థానముల వారి పరిపాలనలోనున్నది. ఈ పాలకసంస్థ, వేదనారాయణస్వామి ఆలయాభివృద్ధికెంతగానో తోడ్పడుచు ఆలయమునందు అనాదిగా ఆచారములోనున్న పూజలు, ఉత్సవములను పునరుద్ధరించినది.

* * *

# నారాయణవనం - అగస్త్యేశ్వరాలయం

నారాయణవనం, తిరుపతి – చెన్నై వయా ఊతుకోట రహదారిలో పుత్తూరుకు 10 కి.మీ. దూరంలో ఉంది. ఈ గ్రామాన్ని పూర్వం నారాయణపురం అని పిలిచేవాళ్ళు. ఇది ఒకనాడు పురాణ రాజవంశమైన తొండమాన్ చక్రవర్తుల రాజధాని. తిరుమల వేంకటేశ్వరుని మామ ఆకాశరాజు ఈ రాజ్యాన్ని ఏలుటేకాక, తన కుమార్తె పద్మావతీదేవిని, ఆయనకిచ్చి నారాయణపురంలోనే కల్యాణం జరిపించినారు. అందుకే ఇచ్చట కళ్యాణ వేంకటేశ్వరాలయం ఉంది. జగత్ ప్రసిద్ధి చెందిన అవనాక్షమ్మ – ఆకాశరాజు కులదేవత. ఆమెకు ఆలయం ఆకాశరాజు నిర్మించినాడు.

అగస్త్య మహర్షి మునీశ్వరులలోకెల్ల ఆద్యుడు. లోకకల్యాణంకోసం భువికేతెంచిన మహర్షి. దక్షిణదేశ పర్యటనలో ఈ స్వామి తాను బస చేసిన ప్రతిచోటా ఆశ్రమాలను నిర్మించి, అచ్చట తన ఇష్టదైవమైన పరమేశ్వరుని ప్రతిష్ఠించి పూజించేవాడు. అలా ప్రతిష్ఠించిన శివలింగాలపై ఆ తరువాత గొప్ప గొప్ప ఆలయాలు నిర్మింపబడ్డాయి. చిత్తూరు జిల్లాలో ఆవిధంగా నిర్మింపబడ్డ ఆలయాలు ఎన్నో ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనవి. పుంగనూరు సమీపంలో అగస్త్య కొత్తకోటలోని అగస్త్యేశ్వర ఆలయం, చిత్తూరు పట్టణం నీవానది గట్టున నెలకొన్న శివాలయం, చంద్రగిరి వద్ద నెలకొన్న తొండవాడ అగస్త్యేశ్వరాలయం. వీటన్నింటికంటే అతిపురాతనమైనది, శ్రీనివాస – పద్మావతి కల్యాణ ఘట్టాలకు ఐతిహ్యం ప్రకారం కేంద్రమైనది, అన్నింటికంటే మించి అపురూప శిల్పశోభిత నిర్మాణం, నారాయణవనం, అరుణానది గట్టున వెలసిన శ్రీ అగస్త్యేశ్వరాలయం.

**ఐతిహ్యం**

అగస్త్య మహర్షి నారాయణవన రాజవంశస్తుల కులగురువు. అందుచేత నారాయణపురం (వనం) లో ఆశ్రమాన్ని ఏర్పాటు చేసుకొని

అచ్చట శివాలయాన్ని ఏర్పాటు చేశాడు. రాజవంశీకులు ఆలయములోని పరమేశ్వరుణ్ణి నిత్యం పూజిస్తూ ఉండేవారు. శ్రీనివాసుడు వేంకటాచలం నుండి వేటకోసం అడవిలో తిరుగుతూ మొదట, ఈ ఆలయమందే పద్మావతిదేవిని దర్శించింది. శ్రీనివాసుని చూచిన తరువాత ఆయనపై తాప జ్వరమేర్పడి మదనపడుతున్న కుమార్తె పద్మావతి బాధ చూడలేక మహారాజు (ఆకాశరాజు) దేవగురువు బృహస్పతితో తన కుమార్తె అనారోగ్య నివారణోపాయము తెలుపమనగా, ఆయన చెంతనే ఉన్న అగస్త్యేశ్వరునికి 'ఏకాదశ రుద్రాభిషేక పూజలు' చేయించి రాకుమార్తెకు, తీర్థప్రసాదాలు అందజేయమన్నాడు. దేవగురువు చెప్పినట్లు, పూజారులు అగస్త్యేశ్వరస్వామికి అభిషేకపూజలు జరిపించుచుండగా, వకుళాదేవి అచ్చటకేతెంచి, తాను వచ్చిన కారణం తెలుపగా, చెలికత్తెలు, స్వామి తీర్థాన్ని, వకుళాదేవిని, అంతఃపురానికి తీసుకెళ్లినారు. శ్రీనివాసపద్మావతి కళ్యాణమహోత్సవాలకై నారాయణపురం ఏతెంచిన బృహస్పతి, వసిష్ఠులు, శుకమహర్షి ఆలయ ప్రాంగణంలోని ఆశ్రమమందే కొంతకాలం నివసించినారు. అంతేగాదు వేంకటాచలవాసుని వివాహమహోత్సవాన్ని తిలకించడాని కేతెంచిన సమస్త దేవతలకు అగస్త్య మహర్షి తన ఆశ్రమంలో విందు భోజనాలు ఏర్పాటు చేసి వారిని సంతృప్తిపరచి సాగనంపినాడు. నాటి నారాయణపురం (వనం) ఆలయాలపరంగానే గాక, యోగులకు, సిద్ధులకు, యంత్ర, తంత్ర, మంత్రగాళ్లకు నిలయమట!

**ఆలయనిర్మాణం**

అగస్త్యేశ్వరాలయం నాటి ఆకాశరాజు – రాజమందిరానికి సమీపంలో పవిత్ర అరుణానదీతీరంలో నిర్మింపబడింది. ఆలయం చుట్టూ ఎత్తైన ప్రహరీ ఉంది. ప్రహరీలో పశ్చిమాన ద్వారం ఉన్నది. అందుపైన అలంకరణ విన్యాసాన్ని చూడవచ్చు. గూడులలో పైన అలంకరింపబడిన ద్వారం ఉంది. ప్రహరీలోపల మధ్యభాగాన అగస్త్యేశ్వర స్వామి పేర ఆలయం

నిర్మించబడింది. ప్రధానాలయం తూర్పుముఖాన్ని కలిగి నిర్మింపబడింది. అయితే ఆలయంలోనికి ప్రవేశించడానికి తూర్పువైపున ప్రవేశద్వారం లేదు. ఆలయంలోనికి గాలి, వెలుతురు రావడానికి తూర్పుదిశలో పెద్దరాతి 'జల్లి'ని ఏర్పాటు చేశారు. ప్రతిరోజు ఉదయం, బాలభానుని లేతకిరణాలు ఈ జల్లిద్వార, స్వామివారుండే గర్భాలయంలోనికి ప్రవేశిస్తాయి. ఈ జల్లికి ముందువైపున నందీశ్వరుడు ఆసీనుడై అలవోకగా తన స్వామిని చూస్తు ఉన్నాడు. ఈయనకు మెడలో గంటలు, కంఠాభరణాలు ఉన్నాయి. నందీశ్వరుని వెనుక, ధ్వజస్తంభం, బలిపీఠం ఉన్నాయి. ధ్వజస్తంభాన్ని చుట్టి ఆలయం దక్షిణదిశకు వస్తే ప్రధానాలయంలోనికి ప్రవేశద్వారం ఉంది. ప్రధానాలయం, దేవిమందిరం, స్వామి మందిరాలుగా విభజింపబడి ఉంది. ఆలయంలోనికి ప్రవేశించగానే మొదట, దక్షిణదిశలో దేవిమందిరం నిర్మింపబడి ఉంది. ఈ మందిరం, స్వామి మందిరానికి కొంత ఎత్తున ఉంది. ఇందులో గర్భగృహం, అంతరాళం, ముఖమండపాలు ఉన్నాయి. గర్భాలయం మధ్యన దాదాపు 4 అడుగుల ఎత్తున దివ్యమంగళకరమైన దేవి 'మరకతాంబిక' పేరున ప్రతిష్ఠింపబడి పూజింపబడుతూ ఉంది. దేవి చతుర్భుజ. దేవికి చుట్టూ లోహపు మకరతోరణ అలంకారమున్నది. గర్భాలయద్వారానికి ఇరువైపులా ద్వారపాలకులు ప్రతిష్ఠింపబడ్డారు. ముఖమండపం, దక్షిణవైపున సప్తమాతృకలు, వినాయకుడు వేదికపై కొలువై ఉన్నారు. దేవి గర్భాలయంపైన ఏకతల (శాల) విమానము, పైన కలశము ఉన్నాయి. శిఖరానికి నాలుగువైపులా దేవి వాహనమైన సింహపు ప్రతిమలు ఉన్నాయి.

### ప్రధానాలయం

దేవిమందిరం ముఖమండపంలో నుండి స్వామివారి ఆలయంలోనికి స్తంభ పరివేష్టితమైన ద్వారమున్నది. ఈ ద్వారం స్వామివారి ముఖమండపాన్ని కలుపుతూ ఉంది. స్వామివారి ఆలయంలో గర్భగృహం, అంతరాళం,

ముఖమండపాలు ఉన్నాయి. గర్భాలయమందు మధ్యన పరమేశ్వరుడు, అగస్త్యేశ్వరస్వామి పేరున కొలువైయున్నాడు. స్వామి ఆకారంలో చిన్నగా ఉండి లోతైన పానవట్టంలో ఒదిగి ఉన్నారు.

## అగస్త్యేశ్వరమహర్షి

"శివుడే దాత, శివుడే భోక్త, శివుడే విశ్వము... నే శివుండ..." అని ప్రార్థించినంతనే పరమేశ్వరుడు ఇచ్చట లింగరూపమున ప్రత్యక్షమైనాడట! ఆ స్వామే అగస్త్యేశ్వరుడు.

అగస్త్యేశ్వరస్వామి వెనుకభాగంలో లోహపు మకరతోరణం, లింగం పైభాగములో అభిషేకధారాపాత్ర ఉన్నాయి. అంతరాళం ముందుభాగాన 4 స్తంభాల సాయంతో నిర్మింపబడిన ముఖమండపమున్నది. ఈ మండప స్తంభాలపైన సూర్య, చంద్ర, శివలింగ, శార్దూల, నాట్యగత్తెల శిల్పాలున్నాయి. ఈ స్తంభాలు, స్తంభ పట్టికలను పరిశీలిస్తే ఈ ఆలయం మలిపల్లవ, చోళ రాజవంశస్థుల కాలంలో నిర్మించినట్లు చెప్పవచ్చు. స్వామివారి గర్భాలయం పైన ద్రవిడపద్ధతిలో ఉన్న ద్వితల విమానము, పైన గుండ్రని శిఖరము, కలశము ఉన్నాయి. విమానం చుట్టూ విమానదేవతలు ప్రతిష్ఠింపబడినారు. విమానం చుట్టూ నాలుగువైపులా నందీశ్వరులున్నారు. ఆలయం వెలుపలి భాగం, అధిష్ఠానం గోడలు పరిశీలిస్తే స్వామి ఆలయం పల్లవ, చోళుల కాలంలోను, దేవిమందిరం, విజయనగర రాజుల కాలంలో నిర్మించినారని తెలుస్తుంది. ఈ నిర్ణయాన్ని, దేవిమందిరం వెనుక అధిష్ఠానం గోడపై లిఖించిన విజయనగరరాజముద్రిక ధృవీకరిస్తూ ఉంది.

స్వామివారి ఆలయం వెలుపల గోడలు, శిల్పకళకు కాణాచి. ఈ గోడలందు కనబడేటటువంటి కుంభస్తంభాలు, కోష్ఠాలు, కుంభపంజరాలు, స్తంభికలు, పుష్పాలంకరణలు, కీర్తిముఖాలున్న గూడులు ఈ ప్రాంతంలో నిర్మితమైన అనేక ఆలయాలలో కానరాదు అంటే అతిశయోక్తి కాదేమో!

ఈ ఆలయంలో కనబడే శిల్పానికి మహాబలిపురం రాతిరథాలలోను, కాంచీపురం ఆలయాలలోని శిల్పానికి పోలిక కానవస్తుంది.

ఈ ఆలయం అధిష్ఠానం వెలుపలి గోడలందు, దక్షిణదిశలో యోగ దక్షిణామూర్తి శిల్పం గూడుయందు ప్రతిష్ఠింపబడింది. గూడు కిరువైపులా కుంభస్తంభాలు ఉన్నాయి. పైన లతాతోరణ అలంకారముంది. గూడునందు స్వామి ఆసీనముద్రలో ఉండి, తన ఎడమ పాదాన్ని అపస్మారక పురుషునిపై ఉంచి, కుడిపాదాన్ని ఎడమ మోకాలిపై ఉంచి ఉన్నాడు. స్వామిపై కుడిచేతిలో నాగాభరణం, ఎడమచేతిలో అగ్నిశిఖ, క్రింది కుడిచేయి చిన్‌ముద్రలో, ఎడమచేతిలో పుస్తకం ఉన్నాయి. స్వామి తలవెనుక ప్రభామండలం, చెవులకు కుండలాలు, యజ్ఞోపవీతం, అపస్మారక పురుషుని క్రింద నాగబింబం, స్వామి ఇరువైపుల ఇద్దరు ఋషులున్నారు.

స్వామి అధిష్ఠానంవెనుక వైపు గోడలోని గూడులో చతుర్భుజ స్థానక మహావిష్ణువు కొలువైయున్నాడు. స్వామిపై రెండు చేతులందు శంఖ, చక్రములను ధరించి, క్రింది కుడిచేయి అభయముద్రలోను, ఎడమచేయి క్రిందికి దించి ఉన్నాడు. ఉత్తరంవైపు గోడలోని కోష్టమందు, అపురూపమైన చతుర్ముఖబ్రహ్మ శిల్పం ఉంది. స్వామి చతుర్భుజుడు. ఈయన పై కుడిచేతిలో అక్షమాల, పై ఎడమచేతిలో కమండలము, క్రింది కుడిచేయి, అభయముద్రలో, క్రింది ఎడమచేయి కటిహస్త రీతిలో ఉంచి, రాజమకుటం, మకర కుండలాలు, కంఠహారాలు యజ్ఞోపవీతం ధరించి ఉన్నాడు. ఈయనకు కుడిప్రక్కన మరొక గూడులో అపురూప లావణ్యవంతమైన విష్ణు, దుర్గ ప్రతిష్ఠింపబడి ఈమె వక్షఃస్థలం కంఠాభరణాలు, కుచబంధాన్ని కలిగి, కట్యవలంబిత పద్ధతిన ప్రతిష్ఠింపబడింది.

ఆలయమందు ఉత్తరదిశలో మూడు చిన్న గూడులున్నాయి. ఒక గూటిలో సూర్యుని ప్రతిమ ప్రతిష్ఠించబడింది. స్వామి చతుర్భుజుడు. తల

వెనుక ప్రభావళి ఉంది. ఈ గూటికి ప్రక్కన మరొక గూటిలో ఆలయక్షేత్ర పాలకుడు చండికేశ్వరుడు ప్రతిష్ఠింపబడివున్నాడు. మరో గూటిలో శివుని ప్రతిమ ప్రతిష్ఠించబడినది. ఈ స్వామి ఎవరో నిర్ధారించలేము. ఆలయ ప్రాంగణంలో పూర్వం శిలాశాసనాలున్న ఆధారాలున్నా, వాటిపై సున్నము ఎఱ్ఱమట్టి చారలు పూయుట చేతను, ఆలయగోడలు, ఎర్రటి ఇసుక రాతితో నిర్మించబడుట చేతను, శాసనాలు పూర్తిగా చెదరిపోయాయి. ఆలయ ప్రాంగణమంతా భూమిపై బండలు పరచినారు.

ఒకనాడు సర్వదేవతామూర్తులకు ఆతిథ్యమొసగి వారిచేత స్తుతింపబడ్డ అగస్త్యేశ్వరుడు – ఆ స్వామి కొలువైన ఆలయం నేడు సందర్శకులే కరువై ఒకనాటి తన వైభవాన్ని నెమరువేసుకొంటూ, ఏకాంతవాసం చేస్తూ ఉంది. నాటి మడిమాన్యాలు, వజ్రవైడూర్యాలు ఏమైనాయి? ప్రస్తుతం ఆలయంలో ఉత్సవ విగ్రహాలు కూడా లేవు. ఆలయం ఎప్పుడూ తెరిచే ఉండటంతో ఆలయములోని అపురూప శిల్ప కళాఖండాలకు కూడా భద్రత కరువైంది.

సంవత్సరానికొక రోజు మహాశివరాత్రి పర్వదినాన నారాయణవనం, గ్రామం చుట్టుప్రక్కల గ్రామస్థులు తండోపతండాలుగా స్వామి ఆలయాని కేతెంచి, రాత్రంతా జాగరముండి, తమ ఇష్టదైవమైన 'మరకతాంబికాసమేత శ్రీ అగస్త్యేశ్వరస్వామి' ని పూజించి పునీతులౌతూ ఉంటారు.

* * *

# నారాయణవనం - అవనిజాక్షి అమ్మ దేవాలయం



దక్షిణ భారతదేశంలో పల్లవులు, చోళులకు పూర్వము నుండే చిత్తూరు జిల్లాలోని నారాయణవనరాజ్యం అతిపురాతనమైనది. ప్రస్తుతం ఇచ్చట శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి, పరాశరేశ్వరస్వామి మరియు అనేక చిన్న చిన్న ఆలయాలు కలవు. ఇటీవల కాలంలో అవధూత సొరకాయలస్వామి ఆలయం కూడా భక్తులను ఎంతగానో ఆకర్షిస్తూ ఉన్నది. నారాయణవనం చేనేత పరిశ్రమకు ప్రసిద్ధి. అంతేగాక ప్రజల ముఖ్యవృత్తి వ్యవసాయమే. అంతేకాదు అనాదిగా మంత్రతంత్రాలకు, చేతబడులకు, తోదుబాటులకు కనుకట్టు విద్యలకు, క్షుద్రపూజలకు ఈ పట్టణం ప్రసిద్ధి. ఇటువంటి ఉపద్రవాలను ప్రజలు తరచూ ఎదుర్కొంటూ ఉంటే తుదకు ఒకనాటి కలెక్టర్ ఈ గ్రామ విషయంలో జోక్యం చేసుకొని వివిధ వైరివర్గాల వారిని పిలిపించి వారిలో సఖ్యతను ఏర్పాటు చేశాడట. ఈ నారాయణవనగ్రామానికి ప్రక్కన అరుణానది ప్రవహిస్తూ ఉంది. ఈ నదిని ఆనుకుని అతిప్రాచీనమైన కోట కలదు. పురాణాలీ కోటను జనమేజయ మహారాజు నిర్మించాడంటారు. ఈ కోట పల్లవ చోళులకాలంలో వారి సామంతులైన తొండమాన్ చక్రవర్తుల రాజధాని. వీరి రాజ్యం కంచి నుండి శ్రీకాళహస్తి వరకు వ్యాపించి ఉండేది.

ఆ తరువాత వీరు కార్వేటినగరాన్ని రాజధానిగా చేసుకొని ప్రస్తుత రాజ్యాన్ని పాలించారు. ఈ ప్రాచీనకోట ఉన్న ప్రదేశాన్ని కెంపులపాలెం

అంటారు. ఈ కోటను రెండుగా విడదీస్తూ మధ్యలో అరుణానది ప్రవహిస్తుంది. ఒక భాగాన్ని 'చిత్రాంగికోట'ని మరొక భాగాన్ని 'రత్నాంగి కోట' అని పేర్కొంటారు. ఈ పేర్లు పూర్వం రాజమహేంద్రవరాన్ని రాజధానిగా పరిపాలించిన చాళుక్య భూపతి రాజరాజ నరేంద్రుని భార్యలు, అయితే ఈ పేర్లు ఈ కోటలకు ఎలా వచ్చాయో వింతగా ఉంది.

ఈ కోటలో అనేక ప్రాచీన ఆలయాలు, శిథిలశిల్పాలు, శాసనాలు కుప్పలు కుప్పలుగా పడి ఉన్నాయి. ప్రస్తుతం వాటిలో చెక్కుచెదరకుండా ఉన్న ఆలయాలలో ముఖ్యమైనది నదిగట్టున ఇసుకతిన్నె ప్రక్కన ఉన్న అగస్త్యేశ్వరస్వామి ఆలయము. ఈ ఆలయంలో అనేక శాసనాలు కలవు. ఈ శాసనాలు ఆనాటి ఈ రాజ్యఔన్నత్యాన్ని తెలియజేస్తూ ఉన్నాయి. పౌరాణికంగా తిరుమల శ్రీనివాసుడు వేటలో ఏనుగులను తరుముకొంటూ వచ్చి ఈ ఆలయం ప్రక్కనే చెలికత్తెలతో ఆటలాడుకుంటూ ఉన్న పద్మావతి దేవిని చూచి ఆమెను ప్రేమించగా అగస్త్యేశ్వరుడు, పరాశరేశ్వరుడు, మిగతా మహర్షులందరూ ఆకాశరాజును ఒప్పించి శ్రీనివాస పద్మావతీదేవిల వివాహం జరిపించారట. ఈ ఆలయాల సమీపంలోనే ఖండిత శిరస్సు కలిగిన అపురూప భూవరాహస్వామి విగ్రహం కలదు. ఈనాటికీ సంక్రాంతి రోజున ఈ అగస్త్యేశ్వరస్వామి ఉత్సవర్లను కొండచుట్టూ ఉత్సవం పేరున ఈ ప్రాంతంలోని అనేక గ్రామాలకు తీసుకునివెళ్లి కడపట నగరి పట్టణంలో ఒక మంటపం ముందు ఉంచి ఆ మరునాడు తిరిగి కోటకు తీసుకుని వస్తారు. ఈ ఆలయానికంటే ప్రముఖమైన మరో ఆలయం దీనికి సమీపంలోనే ఉన్న అవనిజాక్షి ఆలయం. అవనిజాక్షి ఆలయం శక్తిపీఠం అవనిజాక్షి అనగా భూమిలో నుండి పుట్టినది అని అర్థము. అయితే పురాణాలు ఈ దేవిని 'అమ్మనాయాచి అంబ' అంటున్నాయి. అవనజాక్షి అంబా అనగా తన రెండు నేత్రలు వేదాలుగా కలిగిన దేవి అని అర్థము. ఈమెనే కొంతమంది 'అవని యా ఆశి' అని మరికొందరు మహిషాసుర మర్దని అని రాక్షససంహారిణి అని పేర్కొంటారు.

ఈ దేవిపుట్టుకను గురించి ఒక పురాణగాథ ప్రచారమందు కలదు. పూర్వం ఒక పల్లవ రాజు విశాలమైన సామ్రాజ్యాన్ని జయించి ఆ రాజ్యాన్ని కాపాడుటకై తనకు శక్తిని ప్రసాదించమని బ్రహ్మదేవుని ప్రార్థించి యజ్ఞం చేయగా యజ్ఞం నుండి పరాశక్తి నాలుగు రూపాలలో ఉద్భవించినదట. పల్లవరాజు ఆ నాలుగు మూర్తులను తన రాజ్యాన్ని కాపాడుతూ ఉండమని రాజ్యం నాలుగు దిక్కుల ప్రతిష్ఠించాడట. వారిలో మొదటిది మహాబలిపురాన్ని అచ్చటి నిర్మాణాలను, రేవుపట్టణాన్ని కాపాడుటకు, రెండవ శక్తి దేవికాపురం ప్రాంతంలో ఆరని, మూడవ శక్తిని విరించిపురం (వేలూరు) అలాగే నాలుగవ శక్తిని కెంపులపాలెం నారాయణవనం కోటలో ప్రతిష్ఠించాడట. అవనాక్షమ్మ ఆలయం కోట ముఖద్వారం వద్ద నది ఒడ్డున ఉత్తరదిశగా ముఖాన్ని కలిగినట్లు నిర్మింపబడి ఉంది. ఆలయం చాలాకాలం నిరాదరణకు గురైనందువల్ల ఆలయం చుట్టుపట్ల మండపాలు నిర్మాణాలు కొన్ని కనుమరుగైనాయి. ప్రస్తుతం ఆలయమందు గర్భగృహము, అంతరాళము ముఖమండపము, మహామండపాలు కలవు. ఆలయం చుట్టూ ప్రహరీ, ముందువైపు విశాలమైన ప్రవేశద్వారము కలవు. ప్రవేశద్వారానికి, ప్రధాన ఆలయానికి మధ్యన ఎత్తైన లోహపు ధ్వజస్తంభము బలిపీఠము కలదు. ఈ స్తంభము ప్రక్కనే త్రిశూలం కలదు.

ఆలయంలోపల వేపచెట్టు కింద మూడు నాగదేవతల ప్రతిమలు కలవు. ఒక ప్రతిమకు ఐదు శిరస్సులు కలవు. ఈ శిరస్సు కింద సుబ్రమణ్య స్వామి మరో సర్పం శిల్పము క్రింద శివలింగము మరొకటి సర్పాల సయ్యాటను కలిగి ఉంది. ప్రధానాలయం ముందుగా ఉన్న ఆలయంలో గన్నేరు చెట్టుదగ్గర సుబ్రహ్మణ్యస్వామి విగ్రహము మరియు మరో చెట్టుక్రింద ఆసీన వినాయక విగ్రహము ప్రతిష్ఠింపబడినది. ఈ విగ్రహాలన్నీ ఇటీవల కాలంలో ఎక్కువగా పూజింపబడుతున్నాయి. ఆలయద్వారం పైన అలంకారమండపం మధ్యలో దేవి నిజరూపాన విగ్రహముగా తీర్చిదిద్దినారు.

గర్భాలయమందు అవనాక్ష అమ్మవారు దాదాపు 8 అడుగుల ఎత్తున శిలా విగ్రహము కలదు. దేవి భయంకరస్వరూపిణి. విగ్రహం పూర్తిగా నగ్నంగా రూపొందించారు. దేవి తలపై అగ్నిశిఖను పోలిన కిరీటము, విశాలమైన ఎర్రటి నేత్రాలు, నోటినుంచి వెలుపలికి వచ్చిన నాలుక, చేట చెవులు, ఎనిమిది చేతులు కలిగి ఉంది. చేతులందు ఒకదానిలో చిన్న పాత్రలో రక్తము, మరో చేతిలో ఒక కమ్మి, ఇంకో చేతిలో సుత్తిలాంటి లోహపు ఆయుధము. మరి ప్రతి చేతిలో ఏదో ఒక ఆయుధాన్ని కలిగి ఉంది. ఆమె కుడిపాదాన్ని ఎడమ మోకాలివరకు వంచి ఆమె పాదాల వద్ద ఉన్న రాక్షసుని పాదాలపై ఉంచినది. మరో పాదాన్ని కిందికి దించి రాక్షసుని శిరస్సుపై ఉంచి అతడిని త్రొక్కుతూ ఉన్నట్లు చూపబడినది. ఈ రాక్షసుణ్ణి వేదాలు దొంగలించిన సోమకాసురుడు అంటారు. ఈ దేవి కలకత్తా కాళికాదేవికంటే భయంకరరూపిణి. ఒంటరిగా ఆమెను చూస్తే భయంతో ఒళ్ళు పులకరిస్తుంది.

గర్భాలయం పైన మూడంతస్తుల రాజగోపురము పైన ఐదు కలశములు కలవు. ఈ గోపురాలు మొత్తము దేవి శిల్పాలతో అలంకరించారు. అంతరాళమందు ముఖమండపం, దానిముందు 16 స్తంభాల సాయంతో నిర్మించిన మహామండపము కలదు. ఈ మండపం దక్షిణద్వారంప్రక్కన శ్రీచక్రము ప్రతిష్ఠించారు. స్తంభాలపై చెప్పుకోదగ్గ శిల్పం కానరాదు.



ప్రవేశద్వారానికి ఎదురుగా రెండు పొడవాటి రాతిదూలాలు వాటిపై రాతిబండ ఉంచారు. ఇది ఉత్సవాల కాలంలో దేవిని ఊయల ఊగించడానికి ఏర్పాటు చేసినారు అనవచ్చు. ఆలయంలో పూజారి శూద్రుడు. శ్రీదేవి మహాశక్తి సంపన్నురాలు.

ఇచ్చటి స్థానికుల ప్రకారం దేవి ఆలయానికి ప్రతి శుక్రవారం ఒక్క బంగారువర్ణపు సర్పం వస్తుందట. ఆ సర్పం దేవిని కొలచి వెళ్లిపోతుందట. అయితే ఈనాటివరకు ఆ సర్పాన్ని ఎవరు చూడలేదు. కానీ, శ్వేతవర్ణ సర్పము వెదజల్లిన సువాసన కొన్ని గడియల వరకు ఆలయంలో ఉంటుందట. ఆ సువాసనను భక్తులు అనుభవించవచ్చునట. పూర్వము ఈ దేవికి జంతుబలులు విశేషంగా సమర్పించేవారట!

దేవి సకల సంపన్నురాలట. ఆనాడు ఈమెకు రాజులు మడులు, మాన్యాలు విలువ కట్టలేనటువంటి ఆభరణాలు సమర్పించగా, అవన్నీ కాలగర్భంలో కలిసిపోయాయి. ఇటీవలకాలంలో ఆలయంలో దొంగలుపడి దేవి చీరను దొంగలించుకునిపోయి అందులోనే లోహాన్ని సరిగ తీసుకొనుటకు కాల్చగా చీర మొత్తం కాలి బంగారు ముద్దగా నిలిచినదట. దొంగలు భయపడి ఈ విషయాన్ని అచ్చటి పోలీసులకు తెలుపగా ఆ బంగారాన్ని ప్రభుత్వానికి స్వాధీనం చేశారట. వింత ఏమిటంటే ఆ చీరపై సృష్టిలో ఉన్న సకల పక్షిజాతుల ముద్రలు ఉండేవట. ఈ విషయాన్ని విని ఆంధ్రప్రదేశ్ నిన్నటి ముఖ్యమంత్రి శ్రీ అంజయ్య గారు ఆలయానికి ఏతెంచి అమ్మవారిని పూజించి ఆమె శక్తిని తెలుసుకొని ఆమెకు పూర్వము ఏవిధమైన చీర ఉండేదో అటువంటి చీరనే తయారు చేయమని ప్రభుత్వం తరపున లక్ష రూపాయలు ఆలయ అధికారులకు అందజేశారట.

ఈ దేవి నాటి తొండమాన్ చక్రవర్తుల కులదేవత. తిరుమల వేంకటేశ్వరుడు పద్మావతిదేవి తమ వివాహమైన వెంటనే పురాణ పురుషులతో వకుళాదేవి సమేతంగా పసుపు వస్త్రాలతో ఈ ఆలయానికి ఏతెంచి దేవుని

మ్రొక్కి తిరుమలకు బయలుదేరారట. ఉత్సవాలు, అవనాక్షి అమ్మ జాతర (తమిళ ఆవని నెలలో) జూన్ నెలలో 15 రోజులు రంగ రంగ వైభవంగా నారాయణవనమందు జరుగుతుంది. చుట్టుపక్కల గ్రామస్తులందరూ పాల్గొంటారు.

ఈ ఆలయానికి గ్రహపీడితులు అంగవిహీనులు ఎక్కువగా వచ్చి దేవుని పూజిస్తారు. అంతేగాక, సంతానహీనులు కూడా దేవిని నిష్ఠతో పూజిస్తారు. గ్రామస్తుల బంధువులు ఆడపడుచులు, మిత్రులు ఈ ఉత్సవకాలంలో ఈ గ్రామానికి ఏతెంచుతారు. ఉత్సవాన్ని రాజవంశీకుల ఆధ్వర్యంలో జరుపుతారు. ఈ 15 రోజులు ఈ గ్రామాలలో లెక్కలేనన్ని పొట్టేళ్ళు, మేకపోతులు వేలకొద్దీ కోళ్లు తెగిపోతాయి. ఇచ్చట మాంసాహారమే ఈ పండగలో ప్రధాన భూమిక.

గ్రామస్తులు ఈ ఉత్సవరోజుల్లో అనేక వేషధారణలు ధరిస్తారు. ప్రతి ఇల్లు పండుగ వాతావరణంతో కనిపిస్తుంది. యువకులు కొయ్యగుర్రాలను అధిరోహించి, కత్తులను చేతబట్టి యుద్ధనైపుణ్యాన్ని ప్రదర్శించే అంశాన్ని చూడవలసినదే. ఈ నృత్యం బహుళ ప్రజాదరణ పొందింది. ఈ జాతరలో 12వ రోజు జరిగే తంతు నమ్మశక్యంగా ఉందా అనిపిస్తుంది.

ఆ రోజు ప్రజలు ఒక దున్నపోతును ఆలయం వద్దకు తీసుకుని వెళ్లి దానిని పూజించే ఆలయ ముఖద్వారం వద్ద దాని తలనరికి దాని రక్తాన్ని ఆలయ పరిసరాల్లో చల్లుతారట. అంతేగాక టన్నులకొద్దీ బియ్యంతో వరి అన్నం తయారుచేసి కుప్పపోసి, ఆ అన్నాన్ని దున్నపోతు రక్తంతో కలిపి ఆలయ పరిసరాలలో వెదజల్లుతారట' దీనినే బలి, లేక రక్తపు కూడు అంటారు. ఆరాధన అంటారట. ఆపైన చనిపోయిన దున్నపోతును ఒక గోతి త్రవ్వి అందులో పూడ్చి పెడతారట మరుసటి సంవత్సరం. మరుసటి సంవత్సరం అదేరోజు తిరిగి దున్నపోతును గోతిలో నుండి పైకి తీసి దాని కడుపులోని అవయవాలను పరీక్షిస్తారట. అవయవాలు ఏమాత్రం

చెడిపోకుండా ఉంటే ఆ సంవత్సరం వారి రాజ్యంలో సుఖశాంతులు తాండవిస్తాయట. ఏమాత్రము అవయవాలు చెడిపోయి ఉండిన ఆ సంవత్సరములో వారికి కొన్ని కష్టాలు, నష్టాలు సంభవిస్తాయట.

ఈ తిరుణాలలో కట్టకడపట రోజు అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని చుట్టుప్రక్కల గ్రామాలకు తీసుకుని వెళ్ళి మెరవణి చేస్తారట. దాదాపు 15 రోజులు ఉత్సవం ఈ ప్రాంతంలో తమిళనాడులోని పెరియపాలెంలో తప్ప మరెచ్చటా జరపరు. సమీపంలోనే పెరియపాలెంలో మాత్రము ఇటువంటి జాతర ఒక నెల రోజులపాటు జరుపుతారు. నారాయణవనం కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంతోపాటు, పరాశరేశ్వర ఆలయం, అగస్త్యేశ్వర స్వామి ఆలయం, అవనిజాక్షి ఆలయాలను తిరుమల తిరుపతి దేవస్థానం వారు తమ ఆధీనంలోనికి తీసుకున్నారు. అయితే కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయానికి ఇచ్చిన ప్రాధాన్యత మిగతా ఆలయాలకు ఇవ్వలేదు. ఎందుచేతనగా రెండు ఆలయాలు శివుడివి, మరొకటి శక్తి ఆలయము. అయితే ఇటీవల కాలంలో దేవస్థానం వారు ఈ ఆలయాల మీద కూడా కొంత శ్రద్ధ చూపిస్తూ ఉండడం గమనించదగ్గ అంశము.

ఈ అవనాక్షమ్మ ఆలయానికి ప్రతి మంగళ, శుక్రవారాల్లో చుట్టుప్రక్కల గ్రామస్తులు వాహనాలలో గుంపులు గుంపులుగా వచ్చి ఇచ్చటనే దేవికి జంతువులను బలి ఇచ్చి, ఇచ్చటనే వాటిని వండి భుజించుటేకాక చుట్టుప్రక్కల ఉన్న వారికి కూడా ఈ మాంసాహారభోజనాన్ని పంచుతారు. ముఖ్యంగా మంగళవారము ఆలయం చుట్టూ జనసందోహం అట్టహాసంగా ఉంటుంది. ఈ వ్యాసం దాదాపు 15 సంవత్సరాల పూర్వం వ్రాసినది. అయితే ప్రస్తుతం ఆలయంలో పూజలు ఉత్సవాలు ఎక్కువగా జరుగుతూ ఉన్నట్లు తెలుస్తూ ఉంది. గమనించగలరు.

* * *

# అప్పలాయగుంట - ప్రసన్న వేంకటేశ్వరాలయం



తిరుపతి తిరుమల వేంకటేశ్వ రాలయం చుట్టూ పూర్వం నాల్గు ముఖ్యమైన వేంకటేశ్వరాలయాలు నిర్మింపబడ్డాయి. అవి నారాయణ వనం కళ్యాణ వేంకటేశ్వరాలయం, శ్రీనివాసమంగాపురం కళ్యాణ వేంకటేశ్వరాలయం, మంగళం పేట ప్రసన్న వేంకటేశ్వరాలయం, అప్పలా యగుంట ప్రసన్న వేంకటేశ్వరా లయం. ఈ నాల్గు ఆలయాలు దాదాపు ఏకకాలంలో నిర్మింపబడి నట్లు నిర్మాణ పద్ధతులనుబట్టి చెప్పవచ్చు. నారాయణవనం కళ్యాణ వేంకటేశ్వరాలయం, అప్పలాయగుంట ప్రసన్న వేంకటేశ్వరాలయాలను కార్వేటినగరం సంస్థానాధీశులు నిర్మించి పోషిస్తూండేవారు. కొంతకాలం తరువాత ఈ ఆలయాల నిర్వహణ తిరుత్తణి సుబ్రమ్మణ్యేశ్వరస్వామి ఆలయం దేవస్థానంవారి స్వాధీనమైంది.

అవిభక్త మద్రాసు రాష్ట్రంనుంచి తిరుత్తణి తమిళనాడుకు వెళ్ళగా, నారాయణవనం ఆలయంతోబాటు ఆ గ్రామంలోని మిగతా ఆలయాలను కూడా తిరుమల తిరుపతి దేవస్థానం వారు స్వీకరించి, జీర్ణోద్ధారణ గావించి, పూజా విధులు నిర్వహిస్తూ ఉన్నారు. కాని అప్పలాయగుంట ఆలయ బాధ్యతను ఎవరూ స్వీకరించలేదు. స్థానికులే ఏదోవిధంగా పూజాపున స్కారాలు నిర్వహించేవారు. శ్రీనివాసమంగాపురం ఆలయం దాదాపు జీర్ణమైయుండగా, మొగిలి చంద్రమౌళి రెడ్డిగారు ఐ.ఏ.ఎస్ వారు టిటిడి కార్యనిర్వాహకులుగా ఉన్నప్పుడు, ఈ ఆలయాన్ని టిటిడి స్వాధీనం చేసుకొని,

ఆలయజీర్ణోద్ధరణ గావించి, పూర్వపు ఔన్నత్యాన్ని కలుగజేసినారు. పై మూడు దేవాలయాల కంటే ఎక్కువ ఆర్థికపుష్టి కలిగి దాదాపు 10 లక్షల రూపాయల ఆస్తి ఉన్న మంగళంపేట ప్రసన్న వేంకటేశ్వరాలయం, స్థానిక రాజకీయ నాయకుల పాలై, జీర్ణోద్ధరణ పేరుతో పునాదులతో సహా కూల్చివేయబడి, దాదాపు ఆరు సం॥ స్వామి దిక్కులేక వరిపొట్టు దిబ్బలో ఉంచబడి, అతి కష్టం మీద పునరుద్ధరింపబడింది.

పూర్వం తిరుమల వెళ్ళడం కష్టంతో కూడుకొన్న పని. వెళ్ళినా క్షేమంగా తిరిగిరావడం కుదిరేది కాదట! అందువల్ల తిరుపతి చుట్టూ 30 కి.మీ. దూరంలో 4 వేంకటేశ్వరాలయాలు నిర్మించారు. రానురాను తిరుమల క్షేత్రానికి రవాణా సౌకర్యాలు పెరిగి, భక్తులు తిరుమల కెళ్ళి నేరుగా శ్రీనివాసుణ్ణి దర్శించడం అనవాయితీగా మారడంతో, రానురాను పై ఆలయాలకు ప్రాధాన్యత తగ్గిపోయింది. అలా ప్రాశస్త్యాన్ని కోల్పోయిన ఆలయాల్లో అప్పలాయగుంట ఆలయం కూడా ఒకటి.

అప్పలాయగుంట చిత్తూరు జిల్లా, పుత్తూరు తాలూకాలో చిన్న గ్రామం. ఈ ఆలయంలో అపురూపమైన వేంకటేశ్వరస్వామి ఆలయం కలదు. పురాణాల ప్రకారం వేంకటేశ్వరుడు పద్మావతీదేవిని నారాయణవనంలో వివాహం చేసుకొన్న పిదప తిరుమలకు బయల్దేరాడట! దారిలో కైలాసనాథకోనలో ఉన్న పరమశివుని దర్శించి అచట ఋషులను అనుగ్రహించి అచటినుంచి యోగులకొండ (వేములకొండ) వెళ్ళారట! అచట ఉన్న సిద్ధేశ్వర మహర్షి కోరిక మేరకు అచటే ఉండి భక్తులను ఆశీర్వదిస్తానని మాటిచ్చాడు. సిద్ధేశ్వర మహర్షి కొండదిగువన స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించి, ఆయనకు ఆలయాన్ని నిర్మించి స్వామికి ప్రసన్న వేంకటేశ్వరుడని నామకరణం చేశాడు.

సిద్ధేశ్వరకొండలో ఒక గుహ ఉన్నదట! పూర్వమెపుడో శత్రువులు తరుముకురాగా కార్వేటినగర రాజులు ఆ గుహలో తలదాచుకొన్నారట!

అందుచేత ఆ గుహను 'దొరలు దాగిన కొండ' అనికూడా అంటారు. ఆ గుహలో ఒక కత్తి వుందని, ఆ కత్తిని ఎంత వెలుపలికి లాగినా గుండులో నుంచి పైకి మాత్రమే వస్తుందని, గుండును వదలి వెలుపలకు రాదని స్థానికుల కథనం. నిన్నమొన్నటి వరకు ఈ విచిత్రమైన కత్తికి ఏటా ఉత్సవాలు జరిపించి జంతుబలులను సమర్పించేవారు.

ప్రసన్న వేంకటేశ్వరాలయాన్ని కార్వేటినగర రాజులు నిర్మించినట్లు శాసనాధారాలు ఉన్నాయి. ఆలయనిర్మాణంతో బాటు ఆలయం ముంగిట పెద్ద కోనేటి నిర్మాణం చేపట్టినారు. ఈనాటికీ ఈ ప్రాంతంలో ఈ కోనేరే అతిపెద్దది. దీని నిర్మాణంలో రోజూవందల కొద్ది కూలీలను నియమించి, సాయంకాలం ఆ పనివారికి అప్పుపెట్టకుండా కూలీలు చెల్లించేవారట! అందుచేత ఈ గుంటకు (కోనేటికి) 'అప్పలాయగుంట' అని పిలిచేవారు. కోనేటి నిర్మాణం పూర్తికాలేదు. దీని తవ్వకం పూర్తయ్యేలోపలే కార్వేటినగర సంస్థాపకులు ఆర్థికంగా చితికిపోవడం చేత, దీని నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది.

కొంతమంది స్థానికుల ప్రకారం ఈ కోనేటిలో అప్సరసలు జలకమాడి రోజూ స్వామిని సేవించేవారట! అప్సరసలు మునిగిన గుంట కాబట్టి దీన్ని 'అప్సరసలగుంట' అని, అదే కాలగమనంలో 'అప్పలాయగుంట' అయివుండవచ్చునంటున్నారు. దీన్ని "పద్మసరోవరం" అని కూడా పిలుస్తారు. తిరుపతి, మద్రాసు మొదలగు ప్రాంతాలకు ఈ గుంటనుంచే తామర ఆకులు పూలు రోజూ వెళతాయి. మరికొందరి ప్రకారం అప్పలయ్య అనే స్థానిక అధికారి, కోనేటి నిర్మాణాన్ని పర్యవేక్షించడం వల్ల, కోనేటికి అప్పలయ్యగుంట అనిపేరు వచ్చిందని అంటున్నారు. స్థానిక రికార్డులందు 'అమృతసరోవరం' అని పేర్కొనబడింది. తమిళ భాషలో 'అమ్మండ' అనగా అప్పు లేనటువంటి అని అర్థం. ఈ కోనేటికి ముందు భాగాన వెలసిన గ్రామాన్ని అప్పలాయ గుంట అన్నారు.

కార్వేటినగర రాజులు కోనేటి నిర్మాణంతో బాటు ఆలయనిర్మాణం కూడా చేపట్టినారు. ఐతే ఆర్థికపరమైన ఒత్తిడులవల్ల ఆలయనిర్మాణం కూడా పూర్తి కాలేదు. ఆలయనిర్మాణం పూర్తి కాకపోయినా, కార్వేటినగరరాజులు ఆలయధర్మకర్తలు కాబట్టి ఆలయానికి 'అన్నయ్యగుంట' లేక 'అయ్యన్నపల్లి' అనే గ్రామాన్ని మాన్యంగా ఏర్పాటు చేశారు. ఇటీవలికాలంలో ప్రభుత్వం వారు ఆ గ్రామాన్ని స్వాధీనం చేసుకొని 40 వేల రూపాయలు ఆలయానికి నష్టపరిహారంగా చెల్లించినారు. ఆ సొమ్మును బ్యాంకులో భద్రపరిచి ఆ వడ్డీతో పూజలు జరిపేవారు. అన్నయ్య గుంట గ్రామమేగాక, ఆలయానికి అనేక ఇతర మాన్యాలు కూడా ఉన్నాయి. అయితే అవన్నీ కాలగమనంలో అంతర్ధానమైపోయాయి. ఆలయానికి సరైన ఆదాయం లేక పోవడంచేత పూజారులు ఎన్నో ప్రయాసల కోర్చి ఏదో విధంగా పూజలు జరిపేవారు. ఈ ఆలయంలోని పూజారులు తిరుమల ఆలయ పూజారులు ఒకే శాఖకు చెందినవారు.

### ప్రధానాలయం

ఆలయం తూర్పుదిక్కున కభిముఖంగా నిర్మింపబడింది. ఆలయం చుట్టూ ఇటుకలతో నిర్మించిన ప్రహరీఉంది. ప్రహరీగోడ కూడా పూర్తికాలేదు. ఆలయప్రవేశద్వారం పైన పెద్ద రాజగోపురం నిర్మాణానికి పునాదులు వేసిన గుర్తులున్నాయి. ప్రవేశద్వారం దాటగానే ధ్వజస్తంభముంది. ధ్వజస్తంభానికి



ముంగిట ముఖమండపం, ముఖమండపం తూర్పుదిశలో గరుడమండపం నిర్మింపబడింది. ఈ మండపమందు స్వామిని చూస్తూ అంజలి ఘటిస్తూ ఉన్న సుందరమైన గరుడవిగ్రహం కలదు.

మొదటి ప్రాకారానికి లోపలివైపున 10 అ॥ దూరంలో మరొక ప్రాకారముంది. ఈ ప్రాకారం 3 అ॥ ఎత్తువరకు కూడా ఎదగలేదు. ఈ రెండు ప్రాకారాల మధ్యన తూర్పుదిశలో పోటు ఉంది. పోటులోపల అన్నపూర్ణ (వకుళాదేవి) శిల్పం ప్రతిష్ఠింపబడింది. స్వామివారి ఆలయానికి ఇరువైపులా కొంచెం వెనుకగా రెండు మండపాలున్నాయి. దక్షిణంవైపు మండపమందు నిలువెత్తు పద్మావతీదేవి విగ్రహం ఉంది. ఉత్తరంవైపు మండపమందు నిలువెత్తు ఆండాళ్ శిల్పముంది. దేశంలో మరెచ్చటా దేవేరుల మండపాలు ఆలయానికి వెలుపలగా ఉండడం అరుదు. ఇదే ఈ ఆలయంలోని ప్రత్యేకత.

ఆలయం మధ్యన ప్రధానాలయం ఉంది. ఆలయమందు గర్భగృహం, అంతరాళం, విశాలమైన ముఖమండపం ఉన్నాయి. గర్భాలయమందు కన్నులపండువ చేసే విష్ణుమూర్తి ప్రసన్న వేంకటేశ్వరుని పేర పూజలందుకొంటున్నాడు. స్వామి చతుర్భుజుడు. పైరెండు చేతులందు శంఖ, చక్రాలున్నాయి. క్రింద కుడిచేయి అభయముద్రతోను, ఎడమచేయి వరద ముద్రతోను ఉన్నాయి. స్వామికి నాగాభరణాలు లేవని అర్చకులు అంటున్నారు. తిరుమల తిరుపతి ప్రాంతాలలో అభయహస్తాన్ని కలిగి ఉన్న వేంకటేశ్వరుడు ఇతడొక్కడే. స్వామి వక్షస్థలంపై కుడివైపున త్రికోణం గుర్తు ఉంది. ఈ త్రికోణం గుర్తునుబట్టి స్వామియందు శక్తి అంశ ఉన్నట్లు ఊహించవచ్చు. స్వామివారికి సమీపంలో ఉత్సవర్లు, సుదర్శన ఆళ్వార్, విగ్రహాలున్నాయి. గర్భాలయం పైన చతురస్రాకారంలో ఉన్న ద్రవిడ విమానం, విమానంపైన కలశము ఉన్నాయి. విమానం నాలుగు వైపులా 8 గూళ్ళున్నాయి. ఉత్సవరోజుల్లో ఈ గూళ్ళయందు దీపాలుంచుతారు. ముఖ్యంగా కార్తీకదీపం రోజుల్లో ఈ దీపాలు వెలిగిస్తారు.

గర్భాలయం ముంగిట సన్నటి అంతరాళంఉంది. అంతరాళం గోడలు నునుపుగా ఎటువంటి అలంకరణ లేకుండా ఉన్నాయి. అంతరాళానికి ముంగిట చతురస్రాకారంలో 16 స్తంభాల సాయంతో నిర్మింపబడిన ముఖమండపం ఉంది. ఈ మండపస్తంభాలు, గోడలు కూడా ఎటువంటి శిల్పాలను కలిగి ఉండలేదు. మండపం మధ్యన కొంచెం పైకి లేపి కట్టిన అరుగు ఉంది. ముఖమండపంలో ఉత్తరంవైపున తొమ్మిదిమంది వైష్ణవ ఆళ్వారుల శిల్పాలున్నాయి. ఈ మండపమందు దాదాపు 4 అ. ఎత్తున్న లోహపు దీపస్తంభాలున్నాయి. ఈ స్తంభాలను కార్వేటినగరరాజు శ్రీ రాజు వేంకట పెరుమాళ్ దొరవారు అమృతసరోవరనగరస్వామికి బహూకరించినట్లు దీపస్తంభాలపైన లిఖింపబడింది. గర్భాలయం, అంతరాళం, ముఖమండపం ఒకే అధిష్ఠానంపై నిర్మింపబడినాయి.

ప్రసన్న వేంకటేశ్వరస్వామి జన్మనక్షత్రం 'శ్రవణం' కాబట్టి జ్యేష్ఠమాసమందు స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు 9 రోజులు జరుపుతారు. స్వామివారికి పల్లకి, మరియు వాహనాలు ఉన్నాయి.

ఆలయానికి ముంగిట 100 గజాల దూరంలో వేంకటేశ్వరుని చూస్తున్నట్లు ఆంజనేయ మండపం ఉంది. దీనిలో 5 అ. ఎత్తున ఆంజనేయస్వామి నిలుచుని ఉన్నాడు. స్వామి చాలా మహిమ కలవాడని ఈ ప్రాంత ప్రజల నమ్మకం. ఈ ఆంజనేయునికి, తిరుమల కొండపైని బేడి ఆంజనేయునికి పోలికలు కలవట! అర్చకులు స్వామికి నైవేద్యం సమర్పించిన వెంటనే ఆంజనేయునికి సమర్పించి, ఆపైన బలిపీఠానికి నైవేద్యం సమర్పిస్తారు.

అప్పలాయగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయదుఃస్థితిని చూచి తిరుమల తిరుపతి దేవస్థానం వారు 23-9-88 తేది నుండి తమ ఆధీనం చేసుకొని ఆలయానికి పూర్వపు ఔన్నత్యాన్ని కలిగిస్తూ ఉన్నారు.

* * *

# తొండమనాడు - శ్రీ కోదండ రామాలయం

దక్షిణ భారతదేశాన్ని పరిపాలించిన తొలి రాజవంశాలలో – పల్లవులు, చోళులు అత్యంత ప్రసిద్ధులు. వారు విశాలమైన రాజ్యస్థాపనతోపాటు విదేశాలను కూడా జయించారు. దక్షిణ భారతదేశంలో రాజ్య విస్తరణతోపాటు రాజ్యమంతటా ప్రసిద్ధ దేవాలయాలు, వ్యవసాయ అభివృద్ధికై అనేక చెరువులు, బావులు, కాలువలు ఏర్పాటు చేశారు. అన్నిటికంటే ముఖ్యంగా వారు ప్రవేశపెట్టిన గ్రామపరిపాలన విధానము కొనియాడదగింది. చోళ చక్రవర్తి మొదటి రాజరాజు తన రాజధాని తంజావూరులో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన బృహదీశ్వరాలయాన్ని నిర్మించి చరిత్రలో చిరంజీవి అయినాడు.



రాజులలో ప్రసిద్ధుడు, మొదటి ఆదిత్యుడు. ఇతడు విశాలమైన రాజ్య స్థాపనచేస్తూ ఉండగా అతడి శత్రువులైన రాష్ట్రకూటులు, పల్లవులు ఆదిత్యునిపై యుద్ధము ప్రకటించినారు. ఈ యుద్ధం చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి సమీపం తొండమనాడు లేక తొండైమానానూరు అనేచోట భయంకరంగా సాగింది. ఆదిత్యుడు యుద్ధం చేస్తూ తాను అధిరోహించి ఉన్న ఏనుగుపై నుండి క్రిందపడి మరణించాడు. ఆదిత్యుని కుమారుడు మొదటి పరాంతకుడు తన తండ్రి ఆదిత్యుడు మరణించిన ప్రదేశమందే అతడి మృతదేహంపై ఆలయాన్ని నిర్మించాడు. ఆదిత్యుని మరో పేరు కోదండరాముడు. పరాంతకుడు తన తండ్రికి నిర్మించిన ఆలయానికి అధిత్యేశ్వర్ ఆలయం

అని, శ్రీ కోదండరామస్వామి ఆలయం అని, పల్లిపాడు అని, సమాధి కోవిలని పేర్లు పెట్టినాడు. ఈ తొండమనాడు యుద్ధం దక్షిణాపథంలో పల్లవుల ఆధిపత్యాన్ని పూర్తిగా తొలగించివేసింది.

తొండమనాడు ఒకప్పుడు పల్లవుల రాజకీయ కేంద్రం. ఆపైన చోళులు ఇచ్చట తమ మలి రాజకీయకేంద్రము ఏర్పాటు చేసుకుని పరిపాలన సాగించారు. ఆ కాలంలో ఈ ప్రాంతాన్ని తిరువేంగళ కొట్టం అనేవారు. ఇందులో నగరాన్ని తొండమనాడు (తోండైమనానురు), అరుర్‌నాడు అని పిలిచేవారు. నాటి పెద్ద తొండమనాడు పట్టణం ఛిన్నాభిన్నమై అనేక చిన్న చిన్న గ్రామాలుగా విడిపోయి నేడు ఎగువవీధి, దిగువవీధి, బొక్కసంపాళ్యం, చల్లపాళ్యం, మిట్టవీధి మొదలగు పేర్లతో పిలువబడుతూ ఉంది. నేటికీ నాడు చోళరాజులు నిర్మించిన కోట 700 ఎకరాల విస్తీర్ణం కలిగిన విశాలమైన చెరువు. ప్రక్కనే వేంకటేశ్వరస్వామి దేవాలయము. పుట్టాలమ్మ అనే గ్రామదేవత గుడి మొదలగునవి నాటి వారి వైభవాన్ని గుర్తు చేసుకుంటూ ఉన్నాయి.

అధిత్యేశ్వర ఆలయం అతిప్రాచీనమైనది. అంతేకాక తొండమనాడు పరిసరాల్లో నిర్మితమైన ఈ ఆలయం క్రీస్తుశకం 907-915 సంవత్సరాల కాలంలో నిర్మింపబడి ఉండవచ్చు. ఈ ఆలయం నిర్మాత మొదటి పరాంతకుడు మహాపరాక్రమశాలి. శివభక్తిపరాయణుడు. ఇతడు తన రాజ్యంలో 47 ప్రముఖ ఆలయాలను నిర్మించారట. ఇతడు తన తండ్రి ఆదిత్యుడు యుద్ధభూమిలో మరణించగా అతడి మృతదేహం (అస్తికలు) పైన ఆలయం నిర్మించి శాసనాలలో 'ఆరు తంబిన ఉదైయర్' అనే పేరు పెట్టినాడు అనగా ఏనుగుపై నుండి క్రిందపడి మరణించినవాడు. ఈ ఆలయమందలి శివుణ్ణి అధిత్యేశ్వరుడు అంటున్నారు. ఈ ఆలయాన్ని చూచే మొదటి చోళ చక్రవర్తి రాజరాజు తన తాత ఆదిత్యుని జ్ఞాపకార్థమై ఉత్తర ఆర్కాట్ జిల్లా మేల్పాడు గ్రామంలో ఇదేరీతిలో మరో శివాలయాన్ని

"అరంజింగై ఈశ్వరం" అనే సమాధి ఆలయాన్ని నిర్మించాడు. ఈ ఆలయం నేటికీ చెక్కుచెదరకుండా ఆనాడు ఎలా నిర్మించారో అలానే ఉన్నది.

కోదండరామేశ్వరం లేక ఆదిత్యేశ్వర ఆలయనిర్మాణం గర్భగృహము, అర్ధమండపము, ముఖమండపాలను కలిగి ఉన్నది. గర్భగృహమందు స్వామి అపురూపమైన పానవట్టముపై లింగరూపమున ప్రతిష్ఠింపబడినాడు. భక్తులు ఇతడిని ఆదిత్యేశ్వరుడని, కోదండరాముడని కొలుస్తారు. గర్భాలయం పైన ద్వితల విమానము, శిఖరము పైన కలశం ఉన్నాయి. ఈ విమానం మొత్తం శిల్పాలతో ఉన్నది. విమానం చుట్టూ నాలుగువైపులా నాలుగు ఆసీన నంది ప్రతిమలు కలవు. ఆలయ అధిష్ఠానపు గోడలు ఎంతో రమ్యంగా వివిధ దేవతల శిల్పాలతో అలంకరింపబడి ఉన్నాయి. స్వామి గర్భాలయంలో నుండి ఆలయ అభిషేకజలం వెలుపలికి రావడానికి ఉత్తరదిశలో సింహపుతల కలిగిన ఎంతో వైవిధ్యభరితంగా ఉన్న ప్రాణాలము కలదు.

ప్రధానాలయం వెలుపల గోడలపై దక్షిణాన, ఉత్తరాన, పడమర దిశలలో పెద్ద గుళ్ళు కలవు - దక్షిణవైపు గూటిలో అపురూపమైన దక్షిణామూర్తి శిల్పము కలదు. ఇచ్చట స్వామి మర్రిచెట్టు క్రింద ధ్యానముద్రలో ఆసీనుడై ఉన్నాడు. ఇతని కుడి పాదం క్రింద అపస్మారక పురుషుని శరీరము కలదు. స్వామి జటాజూటం తేనెపుట్టవలె చుట్టబడి ఉంది. స్వామి చేతిలో



కుడివైపున సర్పం ఎడమచేతిలో అక్ష మాల మరో ఎడమ చేతిలో పుస్తకము ఉన్నాయి. స్వామి కంఠాభరణాలు, గ్రైవేయకాలు, యజ్ఞోపవీతం,

కడియాలు మొదలగు ఆభరణాలను ధరించి ఉన్నాడు. స్వామి పాదాల క్రిందపడి ఉన్న అపస్మారక పురుషునికి ఇరువైపులా ఇద్దరు వ్యక్తులు నిలుచుని ఉన్నారు. పశ్చిమ గూటిలో ఉన్న విష్ణుమూర్తి శంఖు చక్ర కిరీటములను ధరించి ఉన్నాడు. ఉత్తరపు గూటిలో స్థానక చతుర్ముఖ బ్రహ్మశిల్పము కలదు. స్వామి అక్షమాల, కమండలము, మెడలో ఆభరణాలను కంకణాలు, కడియాలు కలిగి ఉన్నాడు.

అర్ధమండపం ఉత్తరపు గోడలపై అపురూపమైన దుర్గ శిల్పము కలదు. దక్షిణంవైపు మరో కోష్ఠమందు స్థానక గణపతి కలదు. ఇతడి చేతులందు అంకుశం, పాశం, దంతం, మోదకం, కడుపుపై ఉదరబంధం, కాళ్లకు కడియాలు ధరించి ఉన్నాడు. అంతరాళం ద్వారానికి ఇరువైపులా ఆయుధ పాణుల ద్వారపాలకులు ఉన్నారు. దీనిముందు నాలుగు స్తంభాల సాయంతో నిర్మించిన ముఖమండపం కలదు. ఈ స్తంభాల పైన అనేక శైవశిల్పాలు కలవు. ఈ మండపం ముందర నూతనంగా ఏర్పాటు చేసిన ధ్వజస్తంభం బలిపీఠం నంది మండపాలు కలవు. ఆలయం ముందుభాగాన తూర్పు ముఖాన్ని కలిగిన తూర్పున మూడు అంతస్తుల రాజగోపురం గజపృష్ఠ ఆకార విమానాన్ని కలిగి నిర్మింపబడి ఉంది. ఇటువంటి అపురూప కళాఖండం ఎన్నోమార్లు పునర్నిర్మాణానికి నోచుకుంటూ తన పూర్వపుస్థితిని ఔన్నత్యాన్ని కోల్పోతూ ఉంది. పూర్వం ఈ ఆలయానికి వెలకట్టలేని సిరిసంపదలు ఉన్నట్లు ఎల్లవేళలా ఉత్సవాలు జరుగుతూ ఉన్నట్లు ఇచ్చటి శాసనాలు తెలుపుతూ ఉన్నాయి.

ఈ ఆలయం వెలుపలి గోడపై ఉన్న ఒక పెద్ద తమిళ శాసనం ఆలయంలో ప్రతిఏటా జరిగే ఏడు రోజుల ఉత్సవ నిర్వహణకై నూరు కలంజుల బంగారు నాలుగు వేల కాడి వరిధాన్యము వచ్చే ఏర్పాటుచేసి ఉత్సవరోజులందు ఆలయానికి వచ్చే వెయ్యిమంది భక్తులకు నిత్యాన్నదానము చేసే ఏర్పాట్లు ఉన్నట్లు తెలియజేస్తూ ఉంది. ఈ ఏర్పాట్లను ఆనాడు

చోళరాజులు ఏర్పాటు చేసినారు. గ్రామసభలు అనగా సభ మరియు నగరం ఈ పాలక సంస్థలు ఈ ఏర్పాట్లను చూసుకునేవి. అంతేకాక ఉత్సవకాలంలో భక్తులకు కూరగాయలు, పెరుగు, ఉప్పు మొదలగు వంటసామాగ్రి కూడా ఈ గ్రామసభలు, సమకూర్చి రోజు వెయ్యిమంది తపస్వినులకు, పూజారులకు, భక్తులకు భోజనం ఏర్పాటు చేసినట్లు ఈ శాసనం తెలుపుతూ ఉంది.

ఈ ఉత్సవాన్ని ఈ ఆలయంలో జరిగే సంతర్పణ ఏర్పాట్లను సక్రమంగా నిర్వహించుటకు 'యోగేశ్వర పండిత బట్టారర్' అనే గొప్ప వ్యక్తిని బహుశా ఈ బట్టారర్ స్థానిక మతాచార్యుడైన లేక పండితుడైన కావచ్చును. ఈ ఆలయంలో ఏర్పాటు చేసిన విధులను సక్రమంగా నిర్వహిస్తూ ఉన్నారో లేదో అని సభ మరియు నగరసభ్యులు చూసుకునేవారు. ఈ ఏర్పాట్లను తమిళనాడులోని తిరుమలపురం మరియు కన్యాకుమారి ప్రాంతాల్లోని శాసనాలు కూడా ప్రస్తావిస్తూ ఉన్నాయి. ఈ ఆలయంలో ఈ శాసనం చోళరాజుల గ్రామపరిపాలనవిధానాన్ని తెలుసుకొనుటకు ఎంతో ఉపయోగపడుతుంది.

ఈ పరాంతక చక్రవర్తి కాలంలోనే తిరుచానూరులో శ్రీనివాసప్రభువు యొక్క ప్రతిరూపమైన మరో వెండి శ్రీనివాసుని ప్రతిమను పల్లవరాణి సామవై తయారు చేయించి తొలుత తిరుచానూరులో ప్రతిష్ఠించి, ఆపైన తిరుమల శ్రీనివాసుని ముంగిట ప్రతిష్ఠించి ఆయనకు అనేక ఆభరణాలను ప్రసాదించుటేకాక శ్రీనివాసుని మూలవిరాట్టుకు జరిగే అన్ని పూజలు ఈ స్వామికి జరిగే ఏర్పాటును కావించిందట! ఈ స్వామినే భోగ శ్రీనివాసులు లేక మనవాల్ పెరుమాళ్ అంటారు.

పరాంతక చోళ చక్రవర్తి తరువాతి రాజులు ఉత్తమ చోళుడు, మొదటి రాజరాజు ఈ ఆలయమందు ఏర్పాటు చేసిన విధులు సక్రమంగా అమలవుతూ ఉన్నాయా లేదా అని తరచూ వేగులద్వారా తెలుసుకుంటూ

ఉండేవారట! చిత్తూరు జిల్లాలో ఉన్న అపురూప ప్రాచీన ఆలయాలలో ఒకటైన ఈ ఆలయం ప్రస్తుతం సక్రమమైన ఆదరణ కోల్పోతూ ఉండడం అతిశోచనీయం. ఈ ఆలయం సమీపంలోనే ఆనాడు నిర్మించిన శ్రీ వీటి పిరుంద పెరుమాళ్ (విష్ణు) ఆలయం కలదు. ఈ ఆలయమందు స్వామి ఆసీనముద్రలో ఉంటూ ఇరువైపులా శ్రీదేవి భూదేవులు ఆసీనులై ఉన్నారు. ఈ ఆలయం దాదాపు పూర్తిగా శిథిలమైపోతూ ఉంది. ఈ ఆలయాన్ని చుట్టుకుంటూ తిరుపతి కపిలతీర్థము నుండి రాళ్ళవాగు ద్వారా శ్రీకాళహస్తి పెద్ద చెరువులోనికి వెళ్లే నీరు ఈ ఆలయాన్ని చుట్టుకుంటూ వెళ్లి చెరువులో చేరుతాయి. ఈ వేట్టపిరుంధ పెరుమాళ్ అనగా ఇంటపుట్టిన స్వామి విష్ణువు ఆలయాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం వారు తమ ఆధీనంలోకి స్వీకరించి ఆలయ అభివృద్ధికి ఎంతగానో సహకరిస్తూ ఉన్నారు.

* * *

# కార్వేటినగరం - వేణుగోపాలస్వామి ఆలయం

ఆంధ్రదేశాన్ని ఏలిన రాజవంశీయుల్లో చిత్తూరు జిల్లా కార్వేటినగరం సంస్థానాధీశులకొక ప్రత్యేక స్థానముంది. వీరు నేటి చిత్తూరు, చెంగల్పట్టు, ఉత్తర ఆర్కాట్ జిల్లాలలో కొంతభాగాన్ని తమ రాజ్యంగా ఏలేవారు. వీరు ఏ వంశస్థులో ఈనాటికీ చరిత్రకారులలో ఏకాభిప్రాయంలేదు. అయినా ఈ సంస్థానాధీశులందరు దానకర్ణులు, అంతకుమించి దైవభక్తిపరాయణులు. అందు చేతే నేటి మద్రాసు రాష్ట్రంలోని తిరువళ్ళూరు, తిరుత్తణి, తిరువలంగాడు, చిత్తూరు జిల్లాలోని నాగలాపురం, నారాయణవనం, అప్పలాయగుంట, శ్రీనివాసమంగాపురం ఆలయాలు వీరి ఏలుబడిలో ఉండి ఎంతో ఉన్నతస్థితినాక్రమించాయి. అన్నింటికి మించి తిరుమల శ్రీనివాసుడు ఈ ఇంటి అల్లుడు. అందుచేతే నిన్న మొన్నటివరకు బ్రహ్మోత్సవాలు జరిగే కాలంలో వేంకటేశ్వర ఆలయమందు ఈ రాజకుటుంబానికి మామగారికి జరిగే మర్యాదలన్నీ జరిగేవట! ఈ రాజవంశీయులు పూర్వం నారాయణవనాన్ని రాజధానిగా రాజ్యమేలుతూ, తరవాతి కాలంలో రాజధానిని కార్వేటినగరానికి తరలించినట్లు చరిత్రకారుల భావన. ఈ వంశీయుల కట్టడమే ప్రపంచ ప్రసిద్ధి గాంచిన చంద్రగిరి కోట!



పైన తెలిసిన ఆలయాలతో బాటు కార్వేటినగరం సంస్థానాధీశులు తమ రాజధాని నగరం కార్వేటినగరంలో శ్రీ వేణుగోపాలస్వామి ఆలయాన్ని

అత్యంత సుందరంగా నిర్మించి, స్వామిని తమ ఇలవేలుపుగా కొలుచుకొంటూ ఉండినారు. వారు ఆనాడు ఈ స్వామికి ఎన్నో మడులు, మాన్యాలతోబాటు విలువ కట్టలేనటువంటి బంగారు, వెండి ఆభరణాలు చేయించి స్వామివారి ఆలయంలో నిత్యకళ్యాణం పచ్చతోరణంగా ప్రకాశించేటట్లు ఎన్నో ఉత్సవాలు ఏర్పాటు చేసినారు. కార్వేటినగరం రాజులు, వారి రాజ్యం కాలగమనంలో కలసిపోగా, ఈ ఆలయఔన్నత్యం కూడా హారతి కర్పూరంగా సన్నగిల్లిపోయింది. అయినా ఆలయధర్మకర్తలు, ఆలయం పేర బ్యాంకులో నిలువవున్న కొద్దిపాటి సొమ్ముపై వచ్చేవడ్డీ, భూములపై వచ్చే రాబడితో ఆలయమందు నిత్యపూజావిధులు సక్రమంగా నిర్వహిస్తూ ఉండేవారు. ఒకనాడు శోభాయమానంగా విరాజిల్లిన ఆలయం రానురాను శిథిలావస్థకు జారుకొంటూ ఉండడం గమనించి స్థానికులు తమ ఆలయాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం పాలనలోకి తీసుకోమని కోరగా, వారి విన్నపం ప్రకారం టి.టి.డివారు నేడు గోపాలస్వామి ఆలయాన్ని తమస్వాధీనం చేసుకొని, స్వామివారికి పూర్వపు ఔన్నత్యాన్ని సమకూరుస్తున్నారు.

## వేణుగోపాలస్వామి ఆలయనిర్మాణం

కార్వేటినగర రాజవంశీయుల్లో కటారి సాళ్వమాకరాజు వెంకట పెరుమాళ్లరాజు పరమ భాగవతోత్తముడు. పరిపాలనాదక్షుడు. వేంకటేశ్వరుడన్నా, శ్రీకృష్ణ భగవానుడన్నా ఎనలేని భక్తి. ఇతడు 1719 సం॥ (శాలివాహన శకం 1641)లో కార్వేటినగరంలో తన ఇష్టదైవమైన శ్రీకృష్ణునికి వేణుగోపాలస్వామి ఆలయం పేర విశాలమైన ఆలయాన్ని నిర్మించినాడు. ఆలయం నిర్మించుటేగాక, పురవీధులను విశాలపరచి, ఆలయ ఉత్సవాలకు, వేడుకలకు అనువుగా తీర్చిదిద్దినాడు. ఈ సంస్థానాధీశుడు ఆలయనిర్మాణంతోబాటు తన ఆస్థానంలో ఉండిన అష్టదిగ్గజములచేత తన ఇష్టదైవంపై పదాలు పాడించి, కావ్యాలు రచింపజేసినాడు. వారిలో ఒకరు పోలిపెద్ద వెంకటరాయ కవి, 'వేణుగోపాల భక్తిసంత్రాణశీల' అనే మకుటంతో శతకాన్ని రచించి వేణుగోపాలస్వామికే అంకితమిచ్చాడు. ఆస్థాన

కవులందరిలోకి వేణుగోపాలస్వామిని తన కవితాధారతో ముంచెత్తినవాడు పదకవి సారంగపాణి. ఈనాటికీ ఈతడి పదాలు పామరుల నోళ్ళపై సైతం నిత్యనూతనంగా వెలువడుతూ వుంటాయి.

**ఉదా॥ "కొలిచితే వేణుగోపాలుని కొలువవలెను**
**తలచితే విష్ణుచారిత్రంబు తలచు**
**చుండవలెను ఓ జనులారా॥"**
**"పట్టవలె వేణుగోపాలుని పదములు**
**కట్టవలెను వైకుంఠానికి మెట్లు"**

**ఆలయనిర్మాణం**

కార్వేటినగరం గ్రామదక్షిణదిశలో శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం నిర్మించబడింది. ఈ ఆలయం 60 గజాల పొడవు 30 గజాల వెడల్పుగల విశాలమైన ఆవరణలో నిర్మితమైంది. ఆలయం చుట్టూ ఎత్తైన ప్రహరీ ఉంది. ఆలయనిర్మాణం తూర్పుదిశాభిముఖంగా నిర్మితమై, తూర్పువైపు ప్రహరీగోడలో ఆలయప్రవేశద్వారము, ద్వారంపైన అయిదు అంతస్తుల రాజగోపురం నిర్మితమైనాయి. గోపుర అధిష్ఠాన గోడలపై చెప్పుకోతగ్గ శిల్పము కానరాదు. ఆలయంలోనికి ప్రవేశించగానే ధ్వజస్తంభ, గరుడమండపాలు దర్శనమిస్తాయి. గరుడుడు ప్రధానాలయంలోని వేణుగోపాలస్వామికి అభిముఖంగా ప్రతిష్ఠింపబడి, స్వామికి అంజలి ఘటిస్తూ ఉన్నాడు.

ప్రధానాలయ మహామండపం, స్నపనమండపం, ముఖమండపం, అంతరాళం, గర్భాలయాలను కలిగిఉంది. మహామండపం ఎత్తైన



అధిష్ఠానంపై 36 స్తంభాల సాయంతో శోభాయమానంగా నిర్మితమై ఉంది. ఈ స్తంభాలపైన వైష్ణవశిల్పాలు మలచడమేగాక, మలివిజయనగర వాస్తురూపురేఖలను పొందుపరచినారు. ఒకనాడీ మండపమందే కవితాగోష్ఠులు, నృత్యాంగనల అంగవిన్యాసాలు, గాయకుల కంఠనాదాలు మారుమ్రోగేవి. ఈ మహామండపం పడమర ఒక అడుగు ఎత్తులో స్నపన మండపం నిర్మితమై ముఖమండపానికి దారితీస్తుంది. ఈ దారికిరువైపులా ఆయుధపాణులైన (జయ, విజయ) ద్వారపాలకులున్నారు. ఇచ్చటే చిన్న అరుగుపై రామానుజ మరియు ఆళ్వారులు ప్రతిష్ఠింపబడియున్నారు. వీరితోబాటు రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలుడు, వెండి గోవు (ఉత్సవర్లు) కొలువైయున్నారు. ఈ ఉత్సవర్లకు తోడుగా సీతారామలక్ష్మణ ఉత్సవవిగ్రహాలు కూడా చోటు చేసుకొన్నాయి. ముఖమండపం దాటితే ఇరుకైన అర్ధమండపం, అంతరాళములున్నాయి. అర్ధమండపం నుంచే భక్తులు స్వామిని దర్శించవలె. అర్ధమండపంలో ఒకమూల గంభీరమైన శ్రీమహాలక్ష్మి (కమలవల్లి) విగ్రహం ఆసీనభంగిమలో ప్రతిష్ఠింపబడి ఉంది.

గర్భగృహము చతురస్రాకారంలో ఉంది. మధ్యన 3 అడుగుల ఎత్తున్న ఆసీనపీఠముపై నిలువెత్తు వేణుగోపాలస్వామి, రుక్మిణి, సత్యభామ, స్వామి వెనుక గోవు ప్రతిష్ఠింపబడియున్నారు. ఈ దేవేరుల సోయగం చూచి తరించాలేగాని వర్ణించడానికి మాటలు చాలవు. ఈ దేవేరుల ముంగిట నవనీత కృష్ణుడు, సుదర్శనాళ్వార్ పంచలోహ విగ్రహాలున్నాయి. ఈ నవనీత కృష్ణునికే ఏకాంతసేవ, సుప్రభాతం జరుపుతారు. గర్భగృహంపైన ద్రవిడ శిఖరము, ఏకతల విమానము పైన కలశము ఉన్నాయి. గోపురం మొత్తం వైష్ణవశిల్పాలతో అలంకరింపబడి ఉంది. ఆలయమందు తిరుమల ఆలయ సాంప్రదాయంలోనే ఆగమపద్ధతిలో పూజలు జరుగుతాయి.

ఆలయ ఆవరణయందు దక్షిణపార్శ్వమందు శ్రీ కోదండ రామాలయముంది. ఈ ఆలయం కూడా ముఖమండపం, అంతరాళం,

గర్భాలయాలను కలిగిఉంది. ఇచ్చట ప్రత్యేకత ఒంటిమిట్ట కోదండ రామాలయమందు వలె సీతారామలక్ష్మణులను ఏకపీఠశిలపై మలచినారట!

శ్రీ వేణుగోపాల ఆలయమందు 50 ఏండ్లకు పూర్వం వరకు ఎంతో వైభవంగా బ్రహ్మోత్సవాలు జరిగేవట! ఆనాడు బ్రహ్మోత్సవాల కాలంలో ఉపయోగించే అనేక వాహనశకలాలు ఆలయమందు లభ్యమౌతున్నాయి. వాటిలో ముఖ్యమైనది స్వామివారి బంగారు గరుడ వాహనం యొక్క శిరస్సు. ఆనాటి స్వామి వారి గరుడవాహనం కంచివరదస్వామి గరుడవాహనం కంటే పెద్దదట! ఈ వాహనాన్ని 40 మంది వాహనం మోతగాళ్ళు మోసేవారట! ఈ వాహనం పురవీధుల్లో ఊరేగడానికే కార్వేటినగరం రాచవీధులు వెడల్పు చేయబడినాయట! ఈ గరుడసేవను గురించి సారంగపాణి కవి ఈ క్రింది విధంగా పదకవితలల్లుచున్నాడు.

**కదలీవచ్చెను జూడరే వేణుగోపాలుడు**
**కనుల పండగ గాను**
**పదిలుడై గరుడనిపై నెక్కి భక్తుల**
**ముదమొందజేయుచు, ఇదిగో రాజమార్గమున**

బ్రహ్మోత్సవాలతోబాటు వేణుగోపాలస్వామి తెప్పోత్సవాలు కూడా ఆనాడు ఎంతో వైభవంగా జరిగేవి. ఆలయానికి ఒక ఫర్లాంగు దూరంలో ఉన్న స్కందపుష్కరిణియందు ఈ ఉత్సవాలు జరిగేవి. కార్వేటినగరంలోని రాజసౌధాలు ఆలయాల నిర్మాణం ఒక ఎత్తు అయితే, ఈ స్కందపుష్కరిణి నిర్మాణం మరో ఎత్తు. దీని నిర్మాణం యొక్క సోయగం, దీని నిర్మాణానికి తీసుకొన్న శ్రద్ధ నిరుపమానం.

ఇంతటి కళాపోషకులైన కార్వేటినగరం రాజవంశీయులు కాలగర్భంలో కలసిపోయినా, వారు నిర్మించిన వేణుగోపాలస్వామి ఆలయం సూర్యచంద్రులు గతులు తప్పనంతవరకు వారి కీర్తికి, గొప్పతనానికి ప్రతీకగా నిలిచి ఉంటుంది.

* * *

## శ్రీకాళహస్తి - శ్రీకాళహస్తీశ్వరాలయము



శ్రీకాళహస్తి ఆంధ్ర దేశములోని చిత్తూరు జిల్లాయందు తాలూకా కేంద్రము. ఈ పవిత్ర పుణ్యస్థలమందు పరమ శివుడు వాయులింగ రూపమున వెలసియు న్నాడు. చిత్తూరు జిల్లాలో తిరుపతి క్షేత్రము తర్వాత నిత్యకళ్యాణము పచ్చతోరణముగా విరాజిల్లుచు లక్షలాది యాత్రికులను ఆకర్షించు పుణ్యక్షేత్ర మిది. ఈ పుణ్యక్షేత్రమును దక్షిణ కాశిగాను దక్షిణ కైలాసముగను పూజింతురు. శ్రీకాళహస్తి యందలి ఆలయము పల్లవ, చోళ, విజయనగర రాజుల కాలములో అభివృద్ధిగాంచి శిథిలమైనపుడు దేవకోట నాటుకోటు శెట్టిగార్లచేత జీర్ణోద్ధరణ చేయబడి శిల్పకళకు నిలయముగా విరాజిల్లుచున్నది.

శ్రీకాళహస్తీశ్వరస్వామి మహిమను గురించి, క్షేత్ర పవిత్రతను గూర్చి అనేక కథలు, గాథలు ప్రచారమందున్నవి. కృష్ణరాయల భువనవిజయము నందలి అష్టదిగ్గజములలో ఒకడుగా పేర్కొనబడిన శ్రీకాళహస్తినివాసి ధూర్జటి మహాకవి, పరమ శివభక్తుడు. శ్రీకాళహస్తీశ్వరమాహాత్మ్యము, కాళహస్తీశ్వర శతకమును రచించినాడు. ఆతడు శ్రీకాళహస్తీశ్వరమాహత్మ్యమునందు బ్రహ్మదేవుడు, వసిష్ఠుడు, జంగముడు, సాలెపురుగు (శ్రీ), నాగుపాము (కాళ), ఏనుగు (హస్తి), తిన్నడు, ఇంకా ఎంతోమంది భక్తులు ఎలా స్వామి మహిమతో ముక్తిని పొందారో వివరించినాడు.

### బ్రహ్మ యొక్క కథ

ఒకరోజు బ్రహ్మ దేవగణసమేతముగా కొలువుదీరియుండగా, సరస్వతి భర్తను చూచుట కేతెంచినది. ఆ సమయములో భార్య కొంగ్రొత్త

సౌందర్యముతో కనపడగా బ్రహ్మ కామాతురుడై ఆమెను నూరు రూపాలతో తనకు కామతృప్తిని కలిగించమని కోరగా ఆమె భర్త కోరిక నెరవేర్చినది. వారి కలయిక ఫలితముగా వారికి నూర్గురు రాక్షస ప్రవృత్తిగల కుమారులు కలిగారు. వారు మూర్ఖులు, క్రూరులు, యుద్ధప్రియులుగా పెరిగి పెద్దవారై దేవతలకు తీరని కష్టనష్టాలను కలుగజేయగా వారిని భూలోకంలో వింధ్యపర్వతమునకేగి జీవించమన్నాడు. భూలోకములోకూడ వారు తమ క్రూరకృత్యాలను వదలకుండుటచే భూదేవి బ్రహ్మకు ఆ విషయము విన్నవించుకొనెను.

బ్రహ్మ తన రాక్షసపుత్రుల నణచుటకై ఉగ్రుడనే తనయుని సృష్టించాడు. ఉగ్రుడు తండ్రి ఆజ్ఞ ప్రకారము తన సోదరుల నందరిని చంపి తండ్రి వద్దకురాగా, పుత్రశోకాన్ని తట్టుకోలేక శతానందుడు (బ్రహ్మ) ఉగ్రునివైపు కోపముతో తన దృష్టిని మరల్చగా అతడు భస్మమైనాడు. చతుర్ముఖుడు తన తప్పునకు విచారించి మనశ్శాంతికై దేశాటన చేయుచు దక్షిణ కైలాసమున కేతెంచి తపమాచరించగా ఈశ్వరుడు ప్రత్యక్షమై ఒక సంవత్సరము తపస్సు కొనసాగించిన తర్వాత వారి దుఃఖమును బాపు కుమారుడు కలుగునని దీవించినాడు. అలాగే సంవత్సర తపము తర్వాత వారికి 'బుధువు' లేక 'రంభు' అనే కుమారుడు కలిగినాడు. ఆ పసివాడు మహేశ్వరుని పూజించి బ్రహ్మహత్యాపాపమును తొలగించినాడు.

### వసిష్ఠ మహర్షి కథ

పూర్వమెప్పుడో వసిష్ఠ విశ్వామిత్రులకు వైరమేర్పడగా ఉగ్రుడైన విశ్వామిత్రుడు వసిష్ఠ మహర్షి నూరుగురు కుమారులను చంపించినాడు. దుఃఖభారమును సహించలేక వసిష్ఠుడు పెద్ద కొండపై నుండి క్రిందికి దూకి ప్రాణత్యాగమునకు పూనుకోగా, భూదేవి అతనిని తన చేతులతో పట్టి రక్షించి మనఃశాంతికై ఈశ్వరుని ప్రార్థించమన్నది. శివార్చనకొరకై ఆ ఋషీశ్వరుడు శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రమున కేతెంచి స్వామిని ప్రార్థించగా

స్వామి ప్రత్యక్షమై బ్రహ్మవిద్యను ఉపదేశించెను. ఋషి స్వామిని తాను ప్రత్యక్షము కావించుకున్న ఆ ప్రదేశమందే లింగరూపము దాల్చి భక్తులకు ముక్తిని కలిగించుమని శివుని ప్రార్థించగా, భక్తుని కోర్కెను కాదనలేక ఈశుడు దక్షిణ కైలాసమున నివాసమేర్పరచుకొన్నాడు. భర్త ఎడబాటును సహించలేని దాక్షాయణి జ్ఞానప్రసూనాంబ పేరున భర్త చెంతనే స్థిరపడినది.

## జంగమముని వృత్తాంతము

మునుపు నారాయణవన రాజ్యమును యాదవ నరసింగరాయలు పాలించుచుండగా పరమేశ్వరుడు జంగముని వేషమున భిక్షాటనమునకై నారాయణవనమునకు ఏతెంచినాడు. జంగముని వేషమునకు మెచ్చి రాజాంతఃపురమందు పనిచేయు దాసి అతనిని తన ఇంటికి ఆహ్వానించి ఆతిథ్యమొసగి వెంటనే రాజునకు సపర్యలు చేయుటకు వెళ్ళగా, రాజుగారు ఆమె ఆలస్యమునకు కోపించి దానికి శిక్షగా జుట్టును తీయించినాడు. ఆమె బోడితలతో తనయింటికి వెళ్ళగా జరిగిన విషయమును విని జంగముడు ఆప్యాయతతో ఆమె తలను నిమరగా ఆమెకు పూర్వమువలె జుట్టు చేకూరినది. మరుసటిరోజు ఆమె రాజు కొలువునకు వెళ్ళగా ఆమె జుట్టును చూచి రాజు ఆశ్చర్యముతో విషయము తెలిసికొని ఆమెవెంట వెళ్ళి జంగముని చూచి నీవెవరవు ఎందుల కిచ్చటి కేతెంచినావు? అని ప్రశ్నించగా నతడు తాను శ్రీకాళహస్తీశ్వరస్వామి భక్తుడనని, ఆ స్వామి మహిమలను వివరించి స్వామికి ఆలయము నిర్మింపుమని రాజునకు చెప్పి అంతర్ధానమైనాడు. రాజు తన తప్పిదమును తెలిసికొని దాసిని తన్ను మన్నించుమని కోరి, జంగముని ఆన మేరకు స్వామికి ఆలయనిర్మాణమును కావించినాడు.

## సాలెపురుగు (శ్రీ)

ఈ సాలెపురుగు వెనుకటి జన్మలో ఊర్ణనాభుడను బ్రాహ్మణుడు. తన సృష్టికి ప్రతిసృష్టి కావించుచున్న ఊర్ణనాభుని బ్రహ్మ 'రాబోవు జన్మలో

నీవు భూలోకములో సాలెపురుగువై జన్మించెదవు' అని శపించగా ఊర్ణనాభుడు బ్రహ్మ పాదములపైబడి తన తప్పు మన్నించి శాపవిమోచనము కల్గించు మనగా "భూలోకమందలి దక్షిణకైలాసములో శ్రీ అనే పేరున చెట్టుపై నివసించుచు పరమేశ్వరుని స్మరించుచుండు. నీవు ఈశ్వరుని కటాక్షమువలన శాపవిముక్తుడవయ్యెదవు" అని ఆదేశించాడు.

బ్రాహ్మణుడు సాలెపురుగై జన్మించి మారేడు చెట్టుపై నివసించుచుండగా ఒకరోజు ఒక భక్తుడు మారేడు పుష్పాలను కోసి గంపలో వేయుచుండగా పుష్పాలతోకూడ సాలెపురుగు గంపలో పడినది. భక్తుడా పుష్పములను ఈశుని కర్పించగా సాలెపురుగు ఈశ్వరుని స్పర్శతో శాపవిమోచనము పొందినది.

ఇంకొక కథనము ప్రకారము కృతయుగమందు దక్షిణ కైలాసమందలి శివలింగానికొక సాలెపురుగు పూజ చేయుచు స్వామి లింగము చుట్టూ గూడు నిర్మించసాగినది. స్వామి ఆ కీటకము యొక్క భక్తిని పరీక్షించుటకై అది నిర్మించిన గూళ్ళను ఆలయమందలి దీపములతో కాల్చివేయగా కోపగించిన ఆ పురుగు ఆ దీపమును మ్రింగుటకు ప్రయత్నించగా ఈశుడు ఆ కీటకరాజమును తన చేతిలోనికి తీసికొని తనలో ఐక్యము చేసికొన్నాడు.

**కాళము**

త్రేతాయుగమందు 'కాళమనే' సర్పము భూతలమునంతటిని శోధించి రత్నాలు, మణులు సేకరించి దక్షిణకాశియందలి శివలింగానికి అలంకరించుచుండెడిది. అదే సమయములో ఒక ఏనుగు ఈశ్వరార్చనకై సువర్ణముఖి నుండి తొండముతో నీటిని, కలువపూవులను తెచ్చి స్వామిచుట్టు ఉన్న రత్నాలను త్రోసివేసి నీటితో అభిషేకముచేసి కలువపూవులతో అలంకరించెడిది. అదేవిధముగా మరుసటి దినమున పాము ఏనుగు పెట్టిన

పూవులు త్రోసివేసి తిరిగి రత్నాలతో శివలింగమును అలంకరించెడిది. ఒకరికి తెలియకుండా మరొకరు పైపని ఎవరు చేయుచున్నారో తెలిసికొనుటకు కొంతకాలము వేచియుండగా, ఒకరోజు ఏనుగు నీటితో స్వామిని అభిషేకించుచుండగ పాము ఏనుగు ముక్కుద్వారా ఏనుగు తలలో దూరి దానిని హింసించసాగినది. బాధ తట్టుకోలేని గజరాజము తన తలను గోడకేసి బాదగా తలపగిలి ఏనుగుతలలోని సర్పము మరణించినది. స్వామి లింగము నుండి వెలుపలికివచ్చి ఆ జీవములను తనలో ఐక్యము చేసికొన్నాడు.

పాము పూర్వజన్మలో శివుని సేవకుడు. ఒకరోజు తన ప్రియురాలి సాన్నిధ్యములోనుండి పాతాళము నుండి సమయమునకు కైలాసమునకు ఏతెంచలేదట. శివుడు కోపగించి నీవు భూలోకములో జన్మించుమన్నాడు. పాము తన తప్పును మన్నింపుమనగా శివుడు దక్షిణకాశియందు తన్ను పూజించి తనలో ఐక్యము చెందమన్నాడు.

**హస్తి**

పూర్వజన్మలో శంకరుని పరివారములోని కింకరుడు. ఒకరోజు ఆ కింకరుడు ఏకాంతముననున్న పార్వతీ పరమేశ్వరులను దర్శించాడు. పార్వతి లజ్జితయై, కోపగించి నీవు భూలోకములో ఏనుగువై జన్మించు అనగా కింకరుడు శాపవిముక్తికై వేడగా నీవు దక్షిణకాశిలో పాముతో పోట్లాడి మరణించిన తరువాత నన్ను చేరెదవని ఆశీర్వదించాడు. ఆ కింకరుడు ఏనుగై భూలోకమందు జన్మించి కాళముతో పోట్లాడి మరణించి కైలాసమును చేరుకొన్నాడు.

శ్రీ (సాలెపురుగు), కాళము (పాము), హస్తి (ఏనుగు) స్వామిని సేవించి విముక్తిని పొందుటచే దక్షిణకాశియందలి ఈశ్వరునికి 'శ్రీకాళహస్తీశ్వరుడని' పేరు సార్థకమైనది.

## భక్తకన్నప్ప

కన్నప్ప (తిన్నడు) నారాయణవనరాజ్యమందలి ఉడుమూరు గ్రామస్థుడు. బోయకులములో పుట్టుటచే విలువిద్యయందు ఆరితేరినాడు. ఒకరోజు మిత్రులతో కలసి అగస్త్య పర్వతాలకు వేటకు వెళ్ళి ప్రొద్దుగూకుటచే ఆ రాత్రి అచ్చటే నిద్రించినాడు. శివుడా బోయబాలుని కలలో కన్పించి వేటతోనే జీవితమును వ్యర్థముచేయక సమీపములో లింగరూపములోనున్న తన్ను పూజించి జన్మ ధన్యము కావించుకోమనినాడు. మరునాడు తన అనుచరులను ఇంటికిపంపి, శివలింగమును చేరి "స్వామీ అరణ్యములో ఎందుకు? మా వూరికి వెళ్ళెదము రమ్మ"నగా స్వామి ఉలకను పలకను లేదట. అందుచేత కన్నప్ప స్వామి చెంతనే ఉంటూ ప్రతిదినము ఒక దొన్నెలో పందిమాంసముతెచ్చి లింగము ముందుపెట్టి స్వామిని ఆరగించుమనెడివాడు.

ఒకరోజు శైవ బ్రాహ్మణుడు శివపూజకై లింగము చెంతకేతెంచి ఆచ్చటనున్న మాంసపుముక్కలను చూచి స్వామి పాపపంకిలమైనాడని విచారించి ప్రాణత్యాగమున కుపక్రమించగా శివుడు ''భక్తా! ప్రాణత్యాగమెందులకు నాకు ప్రతిదినము ఒక భక్తుడు ప్రసాదించు నైవేద్యమిది. అతని భక్తిని నీవే కళ్ళార ఈ లింగము వెనుక దాగియుండి చూడు" మన్నాడు.

మధ్యాహ్న సమయములో తిన్నడు స్వామివద్దకు వచ్చి పుక్కిటి జలముతో స్వామికి అభిషేకము చేసి మాంసము సమర్పించి 'స్వామీ ఆరగింపు' మన్నాడు. వెంటనే స్వామి కంటినుండి రక్తము స్రవించసాగినది. కన్నప్ప తనకు తెలిసిన వైద్యములన్నింటిని చేసి విఫలుడై ఇక ఫలితములేదని తన కంటి నొకదానిని బాణముతో తీసి స్వామికి రక్తముకారు కంటిలో నుంచినాడు. వెంటనే స్వామి లింగముయొక్క మరొక కంటినుండి రక్తము కారసాగినది. స్వామి కంటియొద్ద, పాదరక్షను ధరించిన తన కాలిని గుర్తుగా

పెట్టి తన ఇంకొక కంటిని తీసి కాలుంచిన కంటికి అమర్చుదానికి బూనునంతలో పరమేశ్వరుడు లింగము నుండి వెలుపలికి వచ్చి, బ్రాహ్మణునికి తిన్నడి శ్రద్ధాభక్తులను తెలియజేసి తిన్నడితో " నీవు నీ కన్నులనే నా కర్పించినావు కావున ఇకపై నీవు 'కన్నప్ప' అను పేరుతో కీర్తినొందెదవు" అని ఆ తర్వాత తిన్నడికి, బ్రాహ్మణునికి మోక్షము ప్రసాదించి అంతర్ధానమైనాడు.

## దేవదాసినులచే విముక్తి

పాండ్యభూపతులు మధురను రాజధానిగా దక్షిణ భారతమును పాలించుచున్న కాలములో వారి ఆస్థానమందు మాణిక్యవల్లి అనే దేవదాసి యుండెడిది. ఆమెకు కోమాలాంగులైన ఇద్దరు కుమార్తెలుండిరి. వారు బాల్యమునుండి పరమేశ్వరభక్తులు. మాణిక్యవల్లి వారిని కులవృత్తి స్వీకరించమనగా అందులకా కన్యలు అంగీకరించక తల్లిని ఎదిరించి తాము శివుని పూజించి ముక్తిని పొందెదమని ప్రతిన పూనినారు. ఆ విషయమువిన్న కొందరు మోసగాండ్రు భక్తుల వేషములో దక్షిణకాశిగా పేరుగాంచిన శ్రీ కాళహస్తి వెళ్ళుచున్నామని చెప్పి ఆ కన్యలను తమతోబాటు తీసికొని వెళ్ళుచు మార్గమధ్యములో వారి యొంటిపైనున్న ఆభరణములను దోచుకొనుటకు ప్రయత్నించగా భక్తులను వెన్నాడి సదా వారిని రక్షించు సదాశివుడా కన్యలను ఆ మోసగాళ్ళ బారినుండి రక్షించి శ్రీకాళహస్తికి రప్పించాడు. ఆ దేవాదాసినులు భక్తితో సేవించి ముక్తిపొందినారు. ఆ కన్యల జ్ఞాపకార్థము దాసీలు ప్రతిష్ఠించిన లింగములు శ్రీకాళహస్తి యందున్నవి.

## నత్కీరుని చరిత్ర

నత్కీరుడు మహాపండితుడు వేదవేదాంతవేత్త. అతడు శివునిచే రచింపబడిన ఒక పద్యమందు తప్పుపట్టినాడు. పరమేశ్వరుడు తన

కవిత్వములో తప్పు పట్టినవానికి కుష్ఠువ్యాధి వచ్చునని శపించాడు. వెంటనే నత్కీరునికి కుష్ఠువ్యాధి సోకగా శాపవిమోచనమునకు పరమేశ్వరుని వేడగా, స్వామి కుమారస్వామిని వేడుకోమన్నాడు. షణ్ముఖుడు నత్కీరుని వ్యాధి పోగొట్టి దక్షిణకైలాసమగు శ్రీకాళహస్తి కేగి అహంభావమును వదలి శివుని సేవించుమన్నాడు. నత్కీరుడు శ్రీకాళహస్తి కేతెంచి అపరగంగానదియైన ఆ సువర్ణముఖిలో రోజూ స్నానమాచరించుచు తన భక్తిచే స్వామిని ప్రసన్నుని చేసి చివరకు ముక్తిని పొందినాడు.

**సువర్ణముఖి జననము**

కైలాస పర్వతమందు పార్వతీపరమేశ్వరుల కళ్యాణమహోత్సవానికి సకల దేవతలురాగా వారి శరీరభారముతో ఉత్తరభారతము లోపలికి కృంగిపోగా శివుడు వింధ్యపర్వతమునకు దక్షిణవైపును ఉత్తరవైపు భూమితో సమానముగా సరిపెట్టమని వసిష్ఠ మహర్షి కాదేశించాడు. వసిష్ఠుడు పత్నీసమేతముగా దక్షిణ దేశము కరుదెంచి అచ్చట ప్రముఖ పుణ్యక్షేత్రములను దర్శించుచు శ్రీకాళహస్తి కేతెంచి ఈశ్వరుని సేవించుటకు పూర్వము నీటి వసతి లేకుండుటచే బ్రహ్మను గురించి తపస్సు చేయగా వాచస్పతి శివుని వద్దకు వెళ్ళి బ్రహ్మర్షి కోరిక ఎటువంటిదైయుండుననగా, ఈశుడు



ఋషీశ్వరుని కోరిక తనకు తెలియునని తన జటాజూటముననున్న గంగను బ్రహ్మవెంట పంపగా గంగాదేవి వసిష్ఠుడు తపమాచరించు ప్రదేశమునకు సువర్ణకాంతులీనుచు ప్రవహించసాగినది. అందుచే దీనికి సువర్ణముఖి యని పేరువచ్చినది. ఈ సువర్ణముఖి చంద్రగిరి పట్టణానికి 20 మైళ్ళ దూరమున నున్న మంగళంపేట మల్లప్పనాయుని చెరువు ముంగిటపుట్టి, దామల్ చెరువు మీదుగా ప్రవహించి శ్రీకాళహస్తి వద్ద దక్షిణవైపుగా ప్రవహించి పవిత్రతను పొందినది. ఈ నది గట్టుమీద అచ్చటచ్చట ఈనాటికి మొగలిపొదలు తండోపతండములుగా నుండుటచే దీనిని 'మొగిలేరు' అనెడివారు.

## శ్రీ కాళహస్తీశ్వరలింగము

శివపురాణము, దక్షిణాపథమందు ఐదు శైవక్షేత్రములను అందలి శివలింగాలను 'బాణలింగాలు'గా పేర్కొనుచున్నది. ఆ పవిత్రమైన శివలింగములు కాంచీపురమందలి పృథ్వీలింగము (ఏకామ్రేశ్వరాలయం), తిరుచిరాపల్లిలోని అప్పు (జల) లింగము, తిరువణ్ణామలైయందలి తేజోలింగము, చిదంబరమందలి ఆకాశలింగము, కడపటిది శ్రీకాళహస్తి యందలి వాయులింగము. మహాదేవుడీ క్షేత్రమందు వాయులింగరూపము ధరించియున్నాడనుటకు నిదర్శనముగా గాలి వచ్చుటకు ఎటువంటి గవాక్షులు గాని గూడులు గాని లేని ఈ యిరుకైన గర్భాలయమందున్న రెండు దీపములు ఎల్లప్పుడు రెపరెపలాడుచుండును.

ఈ లింగము యొక్క మరొక గొప్పతన మేమనగా దీనిని అర్చకులు అనాదిగా తాకరు. జలముతో అభిషేకము చేయరు. అచ్చటనున్న కవచమును అభిషేకించెదరు. గర్భాలయములోని దీపములు అగస్త్య మునీంద్రునిచే వెలిగింపబడి, ఈనాటికి ఆరిపోకుండా ఉన్నవట! లింగముపై కర్పూరజలమును శంఖుతో నింపి అభిషేకిస్తారు ఆ జలమెక్కడికి వెళ్ళుతుందో ఎవరికి తెలియదు. ఆలయము ముంగిట బిల్వ వృక్షమున్నది.

ఈ చెట్టుయందలి పూవులందు రేకులు 8 నుండి 13 వరకు వున్నవి. ఈ క్షేత్రమునకెందులకో "అఖండ బిల్వ కానన" మన్న మరొక పేరున్నది.

ఇచ్చటి దేవి జ్ఞానప్రసూనాంబ. అమిత శక్తివంతమైనది. అంతేగాక భక్తులయెడ కొంగు బంగారము. సంతానహీనులు, దుష్టగ్రహపీడితులును అయిన స్త్రీలు సువర్ణముఖిలో స్నానమాడి తడిబట్టలతో దేవిని సాష్టాంగపడి ధ్యానించినచో వారి సకల కోరికలు నెరవేరి సుఖశాంతులతో వర్ధిల్లెదరు.

శ్రీకాళహస్తీశ్వరాలయ ప్రాంగణమందు పెక్కు చిన్నచిన్న దేవాలయములు, గోపురములు, తీర్థములు చోటుచేసుకొన్నవి. సువర్ణముఖీనది తూర్పు ఒడ్డున ఉన్న రాయగోపురము ఇచ్చటనున్న కట్టడాలన్నింటిలోకి ఎత్తైనది. ఈ గోపురాన్ని శ్రీకృష్ణదేవరాయలు క్రీ.శ. 1516వ సంవత్సరమునందు నిర్మించినట్లు ఈ ఆలయమందును తిరువణ్ణామలై ఆలయములో లభ్యమగుచున్న శాసనముల వలన తెలియుచున్నది. ఈ గోపురము ఎత్తైన అధిష్ఠానములపై 7 అంతస్థులను కలిగియున్నది. అధిష్ఠానముపై సింహలలాట, శాల, కోష్ఠ శిల్పములున్నవి. గోపుర నిర్మాణము ఇటుకలతో నిర్మింపబడి, కూటములు, శాలలు, పంజరములనేకాక ప్రతి అంతస్తు ద్వారమునకిరువైపుల గదాధారులైన శిల్పములు యున్నవి. గోపురముపై అచ్చటచ్చట నగ్న స్త్రీ శిల్పములు, బూతుబొమ్మలు చోటుచేసుకొన్నవి. గోపురము పైభాగము ఆయతాస్త్ర శిఖరమును కల్గి పైన రాతి కలశములున్నవి. అధిష్ఠానముపై విజయనగర రాజముద్రిక చెక్కబడియున్నది.

ప్రధానాలయమునకు చుట్టు మూడు ప్రాకారములున్నవి. మొదటి రెండు ప్రాకారములు ఆలయముచుట్టు వెలుపలిభాగమందును, మూడవ ప్రాకారముపై కప్పుతో నిండి ఆలయ ప్రధాన భాగములను కప్పియున్నది. మొదటి ప్రాకారమునందు ఉత్తర దిశయందున్న గోపురము మాత్రమే

నిలిచియుండి మొత్తము ప్రాకారము శిథిలమైనది. ఆలయము ఒకవైపు కొండతోను మరి రెండువైపుల నదితోను చుట్టబడియుండుటచే నిర్మాణము క్రమపద్ధతిలో లేదు.

ఆలయ ప్రవేశము పడమటివైపుననున్న గోపురద్వారమే. ఈ గోపురముపై చెప్పుకోతగ్గ శిల్పము లేదు. గోపుర ముఖద్వారమున లోపలి భాగమునందు ఇరువైపుల స్తంభములతో నిర్మించిన మండపమున్నది. ఈ గోపురమునకు సమీపమందే కాశీ విశ్వేశ్వరాలయమున్నది. దీనియందు గర్భగృహము, అంతరాళము, పొడవైన మండపములున్నవి. గర్భగృహమందలి గూళ్ళయందు విష్ణు, బ్రహ్మ, దుర్గ శిల్పములున్నవి. అంతరాళము యొక్క ద్వారబంధముపై మకర తోరణము చెక్కబడియున్నది. ముఖమండపమందు విడిగా ప్రతిష్ఠించబడిన వినాయక, కుమార, వీరభద్ర, చండి విగ్రహములున్నవి. గర్భాలయమందు వేదికపై కాశీ విశ్వేశ్వరలింగము ప్రతిష్ఠింపబడియున్నది. దీనిప్రక్కనే దేవి ఆలయం ఉన్నది. ఈ రెండు ఆలయముల చుట్టు ప్రహరీగోడ యున్నది. ఆలయము లోపలి రెండవ ప్రాకార గోపురము చోళరాజుల శిల్పకళను ప్రతిబింబించుచున్నది. గోపురము అధిష్ఠానమునకు ముందువైపు దారికిరువైపుల స్తంభముల సాయంతో నిర్మించిన రెండు మండపములున్నవి. ఒక మండపమునందు ఆసీన గణపతి మరొక మండపములో కుమారస్వామి విగ్రహములున్నవి.

రెండవ ప్రాకారమునకు, మూడవ ప్రాకారమునకు మధ్యనున్న విశాలమైన ఆవరణమునందు పాతాళ విఘ్నేశ్వర, దేవి, దుర్గ, వీరభద్ర ఆలయములున్నవి. రెండవ ప్రాకారమునందే దక్షిణ దిక్కున సువర్ణముఖి నదిలోనికి దిగుటకు మెట్ల వరుసతో నిర్మించిన దారి, ముఖద్వారముపైన గోపురమున్నది. సువర్ణముఖిలో స్నానమాచరించి సరాసరి ఆలయ ప్రాంగణములో ఈ ద్వారము గుండా ప్రవేశించవచ్చును. ఈ గోపురపు తూర్పువైపున గణేశ ఆలయమున్నది.

**నూరుకాళ్ళ (కృష్ణదేవరాయల) మండపము**

ఈ బృహన్నిర్మాణము ఆంధ్రభోజుడు శ్రీకృష్ణదేవరాయలు నిర్మించినాడు. ఇందు నూరు స్తంభములందుటచే నూరుకాళ్ళ మండపమని పేరు కల్గియున్నది. ఈ మండపము రెండు భాగములుగా విభజింపబడి, తొలి భాగముకంటె రెండవభాగము 4 అ. ఎత్తుననున్నది. మండపము క్రిందిభాగమున పన్నెండు వరుసలు, ఒక్కొక్క వరుసలో ఏడు స్తంభములున్నవి. రెండవ భాగములో మూడు వరుసలు, ఒక్కొక్క వరుసలో ఆరు స్తంభములు చోటుచేసుకొన్నవి. మండప ప్రవేశద్వారమున కిరువైపుల రెండు పెద్ద పలకలమీద చెక్కిన ఏనుగులు ద్వారపాలకులుగా స్థాపించబడియున్నవి. మండప స్తంభములపై వివిధములైన శిల్పములు చోటుచేసుకొన్నవి.

**ప్రధానాలయము**

ప్రధానాలయము మూడవ ప్రాకారములోపల కుదించబడియున్నది. ప్రాకార ముఖద్వారము తూర్పుదిశలో నుండి పెద్ద గోపురముచే అలంకరించబడియున్నది. ప్రాకారము లోపలిభాగము మొత్తము పైకప్పును కల్గియున్నది. ఆలయములో ప్రవేశించగానే చుట్టు నాల్గువైపుల స్తంభములచే నిర్మించబడిన మండపమున్నది. ప్రవేశ ద్వారమునకు చెంత చిన్న అరలో లోహముతో తయారుచేసిన ఉత్సవమూర్తులున్నవి. ఈ మండపము సమీపములో ధ్వజస్తంభమున్నది. ఆలయ దక్షిణదిశలోని మండపమందు కుమార, కన్నప్ప, శక్తి గణపతి, శివలింగాలు ప్రతిష్ఠింపబడినవి. ఉత్తర దిశలోని మండపములలో అరవైముగ్గురు నాయనార్ల ప్రతిమలు, తూర్పువైపున సప్తమాతృకలు, శిలలతోను, స్ఫటికతోను తయారుచేసిన అనేక శివలింగములు స్థానమాక్రమించినవి.

ఆలయ మధ్యభాగమున ఎత్తైన వేదికపై శ్రీకాళహస్తీశ్వరాలయము నిర్మించబడినది. గర్భాలయమునకు ముందు స్తంభములచేత నిర్మింపబడిన

మండపము, మండప ప్రవేశమునకిరువైపుల ద్వారపాలకుల విగ్రహములున్నవి. మండపము చుట్టు ప్రదక్షిణాపథము నిర్మించబడినది. ఈ మండపము వెనుక ముఖమండపము, రెండు అంతరాళములు, గర్భగృహము ఉన్నవి. గర్భాలయముఖద్వారము దక్షిణాభిముఖముగానున్నది. గర్భగృహమునందలి గోడలలో మూడు వైపులనున్న చిన్న గూళ్ళయందు లింగోద్భవ, దక్షిణామూర్తి, బ్రహ్మప్రతిమలున్నవి. అంతరాళప్రవేశ ద్వారబంధముపై మకరతోరణమున్నది. ఇచ్చట గోడలలో చోళుల కాలమునాటి శిల్పములున్నవి.

గర్భగృహము పైభాగమున వేసరపద్ధతిలో నిర్మించిన ద్వితల విమానమున్నది. గర్భాలయమధ్యభాగమున పరమపవిత్రమైన స్వయంభూలింగమున్నది. ఈ లింగమునకు పంచముఖములున్నవి. అవి కాళము యొక్క శిరస్సులని, లింగము పైనుండి క్రిందివరకు కనపడు తెల్లటి చారలు ఏనుగు దంతాలని, కిందిభాగముననున్న గూటిలాంటి రూపమును సాలెపురుగు యొక్క ప్రతిరూపమని ప్రతీతి. లింగమునకెదురుగా సర్వాలంకృతములైన రెండు నంది విగ్రహములున్నవి.

**జ్ఞానప్రసూనాంబ ఆలయము**

ఆలయముఖద్వారము ఉత్తర దిక్కుగానున్నది. ఆలయప్రాంగణమున, ముఖమండపము, అంతరాళము, గర్భగృహములున్నవి. ముఖమండపము గోడలపై ఒకవైపు కుమారస్వామి, మరొకవైపున గణపతిశిల్పములు చెక్కబడినవి. గర్భాలయమందు నిలబడియున్న దేవి ప్రసూనాంబ దివ్య మంగళకరమైన విగ్రహమున్నది. ఈ దేవి సర్వపాపహారియని, సర్వాభీష్టదాయినియని భక్తులచే కొనియాడబడుచున్నది.

ప్రధానాలయానికి రెండు కిలోమీటర్ల దూరమున ఎత్తైన ప్రాకారములోపల నిర్మించబడిన మణికంఠేశ్వరాలయమందు గర్భగృహము,

రెండు అంతరాళములున్నవి. మొదటి అంతరాళము గోడలపై మహిషాసురమర్దిని, దుర్గ శిల్పములున్నవి. రెండవ అంతరాళము ముఖద్వారము పై భాగమున మకరతోరణమున్నది. గర్భగృహమందు మణికంఠేశ్వరస్వామి పేరుననున్న శివలింగము ప్రతిష్ఠింపబడినది. గర్భాలయము పై భాగమున ఏకతల విమానమున్నది.

మణికంఠేశ్వరాలయమునకు తూర్పువైపున దక్షిణ కైలాసమని వాసికెక్కిన కొండయున్నది. కొండ క్రిందిభాగమున గండశిలలపై చెక్కిన నటరాజ, పార్వతీపరిణయ, కుమారస్వామి, ఆలింగనమూర్తి, నృత్యగణపతి, భిక్షాటనమూర్తి శిల్పములున్నవి. కొండపైకి వెళ్ళుటకు రాళ్ళతో వంకర టింకరగా నిర్మించిన మెట్లవరుసయున్నది. కొండపైభాగమున చిన్న గుహవంటి మంటపమునందు భక్తుల కండ్లకు విందు చేసే చతుర్ముఖ లింగమున్నది. ఈ మండపము వెనుక భాగమున రాళ్ళపై అచ్చుటచ్చుట సుందర శిల్పములు కలవు. ఈ కొండపైనే పరమేశ్వరుని కొలచి, తన భక్తితో ప్రత్యక్షము కావించుకున్న తిన్నని ఆలయము కలదు.

శ్రీకాళహస్తి పట్టణము ప్రగతిని కోల్పోయిన రాజసౌధాలతో రాచ వీధులతో ఒకవైపు, అధునాతన భవంతులతో మరియొకవైపు, ప్రాతక్రొత్తల మేలి కలయికకు కేంద్రముగా నేడు అలరారుచున్నది. ఈ పట్టణము ప్రాచీన కలంకారి పరిశ్రమకు, ఇత్తడి పాత్రల పరిశ్రమకు, గాజుబొమ్మల పరిశ్రమలకు నేడుకూడ ముఖ్యస్థావరము. రాజకీయముగా కూడ నిన్నమొన్నటివరకీ పట్టణము ఉమ్మడి మద్రాసురాష్ట్ర, ఆంధ్రరాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయములలో కీలకమైన పాత్ర వహించినది.

* * *

## సోంపాలెం - చెన్నకేశవ ఆలయం

చిత్తూరు జిల్లాలో విజయనగరరాజుల కాలంనాటి ఆలయాల్లో మదనపల్లి తాలూకా మొలకల చెరువు గ్రామానికి ఐదు కిలోమీటర్ల దూరంలో వున్న సోంపాలెం గ్రామంలో వెలసిన చెన్నకేశవ ఆలయం ప్రముఖమైనది. ఈ స్వామి మహావిష్ణువు ప్రస్తుతం ఆలయం శిథిలావస్థకు అతిచేరువలో



ఉన్నది. అయితే ఆలయమందలి శిల్పసంపద చిత్రకళ విజయ నగర ఆలయ నిర్మాణాల్లో పరాకాష్ఠను అందుకున్నది. ఆలయ నిర్మాణం చెన్నకేశవ ఆలయాన్ని అచ్యుతరాయకాలంలో 16వ శతాబ్దం నాడు సోంపల్లి గ్రామాధికారి (తలవాయి) గొల్ల చెన్నప్ప నిర్మించినాడు. ఆనాడు ఈ ఆలయం ఎనలేని సిరిసింపదలతో తలతూగుతూ ఉండేది. ప్రస్తుతం ఈ ఆలయం దేవాదాయ ధర్మాదాయశాఖ లేక పురావస్తుశాఖ ఆధీనంలో ఉంది.

ఆలయం చుట్టూ ఎత్తైన రాతిదిమ్మెలతో నిర్మించిన విశాలమైన ప్రహరీ కలదు. ఆలయప్రవేశద్వారముపైన ఆలయంలోపల అనేక మండపాలు, ఆలయాలు కలవు. ఆలయ ప్రవేశద్వారంపైన గోపురము కలదు. ఈ గోపురం కొంత కూలిపోయింది. ఈ గోపురము మొత్తము శిల్పాలతో అలంకరింప బడినది. లోపలివైపు ఆలయంలో విశాలమైన స్తంభాల మండపము కలదు. ఈ మండపమందే గర్భగృహము, అంతరాళము, ముఖమండపము,

మహామండపము, రాతిరథము, కళ్యాణమండపము, గొల్లమండపము కలవు. స్వామి గర్భగృహము చతురస్రాకారంగా ఉన్నది. గర్భాలయం వెనుక గోడను ఆనుకొని దివ్యమంగళకరమైన శ్రీ మహావిష్ణువు విగ్రహము చెన్నకేశవస్వామి పేరిట సమభాగపద్ధతిలో పద్మపీఠంపై నిలుచుని పూజలు అందుకొంటూ ఉన్నాడు. స్వామి చతుర్భుజుడు. పై రెండు చేతులందు శంఖచక్రాలు క్రింది రెండు చేతులు అభయ వరద ముద్రలో ఉన్నాయి. స్వామి నుదుటపై తిరునామంతోపాటు కౌస్తుభం పూర్ణోరుకం యజ్ఞోపవీతం భుజకిరీటాలు కలిగి ఉన్నాడు. గర్భగృహం పైన కప్పు క్రిందివైపు రాతిదూలాలతో స్వస్తిక శిల్పము అలంకరింపబడి ఉన్నది.

గర్భగృహము ముందు దీర్ఘచతురస్రాకారంలో సన్నటి అంతరాళము దానిముందు ద్వారానికి ఇరువైపులా ఆయుధపాణులైన ద్వారపాలకులు కలరు. వీరు సర్వాలంకారభూషితులు. వీరుకూడా నుదుట తిరునామాలు కలిగి వారి కుడి అరిచేతులందు శ్రీవత్స ముద్రలను కలిగి ఉన్నారు. అంతరాళాన్ని ఆనుకొని ఆరు వరుసలలో వరుసకు రెండు స్తంభాల చొప్పున 12 స్తంభాల ముఖ మండపము కలదు. మొదటి రెండు స్తంభాల క్రిందిభాగంలో లక్ష్మీదేవి మహావిష్ణువు, రెండో వరుస రెండు స్తంభాలపైన స్త్రీల చేత పూజింపబడుతున్న లక్ష్మీదేవి కలదు. మిగిలిన స్తంభాలపైన శ్రీదేవి, భూదేవి, విష్ణుమూర్తి, నరసింహ, కూర్మ, మత్స్య, వరాహ, బలరామ, ఆదిశేషునిపై నిలబడిన శ్రీహరి, మురళీకృష్ణ, వామన, కాళియమర్దన, సరస్వతి, ఆంజనేయ, బాలకృష్ణ, సీతాదేవి, హిరణ్యకశిపు, గజేంద్రమోక్షం శిల్పాలు కలవు.

ముఖమండపం క్రిందిభాగంలో పొడవాటి రాతి దూలాలతో మలచిన స్వస్తిక ఆకారం కలదు. ఈ స్వస్తిక మధ్యన అద్భుతపద్మం కలదు. ఈ పద్మం అపురూపంగా మలచబడింది. ఈ పద్మం సౌందర్యాన్ని చూడవలసిందే గాని మాటలతో వర్ణింపలేము. మండపద్వారంపైన మకరతోరణం

ఇరువైపులా మకరములపై కూర్చొని స్వారీ చేస్తున్నట్లు గంగ యమునలు కలరు. స్తంభాలపై మిథున శిల్పాలు కూడ కలవు. మహామండపం 16 స్తంభాల సాయంతో నిర్మింపబడినది. ప్రతి స్తంభము క్రింద ఫలకాలపై వైష్ణవశిల్పాలు కలవు. వీటిలో ఆసీన నారసింహ, హరిశ్చంద్ర చక్రవర్తి విశ్వామిత్రుడికి దానము చేయు దృశ్యం, పరశురామ, లక్ష్మీనారాయణ శిల్పాలు కలవు.

ఈ ఆలయంలో ప్రతి స్తంభము ప్రతి రాతిబండ అణువణువు అపురూపమైన శిల్పాలతో అలంకరింపబడినది. ఈ స్తంభాల ఉపస్తంభాలు మీటితే సరిగమలు వినపడతాయి. ఆలయం చిన్నదైనా ఆనాటి విజయనగర శిల్పకారుల శక్తిసామర్థ్యాలన్నింటిని ధారబోసి ఈ ఆలయమండపాలను, స్తంభాలను రూపొందించారు. ఈ మండప స్తంభాలు వరుసకు నాలుగు చొప్పున నాలుగు వరుసలలో ప్రతిష్ఠింపబడి ఉన్నాయి. ఈ మండపం మొత్తం రామాయణ మహాభారత భాగవత పురాణ కథలను వర్ణచిత్రాలతో చిత్రీకరించారు. ఇందులో వాడిన వర్ణాలు, గీచిన రేఖాచిత్రాలు ఎంతో మనోహరంగా కనిపిస్తూ ఉన్నా దురదృష్టవశాత్తు ఈ వర్ణచిత్రాలు గుర్తించలేనంతగా చెరిగిపోయినాయి. విజయనగర చిత్రలేఖనాల్లో ఇవి మణిభూషణాల వంటివి.

సోంపాలెం ఆలయమందలి చిత్రకళను సి.శివరామమూర్తి జేమ్స్ కజిన్స్ నీలకంఠ శాస్త్రి మొదలగువారు వీటిపై ఎంతో పరిశోధన చేసి ఈ చిత్రకళ విజయనగర శిల్పకళలో అత్యున్నత స్థానాన్ని ఆక్రమించింది అని చెప్పడానికి ఈ క్రింది కొన్ని ఉదాహరణలు చెప్పినారు. ఒకటవ శిల్పంలో విశ్వామిత్ర మహర్షి శ్రీరామలక్ష్మణులను యాగసంరక్షణ కోసమై అడవులకు తీసుకుని వచ్చి రాక్షసులను చూపించుట, ఇచ్చట శ్రీరాముడు ధనస్సును సంధించగా విశ్వామిత్రుడు తన చూపుడువేలుతో తాటకిని చూపుతున్నాడు.

కన్నులు ఎర్రగా జుట్టు విరబోసుకుని నల్లనిరంగులో ఉన్నది. నోటిలో కోరలు కలిగియున్నది. క్రింద ఆమె కుమారులు మారీచ, సుబాహులు ఉన్నారు.

ఇచ్చట రాముని ఆహార్యము అతిమనోహరము. ఇచ్చట శ్రీరాముడు తాటకిపైకి బాణము సంధించినాడు. విశ్వామిత్రుడు రామునివైపు ఏకధాటితో చూస్తూ ఉన్నాడు. ప్రక్కన లక్ష్మణుడు బాణము ఎడమచేతిలో ఉంచుకున్నాడు. శ్రీరాముని చేతిలో విల్లు బాణము ఎంతగానో ఆకట్టుకుంటూ ఉన్నాయి. అలాగే విశ్వామిత్ర మహర్షి రూపము కూడా మరొక చిత్రంలో సీతారాముల కళ్యాణదృశ్యము చిత్రీకరింపబడినది. ఇందులో సీత ధరించిన దుస్తులు, ఆమె అద్దంలో చూచుకుంటూ తన కేశాలను సవరించుకునే దృశ్యము, అలాగే శ్రీరాముని మెడలో పూలమాలను వేసే ఘట్టము వర్ణనాతీతము. ఇచ్చటే సీత తండ్రి జనకుని చిత్రము కూడా కలదు. సీతాదేవి అనేక రకములైన ఆభరణములను ధరించి సిగ్గుతో మురిసిపోతూ ఉంది. ఇచ్చటే మరొక చిత్రమందు దశరథుడు శ్రీరాముని అడవికి వెళ్లమనే దృశ్యము కలదు. ఇచ్చట రాముడు తండ్రికి కొంత వొంగి నమస్కరిస్తూ ఉండగా సీత సాదా ముతక వస్త్రములను ధరించి క్రిందికి చూస్తూ ఉన్నది.

దశరథుడు తన శయ్యపై పవళించి ఉండగా, కైక అతడి పాదాల చెంత కూర్చుని ఉండగా అతడు కైకను శ్రీరాముని అడవులకు పంపవద్దు అని ప్రాధేయపడుతున్నట్లు ఉన్నది. కైక వెనక ఆమె చెలికత్తె మందర కలదు. ఈ మంచము దానిపైనే పరుపు దానిపై వేసిన దుప్పటి ఆనాటి రాజరికపు గొప్పతనాన్ని, అలవాట్లను గుర్తు చేస్తూ ఉంది. ఇచ్చట చిత్రకారుడు తన కుంచెను ఎన్నివిధాల వంచవచ్చు అన్ని విధాలుగా ఉపయోగించుకున్నాడు. మరో చిత్రంలో ఆంజనేయుడు లంకాదహనాన్ని కావిస్తున్నట్లు తన తోకకు నిప్పు అంటించుకున్నాడు. ఇచ్చటే సీతాదేవి అగ్నిగుండప్రవేశదృశ్యము కడు ఇంపైనది. ఇది చూపరులకు కంటనీరు పెట్టిస్తుంది. మరో చిత్రంలో శ్రీరామలక్ష్మణులు ప్రక్క ప్రక్కగా ఆయుధాలను ధరించి నిలుచుని ఉండగా

వారికి ఎదురుగా రావణ చక్రవర్తి సోదరుడు విభీషణుడు వారికి శరణాగతుడను అని నమస్కరిస్తూ ఉన్నాడు. శ్రీరాముడు అతిసుందరముగా చూపించగా విభీషణుడు నల్లగా అతి వినయంగా చిత్రీకరింపబడి ఉన్నాడు.

ఈ చిత్రాలలో ఆనాడు విజయనగరకాలము నాటి పాలకులు ప్రజలు, స్త్రీలు వాడిన దుస్తులు, రుమాళ్ళు, ఆభరణాలు, పైపూతలు, కండ్లకు లేపనము, మెరుగులు, సైనికుల ఆయుధాలు, యుద్ధాలలో ఉపయోగించే రథాలు, జంతువులు మొదలగునవి ఎంతో రమ్యంగా చూపించబడినవి. ఇటువంటి చిత్రలేఖనం దాదాపు అంతరించిపోతూ ఉండడం ప్రజల దురదృష్టము. ఈ చిత్రాలకు లేపాక్షి వీరభద్రాలయంలోని చిత్రాలకు కొంత పోలిక ఉన్నది. ఈ రెండు ఆలయాలలో చిత్రలేఖనము దాదాపు ఏకకాలంలో జరిగినది అనవచ్చు. అనగా అచ్యుతదేవరాయల కాలంలో ఈ ఆలయాలలో చిత్రలేఖనము జరిపినారు. ఈ మండపం మధ్యన అతి రమణీయంగా మలచిన అధఃపద్మము, పద్మంరేకుల పైన భూతగణాలు మలచబడినాయి.

విజయనగర శిల్పకళలో రాతిరథాల నిర్మాణం పేర్కొనతగినది. హంపి విఠ్ఠలస్వామి ఆలయమందలి రథంలాంటిదే సోంపాలెం రాతిరథం కూడా. ఇటువంటి రాతిరథమే తిరుమల ఆలయంలో దక్షిణ దిశలో ఒక మూల భూమిలో కూరుకొనిపోయి ఉండడం గమనించదగ్గ విషయము. ఆలయం గర్భగృహానికి ఎదురుగా మహామండపం ముందు ఉన్న ఈ రాతిరథం ఏకశిలానిర్మితము. రథం క్రిందివైపు నాలుగు చక్రాలు కలిగి రెండు గుర్రాలచేత లాగపడుతూ ఉన్నట్లు, ఈ మహాశిల్పరథాన్ని రూపొందించారు. అధిష్ఠానం గోడలపై సింహపు ప్రతిమలు రథం పైభాగాన విమానము దానిపైన శిఖరము, ఆపైన కలశము కలవు. రథం మొత్తము రమ్యమైన శిల్పాలతో అలంకరింపబడినది.

కళ్యాణమండపం ఆలయం ముందు మరో అద్భుత నిర్మాణము. కళ్యాణమండపం ఆలయం దక్షిణదిశలో 14 స్తంభాల సాయంతో

నిర్మితమైనది. మండపం మధ్యన నాలుగు స్తంభాల సాయంతో ఉన్న వివాహ వేదిక కలదు. ఈ స్తంభాలు వివిధ రకాల శిల్పాలతో ముఖ్యంగా నాట్యం చేయు స్త్రీలు, రౌతులు, అప్సరసలు, కిన్నెర కింపురుషుల శిల్పాలతో అలంకరించారు. కళ్యాణమంటపం పై భాగంలో క్రిందివైపు మొత్తము దేవతలు, శ్రీవారి కళ్యాణాన్ని చూచుటకు ఏతెంచి కళ్యాణదంపతులను ఆశీర్వదించుతున్నట్లు అపురూపమైన దేవతాశిల్పాలు కలవు . ఈ శిల్పాలని మాటలతో వర్ణింపలేము.

ఇచ్చుటే ఒక రాతి పలక ఏర్పాటు చేసినారు. దీనిపైన నాటి ఆ ప్రాంత అధికారి కూర్చుని న్యాయనిర్ణయం చేసేవాడట. ఆనాడు శిక్షలు కఠినముగా ఉండినట్లు తెలుస్తుంది. కొద్దిదూరంలో రెండు స్తంభాల సాయంతో ఏర్పాటు చేసిన ఉయ్యాల మండపము కలదు. ఉత్సవ కాలంలో స్వామిని, దేవిని ఈ ఉయ్యాలలో కూర్చుండబెట్టి ఊంజలసేవ జరిపేవారట. చెన్నకేశవస్వామి మందిరము కుడివైపున దేవి మందిరము కలదు. ఈమె పేరు లక్ష్మీదేవి. మందిరమందు దేవి ఆసీనముద్రలో కొలువై పూజలు అందుకుంటూ ఉన్నది. దేవి చతుర్భుజ, పై రెండు చేతులందు నీలోత్పలములు, క్రింది చేతులు అభయ, వరదముద్రలో ఉన్నాయి .దేవి సర్వాలంకారభూషిత. ఈ దేవి గర్భగృహద్వారంపై గజలక్ష్మిశిల్పము, మకరతోరణాలతో అలంకరింపబడినది.

## గొల్లవానిమండపము

ఆలయముఖద్వారాన్ని ఆనుకొని దక్షిణదిశలో ఆరు స్తంభాల సాయంతో నిర్మించిన గొల్లవాని మండపం కలదు. ఈ మండపం ముందున్న రెండు స్తంభాల పైన ఆలయనిర్మాతలు గొల్ల పెద్దప్ప నాయుడు, గొల్ల చిన్నప్ప నాయుడు శిల్పాలు కలవు. వీరి తలలపై ఆనాటి విజయనగర కాలపు తలపాగాలు కలవు. ఇవి ఆనాటి విజయనగర తలపాగాలను అనగా కుళాయిని (కొల్లాయి) పోలి ఉండటం గమనార్హం. వారి భుజాలపై తెలుగులో

వారి పేర్లు చెక్కబడి ఉన్నాయి. వీరు పొడవాటి అంగి (కమీజు) ధరించి వీరి నడుముపై నుండి పొడవాటి కత్తులు వేలాడుతూ ఉన్నాయి. వీరు ధరించిన అంగీ (కమీజు) ఈనాటి రాయలసీమవాసుల దుస్తులను పోలి ఉన్నాయి. ఈ కళ్యాణమండపం లోపల మరో నాలుగు స్తంభాల మండపము కలదు. ఈ మండపస్తంభాలు కూడా ఎంతో అందంగా శిల్పీకరించి ఉ న్నాయి.

ఈ చిత్రాలలో ఆనాటి రాయలసీమ వాసుల కట్టు, బొట్టు, దుస్తులు వారి ఆహార్యం కత్తులు, వాహనాలు, ఆయుధాలు చూడవచ్చు. అన్నిటికీ మించి ఆనాటి రాయలసీమవాసుల టోపీ లేదా తలపాగా రమ్యంగా ఉన్నది. వీటితోపాటు ఆనాడు రాయలసీమవాసుల రాయలసీమస్త్రీల వస్త్రాలంకరణ, వారు ధరించే ఆభరణాలు, వారు అలంకరించుకునే కేశాలు ముఖ్యంగా కాళ్లకు కడియాలు, మెట్టెలు, ముక్కుపుడకలు, కండ్లకు కాటుక, నుదుటిపై బొట్టు అన్నిటికీ మించి చీర పైకొంగు భుజాల మీదగా ముందుభాగాన్ని కప్పి ఉంచడాన్ని ఎంతో మనోహరంగా ఈ చిత్రాలలో చూపించారు. మండపస్తంభాలపైన గోడలపైన అనేక ఆయుధాలను ధరించి ఉన్న సైనికుల శిల్పాలు, వారి వాహనాలు కలవు.

చెన్నకేశవస్వామి ఆలయం ముందువైపు దాదాపు 86 అడుగుల ఎత్తు ఉన్న ధ్వజస్తంభము ఉన్నది. స్తంభం కిందభాగం 4 అడుగుల ఎత్తువరకు చతురస్రాకార రాతిపలకలు అలంకరించారు. వాటిపై ఒకవైపు అన్నమాచార్యులు, మరోవైపు తరిగొండ వెంగమాంబను పోలిన స్త్రీ శిల్పము కలదు. మరోవైపు గరుడాళ్వారు. ఇంకోవైపు తుంబురుడు కలరు. స్తంభము మొత్తము అపురూపమైన శిల్పాలతో అలంకరించారు. ఈ శిల్పాలు లతలు, పుష్పాలు, లతాంగులు ఒకటేమిటి వివరించటానికి వీలు కానటువంటి అలంకరణతో నిండి ఉంది. ఇటువంటి ధ్వజస్తంభము ఈ చుట్టుప్రక్కల ఎచ్చటను కానరాదు అంటే అతిశయోక్తి కాదు. ఈ ధ్వజస్తంభం భూమి

లోపల దాదాపు ముప్పై అడుగులు, పైభాగాన 60 అడుగులు ఎత్తు ఉన్నది.

ఈ ధ్వజస్తంభాన్ని ఎన్ని వైపరీత్యాలు సంభవించిన ఈ స్తంభము కదలక నిటారుగా నిలచి తన సోయగాన్ని ప్రజలకు చూపుతూ ఉన్నది. ఈ ధ్వజస్తంభాన్ని గురించి ఒక కథ ప్రచారంలో ఉంది. దీనిని పతివ్రత స్తంభము అంటారట. స్తంభాన్ని తయారు చేసిన తరువాత ఎవరు ఎంత ప్రయత్నించినా స్తంభాన్ని నిలబెట్టలేకపోయారట అప్పుడు పండితులు ఒక పతివ్రత వచ్చి ఈ స్తంభాన్ని లేపితే ఇది నిలబడుతుంది అని తెలుపగా, ఉద్యోగులు ఎవరా పతివ్రత అని ఆలోచిస్తూ ఉండగా ఒక గొల్లవాడు వచ్చి తన భార్య పతివ్రత. ఆమె వస్తే స్తంభము నిలబడుతుందని చెప్పి అధికారుల వద్దనుంచి తాంబూలం పుచ్చుకొని ఇంటికి వెళ్లి విషయాన్ని భార్యకు చెప్పగా ఆమె నేను పతివ్రతను కాను అన్నదట. ఆ గొల్లవాడు చింతాక్రాంతుడై ఉండగా అతడి చెల్లెల్లు వచ్చి అన్నా ఎందుకు దిగులుగా ఉన్నావు అనగా, అతడు జరిగిన విషయాన్ని చెల్లెకు చెప్పినాడు. ఆమె అన్నా నేను నీతో వచ్చేదా, నీతో వచ్చెదెను అని అన్నతో ఆలయానికి వెళ్ళింది. ప్రజలందరూ ఆమెతో నీవు స్తంభాన్ని పైకి లేపలేకపోయినచో నీ తల తెగి కిందపడిపోవును అనగా ఆమె అంగీకరించి ధ్వజస్తంభాన్ని చేతులతో పైకి లేపగా ఆ స్తంభము నిటారుగా నిలచినదట. అందుకే ఆ స్తంభాన్ని పతివ్రత స్తంభము అంటారట. ఇంత ఎత్తు ఉన్న అలంకృత స్తంభము ఈ ప్రాంతంలో మరెచ్చట కానరాదు.

**స్తంభము**

ఈ స్తంభవైవిధ్యాన్ని కన్నులతో చూడవలసినదేగాని మాటలతో వర్ణింపలేము. ఇటువంటి అపురూప కళాఖండం ఎందుచేతనో నిరాదరణకు గురై గోపురం కూడా కొంతవరకు శిథిలమైపోయినది. ఇంత ఎత్తుగా ఉన్న ధ్వజస్తంభం ఈ ప్రాంతంలో మరెక్కడా కానరాదు. స్తంభం పైభాగాన

ఇటుకలతో నిర్మించిన చిన్న గూడు కలదు. గూటిలో ఆనాడు అఖండ దీపము వెలిగించేవారట. ఆలయం ఉత్తరదిశలో నాలుగు స్తంభాల సాయంతో నిర్మించిన ఎత్తైన ఉయ్యాల మండపం కలదు. ఈ స్తంభాలు వైవిధ్యభరిత శిల్పాలతో అలంకరింపబడినాయి. మండపంపైని ఒక స్తంభంపై దీనిని నిర్మించిన వారి శాసనము ఈ క్రింది విధముగా ఉన్నది.

"శ్రీ హేవిళంబి సంవత్సర జ్యేష్ఠ శుద్ధ దశమి సోంపల్లి కృష్ణప్ప నాయనం గారి కుమార్తె ముత్యాలమ్మ వేయించిన ప్పట్టే" తరతరాలుగా ఎన్నో ఉత్సవాలు, పూజాదికాలు ఎడతెరపి లేకుండా జరుగుతూ ఉన్నట్లు తెలిపే ఎన్నో శాసనాలు ఆలయమందు లభ్యమవుతూ ఉన్నా, నేడు ఈ స్వామి ఆలయం అతిదయనీయ స్థితిలోనూ స్వామి నిరుపేదగా మిగిలిపోయారు. ఆ కాలమునాటి ఆలయశిల్పాన్ని, నాటి వైభవాన్ని తెలుసుకోవలెను అంటే ఈ ఆలయాన్ని తప్పనిసరిగా పరిశోధకులు, చరిత్రకారులు దర్శించి తీరవలసిందే.

* * *

# గుడిమల్లం - పరశురామేశ్వరాలయము

ఆంధ్రదేశమునందలి శైవాలయముల చరిత్రలోనే గాక యావద్భారతమునందు సైతము ప్రసిద్ధికెక్కిన ఆలయం గుడిమల్లం శివాలయం. ఇది చిత్తూరు జిల్లా తిరుపతి పట్టణానికి 14 మైళ్ళ దూరాన ఉన్నది. ఈ గ్రామము ప్రక్కనే పవిత్ర సువర్ణముఖీనది ప్రవహించుచున్నది. ఇచ్చట నెలకొన్న ఆలయాన్ని పరశురామేశ్వరాలయమని, ఈ ప్రాంతాన్ని పరశురామక్షేత్రమని పేర్కొంటారు. ఈ ఆలయనిర్మాణము పల్లవుల కాలమందు జరిగియుండవచ్చునని ఇచ్చటి శిల్పాలనుబట్టి లభ్యమగుచున్న శాసనాలను పరిశీలించి నిశ్చయింపబడినది.

## స్థలనామము

పూర్వము గుడిమల్లం క్షేత్రసమీపాన సువర్ణముఖీ నదిగట్టున నెలకొన్న ఒక కొలనులో రోజూ విచిత్రమైన పూలు పూచేవట! పరశురామేశ్వరుడనే ఒక శివభక్తుడు రోజూ కొలనులో స్నానంచేసి అచ్చటి పూలను తీసికొనివెళ్ళి



శివలింగమును పూజించెడివాడట. ఒక రోజు ఒక రాక్షసుడు ఆ కొలను వద్దకు వచ్చి అచ్చట పూచిన వింత పుష్పములనుచూచి, వాటినన్నింటిని సేకరించి వెళ్ళి ఈశ్వరుని కర్పించి నాడు. పరశురాముడు పూజా సమయానికి కొలనువద్ద కేతెంచి అందు పుష్పములు కానరాకపోవుటచే దుఃఖితుడై పూలను తస్కరించినవాని కోసం వేచియుండగా మరుసటిరోజు కూడ ఆ రాక్షసుడు ఆ పూవులను సేకరించుటకు రాగా, వారిరువురు వాదులాడు

కొని తుదకు ముష్టియుద్ధానికి పూనుకున్నారు. వారిరువురు ఎంతోకాలము పోరాడుకోగా తుదకు పరశురాముడు విజృంభించి రాక్షసుని మెడపైకెక్కి వానిని అణగద్రొక్కగా, శివుడు కరుణించి ప్రత్యక్షమై భక్తులను తనలో లీనముచేసికొన్నాడు. వారు పోరాడిన ప్రదేశములో పెద్ద పల్ల మేర్పడినది. ఆ పల్లములో గుడి కట్టబడినది కావున దానికి "గుడిమల్లం" అనేపేరు వచ్చినది.

పల్లవరాజులచే కట్టబడిన గుడి కాబట్టి దీనికి 'గుడిపల్లం' అనిపేరు వచ్చియుండవచ్చునని కొంతమంది చరిత్రకారులు భావన.

ఆలయంలో లభ్యమైన శాసనములందు కాని, పురాతన రికార్డులందు కాని ఎచ్చటను 'గుడిమల్లం' లేక 'గుడిపల్లం' అనే పేరు కానరాదు. శాసనాల్లో ఈ గ్రామాన్ని 'విప్పురంబేడు' లేక 'తిరువిప్పురంబేడు' అని వ్యవహరించినారు. 'విప్పురంబేడు' అనగా బ్రాహ్మణనివాసం గల అగ్రహారం. కాబట్టి పల్లవ రాజుల కాలంలో ఈ గ్రామము అగ్రహారంగా చెలామణి అయ్యెడిది. పరశురామాలయమందలి మూలవిరాట్టు (శివలింగము) ను నాటి నారాయణవనరాజ్యమును పాలించిన ఆకాశరాజు తొండమానుడు ప్రతిష్ఠించినట్లు తెలియుచున్నది. ఇతడు మొదట శాతవాహన చక్రవర్తుల దళాధిపతి. ఆ ఆలయమందలి మూలవిరాట్టును ప్రతిష్ఠించిన కాలములోనే తిరుమలలో వేంకటేశ్వరస్వామి విగ్రహం పుట్టనుండి లభించినది. ఆ ఆకాశరాజు కుమార్తె శ్రీనివాసుని పట్టపుదేవి పద్మావతి. తొండమానుని తర్వాత పల్లవులు, బాణులు, చోళులు, విజయనగరరాజులు ఆలయానికి ఎంతో సేవ చేసినట్లు తెలియుచున్నది. ముఖ్యముగా చోళుల కాలంలో ఆలయనిర్మాణము కొనసాగినది. ఈ ఆలయప్రాంగణమునందు పల్లవ, బాణ, యాదవ, చోళ, విజయనగర రాజులకు సంబంధించిన ఇరువది ఆరు శాసనములున్నవి. ఇచ్చట ఆ యా రాజులు ఆ యా కాలములలో ఆలయానికి నిత్య ధూప, దీప, నైవేద్యములకై సమర్పించిన భూ, గో,

సువర్ణదానములను తెలియజేస్తున్నాయి. ఈ ఆలయమందలి అతి పురాతన శాసనము క్రీ.శ. 802వ సం॥ నాటి పల్లవరాజులకు చెందినది.

గుడిమల్లమందు శివుడు సర్వసాధారణంగా కనిపించే లింగ రూపమునగాక ఊర్ధ్వరేతమైన పురుషలింగమువలె ప్రతిష్ఠింపబడియున్నాడు. ఈ లింగము ముందుభాగమున శివుని రూపం చెక్కబడినది. పరమేశ్వరుని కుడిచేతియందు జింక, ఎడమభుజం పైన గండ్రగొడ్డలి, ఎడమచేతిలో నీటికుండ ఉన్నట్లు చూపబడినవి. ఇతని రెండు కండ్లు అతడి నాసికాగ్రములను చూచుచున్నట్లు శిల్పించుటచే ఇచ్చటి శివుణ్ణి భిక్షాటన మూర్తిగాను, యోగదక్షిణామూర్తిగానో లేక విరూపాక్షుడుగానో పోల్చవచ్చును. చెవులకు పెద్ద కుండలాలు, మెడలో హారాలు, ముంజేతికి కడియాలతో శివుని సర్వభూషణాలంకృతునిగా తీర్చిదిద్దినారు. మొలకు చక్కటి ధోవతి చుట్టినట్లు చూపించినను, పురుష చిహ్నమైన లింగం వెలుపలికి కానవచ్చుచున్నది. అందుచే యిచ్చటి లింగమందలి శివుని రుద్రుడని లేక 'లింగి' అని వ్యవహరించవచ్చు. పైగా యిచ్చటి స్వామి చలనమూర్తియై రాక్షసుని భుజాలపై నిలబడియున్నాడు. శివుని తలపై లేత తాటి ఆకుతోనో లేదా మరేదైనా వస్తువుతోనో తయారుచేసినట్లున్న తలపాగా (కిరీటము) యున్నది. దీనినిబట్టి స్వామి దక్షిణామూర్తిగానో లేక కపర్దిగానో ఊహించవచ్చును. శిల్పమందు దేవునికి యజ్ఞోపవీతము చూపలేదు కావున, ఋగ్వేదకాలమునాటి బ్రాహ్మణునికి యజ్ఞోపవీతము లేదని తెలియుచున్నది. ఇన్ని విచిత్రమూర్తులు ఒక్క శిల్పంలో చూపుట ప్రపంచమందెచ్చటను కానరాదు.

ప్రముఖ చరిత్రకారుడైన జితేంద్రనాథ్ బెనర్జీ, ఆనంద కుమారస్వామి, కీ॥శే॥ మారేమండ రామారావు, డా॥ ఆర్.సుబ్రమణ్యం, గోపీనాథరావు, గుడిమల్లం శివలింగాన్ని శిల్పచరిత్రలోనే తలమానికముగా పేర్కొన్నారు. ప్రముఖ చరిత్రకారుడైన గోపీనాథరావు ఈ శిల్పమందు 'మంగోలాయిడ్'

లక్షణాలు మూర్తీభవించియున్నాయన్నారు. ఇటువంటి విదేశ పురుష లక్షణములు కల్గిన విగ్రహము భారతదేశములో సారనాథ్‌లో తప్ప మరెచ్చటను కానరాదు. అందుచేత ఈ ఆలయమందలి శివలింగాన్ని గురించి ఈనాటికీ చరిత్రకారులందు ఏకాభిప్రాయములేదు.

**ఆలయనిర్మాణము**

గుడిమల్లమందలి శివాలయనిర్మాణము విచిత్రముగానున్నది. సర్వసాధారణముగా దేవాలయములలో మూలవిరాట్టునకు అభిముఖముగా, సింహద్వారము, ధ్వజస్తంభాలు నిర్మితమై ఉండేవి. ఇది ఆగమశాస్త్ర నియమము. కాని ఈ ఆలయమందు ఇందుకు వ్యతిరేకముగా పశ్చిమాన సింహద్వారము, మూలవిరాట్టున కభిముఖముగా ధ్వజస్తంభము, బలిపీఠము ప్రతిష్ఠింపబడియున్నవి.

పరశురామేశ్వరాలయము చుట్టూ యిటుకలతో నిర్మింపబడిన ప్రహరీ గోడయున్నది. ఆలయప్రవేశమునకు దక్షిణపార్శ్వమున ఏర్పాటు కావించిన ముఖద్వారముపై గోపురమున్నది. ఈ గోపురము అధిష్ఠానం ఎటువంటి అలంకరణలేని సాధారణ రాతిదిమ్మలతో నిర్మింపబడినది. లోపలివైపు గోడలో ఒక రాతిపై మాత్రము నృత్యగణపతి శిల్పమున్నది. ఆలయము లోపల ఉత్తరపార్శ్వమున చిన్నగుడిలో దేవీసహిత కుమారస్వామి విగ్రహములు



చోటుచేసుకొన్నవి. ఈ గుడిప్రక్కనే మరొక దానియందు నాలుగు చేతులు కల్గిన దుర్గప్రతిమ యున్నది.

ప్రధానాలయమందు గర్భగృహము, అంతరాళము, ప్రదక్షిణాపథము, ముఖమండపములున్నవి. గర్భాలయమందలి గోడలందు మకరతోరణము బ్రహ్మశిల్పములు చెక్కబడినవి. అంతరాళము యొక్క గోడలందు దుర్గ, వినాయక, భూతమాల, మకరతోరణ శిల్పములున్నవి. గర్భగృహము 12 అ. పొడవు, 10 అ. వెడల్పుకల్గి మధ్యన 5 అ. ఎత్తు, 2 అడుగుల మందము కల్గిన శివలింగము ప్రతిష్ఠింపబడియున్నది. గర్భాలయము పైభాగమున గజపృష్ఠాకార పద్ధతిలో గూడుబండి ఆకారము పోలిన విమానము, మూడు రాతికలశములున్నవి. అంతరాళము ముంగిటనున్న ప్రదక్షిణాపథము 2 అ. వెడల్పున చోళుల కాలమునాటి స్తంభాల సహాయంతో నిర్మింపబడియున్నది. ప్రదక్షిణాపథము ముందుభాగమున నాలుగు వరుసలలో నాలుగేసి స్తంభాలు సహాయముతో మొత్తము 16 స్తంభాలతో నిర్మించిన ముఖమండపమున్నది. దీనిచుట్టూ గోడ కట్టబడి దక్షిణవైపున ద్వారము అమర్చబడియున్నది. ఈ మండపములోనికి గాలి, వెలుతురు ప్రవేశించుటకు ద్వారముచెంత రాతితో మలచబడిన కిటికి అమర్చబడియున్నది.

ఆలయప్రాంగణమందు శంఖ చక్రములను ధరించిన దుర్గ, మూడు శిరస్సులను కల్గి ఒక చేతిలో అక్షమాలను, మరొకచేతిలో కమండలమును, ఒక చేతిని నడుముపైన, ఇంకొక చేతిని అభయముద్రలోనుంచిన బ్రహ్మ, శంఖచక్రములను ధరించిన విష్ణుమూర్తి, అపస్మారమూర్తిపై నిలబడియున్న దక్షిణామూర్తి, దేవీసహిత వాహనాధిపతియైన కుమారస్వామి, మకర కుండలములను ధరించి చేతులందు కలువపూవులను ధరించిన సూర్యభగవానుడు, అపస్మార పురుషునిపై కాలుమోపి నృత్యమాడుతున్న నటరాజ, సోమస్కంద శిల్పములున్నవి.

ఈ ఆలయ నిర్మాణమును నిశితముగా పరీక్షించినచో అందలి శిల్ప రీతులనుబట్టి ఆలయనిర్మాణం అనేక దశలలో జరిగినదని తోచును. ఆలయ ప్రాకారమందు తొలి చోళుల శిల్పాలుండుటచేత ఇది వారి కాలమున నిర్మితమైనదని చెప్పవచ్చును. అలాగే గర్భాలయం పల్లవుల కాలములోను, ఆలయమండపాలు విజయనగరరాజుల కాలంలో నిర్మితమైనట్లు అచ్చట కన్పడుచున్న శిల్పశైలినిబట్టి చెప్పవచ్చును.

భారత పురావస్తు శాఖవారు ఇటీవల జరిపిన త్రవ్వకాలలో ఆలయ గర్భగృహమందు శాతవాహనుల కాలంనాటి పెద్దపెద్ద యిటుకలు, మృణ్మయ పాత్రలు బయటపడినవి. ఈ త్రవ్వకాలయందు వెలుగులోనికి వచ్చిన అస్తికలనుబట్టి మొదట ఈ లింగము నాలుగు రోడ్లకూడలిలో ప్రతిష్ఠింపబడి జంతు, నరబలులను స్వీకరించెడిదని తెలియుచున్నది.

పరమ పవిత్రమయిన శ్రీకాళహస్తి వాయులింగానికి ఈ పరశురామేశ్వరలింగము మూల విరాట్టని పరిశోధకుల అభిప్రాయము. ఇంకొందరి చరిత్రకారుల ఉద్దేశములో గర్భాలయము పైకప్పు గూడుబండి ఆకారంలో వుండి లింగము స్తూపమెత్తు ఉండుటచే ఇది మొదటి బౌద్ధమత స్తూపమని బౌద్ధమతపతనంతో శైవులీ స్తూపాన్ని శివలింగముగా మలచి యుండవచ్చునని అభిప్రాయపడుచున్నారు. మరికొందరు ఒకనాడీ ప్రదేశము జైనమతానికి కేంద్రముగా నుండియుండుటచే ఈ శివలింగము మొదట జైనాలయముగా నుండి కాలగమనంలో శివాలయరూపమును ధరించినదనుచున్నారు.

ఏది ఏమైనా చరిత్ర ప్రసిద్ధిచెందిన ఈ అద్భుత శివాలయాన్ని ఇచ్చటి ప్రకృతిశోభను ప్రతి భారతీయుడు చూసి ఆనందించవలసియున్నది.

* * *

# కాణిపాకం - వరసిద్ధి వినాయక ఆలయం



యావద్భారతదేశమందే అత్యంత మాహాత్మ్యం గల ఆలయంగా చిత్తూరు పట్టణానికి 16 మైళ్ళ దూరంలో కాణిపాకం గ్రామంలో ఉన్న వరసిద్ధి వినాయక ఆలయం పేరుపొందింది. ఈ స్వామి పుట్టుకను గురించి ఈ క్రింది కథనం ప్రచారమందున్నది. దాదాపు 500 సంవత్సరాల పూర్వం కాణిపాకం గ్రామంలో ముగ్గురు సోదరులుండేవారు. వారిలో ఒకడు గ్రుడ్డి, రెండవ వాడు చెవిటి, మూడవవాడు మూగి. వారికి ఒక 'కాణి' మడి (భూమి) ఉండేది. వారు ఆ భూమిలో చిన్న బావి త్రవ్వి, ఏతం త్రొక్కుతూ భూమిని సాగుచేసుకొనేవారు. కాని బావి చిన్నదిగా ఉండడంతో ఏతానికి కట్టిన మట్టిబాన రోజూ పగిలిపోయేది.

ఒకమారు కరువు వచ్చింది. బానకు నీళ్ళు అందక బావిని వెడల్పుగా ఇంకా లోతుగా త్రవ్వాలని అన్నదమ్ములు పూనుకొని గడ్డపారతో బావిని త్రవ్వసాగారు. ఉన్నట్లుండి బాన ఒక రాతికి తగిలి చివ్వున రక్తం పైకి చిమ్మింది. ఆ రక్తం తగిలిన వెంటనే గుడ్డివాడు పరిసరాలను చూడసాగాడు; మూగవాడు మాట్లాడగలిగాడు; చెవిటివాడు వినగలిగాడు. ఈ వార్త దావానలంలా గ్రామం చుట్టూ ప్రాకింది. తండోపతండాలుగా జనం వచ్చి, బావిలోని రాతిని పరిశీలించగా, అది మామూలు రాయికాదు, సాక్షాత్తు వినాయక విగ్రహం. వెంటనే భక్తులు ఆ బావి చుట్టు ఆలయం నిర్మించి, స్వామివారికి వరసిద్ధి వినాయకుడని పేరు పెట్టినారు.

ఈనాటికి స్వామి మహిమ కలవాడని, భక్తులపాలిట పెన్నిధిగా, వరసిద్ధి వినాయకుడుగా పేరుపొందుటేగాక, తప్పులు చేసి స్వామి ముంగిట

అబద్ధము చెబితే, స్వామి వారిని కఠినంగా శిక్షిస్తున్నాడు. ఈ విషయాన్ని నిర్ధారించుటకు తరచూ జరిగే ఉదంతాలు కోకొల్లలు. ఉదా॥ ఇటీవల కాణిపాకం గ్రామానికి తనిఖీకి వచ్చిన ఒక రెవిన్యూ అధికారి, స్వామిగురించి పూజారులు చెప్పేది నమ్మక, ఒక ఇనుపకమ్మిని తెచ్చి అర్చకుణ్ణి స్వామి ఉంటున్నచోట ఉండే బావి ఎంత లోతున్నదో చూడాలని కమ్మిని బావిలోనికి దించమన్నాడట! ఎంత దించినా కమ్మి లోపలికి పోతూనే వుందట! లోతు తెలియలేదట. ఉన్నట్లుండి ఆ అధికారి 'ఇంకా వదులు ఇంకా వదులు', అంటూ మూర్ఛ వచ్చినట్లు కాళ్ళు చేతులను కొట్టుకుంటూ పడిపోయినాడట! వెంటనే అతడిని చిత్తూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించినారు. రాత్రంతా ఆ ఉద్యోగి ఒక ఏనుగు తరుముతుంది. కట్టేయండి. నన్ను చంపేస్తుంది' అని అరుస్తూ ఉన్నాడట! అతడి బంధువులు తప్పు జరిగిపోయింది మన్నించమని స్వామిని వేడుకొనగ అధికారి ఆరోగ్యము మరుసటి రోజు నెమ్మదించింది. అతడు కాణిపాకం వెళ్ళి తను చేసిన తప్పు మన్నించమని వేడుకొనగా పూర్తి ఆరోగ్యవంతుడైనాడట!

అలాగే ఇటీవల ఇద్దరు స్త్రీలు ఒక నగ విషయమై ఆలయానికి రాగా, ఆలయపూజారి ఒక స్త్రీకి సహాయము చేయనెంచి ఆమెచేత అబద్దపుమాట పలికించగా, అర్చకుడు వసంతరాయ గురుక్కుళకు కండ్లుపోయి గుడ్డివాడైనాడు. అయినా తాను చేసిన పాపానికి తగిన శిక్ష పడిందని ఆలయంలో ఉంటూ, స్వామిని సేవిస్తూ తనకు పాపవిముక్తి కలిగించమని వేడుకుంటూ వుండగా, కొంతకాలానికి స్వామి కలలో కనబడి అర్చకుడి కండ్లను తన హస్తాలతో తన చేతిలోని కమండలమందలి నీటితో తుడిచి, ఇకమీదట జాగ్రత్తగా ఉండమంటూ హెచ్చరించినాడట! మరుసటి రోజు యథాప్రకారం అర్చకుడికి చూపు వచ్చింది. ఇలాంటి నిదర్శనాలు కోకొల్లలు.

కోర్టులో సాక్ష్యమిచ్చే సమయంలో 'భగవంతుని సాక్షిగా అంతా నిజమే చెబుతాను, అబద్ధం చెప్పను' అనే దానికి బదులుగా 'కాణిపాకం వరసిద్ధి

వినాయకుని సాక్షిగా అంతా నిజమే చెబుతా, అబద్ధం చెప్పను'. అంటూ చిత్తూరు కోర్టులో వాది ప్రతివాదులు తరచూ చెబుతూంటారు. రోగగ్రస్తులు, దొంగతనాలల్లో వస్తువులు పోగొట్టుకొన్నవారు, సంతానహీనులు, అపార్థాలతో, అనుమానాలతో కుంగిపోయే దంపతులు ఈ స్వామిని సేవించి ప్రమాణాలు చేసి, తమతమ కోర్కెలను తీర్చుకుంటూ కుటుంబాలను సరిదిద్దుకొంటూ వుంటారు. కొంతమంది స్వామివారి ఎదుట అబద్ధం పలికి ఎన్నో అవస్థలకు గురౌతూ వుంటారు. కొత్తగా వాహనాలను కొన్నవారు ఇచటికి తీసుకొని వచ్చి పూజించి ఆ తరువాత ఉపయోగిస్తారు.

ఆలయంలోని గర్భగృహమందు స్వామిచుట్టూ భూమి మట్టానికి నీరు ఎప్పుడూ వుంటుంది. అర్చకులు ఈ నీటినే భక్తులకు తీర్థంగా ప్రసాదిస్తారు. ఈ బావిలో నీరు భూమి మట్టానికి సమంగా వుండగా, ప్రక్కనే 10 అడుగుల దూరంలో ఉండే 30 అడుగుల లోతుబావిలో నీరు లేకపోవడంతో ఆ బావిలో దాదాపు 100 అ॥ల లోతు బోర్లువేసి నీరుపైకి తీయడం స్వామి మహిమకాక మరేమిటి?

**ఆలయనిర్మాణం**



ఆలయమందు గర్భగృహం, అంతరాళం, ముఖమండపం, మహా మండపాలున్నాయి. గర్భగృహమందు మధ్యన కన్నుల పండుగ చేసే అపురూపమైన ఆసీన వరసిద్ధి వినాయక, స్వయంభూ స్వామి విగ్రహం నెలకొని ఉంది. స్వామిచుట్టూ నీటిబుగ్గ ఉంది. గర్భగృహంపై ద్రవిడ శిఖరము, దాని పైన కలశము ఉన్నాయి. గర్భాలయం ముంగిట సన్నటి అంతరాళం ఉన్నది. భక్తులు ఇచ్చటివరకు వెళ్ళి స్వామిని సేవిస్తారు. అంతరాళం ముంగిట విశాలమైన ముఖమండపం కలదు. ఈ మండపం 4 స్తంభాల సహాయంతో నిర్మితమైంది. స్తంభాలపైన వినాయక, మహేశ్వర శిల్పాలున్నాయి. ముఖమండపం ప్రవేశానికి ఒకవైపు వినాయక, మరొకవైపు కుమారస్వామి శిల్పాలున్నాయి. వినాయక విగ్రహం ముంగిట చిన్న గదిని నిర్మించి, అందులో కొన్ని పంచలోహ విగ్రహాలు ప్రతిష్ఠించారు. వీటిని మంగమ్మ అనే భక్తురాలు సమర్పించింది.

ముఖమండపం వెలుపల మహామండపం, చిన్నగోపురం ఉంది. దానికింద స్వామి వాహనం మూషికరాజు ఉన్నాడు. ఇతడి ప్రక్కనే నంది శిల్పమున్నది. ఈ మండప మందు ఎత్తైన రెండు ధ్వజస్తంభాలున్నాయి. వాటిలో ఒకటి లోహపు తొడుగు గలది. రెండోది రాతిస్తంభము. ఆలయం చుట్టూ ప్రహరీ వుంది. తూర్పు దిక్కుగా వున్న ప్రవేశద్వారం పైన 3 అంతస్తుల రాజగోపురం వుంది. ఆలయంలోపల పడమటి దిశలో ఒక ముష్టి వృక్షము క్రింద సంతాననాగ ప్రతిమలు ప్రతిష్ఠించారు. గోపురానికి ఉత్తరపు దిక్కున నవగ్రహాలు ఇటీవల కాలంలో ప్రతిష్ఠించారు. ఆలయానికి వెలుపల, రాజగోపురానికి ముంగిట 50 అడుగుల దూరంలో కోనేరు కలదు. భక్తులు ఆలయంలోపలికి వెళ్ళేముందు ఈ పుష్కరిణిలోని నీటితో కాళ్ళు, చేతులు శుభ్రం చేసుకొని, నెత్తిపై నీటిని చల్లుకొని ఆలయప్రవేశం చేస్తారు.

కాణిపాకం గ్రామంలో వరసిద్ధివినాయక ఆలయంతోబాటు అతి ప్రాచీనమైన వరదరాజస్వామి మరియు మణికంఠేశ్వర ఆలయాలున్నాయి.

* * *

# సురుటుపల్లి - నీలకంఠేశ్వరాలయం

సురుటుపల్లి చిత్తూరు జిల్లా సత్యవేడు తాలూకా తిరుపతి – మద్రాసు రహదారిలో మద్రాసు రాష్ట్ర సరిహద్దు గ్రామమైన ఊత్తుకోటకు ½ కిలోమీటరు దూరంలో ఉంది. ఈ గ్రామంలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన శివాలయం నీలకంఠేశ్వర లేక "పళ్లికొండదేవర్' పేరున వెలసి ఉంది. ఈ ఆలయంలో పరమశివుడు మానవాకృతిలో శయనించి ఉండడం ప్రత్యేకత. శివుడు మానవాకృతిలో ఈ ప్రదేశమందు తప్ప, భారతదేశంలో మరెచ్చటా పూజలందుకోవడం కానరాదు. ఈ స్వామిని 'శయన శివుడు' అనికూడా వ్యవహరిస్తారు.

## పూర్వగాథ

శివపురాణం, స్కందపురాణాలీ క్షేత్రమహిమను గురించి ఈ క్రింది విధంగా తెలుపుతూ ఉన్నాయి. పూర్వం దేవ, దానవులు అమృతంకోసం క్షీరసముద్రాన్ని మథించగా హాలాహలం పుట్టిందట! అది సేవిస్తే దేవతలందరూ హరించుకుపోతారని శంకరుడా విషాన్ని మ్రింగగా, అతడికి మైకం కమ్మి తప్పటడుగులు వేస్తూ ఉండడం, పార్వతీదేవి గ్రహించి విషం



స్వామి కడుపులోనికి వెళ్ళకుండా అతడి కంఠాన్ని చేతులతో బిగపట్టిందట! విషం కంఠమందే నిలిచిపోయి, కంఠం నీలంగా మారిపోయింది. స్పృహ తప్పిన స్వామి, దేవితొడపై పవళించినాడు. మహేశ్వరుడు స్పృహ తప్పినాడని, సకలదేవతలూ, దిక్పాలకులూ, ఋషులూ స్వామిచుట్టూ ఆందోళనగా చేరి, శుశ్రూష చేస్తూ స్వామిని సేవించగా, అతడు మెల్లగా తేరుకున్నాడు. విషాన్ని కంఠమందు బంధించినందువల్ల స్వామిని నీలకంఠుడన్నారు. స్వామి స్పృహతప్పి వుండిన ప్రదేశానికి సురులు (దేవతలు) అందరూ రావడం చేత, ఈ స్థలాన్ని సురులపల్లి అన్నారు. కాలగమనంలో సురులపల్లి "సురుటుపల్లి'గా రూపుదిద్దుకొంది.

**ఆలయవర్ణన**

నీలకంఠేశ్వరాలయం మూడు గుళ్ళ సముదాయం. ఒక భాగంలో వాల్మీకేశ్వర, మరకతాంబిక ఆలయాలు, రెండోభాగంలో నీలకంఠేశ్వరాలయం ఉన్నాయి. ఈ మూడు ఆలయాలకు చుట్టూ ఎత్తైన ప్రహరీ నిర్మింపబడింది. ప్రహరీ తూర్పుభాగంలో ఆలయప్రవేశద్వారం, ద్వారం పైన నాలుగు అంతస్థుల రాజగోపురం ఉంది. రాజగోపురానికి ఎదురుగా దేవి



మరకతాంబిక ఆలయం ఉంది. ఆలయంలో మహామండపం, ముఖమండపం, అంతరాళాలున్నాయి. గర్భగృహమందు దాదాపు నాలుగు అడుగుల ఎత్తున దేవి "మరకతాంబికై" పేరున వెలసి ఉంది. గర్భగృహానికి ఇరువైపులా సుబ్రహ్మణ్య, గణేశ శిల్పాలున్నాయి. ముఖమండపస్తంభాలపైన వివిధాలైన శిల్పాలున్నాయి. మహామండపం లోపలి ద్వారాని కిరువైపులా దేవీసహిత కుమారస్వామి, గణేశులున్నారు. ముఖమండపం దక్షిణదిశలో అప్పర్, సంబంధర్, సుందర్, వాల్మీకి, పరాశరేశ్వర, జ్యేష్ఠాదేవి విగ్రహాలు ప్రతిష్ఠింపబడినాయి.

మరకతాంబికై ఆలయం ఉత్తరదిశలో వాల్మీకేశ్వరాలయం ఉంది. ఆలయం ముఖమండపం, గర్భగృహాల సముదాయం. గర్భాలయమందు వాల్మీకేశ్వరుని పేర అపూర్వమైన పంచ ముఖ స్వయంభూస్వామి లింగమున్నది. ఈ లింగం యొక్క ప్రత్యేకత చూచి ఆనందించవలసిందే కాని మాటలలో వర్ణించలేము. ముఖమండపమందు లవ, కుశుల పాదముద్రలుగల శిలాఫలకం ఉంది. ఆ చిన్నారులీ ప్రదేశమందు వాల్మీకిమహర్షి ఆశ్రమంలో పెరిగినారట! వాల్మీకేశ్వరస్వామికి ఎదురుగా మండపమందు అపరరామేశ్వరలింగముపేర అపూర్వమైన శివలింగ మున్నది. ఈ లింగాన్ని దర్శించినచో రామేశ్వరంలో శ్రీరామచంద్రుని చేత ప్రతిష్ఠించబడిన లింగాన్ని దర్శిస్తే కలిగే పుణ్యం ప్రాప్తిస్తుందట!

ఇచట మండపాలలోని స్తంభాలు చోళశైలిలోఉన్నాయి. పంచముఖేశ్వర స్వామి గర్భగృహం అధిష్ఠానపు గోడలయందు ఉత్తరాన చతుర్ముఖ బ్రహ్మ అంజలిని ఘటిస్తున్నాడు. ఇటువంటి శిల్పం చాలా అరుదు. దక్షిణంవైపు మహోన్నతమైన దక్షిణామూర్తిశిల్పం ఉంది. కంచి కామకోటి పీఠాధిపతులే ఇటువంటి శిల్పం దక్షిణభారతదేశంలో అరుదుగా కనిపిస్తుందని అన్నారట! ఈ శిల్పానికి ప్రక్కనే ముద్దులొలికే బాలవినాయకుని ప్రతిమ కలదు. పడమర లింగోద్భవమూర్తి ఉన్నాడు. ఈ రెండు ఆలయాలకు కలిపి

ఒకే ప్రదక్షిణాపథం ఉంది. ఇచట దక్షిణపార్శ్వాన త్రిపాద బ్రహ్మ, కపాలధారియైన విష్ణు, చతుర్ముఖ శివుల శిల్పాలు ప్రతిష్ఠించబడినాయి.

ఉత్తరంవైపు ఒక మూల చిన్న బిలం ఉంది. ఇది శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయంలోనికి వెళ్తుందట! ఈ ప్రదేశమందే మతంగ మహర్షి తపస్సు చేయగా, యజ్ఞకుండం నుండి ఒక జలపాతం పుట్టి, అరుణానదిలో కలిసిందట! ఇప్పటికీ అరుణానదిలో నీరు ప్రవహిస్తే, యజ్ఞకుండంగా చెప్పబడే ప్రదేశమందు నీరు ఆలయం భూమట్టానికి వస్తాయి. ఈ యజ్ఞకుండం ప్రక్కనే సప్త మాతృకలు, శైవనాయనార్ల శిల్పాలున్నాయి. ఈ రెండు ఆలయాలకు కలిపి ముందుభాగాన నందిమండపం, ధ్వజస్తంభం, బలిపీఠాలు కలవు. నందిమండపం ముందు గంభీరమైన నందీశ్వరుడున్నాడు.

## నీలకంఠేశ్వరాలయం

ఈ ఆలయం అతిప్రాచీనమైనదగుటచేత ఎన్నోమార్లు శిథిలమై పోయినా ఎప్పటికప్పుడు జీర్ణోద్ధరణ గావింపబడినట్లు తెలుస్తుంది. ఆలయమందు గర్భగృహం, నూతనంగా నిర్మించిన ముఖమండపం ఉన్నాయి. గర్భగృహమందు 12 అడుగుల పొడవు, 4½ వెడల్పుతో నయనానందకరమైన పరమేశ్వరుడు అనంతశాయిపద్ధతిన గంభీరముద్రలో పవళించి ఉన్నాడు. స్వామిశిరస్సు సర్వమంగళ పేరున వెలసిన దేవి తొడపై ఉంది. స్వామి మోము మైకం కప్పినట్లు, కండ్లు అరమోడ్పులై యున్నాయి. స్వామి చతుర్భుజుడు. దేవి వదనము విచారగ్రస్తమై ఉంది. ఈమె కూడా నాలుగు చేతులను కలిగి ఉంది. గర్భాలయం లోపలివైపు గోడలు విష్ణువు, బ్రహ్మ, దిక్పాలక, కాలభైరవ, మహర్షుల వర్ణచిత్రాలతో నిండి ఉన్నాయి. వారందరూ స్వామివైపు కలవరపాటుతో తదేకదృష్టితో చూస్తూ ఉన్నారు. నీలకంఠేశ్వరస్వామి విగ్రహం మామూలు మట్టితో తయారుచేసి, నల్లటి పైపూత పూసి ప్రతిష్ఠింపబడింది. శతాబ్దాలు గడచినా విగ్రహంలో ఎటువంటి

మార్పు ఏర్పడకపోవడం ఆశ్చర్యకరమైన విషయం. గర్భాలయం పైకప్పు కొయ్య దొంతర్లుతో నిర్మింపబడింది. గర్భాలయంపైన ద్వితలవిమానం, కలశం ఉన్నాయి. ప్రస్తుతం వేయబడిన రంగులను బట్టి ఈ విమానం కొద్దికాలం కిందటే జీర్ణోద్ధరణ కావించబడినట్లు తెలుస్తూ ఉంది.

పురాణాల ప్రకారం, సముద్రమథనానంతరం పరమేశ్వరుడు హాలాహలాన్ని స్వీకరించి, మైమరచిన తరువాత సురుటుపల్లిలోనే మానవాకృతిని శాశ్వతంగా విడనాడి, సమీపంలోని గుడిమల్లంలో లింగాకృతిని ధరించాడట! అందుచేత ప్రపంచమందే సురుటుపల్లిలోని నీలకంఠేశ్వర స్వామి, గుడిమల్లంలోని పరశురామేశ్వరలింగం అతిప్రాచీనవైనవంటున్నారు. అంతేగాక అత్యంత ప్రాచీనవైన శ్రీకాళహస్తిలోని వాయులింగానికి, గుడిమల్లంలోని పరశురామేశ్వర లింగానికి, సురుటుపల్లిలోని నీలకంఠేశ్వరునికి అవినాభావ సంబంధమున్నట్లు చరిత్రకారుల భావన.

ఈ ఆలయం ప్రస్తుతం పురావస్తుశాఖవారి అధీనంలో ఉంది. ఆలయంలోని మండపాలు, ప్రహరి కూలిపోవడానికి ఇప్పుడా, రేపా అని కాచుకొని ఉన్నట్లున్నాయి. ఆలయ మహాద్వారం ఎప్పుడూ తెరచి ఉంచుటచేత అపూర్వ కళాఖండాలకు భద్రత లేదు. ఆలయ పూజావిధులకు అర్చకులను ప్రభుత్వం నియమించినా, స్వామికి నైవేద్యం, కనీసం హారతి పట్టేందుకు వారివద్ద కర్పూరం కూడా అప్పుడప్పుడూ కరువై పోతూంటుందంటే ఆశ్చర్యపడవలసిన పనిలేదు.

* * *

# ఒంటిమిట్ట - కోదండరామాలయము



ఒంటిమిట్ట (సిద్ధవటం తాలూకా) రాజంపేట, కడప మార్గమున కడపకు 15 మైళ్ళ దూరమున ఉన్నది. అచ్చట వేంచేసియున్న రఘునాయకస్వామి జాంబవంతునిచే ప్రతిష్ఠింపబడి త్రేతాయుగము నుండి పూజలనందుకొనుచున్నాడు.

ఒంటిమిట్ట కోదండరామాలయానికి సమీపమునందు 'రామతీర్థ'మను కోనేరు కలదు. సీతారామలక్ష్మణులు అరణ్యవాసమున ఈ ప్రదేశము చేరినప్పుడు, సీత 'స్వామీ! ఈ ప్రాంతమునందెచ్చటను నీరు కానరావడము లేదే, ఇచ్చటి జీవరాసులెట్లు దప్పిక తీర్చుకొనుచున్నవి' అనగా శ్రీరాముడు జానకి దప్పికకొన్నదని భావించి బాణమును సంధించి భూమిపై విడువగా, అది పాతాళమునకు చొచ్చుకొనివెళ్ళగా అందుండి గంగ పైకెగసిరాగ సీతమ్మ ఆ నీటితో సేదతీర్చుకొన్నది. ఈ తీర్థమందెప్పుడు నీరు పుష్కలముగానుండి, ఇందు స్నానమాచరించిన దీర్ఘరోగ వ్యాధిగ్రస్తులు, గ్రహపీడితులు ఆరోగ్యవంతులయ్యెదరని ప్రజల ప్రగాఢ విశ్వాసము.

ఆలయమునకు సమీపమున మృకండ మున్యాశ్రమమున్నది. ఇచ్చట మార్కండేయుడు పరమేశ్వరుని ధ్యానించి మృత్యుంజయుడైనాడని ప్రతీతి. దీనిచెంత 'శృంగిశైల'మను కొండయున్నది. శృంగి పరీక్షితుని శపించి తన తొందరపాటుకు చింతించి ఈ కొండపై తపమాచరించి పాపవిముక్తుడైనాడు. ప్రస్తుతమీ కొండపైన 'ఆంధ్రవాల్మీకి' (వాసుదాసు) యొక్క ఆశ్రమమున్నది.

**ఆలయవర్ణన**

ఆలయనిర్మాణము ఒక కాలమునందు జరిగినట్లు గోచరింపదు. గర్భాలయము, అంతరాళము చోళుల కాలములో నిర్మింపబడినవి.

ముఖమండపము, మహామండపము విజయనగర కాలమునాటివి. ఆలయము చుట్టూ విజయనగర రాజులు, వారి సామంతులైన మట్ల ప్రభువులచేత కట్టించిన విశాలమైన ప్రహరీ గోడయున్నది.

ప్రధానాలయము ఎత్తైన వేదికపై నిర్మింపబడినది. అందు గర్భగృహము, అంతరాళము, ముఖమండపము, రంగమండపములున్నవి. గర్భగృహమునందు ఒకే రాతియందు చెక్కబడిన సీతారామలక్ష్మణుల సుందర విగ్రహములున్నవి. గర్భాలయము పైభాగమున ద్రావిడవిమానము, కలశము కలవు. అంతరాళమునకు ముందు భాగమున ద్వారపాలకులు (జయవిజయులు) న్నారు. ముఖమండపమునకు చెంత గల గరుడ మండపమునందు అంజలి ఘటించుచున్న గరుడవిగ్రహమున్నది. ఇచ్చటే పేరు తెలియని ఒక చోళరాజు, అతడి దేవేరుల సుందర శిల్పములున్నవి. ముఖమండపము, రంగమండపమునందలి స్తంభములు అనేక శిల్పములతో విరాజిల్లుచున్నవి. ముఖమండపమునకు సమీపమున సంజీవరాయుని గుడి కలదు. ఇందు హనుమంతుడు సంజీవరాయుని పేరున అంజలి ఘటించుచు స్వామి ఎదురుగా వెలసియున్నాడు.



ఆలయమందు విజయనగర చక్రవర్తి, సదాశివరాయల కాలమున వేయించిన రెండు శాసనములున్నవి. ఇందు మొదటిది క్రీ.శ. 1555వ సం॥ నాటిది. ఒంటిమిట్ట రఘునాథుని ఆలయపోషణకు పొత్తిపినాటిలోని పులపుత్తూరు, బోగేపల్లి, అంతుపల్లెలను దానము చేయుచు, ఆ దాన శాసనమును అతిక్రమించినవారు గంగానదీతీరాన గోవులను, బ్రాహ్మణులను వధించుటచే కలిగెడి పాపములను, కాశిలో మాతృవధ చేయుటచే కలిగెడి పాపమును పొందెదరని తెలియజేయుచున్నది. రెండవ శాసనము క్రీ.శ. 1558 సం॥ నాటిది. ఈ శాసనము ఆలయమందలి గోపుర ప్రాకార నిర్మాణములకు, తిరునాళ్ళు జరిపించుటకు, ఒంటిమిట్ట గ్రామమును దానము చేసినట్లు తెలుపుచున్నది.

ఒంటిమిట్ట రఘునాథుని సేవించి తరించిన భక్తులలో భాగవత రచయిత బమ్మెరపోతన ప్రథముడు. ఇచ్చటి స్వామికి పోతన తన రచనను అంకితమిచ్చినాడు. ఈనాడిచ్చట పోతన పేర కొంతభూమి, ఆలయ ప్రాంగణమందు, స్వామిని సేవించుచున్నట్లు అంజలి ఘటించు విగ్రహము, దానిక్రింద "ఇమ్మనుజేశ్వరాధముల..." అను పద్యము పోతనకు సంబంధించినదట. పోతనవలెనే, విద్యానగరప్రభువు ప్రౌఢదేవరాయల ఆస్థానకవి అయ్యలరాజు తిప్పయ్య (తిపురాంతకుడు) ఒంటిమిట్ట నివాసి. ఇతడు స్వామిపేరిట 'శ్రీ రఘువీరశతకము' ను రచించినాడు. ఇతని మనుమడు అయ్యలరాజు రామభద్రుడు చిన్ననాడే సీతమ్మకృపకు పాత్రుడై ఆమె స్తన్యమునుగ్రోలి మృత్యువును జయించినాడు.

క్రీ.శ. 17వ శతాబ్దమందు కడప నవాబు ఇమాంబేగ్, స్వామి మహిమలను పరీక్షింపనెంచి, భక్తితో 'ఓ రామా! ఒంటిమిట్ట రఘురామ' యని మూడుమార్లు పిలువగా, స్వామి ఓ, ఓ, ఓ అని బదులు పలుకగా, నవాబు స్వామి శక్తికిమెచ్చి, ఆలయముచెంత ఒక బావిని త్రవ్వించినాడు.

**మాల ఓబన్న**

ఓబన్న హరిజనుడు, స్వామి భక్తుడు. నిత్యము కాలికి గజ్జెకట్టి, ఒక చేతిలో తంబుర, మరొక చేతియందు తాళములు ధరించి స్వామికి భజనచేయుచుండగా, ఒకరోజు తహసిల్దారు ఆలయమునకేతెంచి, అచ్చట ఓబన్నను చూచి అచ్చటనుండి వెళ్ళిపొమ్మనెను. ఓబన్న ఒక మారుమూలకు వెళ్ళి కంటతడిపెట్టి స్వామిని ధ్యానించుచుండెను. ఆ మరునాడు తెల్లవారి అర్చకులు ఆలయము తలుపులు తెరవగా స్వామి వెనకవైపుగా మళ్ళియుండెను. ఆ వింతచూచి అర్చకులు పెద్దగా కేకలు వేయగా, ప్రజలు తండోపతండములుగా వచ్చి, స్వామికి ప్రజలపై ఆగ్రహము కలిగినదని వాపోయిరి. ఆ రాత్రి స్వామి తహసీల్దారు కలలో కనిపించి ఓబన్నను తనచెంతకు చేర్చుమనగా, తెల్లవారి ఆలయ ధర్మకర్తలు, తహసీల్దారు ఓబన్నను ఆలయమునకు కొనిపోగా స్వామి యథారీతిన ముందుకు తిరిగియుండెను. ఓబయ్య 120 సం॥లు జీవించి స్వామిని సేవించుచు ఆతనిలోనే లీనమయ్యెను.

**వావిలికొలను సుబ్బారావు**

సుబ్బారావుగారి జన్మభూమి జమ్మలమడుగు. ఎమ్.ఏ., వరకు చదివి, రెవిన్యూ శాఖలో చేరి తహసీల్దారు వరకు ఎదిగి, ఉద్యోగమును వదలి ఒంటిమిట్ట చేరి ఆశ్రమము నిర్మించుకొని నిత్యము కోదండరాముని సేవిస్తూ చిప్పచేతపట్టి లక్షల ధనాన్ని సేకరించి, స్వామి ఆలయాన్ని బాగుచేయించి, వాల్మీకి రామాయణమును ఆంధ్రీకరించి దానికి వ్యాఖ్యానము 'మందర'మను పేర వ్రాసి స్వామికి అంకితమిచ్చెను. ప్రజలు ఆంధ్రవాల్మీకి అను బిరుదముతో సత్కరించిరి. ఈనాడు ఆలయములో జరిగెడి పూజావిధులన్నిటిని పునరుద్ధరించినదీ మహాభక్తుడే. ఒంటిమిట్ట రామాలయము అతిప్రాచీనమైన దైనను ఆలయమునకు కావలసిన ఆదాయము లేకుండుటచే క్రమక్రమముగా ఆలయము శిథిలావస్థకు గురియగుచున్నది.

* * *

# కడప - ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయము

రాయలసీమ చరిత్రలోనే గాక, యావత్ భారతదేశములోనే కడప అత్యంత ప్రాముఖ్యమును సంతరించుకొన్నది. ఈ జిల్లా పల్లవులు, బాణులు, వైదుంబులు, తెలుగు చోళులు, పాండ్యులు, కాకతీయులు, మహమ్మదీయులు, విజయనగరాధీశ్వరులు, మట్లరాజులు, మైసూరు, గోల్కొండ, నిజాం నవాబులు, తూర్పు ఇండియా కంపెనీవారిచేత పాలింపబడినది. ఈ జిల్లా దత్తమండలములకు కేంద్రము. ఇచ్చట హిందు, బౌద్ధ, జైనమతాలకు సంబంధించిన పురాతన అవశేషాలు బయల్పడినవి. అలాగే లబ్ధమైనవానిలో మొట్టమొదటి తెలుగు శాసనము (కలమళ్ళ ధనంజయునిది) ఈ కడప జిల్లాయందు కనుగొనబడినది. కంపెనీ అధికారి మన్రో దొరకు కడప జిల్లా గండికోట సమీపమున 'పసిడి తోరణము' కనిపించినది. ఈ జిల్లాలో ఒంటిమిట్ట కోదండ రామాలయము, పుష్పగిరి చెన్నకేశవాలయం, కడప ప్రసన్న వేంకటేశ్వరాలయములు ప్రసిద్ధమైనవి.

## పేరు

'కడప' అనే పేరు ఎట్లువచ్చినదో తెలియజెప్పుట కష్టమే. పూర్వము తిరుమల క్షేత్రమునకు వెళ్ళెడి యాత్రికులు ఇచ్చటి పాలకొండలలోని 'ఒంటిమిట్ట' కనుమద్వార పయనించెడివారు. అందుచేత తిరుమల వేంకటేశ్వరాలయమునకు ముఖద్వారము (గడప) గా నుండెడి ఈ ప్రదేశమునకు 'గడప' అను పేరు వచ్చినది. కాలగమనంలో 'గడప' కడపగా మారియుండవచ్చు. మరికొందరు 'కడప' అనుపేరు 'కృప' శబ్దము నుండి వచ్చినదనుచున్నారు. పూర్వమీ పాలకొండలయందు కృపాచార్యుడు తపస్సుచేసి, మహావిష్ణువును ప్రసన్నుని చేసికొనుటచే, ఈ క్షేత్రమునకు 'కృపాచార్యక్షేత్ర'మని పేరు వచ్చినదని అభిప్రాయపడుచున్నారు. నాటి 'క్రిప' లేక 'కృప' ఈనాటి కడప పట్టణము.

ప్రస్తుతము కడప పట్టణముగా ప్రసిద్ధిగాంచిన గ్రామమును 16వ శతాబ్దమందు గోల్కొండ ప్రధాని 'నైక్ నామ్ ఖాన్' చేత పాత కడపకు మైలు దూరమున నిర్మింపబడినది. అయితే మహమ్మదీయులుండు ఈ క్రొత్త గ్రామములో నివసించుటకు హిందువులెవరు ముందుకురాలేదు. ఆ విషయము తెలిసికొన్న నైక్నామ్‌ఖాన్ హిందువులతో స్నేహము చేసికొని, వారిని క్రొత్తగా 'నేక్నామ్‌బాద్' అని తనపేర నిర్మించిన గ్రామములో నివసించమని ప్రోత్సహించినాడు. హిందువులు అతడి మాటలను విశ్వసించి నేక్‌నామాబాదుయందు నివాసమేర్పరచుకొన్నారు. ఇచ్చటి హిందూ, ముస్లిమ్ సఖ్యతకు నిదర్శనముగా, నేక్నామాఖాను భవంతి, మసీదులకు ప్రక్కనే ఆంజనేయస్వామి ఆలయము నిర్మించబడినది. నేక్‌నామ్‌ఖాన్ పెట్టిన 'నేక్‌నామ్‌బాదు' అనే పేరు అతడి మరణముతో అంతరించి కడప అనే పాత పేరు ఈ క్రొత్త గ్రామమునకు స్థిరపడినది.

కడప పట్టణమందలి పాత కడపనే ప్రజలు 'దేవునికడప' అంటున్నారు. ఈ క్షేత్రమందు పరమ పవిత్రమైన ప్రసన్న వేంకటేశ్వరాలయమున్నది. ఈ ఆలయములో వేంచేసియున్న వేంకటేశ్వరస్వామి విగ్రహమును కృపాచార్యుడు ప్రతిష్ఠించినాడు. మృకండుమహర్షి స్వామినిగురించి తపస్సుచేసి ఆతని దర్శనభాగ్యమును పొందినాడు. ఈ ఆలయమందలి స్వామి భక్తులపాలిటి కొంగుబంగారము. తిరుమలక్షేత్రమును 'వరాహక్షేత్ర' మన్నట్లే, దేవుని కడపను 'హనుమంతక్షేత్ర' మంటారు. కడప వేంకటేశ్వరస్వామి ఆలయచరిత్ర, తిరుమల ఆలయచరిత్రతోనే ప్రారంభమైనదనవచ్చు. ఈ క్షేత్రమునకు 'దేహలిక్షేత్ర'మను మరొక పేరుకూడా ప్రచారమందున్నది. ఈ స్వామికి కదంబులు, పల్లవులు, చోళులు, విజయనగరప్రభువులు, మట్లరాజులు ఎంతగానో సేవచేసినారు. ఈ స్వామిని భక్తసంరక్షకుడని, ప్రసన్న వేంకటేశ్వరుడనియు స్థలపురాణములు పేర్కొనగా, సాహిత్యము ఈ స్వామిని 'కడప రాయుడనియు' శాసనములు 'తిరువేంగళనాథు' డనియు

పేర్కొనుచున్నవి. భక్తులు కడప ప్రసన్న వేంకటేశ్వరుడు, తిరుమలేశునికి ప్రతిరూపముగా భావించి, తిరుమలరాయుడే కడపరాయు డంటున్నారు.

**ప్రధాన ఆలయము**

ప్రసన్న వేంకటేశ్వర ఆలయము చుట్టూ రాతితో నిర్మించిన ప్రాకారమున్నది. ప్రాకారమందు మూడు గాలి గోపురములున్నవి. తూర్పువైపునన్న గోపురము తక్కిన రెండు గోపురములకంటే ఎత్తైనది. దీనిని మట్ల అనంతభూపాలుడు నిర్మించినాడు. శిథిలావస్థలో యుండిన ఈ గోపురమును క్రీ.శ. 19వ శతాబ్దపు మొదటి భాగమందు మన్రో దొరగారు బాగుచేయించినారు. తూర్పువైపునన్న గోపురద్వారము ఆలయ ప్రవేశమునకు ప్రధానద్వారము. ద్వారము దాటగానే ఎదురుగా కనబడునదే ప్రసన్న వేంకటేశ్వరాలయము. ఆలయమందు ముఖమండపము, అంతరాళము, గర్భగృహములున్నవి. ముఖమండపమందలి స్తంభములు అనేక శిల్పములతో విరాజిల్లుచున్నవి. వీటిలో తాండవ గణపతి, రాజదంపతులు, శ్రీనివాసకళ్యాణఘట్టము, విష్ణుమూర్తి, రామాయణ శిల్పములు పేర్కొనదగినవి. ఈ మండప పైభాగమందుకూడ కొన్ని చిత్రములున్నవి. ఇచ్చటి స్తంభములు కొన్ని పల్లవ, మరికొన్ని విజయనగర శిల్పపద్ధతికి చెందియున్నవి. అంతరాళమునకు ఇరువైపుల జయ, విజయుల ద్వారపాలక విగ్రహములున్నవి. గర్భాలయ గోడలపైననూ వైష్ణవశిల్పములు కానవచ్చుచున్నవి. గర్భాలయమునకు ముందు కన్నులపండువుచేయు దివ్యమంగళ స్వరూపుడైన ప్రసన్న వేంకటేశ్వరస్వామి విగ్రహమున్నది. స్వామి పాదములచెంత ఉత్సవమూర్తులు, వెనుకవైపున ఆంజనేయస్వామి విగ్రహములున్నవి. అంతరాళముపైన వేసరశైలికి చెందిన విమానము, శిఖరముపైన కలశమునున్నవి. స్వామికి ఎదురుగా బలిపీఠము, ధ్వజస్తంభము, గరుడమండపములునున్నవి.

వేంకటేశ్వరస్వామి ఆలయమునకు ప్రక్కనే పద్మావతీదేవి ఆలయమున్నది. ఈ ఆలయమందు ముఖమండపము, అంతరాళము, గర్భగృహములున్నవి. ముఖమండపమందలి స్తంభములపైన వైవిధ్యముగల శిల్పములున్నవి. ఈ మండపము పై కప్పులో రాతితో మలచిన రెండు బల్లులున్నవి. ఈ బల్లులను తాకినచో బల్లిపడిన దోషము తొలగిపోవునని ప్రజల విశ్వాసము. అంతరాళమునందు అలంకారభూషితమైన పద్మావతీదేవి (లక్ష్మీదేవి) విగ్రహము ప్రతిష్ఠింపబడినది. పూర్వమీ గుడిలోయున్న పద్మావతీదేవి విగ్రహం మహమ్మదీయుల చేతులలో శిథిలమైపోగా, ఇప్పుడున్న దేవి విగ్రహము రెండు శతాబ్దములకు పూర్వము ప్రతిష్ఠింపబడినది. అంతరాళముపైన ఏకతల విమానము, శిఖరము, శిఖరముపైన కలశము వున్నది. ఆ ఆలయగోడలపైన విష్వక్సేన, తాండవ గణపతి, కృష్ణలీలా శిల్పములు మలచబడినవి.

ప్రధానాలయ ప్రాంగణమునందే పన్నెండుగురు వైష్ణవమత ఆళ్వారుల విగ్రహములున్నవి. ఆలయమునకు సమీపములో 'హనుమత్ పుష్కరిణి' అనబడే పవిత్రమైన కోనేరు కలదు. పుష్కరిణి మధ్య భాగమున నాలుగు స్తంభముల ఆధారముతో నిర్మించిన మండపమున్నది. పూర్వమీ పుష్కరిణియందు స్వామివారి తెప్పోత్సవము కన్నులపండువుగా జరిగెడివట! ఈ కోనేరులోనికి పాత కడప చెరువు నుండి నీళ్ళు వచ్చుటకు ఏర్పాట్లు చేయబడియున్నవి. పోయిన శతాబ్దము చివరవరకు, తిరుమలరాయుడి ఆలయమందు జరిగెడి ఉత్సవములన్నియు, కడపరాయుని ఆలయమందు కూడ జరుగుచుండెడివి.

కడప వేంకటేశ్వరాలయమందు అనేక శాసనములున్నవి. వీటిలో క్రీ.శ. 1396 సంవత్సరమందు మహామండలేశ్వర తిమ్మదేవరాజు ఉదయగిరి సీమలో ఒక గ్రామమును స్వామికి దానమిచ్చినట్లు క్రీ.శ. 1480 సంవత్సరమందు మహామండలేశ్వర ఓబులరాజు స్వామికి కొంత భూమిని

దానమిచ్చినట్లు, అదే సంవత్సరమందు మరొకరు, స్వామికి వెండిపాత్రలు సమర్పించినట్లు క్రీ.శ. 1176 సం॥ అవుబలరాజు స్వామికి పూలతోటకై భూదానముగావించినట్లు, అవేగాక, కృష్ణరాయలు, సదాశివరాయలు, మట్ల ఆనంతరాయలు చేసిన దానధర్మములను, క్రీ.శ. 1629 సం॥ అరణం సర్వప్ప అనే భక్తుడు స్వామికి బంగారు కిరీటమును సమర్పించినట్లు తెలియజేయు శాసనములు ముఖ్యమైనవి.

దేవుని కడపయందలి వేంకటేశ్వరుని మహిమలను, తాళ్ళపాక అన్నమయ్య తన కృతులందు, క్షేత్రయ్య తన పదములందు, వైష్ణవాచార్యుడైన వేదాంతదేశికుడు తన 'దేహళీస్తుతి' యందు విరివిగా పేర్కొనినారు. ఈనాటికి కడప మండలమందు ఈ స్వామి మహిమలను చాటిచెప్పు జానపద జావళీలు ఎంతగానో ప్రచారమందున్నవి.

ప్రతి సంవత్సరము రథసప్తమికి స్వామివారి బ్రహ్మోత్సవము వైభవముగా జరుగును. ఈ తిరునాళ్ళలో ముఖ్యముగా రథోత్సవమునకు, వేలాది భక్తులు వచ్చి స్వామిని సేవించి తరింతురు. పూర్వమున్న రథము శిథిలమైపోగా, నేడు వాడుకలోనున్న రథమును క్రిందటి శతాబ్దమునందు ముత్యాల శేషన్న అను భక్తుడు చేయించినాడు.

* * *

## కడప - పాలకొండరాయస్వామి ఆలయం



చిత్తూరు జిల్లా పడమటి తాలూకా మదనపల్లి వాయల్పాడు ప్రాంతాలలో ముఖ్యంగా గుర్రంకొండ ప్రాంతంలో రెడ్డమ్మ రెడ్డయ్య రెడ్డి భాష రెడ్డప్ప రెడ్డి అంటూ అనేక పేర్లు కలవు. అలాగే కడప జిల్లా రాయచోటి సుండుపల్లి, రాజంపేట ప్రాంతాలలో పాలకొండ అన్నా, పాలకొండ రాయుడు, పాలకొండ రెడ్డి, కొండమ్మ, కొండయ్య అనే పేర్లు వినబడుతాయి. ఇవన్నీ ఆయా స్థానిక దేవత, దేవుడి పేర్లు. కడప జిల్లాలో మొదట వేంకటేశ్వరస్వామి ఆలయం, దేవుని కడపలోనిది. రెండవది పాలకొండరాయ స్వామి. ఇచ్చట వేంకటేశ్వరస్వామి పాలకొండ రాయుడు అని పేర్కొంటారు. ఈ క్షేత్రం క్రీస్తుశకము 8 లేక 9 శతాబ్దము నాటిది అంటారు. ఇచ్చటి నిర్మాణాలను బట్టి ఆలయం పల్లవుల కాలము నాటిది లేదా పశ్చిమ చాళుక్య కాలము నాటిది అనవచ్చు.

ఐతిహ్యం ప్రకారం పూర్వం శ్రీమహావిష్ణువును భృగుమహర్షి తన్నగా తన స్థావరాన్ని తన్నినాడు అని లక్ష్మీదేవి వైకుంఠము వదిలి భూలోకానికి వెళ్ళిపోయినది. భృగుమహర్షి గర్వం అతడి అరికాలిలో ఉన్న నేత్రానిదే అని శ్రీహరి ఆ కన్నును చిదిమి వేయగా భృగు శక్తిహీనుడై పశ్చాత్తాపముతో స్వామిని మన్నించమని వేడుకుని తాను ఎల్లకాలము తనవద్దనే ఉంటూ స్వామిని సేవించే వరము ఇవ్వమని కోరగా, మహావిష్ణువు అంగీకరించి అతడిని నదిగా మార్చి తనవద్దనే ఉండమని వరమిచ్చినాడు. లక్ష్మీదేవి వెళ్ళిన తరువాత విష్ణుమూర్తి దేవిని వెతుకుచూ భూలోకంలో నైమిశారణ్యంలోనే నల్లమల అడవి ప్రాంతంలో తిరిగి అలసిపోయి ఒకచోట పడిపోయాడట. అలా శ్రీనివాసుడు పడిపోయినచోటుకు బ్రహ్మ, శివుడు, ఆవు, దూడ రూపము

దాల్చి వెతుకుచూ వచ్చి స్వామికి ఆవుపాలను ఇచ్చి సేద తీర్చారట. అందుచేత ఈ పర్వత ప్రాంతాన్ని పాలకొండలు అన్నారు. క్షీరసాగర మథన కాలంలో పాల సముద్రపు చినుకులు ఈ కొండలపై పడి ఆ ప్రదేశము తెల్లగా మారుట చేతను పాలకొండలు అన్నారట. ఇచ్చటే భృగుమహర్షి నదిరూపం దాల్చి స్వామి ప్రక్కగా ప్రవహిస్తూ ఉన్నాడు.

కడప పట్టణం నుండి దాదాపు 20 మైళ్ళ దూరంలో పాలకొండరాయ స్వామి ఆలయం కలదు. ఇది రాజంపేట, రాయచోటి, సుండుపల్లి ప్రాంతాలకు అతిసమీపము. భక్తులు ఈ ప్రదేశాల నుండి ఈ కొండపైకి వచ్చి స్వామిని సేవిస్తూ ఉంటారు. భక్తులు కొండ కిందిభాగం వరకు వరకు వాహనాలలో వచ్చి ఆ పైన కాలినడకన కొన్ని మైళ్ళు ప్రయాణించి స్వామి ఆలయాన్ని చేరుకుంటారు. అంతేకాక వారు ఏవైనా వస్తువులను కానీ, సామాగ్రిని కానీ స్వామికి సమర్పింపవలయునన్న వాటిని గాడిదలపై మూటలుగా ఉంచి ఆలయానికి తీసుకొని వెళ్లెదరు. మెట్ల దారి ప్రారంభంలో ఒక ద్వారాన్ని నిర్మించారు. ద్వారంపైన లక్ష్మీసమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఉన్నారు. ఈ ద్వారాన్ని దాటగానే ఒక ఎత్తైన పద్మపీఠముపై స్వామివారి పాదపద్మముల గుర్తులు కలవు. ఈ శిల్పము అతిపురాతనమైనది.

ఈ మెట్లదారి తిరుమల అలిపిరి సోపానమార్గాన్ని గుర్తు చేస్తుంది. ఇచ్చటనుండే దట్టమైన అరణ్యప్రాంతము ప్రారంభమవుతుంది. స్వాగతతోరణం క్రింద గోడపై ఒకవైపు వినాయక మరోవైపు కుమారస్వామి ప్రతిమలు కలవు. మెట్లదారిలో అచ్చటచ్చట యాత్రికులు సేద తీర్చుకొనుటకు చిన్న చిన్న మంటపాలు కలవు. ప్రధానాలయం ముంగిట లక్ష్మీనరసింహస్వామి మండపం, అరలో దేవిసహిత నరసింహస్వామి ఆసీనుడై ఉన్నాడు. మరోప్రక్క ఆసీన వినాయక విగ్రహం కలదు. ఆలయానికి ఒకవైపు క్షేత్రపాలకుడైన వాయునందనుడు ప్రతిష్ఠింపబడినాడు. ఆలయానికి ఒకవైపు సుబ్రహ్మణ్య స్వామి మందిరము కలదు. ఇది నూతనంగా ఏర్పాటు చేసినది అంటారు.



ప్రధాన ఆలయంచుట్టూ నూతనంగా ఏర్పాటు చేసిన ప్రహరీ కలదు. ప్రహరీ ముందు భాగంలో తూర్పువైపున మూడంతస్తుల రాజగోపురం కలదు. గోపురము కూడా ఇటీవల కాలంలో పునరుద్ధరింపబడినది. గోపురం మీద 5 కలశాలు, గోపురం మొత్తం వైష్ణవ శిల్పాలతో అలంకరింపబడినది.

ఆలయంలోనికి వెళ్ళుటకు ఈ గోపురం క్రింద లోహపు తలుపులను ఏర్పాటు చేశారు. ఈ ద్వారం గుండా లోపలికి ప్రవేశించగానే అతిప్రాచీనమైన స్వామి ఆలయం కలదు. ఆలయమందు గర్భగృహము, అంతరాళము, ముఖమండపము, మహామండపము కలవు. ప్రధాన ఆలయం మాత్రమే చెక్కుచెదరకుండా నిలబడి ఉన్నది. స్వామి గర్భాలయమందు దాదాపు నాలుగు అడుగుల ఎత్తున వేంకటేశ్వరస్వామి పాలకొండరాయుని పేర ప్రతిష్ఠింపబడి ఉన్నాడు. స్వామి చతుర్భుజుడు. క్రింది రెండు చేతులు అభయ వరద ముద్రలో ఉండగా, పై రెండు చేతులు శంఖచక్రములను దాల్చి ఉన్నాడు. స్వామి నుదుట తిరునామము తలపై కిరీటము కలవు. స్వామికి ఇరువైపులా రెండు లోహపు కడ్డీలు వాటి పైనుండి స్వామికి మకరతోరణం అమర్చినారు. ఈ మూలవిరాట్టు నూతనంగా ప్రతిష్ఠించినదట. పూర్వపు విగ్రహం శిథిలమైపోగా, ఈ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. గర్భాలయం పైన ద్వితల విమానం దానిపై బోర్లించి ఉన్నట్లు ఉన్న పూలసజ్జ ఆకారంలో శిఖరము పైన కలశము కలవు. నిర్మాణంపై చుట్టూ అనేక వైష్ణవ శిల్పాలు, దేవి శిల్పాలు కలవు. గర్భాలయం ముందు సన్నటి అంతరాళము

దానిముందు నాలుగు వైవిధ్యభరితమైన స్తంభాల సాయంతో నిర్మించిన ముఖమండపము కలదు. ఈ స్తంభాలు చాలా అందముగాను ఉన్నాయి

ఈ ముఖమండపం ముందుభాగాన స్తంభాల సాయంతో ఏర్పాటు చేసిన మహామండపము కలదు. ఈ మండపంలో గరుడాళ్వారు కలరు. స్తంభాలు పైకప్పు, పైభాగాన అలంకారమండపంనందు గూళ్ళలో దశావతారాల శిల్పాలు కలవు. ముఖమండపం చుట్టూ స్వామి ప్రదక్షిణ కలదు. ఈ ప్రదక్షిణ వెలుపలి గోడలు అపురూపమైన శిల్పాలతో, కుంభ, పంజర, కుంభపంజర, వ్యాళి శిల్పాలతో అలంకరించారు. ఈ ఆలయంలో ఈ నిర్మాణమే అపురూపమైనది అనవచ్చు.

స్వామి మందిరానికి ఎడమవైపు దేవీమందిరము కలదు. దేవిని లక్ష్మీదేవి అని కొలుస్తారు. గర్భాలయమందు కన్నుల పండుగ చేసే సర్వాలంకరణ భూషితయిన లక్ష్మీదేవి నిలుచుని ఉన్నది. దేవి మరకతకంటిని కంటహారాలను తలపై కిరీటాన్ని ధరించి ఉన్నది. గర్భాలయం పైన ఏకతల విమానము గుండ్రటి శిఖరము, పైన కలశం కలవు. ఈ మందిర సమీపంలోనే విశాలమైన పుట్ట కలదు. ఈ పుట్టని సంతానహీనులైన స్త్రీలు పూజిస్తారట. దేవి మందిరానికి సమీపంలో మరో వినాయక, సుబ్రహ్మణ్య స్వామి విగ్రహాలు కలవు. ఆలయమందు ఒక పెద్ద వృక్షము క్రింద మూడు నాగబంధ ప్రతిమలు ప్రతిష్ఠించారు. ఈ ప్రతిమలను స్త్రీలు అమితంగా పూజిస్తూ ఉంటారు. ఈ మందిరానికి కొంతదూరంలో నరసింహస్వామి మందిరము కలదు. ఈ మందిరము లోపల స్వామి దేవిసహితుడై ఆసీన ముద్రలో ఉన్నారు.

ఆలయమందు చెప్పుకోదగ్గ విశేషము ఇచ్చటి పుష్కరిణి, ఎత్తైన పర్వత ప్రాంతంలో గల ఈ పుష్కరిణి యందు సర్వకాల సర్వావస్థల యందు నీరు పుష్కలంగా, స్వచ్ఛంగా ఉంటుంది. ఈ పుష్కరిణిలోనికే భృగు మహర్షి

నదిరూపమున నేరుగా వస్తున్నాడట. కోనేటి కట్టడం పూర్తిగా శిథిలమైనను నీరు ఎంతో స్వచ్ఛంగా ఉంటుంది. పుష్కరిణిలోనే పూర్వము మహర్షులు, మునులు, సాధువులు స్నానమాచరించేవారట. ఈ ఆలయ సముదాయ మందలి దేవతలకు ఈ నీటితోనే అభిషేకము చేస్తారు. అంతేకాక భక్తులు ఇందులోనే స్నానమాచరిస్తారు. ముఖ్యంగా స్త్రీలు ఇందులో స్నానం చేసి తడిగుడ్డలతో ఆలయంలోని దేవతలకు ముఖ్యంగా లక్ష్మీదేవికి, నాగపడగలకు తమకు సంతానము కలుగచేయమని, అలా సంతానం కలిగినచో వారికి అమ్మ స్వామివార్ల పేర్లు పెట్టుకుంటామని పూజిస్తారు. అలా వచ్చినవే పైన పేర్కొన్న పేర్లు. ఈ కోనేటిని భృగుతీర్థం అని కూడా పేర్కొంటారు. ఈ ఆలయానికి శ్రావణమాసంలో జరిగే ఉత్సవానికి జనులు దూరప్రాంతాల నుంచి కూడా విచ్చేసి దేవతలను పూజించి తమ ముడుపులను చెల్లించుకుంటారు. ఆలయానికి వచ్చే యాత్రికులకు, భక్తులకు భోజన వసతి ఏర్పాట్లు చేయుటకు పాలకులు ప్రయత్నిస్తూ ఉండడం హర్షించదగ్గ విషయము.

* * *

## నందలూరు - శ్రీ సౌమ్యనాథస్వామి ఆలయం



కడప జిల్లాలోని ప్రాచీన ఆలయాలలో నందలూరు శ్రీ సౌమ్యనాథ స్వామి ఆలయం ఒకటి. ఇది అతిపురాతనమైనది. అంతేకాక అతి విశాలమైనది. నందలూరు రాజంపేటకు సమీపంలో ఉన్నది. కడప నుండి నందలూరికి 40 కిలోమీటర్ల దూరం. ఈ ప్రదేశం ఆంధ్ర దేశంలో అతిప్రాచీన నాగరికతకు నిలయం. చరిత్రకారులు ఒకప్పుడు ఈ ప్రదేశం బౌద్ధక్షేత్రంగా ఉండేదని అచ్చట కొన్ని గుహలు, విహారాలు ఉన్నట్లు కనుగొన్నారు. అసలు కడప జిల్లాకు రాయలసీమ ఇతర జిల్లాలకంటే ఒక ప్రత్యేకత కలదు. మిగతా జిల్లాలు చిత్తూరు, అనంతపురం, కర్నూలు ఇతర రాష్ట్రాల సరిహద్దులలో ఉండుటవలన ఆ రాష్ట్రాల సంస్కృతి, భాషలు, ఆచారాలు రాయలసీమ జిల్లాలపై కూడా ఉంది. అయితే కడప జిల్లాకు చుట్టుప్రక్కల వేరే భాషాప్రాంతాలు లేవు. అంతేకాదు మొట్టమొదటి తెలుగు శాసనం ఈ కడప జిల్లాలో లభించుట తెలుగుభాష చరిత్రలో ప్రముఖ ఘట్టము. నందలూరు సౌమ్యనాథ స్వామి ఆలయం చోళులకాలంలో నిర్మాణం కావింపబడినది.

ఆలయం చోళరాజుల కాలంలో అత్యంత ఉన్నతస్థితిలో ఉన్నట్లు చారిత్రక శాసన ఆధారాలు కలవు. నందలూరు చెన్నై – కడప రహదారిలో బాహుదా నదీతీరంలో ఉన్నది. పూర్వం ఒక తెలుగు చోళప్రభువు గోహత్య పాపనివారణ కోసం బాహుదానదీతీరం వెంబడి 108 శివాలయాలు నిర్మించాడు ఈ ఆలయాలలో నందివిగ్రహప్రతిష్ఠాపనకు ప్రాముఖ్యతనిచ్చి నందువల్ల ఈ నది గట్టున ఉన్న గ్రామానికి నంది ఊరుగా పేరు వచ్చింది.

ఈ గ్రామానికి అంతకు పూర్వం తొండ మండలం చొక్కాపురం, నిరంతర పురం అనే పేర్లు ఉండేవనీ... కడప చరిత్రకు ముఖ్య ఆధారమైన మెకంజి కైఫియత్ రచనలు తెలియజేస్తూ ఉన్నాయి. ఈ ప్రాంతాన్ని ఏలిన రాజు ప్రేయసి నలంద బాహుదానదీతీరాన్ని దర్శించి ఆ సుందర ప్రదేశాన్ని చూసి అచ్చటి ప్రకృతిరమణీయతకు ముగ్ధురాలై తన పేర ఆ ప్రదేశంలో జ్ఞాపక చిహ్నంగా ఏదైనా ఏర్పాటు చేయమనగా, రాజు ప్రేయసి కోరిక మేరకు బాహుదానదీతీరంలో అంతకుపూర్వమే వరదల వల్ల కొట్టుకుపోయిన నిరంతరపురం స్థానంలో ఆమె పేర, నెలందనూరు అనే గ్రామాన్ని నిర్మించాడట. అదే కాలక్రమంలో నందలూరుగా మారినదట.

నందలూరు గ్రామం ప్రక్కన ప్రవహించే బాహుదానది ఈ ప్రాంతంలో చెయ్యేరు అని ప్రసిద్ధమైనది. స్థలపురాణం ప్రకారం ఒకమారు మహావిష్ణువు నారదమహర్షి కోరికమేర భూలోక వింతలను చూస్తూ చెయ్యేరు ప్రాంతానికి వచ్చి అచ్చటి ప్రశాంత వాతావరణానికి ముగ్ధుడైనాడట. నారద మహర్షి శ్రీహరి మోములోని ప్రశాంత వాతావరణాన్ని గ్రహించి, తాతగారితో కలియుగమందు అచ్చటి నదీతీరమందే శిలారూపంలో కొలువై భక్తులను కాపాడమని ప్రార్థించగా శ్రీహరి మహర్షి కోరిక తీర్చుటకు బాహుదా నదీతీరంలో సౌమ్యనాథస్వామి పేర శిలారూపము దాల్చినాడట. కొందరీ స్వామిని సాక్షాత్తు నారద మహర్షి స్వయంగా ప్రతిష్ఠించి ఆలయనిర్మాణానికి పూనుకున్నాడు అంటారు.



**ఆలయనిర్మాణం**

సౌమ్యనాథ స్వామి ఆలయం దాదాపు పది ఎకరాల సువిశాల మైదానంలో నిర్మింపబడింది. ఆలయం చుట్టూ ప్రహరీ తూర్పువైపున

ప్రహరీలో ఆలయ ప్రవేశద్వారం, దానిపైన అయిదంతస్తుల రాజగోపురం ఉంది. అలాగే ఉత్తరదిశలో మూడు అంతస్తుల గోపురం కలదు. దక్షిణంవైపు ప్రహరీలోని గోపురం శిథిలమై అధిష్ఠానం వరకే నిలచి ఉంది. రాజగోపురం దాటి ఆలయంలోనికి ప్రవేశించగానే ఎంతో నైపుణ్యంతో చెక్కిన శిలాదీప స్తంభం దానికిముందు ధ్వజస్తంభం, బలిపీఠం, గరుడమండపాలు కలవు. గరుడమండపమందలి స్వామి ముకుళిత హస్తాలతో తన ప్రభువును సేవిస్తూ ఉన్నాడు. ధ్వజస్తంభానికి దక్షిణదిశలో వాహనమండపం, దానిముందు నిలువెత్తు వీరాంజనేయస్వామి విగ్రహం ఉంది. వాహనమండపానికి ఎదురుగా ఉత్తరదిశలో ఇటీవల కాలంలో నిర్మించిన చిన్నకోనేరు కలదు. ఆలయంచుట్టూ ఉన్న ప్రహరీ, రాజగోపురం, ఉత్తరద్వారం గోపురం ఇటీవల కాలంలో పునరుద్ధరింపబడినాయి.

ప్రధాన ఆలయం 10 ఎకరాల స్థలంలో ప్రహరీ మధ్యన నిర్మింపబడినది. ప్రధాన ఆలయప్రవేశద్వారంపైన మూడు అంతస్తుల గోపురం కలదు. ఈ గోపురం ద్వారా ఆలయంలోనికి ప్రవేశించగానే ఉత్తరదిశలో అధిష్ఠానం గోడపై అతిసుందరమైన ఆసీన గణపతి అభయ గణపతి పేరున కొలువై ఉన్నాడు. ప్రధాన ఆలయం మహామండపం, కొలువు మండపం, ముఖమండపం, అంతరాళం, గర్భగృహాల సముదాయము చుట్టూ దక్షిణ, పశ్చిమ, ఉత్తర దిశలలో నాలుగు అడుగుల ఎత్తున ఉన్న అధిష్ఠానంపై 108 స్తంభాల సాయంతో నిర్మించిన ప్రదక్షిణ కలదు. ఈ వసారా స్తంభాలన్నీ చోళ వాస్తునిర్మాణ పద్ధతిలో గుండ్రముగా ఉన్నాయి.

ప్రధాన ఆలయనిర్మాణమంతా ఏకకాలం ముందుకాక అనేక దశలలో జరిగినట్లు ఇచ్చటి నిర్మాణాన్నిబట్టి చెప్పవచ్చు. అసలు సౌమ్యనాథస్వామి ఆలయనిర్మాణమే ఒక విచిత్రంగా ఉన్నది. ఆలయప్రవేశగోపురం నుండి ప్రధానఆలయగోపురం వరకు భూమి సమతలంగా ఒకే ఎత్తున ఉంది గాని ప్రధానాలయం ముందు ఉన్న కొలువు మండపం కొంత ఎత్తున, దానిముందున్న ముఖమండపం మరికొంత ఎత్తున దానికి ముందున్న

అంతరాళం గర్భగృహం, ఇంకొంత ఎత్తున నిర్మింపబడి ఉన్నాయి. ఇటువంటి నిర్మాణశైలి దక్షిణ భారతదేశంలో మరి ఏ ఇతర ఆలయాల్లోనూ కనిపించదు. ఈ నిర్మాణపద్ధతిలో కనబరిచిన వైవిధ్యం వల్లే రాజగోపురం నుండి దాదాపు నూరు గజాల దూరం నుండి గర్భాలయంలోని స్వామిని స్పష్టంగా చూడవచ్చు. ప్రస్తుతం భక్తులు మహామండపం నుండి ఆస్థాన మండపం దక్షిణదిశలో ఏర్పాటు చేసిన మెట్ల మీదుగా స్వామివారి ముఖమండపము చేరి అచ్చటి నుండి స్వామిని దర్శించి సేవిస్తారు.

గర్భాలయం నందు దాదాపు 7 అడుగుల ఎత్తున శ్రీమహావిష్ణు సౌమ్యనాథస్వామి పేరున స్థానకమూర్తిగా, పద్మపీఠముపై ఉన్నాడు. స్వామి చతుర్భుజుడు. పై రెండు చేతుల్లో శంఖచక్రాలు, కింద కుడిచేయి ఎడమచేయి అభయ వరదముద్రలో ఉన్నాయి. స్వామి కిరీటము, మకర కుండలాలు, యజ్ఞోపవీతము వక్షఃస్థలమందు లక్ష్మీదేవిని కలిగి ఉన్నాడు. స్వామి వెనుకభాగంలో లోహపు మకరతోరణం కలదు. స్వామి విగ్రహం అపూర్వ సౌందర్యరాశి. సౌమ్యనాథస్వామికి తిరుమల శ్రీనివాసునికి ఆకారంలో, ఆకర్షణలో ఏకత్వము గోచరిస్తుంది. గర్భాలయమందు స్వామివారి చెంత ఆంజనేయస్వామి ఉత్సవమూర్తిగా కొలువై ఉన్నారు. గర్భాలయం పైన ద్రవిడపద్ధతిలో నిర్మితమైన ద్వితల విమానముపైన గుండ్రని శిఖరము, ఆపైన కలశము కలవు. విమానం మొత్తం వైష్ణవ శిల్పాలతో అలంకరింపబడి ఉన్నాయి. ఈ విమాననిర్మాణము తిరుమల ఆనందనిలయ విమానాన్ని పోలి ఉంది.

### గర్భాలయం

వెలుపలి గోడలందు శివాలయంలోవలే గుడులు అందులో మూడింట వినాయక, దుర్గ, విష్ణుదేవతాశిల్పాలు కలవు. సౌమ్యనాథస్వామి ఆలయ విమాననిర్మాణం ఎంతో సాంకేతిక ఔన్నత్యంతో నిండి ఉంది. ఈ విమానం పైన అన్ని మూలల ఏర్పాటు చేసిన రాతిపలకలపై సూర్యరశ్మి పడగానే ఆ



కిరణాలు వక్రీకరణ చెంది, గర్భాలయంలోనికి ప్రవేశిస్తాయి. అందుచేత సూర్య లక్ష్మి భూమిపై ప్రసరిస్తూ ఉన్నంతవరకు, గర్భాలయంలోని స్వామి ఎటువంటి దీపకాంతులు లేకుండానే భక్తులకు దేదీప్యమానంగా దర్శనమిస్తాడు. అలాగే వెన్నెల రాత్రులందు కూడా స్వామిని చంద్రకాంతులలో స్పష్టంగా చూడవచ్చు. ఈ నిర్మాణకౌశల్యం ఆనాటి శిల్పుల సాంకేతిక పరిజ్ఞానానికి ప్రతీక.

గర్భాలయం ముంగిట సన్నటి అంతరాళము కలదు. దీనిముందర కొంత దిగువుగా విశాలమైన ముఖమండపం ఉంది. ఈ మండపం 20 స్తంభాల సాయంతో ఎంతో విశాలంగా నిర్మింపబడింది. ఈ మండప స్తంభాలన్నీ శిల్పాలతో అలరారుతున్నాయి. ఈ శిల్పాలలో ముఖ్యంగా దశావతార, విష్ణు, ఆంజనేయ, శ్రీరామ, శ్రీకృష్ణ ముఖ్యంగా నరసింహుని పేర్కొనవచ్చు. ఈ మండపం పై కప్పు కూడా ఎంతో రమ్యంగా శిల్పాలతో అలంకరింపబడినది. ఇచ్చట ఉన్న చేప శిల్పానికి ప్రత్యేకత కలదు. కలియుగాంతంలో చెయ్యేరుకు వరదలు వచ్చి ఆలయం మునిగిపోగా ఈ చేపకు ప్రాణం వచ్చి నీటితో కలిసిపోతుందని ఆపైన మరో యుగం ప్రారంభమవుతుందని శ్రీ పోతులూరి వీరబ్రహ్మం గారు తన కాలజ్ఞాన తత్త్వాలలో పేర్కొన్నాడు. ఈ ముఖమండపం ముందే విచిత్రంగా ఒక వినాయక విగ్రహం ప్రతిష్ఠింపబడి ఉంది. ముఖమండపం కప్పు క్రింద గోడలపైన వైవిధ్యమైన దేవతాశిల్పాలు ఏర్పాటు చేశారు. ముఖమండపం వెలుపలి ద్వారానికి ఇరువైపులా ఐదు అడుగుల ఎత్తున జయ, విజయ శిల్పాలున్నాయి. ఈ ద్వారానికి ఉత్తరదిశలోనే మండపమందు ఆలయ

పాలకుడు విష్వక్సేనులవారు ఆసీనముద్రలో కొలువై ఉన్నాడు. అతడి ప్రక్కనే శ్రీ రామానుజుల వారూ ప్రతిష్ఠింపబడినారు. ప్రస్తుతం ఆలయప్రవేశద్వారం, ముఖమండపం ముందువైపున దక్షిణదిశలో ఏర్పాటు చేశారు. భక్తులు స్తంభాల మండపం నుండి ముఖమండపం చేరి అచ్చటనుండి స్వామివారిని అర్చించి, తిరిగి అదేమార్గాన వెనుతిరిగి దక్షిణవైపు నుండి తూర్పుదిశ వరకు ఆలయం చుట్టూ మహాప్రదక్షిణ చేస్తారు.

**ఆస్థానమండపం**

నందలూరు సౌమ్యనాథస్వామి ఆలయసోయగమంతా ముఖ మండపం, మహామండపాల మధ్యన నిర్మితమైన ఆస్థానమండపమందే ఇమిడి ఉంది. ఈ మండపం నాలుగువైపులా నాలుగు స్తంభాలు కలవు. ఈ స్తంభాలపైన శిల్పాలు భక్తుల మనసులను రంజింప చేస్తాయి. ముఖ్యంగా దక్షిణంవైపు ముందు స్తంభంపై మహావిష్ణువు యొక్క అవతారాలు ఎంతో అందంగా ఉన్నాయి. మిగతా మూడు స్తంభాలపైన అన్ని అవతారాలలోని ముఖ్య ఘట్టాలను శిల్పీకరించారు. వాటిలో ముఖ్యమైనవి నరసింహమూర్తిని ఆసీనమూర్తిగా లక్ష్మీనరసింహుడుగా, ప్రసన్నమూర్తిగా, ఉగ్ర నరసింహుడిగా, జ్వాలామూర్తిగా చూపడం, మరో స్తంభముపై వామనమూర్తి, త్రివిక్రమమూర్తి శిల్పాలు, ఇంకో స్తంభంపైన వరాహమూర్తి, హిరణ్యాక్షుని సంహరించినట్లుగా, సముద్ర మథన సమయంలో మందరపర్వతానికి క్రింద నిలిచి ఉన్నట్లుగా కూర్మావతారునిగా, ఇంకో శిల్పమందు పరశురామ, శ్రీరాముల భేటీ ఎంతో రమ్యంగా ఉన్నాయి.

ఈ అవతార శిల్పాలలో రామకృష్ణ, నరసింహ శిల్పాలే ఎక్కువగా ఉన్నాయి. ఇక శ్రీకృష్ణుని అవతార దృశ్యాలు వర్ణనాతీతం. ఈయనను బాలకృష్ణుడుగా, వెన్నదొంగగా, నలకూబర మణిగ్రీవుల శాపవిమోచకుడిగా, గోపికావస్త్రాపహరుడిగా, కాళియమర్దనుడిగా, గోవర్ధనగిరిధారుడుగా, చాణూర, ముష్టికుల వధకుడిగా చూపించారు. దశావతారాలతోపాటు ఈ

స్తంభాల పైన అగ్ని, కాళీ, నాగ, సూర్య, నవగ్రహాలు చెక్కబడి ఉన్నాయి. ఈ శిల్పాలనుబట్టి ఇది మలి విజయనగర రాజుల నిర్మాణమని చెప్పవచ్చు.

సౌమ్యనాథస్వామి శక్తిసంపన్నుడు. ఈయన భక్తుల కొంగు బంగారము. స్వామివారి ఎదుట నిలబడి భక్తితో తన కోరికలు తీర్చమని ప్రార్థించి ఆలయం చుట్టూ 9 ప్రదక్షిణలు చేస్తే, వారి కోరికలు తప్పక తీరుతాయట. ఆలయంలోనూ మరియు విడి రాతిపలకలపైన అనేక శాసనాలు కలవు. వాటిలో ఎక్కువభాగం తమిళం కొన్నిమాత్రం తెలుగు శాసనాలు. ఈ శాసనాలు చోళ చక్రవర్తి మొదటి కులోత్తుంగుని కాలంనుండి మట్లరాజుల కాలంవరకు ఉన్నాయి. ఈ శాసనాలనుబట్టి చూడగా చోళ చక్రవర్తి ఈ ఆలయాన్ని 20 ఎకరాల స్థలంలో 180 స్తంభాల సాయంతో నిర్మించి స్వామికి అనేక కానుకల్ని సమర్పించి, ఆలయమందు ఉత్సవ ఏర్పాట్లు కావించినాడు. ఆ తర్వాత కాకతీయ ప్రతాపరుద్రుడు, విజయనగర సాళువ నరసింహుడు, శ్రీకృష్ణదేవరాయలు, అచ్యుతరాయలు, సదాశివరాయలు, మట్లి అనంతరాయలు స్వామికి ఎన్నో మడులు, మాన్యాలు, వజ్రవైఢూర్యాలు సమర్పించారు. తాళ్లపాక అన్నమయ్య ఈ స్వామిని 16 సంకీర్తనలతో కీర్తించినాడు.

ప్రకృతి వైపరీత్యాలవల్ల మహమ్మదీయుల దండయాత్ర వల్ల ఈ ఆలయం తన ఔన్నత్యాన్ని, సంపదను కోల్పోగా నాటి దత్తమండలాల కలెక్టర్ సర్ థామస్ మన్రో ఆలయాన్ని కొంతవరకు ఉద్ధరించినా, తర్వాత యథావిధి క్షీణదశకు చేరుకుంది. పూర్వం ఆలయానికి వెలుపల ఈశాన్యదిశలో పెద్ద కొనేరు ఉండేది. అది ప్రస్తుతం శిథిలమైపోగా ప్రధాన ఆలయ సమీపమందు చిన్న కోనేటిని ఏర్పాటు చేసి పాత కోనేటి నుంచి గొట్టాల ద్వారా నీటిని సరఫరా చేస్తూ ఉన్నారు. ఈ నీటిని స్వామి అభిషేకానికి ఉపయోగిస్తారట. సౌమ్యనాథస్వామి వార్షిక బ్రహ్మోత్సవం ప్రతి ఏటా ఆషాఢమాసంలో పది రోజులు ఎంతో వైభవంగా జరుగుతాయి. ఈ జాతరను చూచుటకు వేలకొద్ది ప్రజలు వచ్చి ఉత్సవంలో పాల్గొని స్వామిని సేవిస్తారు.

## గండి - శ్రీ వీరాంజనేయస్వామి ఆలయం



భారతదేశంలో అందులో ఆంధ్రదేశంలో శ్రీ ఆంజనేయస్వామి ఆలయాలు ఎక్కువ. అనేక ప్రదేశాలలో శ్రీరామచంద్రుని ఆలయాలతో మరికొన్ని చోట్ల ఉపాలయాలతో మరికొన్నిచోట్ల ఒంటరి క్షేత్రాలు కలవు. ఉదాహరణకు విజయనగర ప్రభు శ్రీకృష్ణదేవరాయలను కుహూగండము నుండి కాపాడినది ఈ అంజనీపుత్రుడే అని అతడికి తన రాజ్యంలో ఆయన గురువు వ్యాసతీర్థులవారు దాదాపు 356 ఆంజనేయస్వామి ఆలయాలు లేక విగ్రహాలను ప్రతిష్ఠించారంట. సాక్షాత్తు తిరుమల క్షేత్రంలో కూడా ఆంజనేయ స్వామి మండపం నిర్మించారు.

ఇలా నెలకొన్న ఆంజనేయస్వామి క్షేత్రాలలో కడప జిల్లా చక్రాయంపేట మండలంలో ఉన్న గండి శ్రీ ఆంజనేయస్వామి ఆలయం చాలా ప్రముఖమైంది. ఈ గండి ఆలయ దరిదాపుల్లోనే ప్రాచీన గండికోట ఆలయం, గండికోట ఉన్నది. కడప జిల్లాలో 'గండి' అనే గ్రామం వద్ద పాలకొండలు అనేచోట అంతమై తిరిగి కొంతదూరంలో పర్వతం ప్రారంభమవుతుంది. ఈ రెండు పర్వతాల మధ్యన ఏర్పడిన దారిద్వారా పవిత్ర పాపాఘ్నినది ఉత్తరదిశగా ప్రవహిస్తూ ఉంది.

ఈ గండిక్షేత్రాన్ని వాయుక్షేత్రమని మహామహిమాన్వితమైన పుణ్యక్షేత్రమని భక్తులు కొలుస్తారు. పూర్వం వాయుదేవుడు ఈ పర్వత స్థానంలో తపస్సు చేసుకుంటూ ఉండేవాడట. ఆంజనేయుడు వాయుపుత్రుడు. త్రేతాయుగము నుండి ఎంతో ప్రసిద్ధి గాంచిన ప్రాంతం ఇది. పాపాలను హరింపచేసే నది కావున ఇచ్చుట ప్రవహించే నదికి 'పాపాఘ్ని' అనే పేరు వచ్చినదట!

త్రేతాయుగమందు సీతాదేవిని రావణుడు అపహరించుకుని ఈ దారినే వెళ్లాడని తెలుసుకొని శ్రీరామలక్ష్మణులు ఈ గండిక్షేత్రం ద్వారా ఆమెను వెతుకుతూ వెళుతూ ఉన్నారని తెలుసుకొని వాయుదేవుడు శ్రీరామునికి తన ఆతిథ్యము స్వీకరింపమని కోరగా శ్రీరాముడు వాయువుతో, ప్రస్తుతం సమయం లేదు. సీతాన్వేషణ చేసిన తర్వాత ఆమెను గ్రహించి తిరిగి వచ్చే సమయంలో తప్పక ఆతిథ్యమూ స్వీకరిస్తానని చెప్పి అతడిని ఒప్పించి ముందుకు సాగాడట. అలా వెళ్లిన శ్రీరామలక్ష్మణులు సీతాదేవిని వెతుకుతూ వాయుపుత్రుడైన ఆంజనేయునితో స్నేహం కుదిరి, అతడు లంకకు వెళ్లి సీతాదేవి ఉనికిని కనుగొని తిరిగి వచ్చి వానరసైన్యాన్ని వెంటబెట్టుకుని సముద్రంపై వారధి నిర్మించి లంకానగరంలో ప్రవేశించి విభీషణుని సాయంతో రావణసంహారం చేసి సీతను గ్రహించి తిరిగి అయోధ్యకు తన పరివారంతో బయలుదేరారు. శ్రీరామచంద్రుడు సతీసమేతంగా ఆంజనేయ, జాంబవంత, సుగ్రీవ, విభీషణ, అంగద మొదలగు పరివారంతో వస్తూ ఉ న్నారని తెలుసుకొని వాయువు వారికి అఖండ స్వాగతం పలకాలని పాపాఘ్ననదికి ఇరువైపులా ఉన్న కొండల పైభాగాన వజ్ర, రత్న, వైఢూర్యాలతో కూడిన స్వర్ణతోరణాన్ని స్వాగతం కట్టి, రాముల వారిని తన సన్నిధికి తీసుకెళ్ళి



అతడి ప్రముఖులకు సకల సౌకర్యాలు ఏర్పాటు చేశారట. వాయువు యొక్క ఆతిథ్యానికి అందరూ ఆశ్చర్యచకితులై, అచ్చటే ఒకరోజు గడిపారట.

ఆ సమయంలో శ్రీరామునికి ఆంజనేయుడు చేసిన సహాయాన్ని గుర్తు చేసుకుంటూ అతడికి తనపట్ల ఉన్న భక్తికి నిదర్శనంగా తన బాణం కొనభాగంలో ఒక రాతిపైన, ఆంజనేయుని స్వరూపాన్ని లిఖిస్తూ ఉండగా తన అయోధ్య ప్రయాణ ముహూర్తం మించిపోతూ ఉందని గ్రహించి తాను చిత్రీకరిస్తూ ఉండిన బాణపు గుర్తుని శ్రీరాముడు నిలిపివేశాడట. అప్పటికి చిత్రం పూర్తయి, ఒక్క ఎడమచేతి చిటికెన వేలుముద్ర మాత్రమే మిగిలిపోయినదట. అందుకే గండి క్షేత్రంలో ఉన్న ఆంజనేయుడు శిల్పంలో అతడి ఎడమచేతి చిటికెన వేలు కనపడదు. ఆ తరువాత ఎంతోమంది మహానుభావులు, శిల్పులు ఆంజనేయుని చిటికెన వేలు చెక్కడానికి ప్రయత్నించగా, వేలు మొదటిభాగం నుండి రక్తము కారసాగినదట. అందుచేత ఎవరు ఆనాటినుండి ఆ ప్రయత్నాన్ని చేయలేదట.

గండి ఆంజనేయస్వామి ఆలయం తూర్పు ముఖాన్ని కలిగి నిర్మింపబడి ఉంది. ఆలయం ముందు ఐదు అంతస్తుల రాజగోపురం పైన ఐదు లోహపు కలశాలు ప్రతిష్ఠించారు. రాజగోపురంపైన ప్రతి అంతస్తు ద్వారానికి ఇరువైపులా సాయుధపాణులైన ద్వారపాలకులు కలరు. ఈ గోపురం అనేకమార్లు పునరుద్ధరింపుటచేత ప్రాచీనతను కోల్పోయినది. రాజగోపురం దాటగానే బలిపీఠం, ఎత్తైన వేదికపై ధ్వజస్తంభము కలవు. వీటికిముందు విశాలమైన స్తంభాల మంటపం దీనిని ఆనుకొని ప్రధానాలయ అంతరాళం, గర్భగృహాలు కలవు.

గర్భాలయం ముందు అపురూపంగా చెక్కబడిన వీరాంజనేయస్వామి శిల్పము కలదు. స్వామి ఉగ్రరూపంలో ఉన్నాడని తెలుస్తుంది. ముందుకు చొచ్చుకొని వచ్చినట్లు ఉన్న నేత్రాలు, నుదుట త్రినేత్రము, తిరునామాలు

ఉన్నాయి. స్వామి అభయ హస్తాన్ని కలిగి భక్తులను ఆశీర్వదిస్తూ ఉన్నాడు. ఇతడు ఒక పాదాన్ని పైకి ఎత్తి రెండో పాదాన్ని క్రిందికి దించి గాలిలో ఎగురుతున్నాడా అనే భావనను కల్పిస్తూ ఉన్నాడు. స్వామి సర్వాభరణాలను, గదను తలపై కిరీటాన్ని కలిగి తలవెనుక భాగంలో మకరతోరణంతో అలంకరింపబడి ఉన్నాడు.

గండి ఆంజనేయ స్వామి భక్తుల కొంగుబంగారం. పిలిస్తే పలికే స్వామి. ఈ చిరంజీవి త్రికాలజ్ఞుడు. స్వామి ఆలయమందు రోజు ఆరు మార్లు విశేష పూజలు జరుపుతారట. తెల్లవారి ఐదు గంటలకు శుభ్రతసేవ, సుప్రభాత సేవ, రెండవ మారు అలంకార సేవ, మూడు నైవేద్య సేవ, నాలుగు మధ్యాహ్నం సేవ, ఐదు ఏకాంతసేవ, ఆరు పవళింపుసేవ చేసి రాత్రి ఎనిమిది గంటలకు గర్భాలయం మూసివేస్తారు. ఆంజనేయస్వామి ప్రక్కన ఉత్సవమూర్తుల విగ్రహాలు కలవు. గర్భాలయం పైన రెండు అంతస్తుల విమానము, గుండ్రటి శిఖరము పైన కలశం ఉన్నాయి.

ఈ ఆలయం ప్రక్కనే మరో చిన్న ఆలయం, అందులో పార్వతీదేవి చౌడేశ్వరి దేవి పేరున ప్రతిష్ఠింపబడి పూజలను అందుకుంటుంది. ఈమె తన సింహవాహనంపై ఆసీనురాలై తన నాలుగు చేతులందు వివిధరకాల ఆయుధాలను, ముఖ్యంగా ఒక చేతిలో సర్పాన్ని, మరో దానిలో డమరుకాన్ని, మరో చేతిలో పద్మాన్ని మరో చేతిలో కత్తిని పట్టి ఉన్నట్లు ఉన్నది. ఈ దేవి మహాశక్తివంతురాలు. ఈమె వెనుకభాగంలో మకరతోరణం కలదు. దేవి సర్వాలంకారిణి. ఈ స్వామి మరియు దేవీ మందిరాలతోబాటు ఆలయ ప్రాంగణంలో అనేక ఉప ఆలయాలు ముఖ్యంగా మహామండపం పై భాగాన మరియు అలంకారమండపాలలో అనేక హిందూ దేవి దేవతల విగ్రహాలు ప్రతిష్ఠింపబడి ఉన్నాయి.

ఆలయప్రాంగణమందు అనేక ఉప ఆలయాలు మండపాలు కలవు. ఇచ్చటే ఒక ఎత్తైన స్థూపం పైభాగాన గదాధారుడైన ఆంజనేయుని నిలువెత్తు విగ్రహం అతడి పాదాల క్రింద కుమారస్వామి, వినాయక ఉన్నారు. ఆలయశిల్పాలలో ఆశ్చర్యకరంగా శివలింగము, పార్వతీదేవి, నాగప్రతిమలు, పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహం, సంజీవరాయుడు, అక్కదేవతలు, భూమానందస్వామి, వీరబ్రహ్మేంద్రస్వామి, సాయినాథ యోగానంద రామతీర్థులు కొలువై ఉన్నారు. వీరిమధ్యన లోహపు కవచంతో ఉన్న ఆసీన వినాయకుడు పవళించి ఉన్నాడు. ఇచ్చట శ్రీకృష్ణదేవరాయల గురువు వ్యాసతీర్థుల వారు ప్రతిష్ఠించిన ఆంజనేయ స్వామి శిల్పము ఉంది. వ్యాసతీర్థుల వారు దక్షిణ దేశమంతటా పర్యటిస్తూ దాదాపు 356 ఆంజనేయశిల్పాలు ప్రతిష్ఠించారు. ఆంజనేయశిల్పాలలో ప్రత్యేకత ఆంజనేయుని తోక పైకి ఎత్తబడి తలవెనుక వరకు వచ్చి కొనభాగంలో గంటను కలిగి ఉంటుంది. ఈ ప్రధాన ఆలయంచుట్టూ ప్రస్తుతం ప్రహరీ నిర్మింపబడింది.

స్వామి ఈ వాయుక్షేత్రమందు అనేక పూజలను స్వీకరిస్తూ ఉన్నాడు. వాటిలో తమలపాకుల పూజ అతి పవిత్రమైనది. స్వామి శరీరం మొత్తం తమలపాకులతో కప్పి ఉంచుతారు. తమలపాకు తాపాన్ని వేడిని తగ్గిస్తుందట. అందుచేత ఈ ఆకులతో పూజిస్తారు. స్వామికి సింధూరం అంటే ఎంతో ప్రీతి. అందుకే ఈయన ఆ రంగు వస్త్రాలు ధరిస్తారు. స్వామి ఆలయమందు శ్రావణమాసం మొత్తం ఉత్సవాలే. ఆలయమందు నిత్య అన్నదాన ప్రసాద వితరణను ఏర్పాటు చేశారు. ఈ అన్నదానం చేసేచోట స్వామి ప్రతిమ కలదు. శ్రావణమాసంలో ఆలయమందు జరిగే తిరునాళ్లకు వేలసంఖ్యలో భక్తులు వస్తారు. కొంతమంది భక్తులు స్వామికి తలనీలాలు సమర్పించి, కానుకలు చెల్లిస్తారు. ఈ ఆలయానికి ప్రముఖంగా గ్రహపీడితులు,

సంతానహీనులు, అవివాహితులు, పాపులు విచ్చేసి ఈ మారుతిని పూజించి తమను ఆ కర్మల నుండి విముక్తి కావించమని ప్రార్థిస్తారు. శ్రావణమాసంలో జరిగే ఉత్సవాలలో స్వామికి విలువ కట్టలేని కానుకలను భక్తులు సమర్పిస్తారు. ఈ ఉత్సవాలకు దక్షిణ భారతదేశంలోని అన్ని రాష్ట్రాల వారు వస్తారు.

ఒక రాజు కుష్టురోగి అయి విలపిస్తూ ఉండగా ఎవరో అతడిని ఆంజనేయస్వామిని పూజించమన్నారట. ఆ రోగి ఆలయానికి వచ్చి మండలం రోజులు రోజూ నదిలో స్నానం చేస్తూ స్వామిని పూజించాడట. అందుచేత అతడు ఆ భయంకరవ్యాధి నుండి విముక్తుడైనాడట. అన్నిటికంటే ముఖ్యమైన విచిత్రమైన సంఘటన 18వ శతాబ్దంలో రాయలసీమ జిల్లాల ముఖ్య కలెక్టర్‌గా ఉన్న సర్ తామస్ మన్రో కడప నుండి బయలుదేరి ఈ గండి క్షేత్ర సమీపానికి వచ్చి యాదృచ్ఛికంగా ఆకాశంవైపు చూశాడట! ఆ మహానుభావునికి ఆకాశంలో పూర్వం శ్రీరామచంద్రుని ఆహ్వానిస్తూ వాయుదేవుడు కట్టిన స్వర్ణహారం మరియు వైకుంఠం కనిపించినదట. ఆ ప్రాచ్యుతుడు ఆశ్చర్యంతో తనవెంట ఉన్న కొంతమంది పండితులను, పండితులను ఈ విషయమై తెలిపే వివరణ కోరగా, ప్రభూ! మీరు ఎంత పుణ్యాత్ములు. త్వరలోనే మీకు వైకుంఠప్రాప్తి కలుగుతుంది అన్నారట. అంతే కొద్ది రోజులలోనే ఆ ఆంగ్లేయ మహనీయుడు ఇచ్చటికి సమీపంలోనే దివికేగినాడట. ఈ విషయం కడప జిల్లా మాన్యువల్‌లో కూడా లెక్కింపబడి ఉంది. అతడికే కాదు ఎంతోమంది పుణ్యాత్ములు ఈ తోరణ దర్శనానికి ప్రాప్తులై పుణ్యలోకం చేరారట. ఇంతటి ప్రసిద్ధ ఆలయాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం వారు తమ ఆధీనంలోనికి తీసుకుని మరల దేవాదాయ శాఖవారికి ఇచ్చేశారు. గండి ఆంజనేయస్వామి ప్రతిష్ఠ మరింత వైభవంగా విస్తరిస్తుంది అనుట అతిశయోక్తి కాదు.

* * *

# పుష్పగిరి క్షేత్రము - చెన్నకేశవస్వామి ఆలయం, సంతాన మల్లేశ్వరాలయం, ఉమామహేశ్వరాలయం



రాయలసీమయందు పవిత్ర పెన్నా నదీతీరాన కడప పట్టణానికి పదిమైళ్ళ దూరమున పుష్పగిరి క్షేత్రము కలదు. ఈ పుణ్యస్థలము శైవులకు, వైష్ణవులకు కూడ దర్శనీయ ప్రదేశము. ఒకే ప్రాంగణములో శైవమతమునకు చెందిన సంతాన మల్లేశ్వర, ఉమామహేశ్వర ఆలయములు, వైష్ణవమతానికి చెందిన చెన్నకేశవస్వామి దేవాలయము నెలకొనియున్నవి.

పుష్పగిరి క్షేత్రము ప్రకృతి రామణీయతకు నిలయము. స్కంద పురాణమునందు వర్ణించినట్లుగా శ్రీశైలక్షేత్రమునకు పుష్పగిరి నైఋతి ద్వారము. 'శ్రీశైలఖండ' మందును, 'స్కందపురాణ' మందును. నిత్యానాథుని 'రసరత్నాకర'మందును పుష్పగిరి క్షేత్రమును గురించిన అనేక వివరములు కలవు. ఈ పవిత్ర పుణ్యక్షేత్రమందలి ఆలయములకు మూడు వారములు ప్రదక్షిణచేసి గిరిశిఖరమును అధిరోహిస్తే మోక్షము లభించి పునర్జన్మ లేకుండాపోతుందని ప్రజల విశ్వాసము.

పుష్పగిరిక్షేత్రమహిమను చాటిచెప్పే అనేక కథలు, గాథలు, పురాణాలు ప్రచారమందున్నవి. ఒకానొకప్పుడు బ్రాహ్మణుడొకడు తన తండ్రి మరణానంతరము ఆతని ఆత్మను శాంతింపచేయుటకై అస్తికలను గంగానదిలో కలుపుటకు తీసుకొనివెళ్ళుతూ పుష్పగిరి క్షేత్రముచేరి అస్తికలను గట్టుపైయుంచి జపము చేయుటకై పెన్నానదిలో స్నానముచేసి గట్టుమీదికి వచ్చి అస్తికలను చూడగా, అస్తికలకు బదులు ఆ ప్రదేశమందు పుష్పాలు

వున్నవట! తండ్రికి మోక్షము లభించినదని ఆ బ్రాహ్మణుడు పుష్పాలను నదిలో వదలినాడట. కొండప్రాంతమందు అస్తికలు పుష్పాలుగా మారినవి కావున ఆ ప్రదేశమునకు పుష్పగిరి అనే పేరువచ్చినది.

పురాణములందు ఈ క్షేత్రప్రసక్తి మరొక విధముగా వర్ణింపబడినది. పూర్వము గరుత్మంతుడు తల్లిని దాస్యవిముక్తురాలిని చేయుటకు దేవతలను ఓడించి, అమృతభాండమును తెచ్చుచుండగ ఇంద్రుడు తన వజ్రాయుధమును ఆ భాండముపైకి ప్రయోగించినాడట. ఆయుధాన్ని అవమానపరచుటకిష్ట పడక, గరుత్మంతుడు తన ఈకను ఒకదానిని వదలి పెట్టాడట. గరుత్మంతుని శక్తికి, వినయానికి మహేంద్రుడు ఆశ్చర్యపడి అతడితో స్నేహముచేసుకొని, అమృతభాండమును ఉరగులకివ్వవద్దనగా, గరుత్మంతుడు తన తల్లి దాస్య విమోచనమునకు తప్పక అమృతభాండమును వారికివ్వవలయునని, వీలైతే వారు అమృతాన్ని సేవించకుండా చూడమని దేవేంద్రునికి విన్నవించు కొన్నాడు. వినతాపుత్రుడు అమృతభాండమును ఉరగులకు చూపి దానిని దర్భలపొదలో ఉంచి తల్లిని దాస్యవిముక్తురాలిని చేయుటకు వెళ్ళగా, సర్పాలు స్నానముచేసి అమృతపానము కావించవలయుననే ఉద్దేశముతో ఊకుమ్మడిగా అవి స్నానము చేయుటకు వెళ్ళగా, సురపతి ఆ అమృతభాండమును సంగ్రహించి అమరావతికి చేరినాడు. సర్పాలు స్నానముచేసి తిరిగివచ్చి



చూడగ అమృతభాండము కనిపించలేదు. కాని ఆ పాత్ర వుంచినచోట అమృతబిందువులు రాలియుండవచ్చునన్న ఆశతో అవి అచ్చటనున్న దర్భలను నాకినవి. అందుచేత వాటి నాలుకలు రెండుగా చీలినవి.

ఇంద్రుడు గరుత్మంతునిపైకి వజ్రాయుధాన్ని ప్రయోగించగా ఆయుధము తాకిడికి, అమృతబిందువు ఒకటి పాత్రనుండి తొణికి పుష్పగిరి సరస్సులో పడి సరస్సు అమృతమయమైనది. అది సహించలేక దేవతలు త్రిమూర్తులను ఆశ్రయించగా, వారు సరస్సును పూడ్చుట ఒక్కటే మార్గమన్నారు. దేవతలు సరస్సును పూడ్చుటకు వాయుదేవుని ఆశ్రయించగా అతడు పెద్ద కొండనొకదానిని తెచ్చి అమృతధార పడిన సరస్సునందు పడవేయగా, అది పుష్పమువలె తేలియాడినదట. ఆ కొండను మహావిష్ణువు ఒకపాదముతోను, మహేశ్వరుడొక పాదముతోను త్రొక్కిపట్టినారట. సరస్సునందు కొండపుష్పమువలె తేలినది కావున ఈ ప్రదేశమునకు 'పుష్పగిరి' అని పేరువచ్చినది. శివకేశవులిద్దరు ఒకే కార్యమునకు పూనుకొనుటచే ఇచ్చట ఒకే ప్రాంగణమునందు వారిద్దరికి ఆలయములు వెలసియున్నవి. మరొక కథనం ప్రకారము ఒక చోళరాజు శాపవిముక్తి కోసము ఈ ఆలయాన్ని నిర్మించినాడని ప్రతీతి.

**ఆలయనిర్మాణము**

చెన్నకేశవాలయము, సంతాన మల్లేశ్వరాలయము, ఉమామహేశ్వ రాలయాలు ఒకే ప్రాంగణమునందు నిర్మించబడియున్నవి. ఈ ఆలయాలకు చుట్టూ పెద్ద పెద్ద రాతి దిమ్మెలతో నిర్మించబడిన ప్రాకారమున్నది. ఈ ప్రాకారమందు పడమర వైపున ఆలయప్రవేశమునకు ముఖద్వారము, దానిపై ఐదు అంతస్తుల మహోన్నతమైన గోపురము ఉన్నవి. ఆలయకుడ్యముల వెలుపల చెక్కిన కుంభపంజరముల కుంభములు అధిష్ఠానముపై చెక్కబడుట ఇచ్చటి 'విశేషం'. ఈ నిర్మాణలక్షణములు మలి విజయనగర ప్రభువులే అమలుపరచుటచే సంతానమల్లేశ్వర, ఉమామహేశ్వరాలయములు క్రీ.శ.



1500 సం॥ల తర్వాత నిర్మింపబడియుండవచ్చునని ఊహింపవచ్చును. చెన్నకేశవాలయము, శివాలయములకంటే ముందు నిర్మింపబడినదని చెప్పుటకు ఆలయమందు అనేక శాసనములు లభ్యమగుచున్నవి. ఉదా : కృష్ణదేవరాయలు క్రీ.శ. 1514 సం॥మందున ఆలయనిర్వాహమునకై ఒక గ్రామమును దానము చేసినట్లు క్రీ.శ. 1520 సం॥మందు ఆలయ ప్రశస్తి కోసము కొన్ని పన్నులను రద్దుచేసినట్లు, అదేవిధముగా క్రీ.శ. 1558 సం॥ మందు విజయనగర సామంతుడైన తిరువేంగళనాథయ్య కొంత భూమిని చెన్నకేశవాలయమునకు దానమిచ్చినట్లు తెలుపుతున్నాయి.

పడమరవైపు నెలకొన్న ముఖద్వారము ద్వారా ఆలయము ప్రవేశించగానే ఎదురుగా కనపడేది చెన్నకేశవాలయము. ముఖద్వారము పైన నిర్మింపబడిన గోపురము విజయనగర నిర్మాణపద్ధతిలో నిర్మించబడి యున్నది. అధిష్ఠానమునందు ప్రవేశద్వారమునకు లోపల ఇరువైపుల పొడుగాటి రాతిస్తంభములపై లతలు, పుష్పములు మలచబడియుండుటే గాక, తక్కిన రాళ్ళపై హంసలు, శివలీలాశిల్పములు, పక్షుల యొక్క శిల్పాలు చెక్కబడినవి.

ముఖద్వారము దాటిన తర్వాత భక్తులు ప్రవేశించునది చెన్నకేశవాలయము. ఈ ఆలయము ప్రక్కనే శివాలయములైన సంతాన

మల్లేశ్వర, ఉమామహేశ్వరాలయములున్నవి. ఈ మూడు ఆలయములను కలుపుతూ ఒకే ఒక ముఖమండపమున్నది. ఈ మండపము యొక్క అధిష్ఠాన భాగములుగా ఉపాన, గళ, పట్ట, పద్మ మొదలగునవి కలవు. ఈ అధిష్ఠానమందే వరుసగా ఏనుగుల శిల్పాలు, మరొక వరుసలో గుఱ్ఱముల శిల్పాలు చెక్కబడియున్నవి. ఈ మండప మధ్యభాగమున గోడ నిర్మింపబడుట చేత ఒకభాగము చెన్నకేశవస్వామి ఆలయమునకు ముఖమండపముగాను, మరొకభాగము సంతాన మల్లేశ్వర, ఉమామహేశ్వ రాలయములు రెండింటికి ముఖమండపముగా ఉపయోగపడుచున్నది.

## ఆలయవర్ణన

చెన్నకేశవాలయ ముఖద్వారము పడమటి వైపుగా నిర్మితమైనది. ఈ ఆలయమందు గర్భగృహము, అంతరాళము, ముఖమండపములున్నవి. గర్భగృహమందలి వెనుకవైపు గోడలలో కుంభపంజరములు, సాల, కోష్ఠములేకాక మకరతోరణ, సింహలలాట శిల్పములు చెక్కబడియున్నవి. గర్భగృహముపైనున్న విమానము, రెండు తలములు కల్గి వేసరపద్ధతిన నిర్మించబడియున్నవి. గర్భగృహమందు నిలువెత్తు దివ్యమంగళకరమైన విష్ణు విగ్రహము చెన్నకేశవస్వామి పేరున ప్రతిష్ఠింపబడియున్నది. అంతరాళము యొక్క ద్వారబంధములందు ద్వారపాలకుల శిల్పాలు, ద్వారమునకు పైభాగమున గజలక్ష్మి శిల్పములు గలవు. ముఖమండపము మధ్యభాగమున ఉన్న నాలుగు స్తంభములు తరిణము పెట్టినట్లు మిలమిల మెరుస్తూఉన్నవి. ఈ ఆలయము ప్రక్కనే లక్ష్మీదేవి ఆలయమున్నది.

## సంతాన మల్లేశ్వరాలయము

ఈ ఆలయమునందు గర్భగృహము, అంతరాళము, ముఖమండపము అనే భాగములున్నవి. గర్భగృహము అంతరాళములు రెండున్నూ ఒకే అధిష్ఠానముపై నిర్మింపబడి వున్నవి. గర్భగృహమునందలి గోడలు, కుంభపంజరములతోను, సింహలలాటములతోను, మకరతోరణములతోను

అలంకరింపబడియున్నవి. గర్భగృహముపైన ద్వితల విమానమును, విమాన పైభాగమున గుండ్రని శిఖరమును కల్గియున్నది. అంతరాళము యొక్క ప్రవేశద్వారమునకిరువైపుల ద్వారపాలక విగ్రహములున్నవి. ద్వారము పైభాగమున గజలక్ష్మి శిల్పము, శిల్పమునకిరువైపుల పంజానెత్తి పట్టిన సింహపు శిల్పాలు వున్నవి. గర్భగృహమునందలి వేదికపై సంతాన మల్లేశ్వరస్వామి పేరిట శివలింగము ప్రతిష్ఠింపబడియున్నది.

**ఉమామహేశ్వరాలయము**

ఈ ఆలయమందు గర్భగృహము, అంతరాళము, ముఖమండపము లున్నవి. ఆలయముఖద్వారము దక్షిణవైపుగా నిర్మింపబడినది. గర్భగృహము, అంతరాళములు ఒకే అధిష్ఠానముపై నిర్మింపబడియున్నవి. ఈ అధిష్ఠానము చుట్టూ అనేక శిల్పాలు చెక్కబడినవి. గర్భగృహము, అంతరాళముల లోపలివైపు గోడలు, కోష్టములు, కుంభపంజరములు, సాల, కోష్టములతో నిండియున్నవి. ఆలయవిమానము నాగరపద్ధతి శిఖరమును కల్గియున్నది. విమానమునకు నాలుగు దిక్కుల నంది విగ్రహములున్నవి. గర్భగృహమందు ఉమామహేశ్వరస్వామి పేరున పిలువబడే శివలింగము సోమసూత్రముపై ప్రతిష్ఠింపబడియున్నది. ఈ ఆలయమునకు సమీపమందే ఆంజనేయ మండపమున్నది. ఈ ఆలయాల గోడలపైన చెప్పుకోతగ్గ శిల్పములు కానవచ్చుచున్నవి. వాటిలో పేర్కొనదగ్గవి గజాసురసంహారమూర్తి, కార్తికేయ, వినాయక, భిక్షాటనమూర్తి, గీతోపదేశము, కిరాతార్జునీయ గాథ, ఏనుగులు, పక్షులు, లతలు, అప్సరసల శిల్పములు.

పుష్పగిరిక్షేత్రమందు చెన్నకేశవ, సంతాన మల్లేశ్వర, ఉమామహేశ్వర ఆలయములతోబాటు, కాశీ విశ్వనాథస్వామి, త్రికుటేశ్వర స్వామి, రాఘవస్వామి,సంభవేశ్వరస్వామి, ఇంద్రనాథేశ్వరస్వామి, వైద్యనాథస్వామి, భీమేశ్వరస్వామి మొదలగు ఆలయములు కూడా యున్నవి. ఆలయచరిత్రకు సంబంధించిన అనేకశాసనములు ఇచ్చట ఉన్నవి. వాటిలో మొట్టమొదటిది

క్రీ.శ. 1298 సం॥ నాటిది. కంపయ్య అనే భక్తుడు చెన్నకేశవస్వామి ఆలయమరమ్మత్తులు కావించినట్లు తెలిపే శాసనము క్రీ.శ. 1446లో వేయించబడినది. చెన్నకేశవస్వామి ఆలయశిఖరాన్ని అఘోరశివాచార్యుడు ప్రతిష్ఠించినట్లు కీ.శ 1501 వ సం॥ నాటి శాసనము తెలుపుచున్నది.

ప్రతి ఏడు ఏప్రిల్ మే నెలలందు స్వామితిరునాళ్ళు రంగ రంగ వైభవముగా జరుగుతుంది. ఈ వుత్సవమునకు పరిసరప్రాంతముల నుండి భక్తులు తండోపతండములుగా వచ్చి పెన్నానదిలో స్నానమాచరించి స్వామిని సేవించి తరిస్తారు.

ఈ క్షేత్రము నందు ఆదిశంకరులచే ప్రతిష్ఠింపబడిన శ్రీచక్రమున్నది. ఇచ్చట శంకరమఠాధికారులు వేళకు వెళ్ళిన యాత్రికులకు ఉచిత భోజన సౌకర్యమును కలిగిస్తారు.

* * *

# రాయచోటి - శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయం



రాయలసీమలో ముఖ్యంగా కడప జిల్లాలో నిర్మింపబడిన ఆలయాలలో రాయచోటి శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయం ప్రాచీనమైనది. ఈ ఆలయ మందు కొన్ని శాసనాలు ఉన్నవి. వాటి ప్రకారం ఈ ఆలయం చోళరాజుల కాలంలో నిర్మింపబడినది అని చెప్పవచ్చు. ఇచ్చటి రెండు శాసనాలు ఈ ప్రదేశాన్ని ప్రస్తుతం కానీ అంతకుముందు కానీ వాడుకలో లేని పేర్లతో లిఖించారు. అంతేకాక ఆనాటి ప్రభువులు ఏ కాలంవారు అని ఖచ్చితంగా చెప్పలేక ఉన్నాము. ఈ పట్టణాన్ని ఒకప్పుడు రాచ(జ)వీడు అనీ, రాచీటీ అని ప్రస్తుతం రాయచోటి అనే పిలువబడుతూ ఉంది. ఈనాడు కూడా చుట్టుప్రక్కల గ్రామస్తులు పట్టణాన్ని రాచేటి అంటారు. రాచీటే రాయచోటిగా మారి ఉండవచ్చు.

ఇచ్చటి శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయం 9 లేక 10వ శతాబ్దమునాటికే ప్రశస్తంగా ఉండేదని ఈ ఆలయానికి అనేక రాజవంశీకులు అపారమైన సంపదను విరాళాలుగా సమర్పించినారు. తుదకు ఓరుగల్లును పాలించిన కాకతీయ చక్రవర్తి గణపతి దేవుడు విజయనగర ప్రభువు శ్రీకృష్ణదేవరాయలు ఈ స్వామి భక్తులే అయితే 16, 17 శతాబ్దాలలో ఈ ప్రాంతాన్ని పాలించిన మట్ల రాజవంశీకులు ఈ ఆలయాన్ని ఎంతగానో అభివృద్ధి చేశారు. ఆలయ గర్భాలయ ముంగిట పరచిన రాతిబండలపై మట్ల అనంత భూపాలుడు అతడి దేవేరుల రేఖాచిత్రాలు ఉండేవి. అతడిని దర్శించడానికి వచ్చిన రోజు స్వామివారికి ఖడ్గాలు సమర్పించేవారట. అందుకే ఈ స్వామిని రాచరాయుడు అని కూడా పిలుస్తారు.

### వీరభద్రస్వామిప్రశస్తి

దక్షుడు యజ్ఞం చేస్తూ సకల దేవతలను ఆహ్వానించి యాగనిర్వహణలో పాలుపంచుకోమని తన అల్లుడు పరమేశ్వరుని కానీ కుమార్తె పార్వతీదేవిని గాని ఆహ్వానించలేదట. అయితే పార్వతీదేవి తండ్రి నిర్వహిస్తూ ఉన్న యజ్ఞానికి తండ్రి పిలవకపోయినా వెళ్లిందట. కుమార్తెను చూచిన దక్షప్రజాపతి కుపితుడై ఎందుకు వచ్చినావు? నీ భర్త ఆగర్భదరిద్రుడు అంటూ అందరిముందు అవహేళన చేస్తూ దూషించగా పార్వతీదేవి రోషంతో యజ్ఞకుండంలో దూకి ఆత్మాహుతి చేసుకున్నది. ఈ విషయాన్ని శంకరుడు తన త్రినేత్రంతో చూచి కుపితుడై తన జటాజూటంలో నుండి ఒక వెంట్రుక తీసి నేలపై వేయగా అందులో నుండి తన భక్తుడు వీరభద్రుడు ఉద్భవించి ప్రభు ఏమి అనగా 'భద్ర, దక్షుడు యజ్ఞం చేస్తూ ఉండగా పార్వతీదేవి వెళ్ళింది. ఆమెను ఆమె తండ్రి ఎంతో హీనంగా దూషించాడు. ఆమె అవమాన భారంతో అగ్నికుండంలో దూకి ఆత్మహత్య చేసుకుంది. నీవు వెళ్లి ఆ యజ్ఞాన్ని అచ్చటికి ఏతెంచిన దేవతలను అందరినీ హతమార్చి రా' అన్నాడు. అంతే వీరభద్రుడు తన స్వామి ఆజ్ఞతో యజ్ఞప్రదేశానికి వెళ్లి ధ్వంసం చేసి దేవతలందరినీ తన ఇష్టం వచ్చినట్లు శిక్షించాడట. ఆ సమయంలోనే సూర్యభగవానుడికి కూడా ఒక దంతము ఊడిపోయినదట. ఉగ్రుడైన వీరభద్రుని శాంతింపజేయుటకు ఎవరివల్ల కాలేదట. ఆ స్వామి ఆ రూపంలో వివిధ ప్రదేశాల యందు ఉగ్రరూపంతో సంచరిస్తూ ఉండగా తుదకు పార్వతీదేవి చెలికత్తె కాలిక వీరభద్రుని శాంతింపజేసినదట. దేశంలో అనేక వీరభద్ర ఆలయాలు ఉన్నా, వాటన్నిటికీ మూలం ఈ ఆలయమే అంటారు.

### ఆలయనిర్మాణం

శ్రీ భద్రకాళీ వీరభద్రస్వామి ఆలయం రాయచోటి పట్టణం సమీపంలో ప్రవహిస్తూ ఉన్న మాండవ్య నదిగట్టున నిర్మితమైనది. ఆలయపరిసరాలు ఎంతో ఆహ్లాదకరంగా ఉంటూ నేత్రానందాన్ని కలుగజేస్తాయి. ఆలయం

చుట్టూ ఎత్తైన ప్రహరీ ఉంది. అందులో తూర్పుదిక్కున మూడు అంతస్తుల రాజగోపురము కలదు. ఈ గోపురం ఎప్పటికప్పుడు పునర్ నిర్మింపబడుతూ ఉంది. గోపుర పైభాగంలో మధ్యన ద్వారాలు వాటికి ఇరువైపులా ఆయుధాలు ధరించిన ద్వారపాలకులు ఉన్నారు. గోపురం పైన ఐదు కలశాలు కలవు. గోపురం మొత్తం శైవమూర్తులతో స్వామి పరివారదేవతలతో అలంకరించారు. ప్రవేశద్వారం దాటగానే బలిపీఠం, ధ్వజస్తంభం, నంది మండపం ఉన్నాయి. వీటికి ముందు విశాలమైన 24 స్తంభాల సాయంతో నిర్మించిన మండపం దానిముందు అంతరాళం, గర్భాలయం ఉన్నాయి.

గర్భాలయమందు కన్నుల పండుగచేసే శ్రీ వీరభద్రస్వామి అర్చామూర్తిగా స్థానకముద్రలో కొలువై ఉన్నాడు. స్వామిమూర్తికి ఆయన శరీరంపైనే అనేక ఆభరణాలు మలచబడినాయి. స్వామి మొదట ఈ ఆలయంలో సౌమ్యమూర్తిగా అంటే కోరలు, మీసాలు, జటాజూటం, గదాయుధాలు లేకుండా వెలసినాడని ఆ తర్వాత ఉగ్రరూపంలోకి మార్చినారనే పేర్కొంటారు. స్వామి కిరీటి, పెదాలపైన పొడవాటి మీసాలు,



నుదుట విభూతి రేఖలు పెద్ద పెద్ద కండ్లు కలిగి ఉన్నాడు. సౌమ్యమూర్తిగా అనగా మీసాలు లేనివాడు, కోరలు లేనివాడు జటాజూటం గదాయుధాలు లేకుండా వెల సినాడని అంటారు. సౌమ్య మూర్తిగా ఉన్నపుడు ఈ స్వామిని 'వీరేశ్వరుడు' అనగా మీసం లేనివాడు అనే అర్థంతో అనేవారు. తర్వాత ఉగ్రరూపంలోకి వచ్చినాడు అంటారు. ప్రస్తుతం వీరభద్రస్వామి ఖడ్గధారి, చతుర్భుజుడు, డమరుకం, శరీరమంతా రుద్రాక్షమాలలు వెనుక భాగంలో వెడల్పాటి మకరతోరణం కలదు. గర్భాలయంపైన ఏకతల విమానము, గుండ్రని శిఖరముపైన కలశము ప్రతిష్ఠించారు. స్వామి పాదాలచెంత ఇతడి వాహనం కొలువై ఉన్నది.

గర్భాలయం ముంగిట అంతరాళమందు భూమికి కొంత కింది భాగంలో ఒక పెద్ద మరో చిన్న రెండు నంది విగ్రహాలు కలవు. ఈ మండప ప్రవేశద్వారానికి ఇరువైపులా ఆయుధాలను ధరించిన ద్వారపాలకులు కలరు. శివాలయాలలో ద్వారపాలకులు అరుదు. ఈ మండపమందు విశాలమైన స్తంభాలపై వివిధ రకాలైన శైవప్రతిమలు కలవు. ఇవి కొన్నిచోట్ల చోళశిల్పశైలిలో, కొన్ని విజయనగరశైలిని కలిగి ఉన్నాయి. భక్తులు ఈ మండపం నుండి గర్భాలయమందలి స్వామిని కొలుస్తారు. స్వామి భక్తుల కొంగుబంగారం. స్వామి బలిపీఠం పైన పుష్పబలి, భోజన బలి సమర్పిస్తారు. ఇచ్చట పొడవాటి రెండు ధ్వజస్తంభాలు కలవు. ఇవి ఐహిక ఆనందాలకు ప్రతీక.

ధ్వజస్తంభాన్ని ఆనుకుని నాలుగు స్తంభాల మండపం కలదు. ఇచ్చట నందీశ్వరుడు కొలువై ఉన్నాడు. ఇది చాలా అరుదు అయినా వీరభద్ర స్వామి కూడా శివస్వరూపుడే అనే విషయాన్ని కొలువై ఉన్న నందీశ్వరుడు తెలియజేస్తూ ఉండవచ్చు. ఈ ఆలయంలో ఐదు నందివిగ్రహాలు ప్రతిష్ఠింపబడి ఉన్నాయి. అందుకేనేమో ఈ క్షేత్రాన్ని పంచ నందీశ్వర

ఆలయం అంటారు. ఇచ్చట స్వామి ఆలయం ప్రక్కనే దేవి ఆలయం కూడా కలదు.

భద్రకాళి అమ్మవారి ఆలయం కొంత చిన్నదిగా ఉంటూ పైన గుండ్రటి శిఖరము కలశం కలిగి ఉంది. దేవి గర్భగృహమందు ఒక విచిత్ర రూపంలో ఉంటూ ప్రత్యేకమైన అలంకరణలో ఉంటుంది. దేవి తలపై కిరీటము, రకరకాలైన కేశ ఆభరణాలు, ముందుకు వచ్చిన నాలుక, రెండు కోరలు, మూడు ముక్కుపుడకలు, నుదుట వెడల్పాటి కుంకుమబొట్టు, చేతిలో త్రిశూలం కలిగి ఉంటుంది. ఈమె శరీరమంతా నిమ్మకాయల మాలలతో అలంకరింపబడి ఉంది. వెనుక సింహవాహనం కలిగినది. మకరతోరణం కలిగినది. దేవి శివుని ప్రాణశక్తి అంటారు. ఈమె జగన్మాత. ఈ తల్లిని తాంత్రికశక్తిగా, శాకంబరిగా కొలుస్తారు.

ఈ దేవి ఆలయాన్ని ఆనుకొని చిన్న చిన్న మందిరాలు కలవు. 1) అవి క్షేత్ర పాలకుడైన కాలభైరవుడు. ఇతడు త్రిశూలపాణి, చతుర్భుజుడు, దిగంబరుడు. మందిరంపైన చిన్న గోపురం దానిపైన అతడి వాహనం శునకము కలదు.

2) షణ్ముఖస్వామి – ఈ స్వామికి ఆరు శిరస్సులు, శూలం, శిరస్సులపై కిరీటాలు వాహనం నెమలి ముందు ఉన్నాయి.

3) శివాలయం చుట్టూ అనేక శివలింగాలు ద్వాదశ లింగాల పేర కొలువైనారు. వీటిమధ్యన ఒక పెద్ద శివలింగము పానవట్టం దానిపైన ఆసీనమై ఉంది. అతడి తలపైన ధారాపాత్ర, దానిక్రింద రెండు నాగపడగలు కలవు. ఈ మందిరంపైన కూడా చిన్న మండపము కలదు.

4) నవగ్రహమండపం – అధిష్ఠానంపైన నవగ్రహాలు ప్రతిష్ఠ చేయబడి పూజలందుకుంటున్నారు.

5) నందిమండపం – ఈ మండపం నందు నందీశ్వరుడు కలదు. మెడచుట్టు గంటలు ముక్కుతాడు కలిగి ఒక కాలును ముందుకు చాపి ఆసీనుడై ఉన్నాడు.

6) ఇచ్చట అపురూపమైన వినాయకుడి విగ్రహం కలదు. ఈతడి తొండము కుడివైపుకు ఉంది. శిలారూపుడైనా ఈ స్వామి శరీరం మొత్తం లోహపు కవచంతో కప్పి ఉంచినారు. అరుదుగా కనిపించే స్వామి తొండము కుడివైపుకు తిరిగి ఉన్నది. ఈయన యజ్ఞోపవీతాన్ని ధరించినాడు. మందిర ద్వారానికి ఇరువైపులా ద్వారపాలకులు ఉన్నారు.

7) దేవి మందిరం ముఖద్వారం ఇరువైపులా ఆయుధాలు ధరించిన ద్వారపాలకులు కలరు. ఇచ్చట కూడా ఒక నందివిగ్రహం కలదు. అందుకేనేమో ఈ ఆలయాన్ని పంచనంది క్షేత్రం అంటారు.

**ఉత్సవాలు**

ఈ ఆలయమందు నిత్య వార మాస సంవత్సర ఉత్సవాలు ఘనంగా జరుగుతూ ఉంటాయి. ఈ స్వామిని మీనమాసం మీనలగ్నం అనగా మార్చి నెల 26వ తేదీనుండి ఐదు రోజులు ఉత్తరాయణం కాలంలో ఆలయంలోనికి సూర్యకిరణాలు ప్రవేశించి భక్తులను ఆనందపరవశం చేస్తాయి. ఈ దృశ్యాన్ని చూడటానికి ఆంధ్రదేశం నుండేగాక కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర భక్తులు కూడా వస్తారు. ఆలయమందు తిరునాళ్లు 11 రోజులపాటు ఘనంగా నిర్వహిస్తారు. ఆఖరిరోజు స్వామివారి రథసేవకు దాదాపు లక్షమంది భక్తులు వస్తారట.

దేవి మందిరమందు శ్రావణ కార్తీక మాసాలు (దసరా) ఉత్సవాలు ఘనంగా జరుపుతారు. దేవికి నిత్యం అభిషేకం దీపారాధన పుష్పాలంకారము చేసి నైవేద్యం సమర్పిస్తారు. ఈ దేవిని గ్రహపీడితులు, అవివాహితులు, సంతానహీనులు 5 వారాలు, తొమ్మిది వారాలు, 21 వారాలు ఇచ్చటే

ఉండి పూజిస్తే వారి కోరికలు తప్పక నెరవేరుతాయి. తాంత్రికులు కూడా ఈ దేవిని ఆరాధిస్తారట. దేవికి కుంకుమార్చన ప్రత్యేకం. ఈ ఆలయం దినదినాభివృద్ధి చెందుతూ ఉంది. భక్తులు ఈ ఆలయంలోని దేవేరులను భక్తితో ఎల్లప్పుడూ కొలుస్తూ ఉంటారు.

ఆలయమందు మరో వింత. స్వామి దేవేరి ఉపమందిరాలలోని దేవుళ్లకు సమర్పించే అభిషేకజలం పైకి కనబడకుండా మాండవ్యనదిలోనికి వెళ్లి అదృశ్యమవుతుందట. శ్రీ వీరభద్రస్వామి ఆలయం ముందు బ్రహ్మోత్సవాల కడపటి రోజున మహామండపమందు కుంకుమ పసుపుపొడితో ఓ శ్రీ చక్రాన్ని ఏర్పాటు చేసి మధ్యలో గంపలకొద్దీ అన్నం పోసి దానిపై కుంకుమ, పసుపు, వేప ఆకులు కలిపి ఎర్రటి బలి అన్నాన్ని స్వామికి కుంభకూడుగా సమర్పిస్తారు. ఈ బలి ప్రసాదం స్థానంలో పూర్వం ఆలయమందు స్వామికి దేవికి బలులు సమర్పించే ఆచారము ఉండేదట. ఆ రక్తంతోనే వారికి ఆ కాలంలో కుంభకూడు వేసేవారు.

* * *

# శ్రీశైలం - భ్రమరాంబ మల్లికార్జున ఆలయము

"శ్రీశైలశిఖరం దృష్ట్వా పునర్జన్మ న విద్యతే"



శ్రీశైలశిఖరదర్శనము చేసికొన్నవారికి పునర్జన్మ ఉండదని పురాణములు ఘోషించుచున్నవి. అటువంటి శ్రీశైల పుణ్యక్షేత్రము రాయలసీమలోని కర్నూలుజిల్లా నల్లమల కొండలయందు నెలకొనియున్నది. ఈ ఆలయము భారతదేశమందలి ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటిగా పురాణములు తెలుపుచున్నవి. ఆ జ్యోతిర్లింగములు 1) హిమాలయ పర్వతమందలి కేదారేశ్వరలింగము, 2) గుజరాత్‌నందలి సోమనాథలింగము, 3) కాశిలోని విశ్వేశ్వరలింగము, 4) పరలియందలి వైద్యనాథలింగము, 5) ఉజ్జయినీ యందలి మహాకాళేశ్వరలింగము, 6) డాకినీయందలి భీమశంకరలింగము, 7) అయోధ్యలోని నాగలింగము, 8) నాశిక్‌లోని త్ర్యంబకేశ్వరలింగము, 9) ఎల్లోరా యందలి గౌతమీశ్వరలింగము, 10) నర్మదాతీరమందలి ఓంకారేశ్వరలింగము, 11) రామేశ్వరమందలి రామేశ్వరలింగము, 12) శ్రీశైలములో వెలసిన మల్లికార్జునలింగము.

శ్రీశైలము భారతదేశములోని అతి పురాతన క్షేత్రములందు ఒకటని స్కందపురాణము, వేదవ్యాసప్రణీతమైన మహాభారతము, వాల్మీకి రామాయణముల వల్ల తెలియుచున్నది. కృతయుగమందు హిరణ్యకశిపుడు, త్రేతాయుగమందు శ్రీరామచంద్రుడు, ద్వాపరయుగమందు పాండునందనులు శ్రీశైల క్షేత్రమును దర్శించి స్వామిని సేవించి ధన్యులైనట్లు తెలియుచున్నది. ఇందులకు నిదర్శనముగా నేటికిని ఇచ్చట రామసహస్ర

లింగము, సీతాసహస్రలింగము పంచపాండవలింగములు వెలసియున్నవి. అదేవిధముగా కలియుగమందు అద్వైతమతాచార్యులైన ఆదిశంకరాచార్యులు తన శిష్యులతో కొంతకాలమీక్షేత్రమునందు నివసించి, స్వామిని సేవించి ధన్యుడై, అచ్చటి కాపాలికుల చేతులనుండి వెంట్రుకవాసిలో మృత్యువునుండి బయటబడి ఆ ప్రదేశమునుండి వెళ్ళిపోయినట్లు తన "శివానందలహరి"లో తెలిపినాడు.

శ్రీశైలమునందు వెలసిన స్వామికి మల్లికార్జునుడని పేరెట్లు కలిగినదో తెలియజేయుటకు అనేక కథలు ప్రచారమందున్నవి. పూర్వము చంద్రగుప్తుడనే రాజు తన కుమార్తెయైన చంద్రావతిని అనేక బాధలు పెట్టసాగెను. తండ్రి పెట్టెడు బాధలు, అవమానములు సహింపలేని చంద్రావతి కొంతమంది దాసదాసీజనముతో శ్రీపర్వతమునకు వెళ్ళి అచ్చట స్థిరపడింది. ఒకరోజు ఆమె పశువుల కాపరి, తమ ఆవులలోని ఒక నల్ల ఆవు రోజూ ఒక రాతిపై తన పొదుగులోని పాలను వదలుచున్నదని తెలియజేయగా, చంద్రావతి స్వయముగా వింతచూడనెంచి ఆవులవెంట వెళ్ళినది. యథాతథంగా ఆ ఆవు శిలపై పాలను వదలు దృశ్యమును గాంచి, శిలవద్దకెళ్లి అది మామూలురాయి కాదని, శివలింగమని నిశ్చయించుకొని ప్రతిదినము ఆ



లింగమును భక్తి శ్రద్ధలతో పూజించసాగినది. స్వామి ఆమె నిష్ఠాగరిష్ఠమైన పూజలకు సంతసించి ఒకరోజు ఆమెకు ప్రత్యక్షముకాగ, చంద్రావతి తన చేతనున్న 'మల్లిక' 'అర్జున' పుష్పాలతో కూర్చిన మాలను సమర్పించి, మాలను ధరించమని ప్రార్థించగా స్వామి ఆమె కోరిక మేరకు మాలను ధరించి ఆమెను కూడా తనలోనైక్యము చేసికొన్నాడు. 'మల్లిక' 'అర్జున' పుష్పమాలికను ధరించుటచే స్వామి మల్లికార్జునుడైనాడు.

పార్వతీ పరమేశ్వరులు కైలాసమును వదలి శ్రీశైలముపై వేంచేయుటకు ఇంకొక కథ ప్రచారమునందున్నది. ఆది దంపతులు తమ పుత్రులైన కుమారస్వామికి, వినాయకునికి వివాహములు చేయనెంచి వారిలో ఎవరికి ముందుగా కళ్యాణము జరిపించాలి అనే విషయములో కుమారులిద్దరిలో సఖ్యత లేకపోవుటచే, వారొక వుపాయమాలోచించి, 'మీ యిద్దరిలో ఎవరు ముందుగా భూప్రదక్షిణముచేసి వచ్చెదరో వారికి ముందు వివాహము జరిపించెదమనగా, షణ్ముఖుడు వెంటనే తన మయూర వాహనము నధిరోహించి భూప్రదక్షిణమునకేగగా, స్థూలకాయుడైన విఘ్నేశ్వరుడు ఉపాయమాలోచించి తల్లిదండ్రులకు మూడుమార్లు ప్రదక్షిణము కావించి తనకు వివాహము జరిపించమన్నాడు. వినాయకుని సమయస్ఫూర్తికి సంతసించి పార్వతీపరమేశ్వరులు అతడికి సిద్ధి, బుద్ధి అనే కన్యలతో వివాహము జరిపించినారు. భూప్రదక్షిణము పూర్తిచేసి కైలాసమునకేతెంచిన స్కందుడు విషయమునెరింగి, తల్లిదండ్రులపై కోపగించి కైలాసమును వదలి శ్రీగిరికెళ్ళి అచ్చట నివాసమేర్పరచుకోగా, కనిష్ఠుడు, అందునా ముద్దుల కుమారుడునైన కుమారస్వామిని వదలి యుండలేక పార్వతీపరమేశ్వరులు కూడా ఆ పర్వతమునకేతెంచి నివాస మేర్పరచు కొన్నారట.

స్థలపురాణము, శివుడొకమారు శ్రీగిరికెళ్ళి అచ్చట ఓ అందమైన చెంచుకన్యను చూచి మోహించి ఆమెను వివాహమాడి అచ్చటనే

స్థిరపడినాడని తెలుపుతూంది. అందులకే చెంచులు స్వామిని ముద్దుగా చెంచుమల్లయ్య అంటారు.

స్వామి వేంచేసియున్న ఈ పర్వతమునకు శ్రీశైలమనే పేరెట్లువచ్చెనో తెలుసుకొనుటకు కూడా అనేక కథలు ప్రచారమందున్నవి. అందులో ఓ కథనుబట్టి పూర్వము శిలాధితుడనే మహర్షికి శ్రీదేవి యను కుమార్తె, పర్వతకుడనే కుమారుడు ఉండిరట! వారిరువురు మహేశ్వరుని గురించి తపస్సు చేయగ, స్వామి వారిని అనుగ్రహించి ప్రత్యక్షమై మీ కోరికలు ఏమనగా, వారు తామిద్దరి పేరును తాము తపస్సు చేసిన పర్వతమునకు నిశ్చయించి, దానిపై స్వామిని నివసించమన్నారట. అందుచేత ఆనాటినుండి ఈ పర్వతమునకు శ్రీశైలమని పేరువచ్చినది.

పూర్వము శిలాధితుడనే మహర్షి మహేశ్వరుని గురించి తపస్సు చేయగా, శివుడాతని తపస్సుకు మెచ్చి, ప్రత్యక్షమై వరములను కోరుకొమ్మనగా, నేను తపస్సు చేసిన ఈ ప్రదేశమున నీవు నివసించి, నిన్ను దర్శించినవారి పాపములను హరింపజేయవలయుననగా, స్వామి అంతట పర్వతరూపమును దాల్చినాడట. అందుచేత ఆనాటినుండి ఈ క్షేత్రమును శ్రీశైలము లేక శ్రీపర్వతము అంటున్నారు.

ఇచ్చట స్వామికి మల్లికార్జునుడు అను పేరెట్లువచ్చినదో అదేవిధముగా, ఇచ్చటి దేవికి భ్రమరాంబ నామము స్థిరపడుటకు కొన్ని కథలు ప్రచారమందున్నవి. పూర్వమొక రాక్షసుడు బ్రహ్మదేవుని గూర్చి ఘోరతపస్సు చేసి, అతనిని మెప్పించి, అతని వలన ఎటువంటి ఆయుధముల చేతను, సకల జీవరాసుల చేతను మరణము లేకుండా వరమును పొంది, గర్వించి ముల్లోకములను భయకంపితులను చేయుచుండగా, అష్టాదశ శక్తులందలి భ్రమరీశక్తి, తుమ్మెదమాలను మెడయందు ధరించి, రాక్షసునిపై యుద్ధమునకు వెళ్ళగా, మాలనుండి కోటానుకోట్ల తుమ్మెదలుద్భవించి, రాక్షసుని ఉక్కిరిబిక్కిరి చేయగా, శక్తి రాక్షసుని సంహరించి, శ్రీశైలమున

నివాసమేర్పరచుకొన్నదట. ఆనాటినుండి ఇచ్చట వెలసిన దేవిని భ్రమరాంబ అంటున్నారు. ఈ గాథ సత్యాసత్యములెట్లున్నను ఈ భ్రమరాంబ ఆలయము వెనుకవైపు గోడలో రెండు చిన్న రంధ్రములున్నవి. వాటికి సమీపముగా చెవి పెట్టినచో తుమ్మెదలు చేయు ఓంకారధ్వని వినబడును. ఈనాటికి కూడ భక్తులు దేవి దర్శనానంతరము భ్రమరాల ధ్వనిని వినవలయునన్న ఆచారమున్నది.

శ్రీశైల మల్లికార్జునుని మహిమలను గురించి సంస్కృత, తమిళ, కన్నడ, తెలుగు సాహిత్యములు ఎంతగానో ప్రస్తుతించుచున్నవి. వ్యాసమహర్షిచేత వ్రాయబడిన మహాభారతమునందు అర్జునుడు శ్రీశైల యాత్ర చేసినట్లు తెలుపబడినది. శ్రీహర్షచక్రవర్తిచే వ్రాయబడిన 'రత్నావళి' గ్రంథమునందు శ్రీశైలనివాసియైన అధార్మికుడనునతడు చెట్లయందు అన్ని ఋతువులలోను పూలు పూయించేవాడని తెలుపబడినది. భవభూతి తన 'మాలతీమాధవ' నాటకమందు శ్రీశైలనివాసి అఘోరాంతకుడనే పూజారి మాలతి అనే కన్యనుపట్టి బలి యివ్వవలయుననుకొన్నాడని పేర్కొనబడినది. అట్లే ఆచార్య నాగార్జునుడు తన 'రసరత్నాకర'మందు శ్రీశైలక్షేత్రమున అనేక రసాయన పదార్థాలు లభ్యమయ్యేడివని, ఇచ్చట ఒక రసాయన ప్రయోగశాల ఉండెడిదని పేర్కొనినాడు. స్కందపురాణము, వాయుపురాణము, బ్రహ్మాండపురాణము శ్రీశైలక్షేత్రమును వేనోళ్ళ కొనియాడుచుండగా, మత్స్యపురాణము దీనిని 'సిద్ధిక్షేత్రము' అని ప్రస్తుతించినది.

ప్రముఖ తమిళ కవులైన 'అప్పరు' 'సుందరుడు' 'జ్ఞాన సంబందర్'లు తమచే వ్రాయబడిన 'తేవారమూలం' నందు శ్రీశైలక్షేత్రమహిమను ప్రస్తావించినారు. అలాగే కన్నడ కవులైన అక్కమహాదేవి, అల్లమ ప్రభువు, చామరసు, సిద్ధిరామన్న మొదలగువారు తమ రచనలయందు శ్రీశైల మల్లికార్జునుని, భ్రమరాంబను గొప్ప మహిమలు గల దేవతలుగా ప్రస్తుతించినారు.

తెలుగు సాహిత్యము, అందునా శైవసాహిత్యము, శ్రీశైల మల్లికార్జునుని మహిమలను, క్షేత్రప్రాశస్త్యమును అధికముగా కొనియాడుచున్నది. ఆదికవి నన్నయ్య తన మహాభారతమునందలి అరణ్య పర్వములోను, మల్లికార్జున సోమనాథుడు 'మల్లికార్జున శతక' మందు, నన్నెచోడుడు 'కుమారసంభవ' మందు పాల్కురికి సోమనాథుడు 'అనుభవసారము' లోను 'పండితారాధ్య చరిత్ర'మందును, శ్రీగిరి కవి 'శ్రీగిరిశతక' మందును, రావిపాటి త్రిపురాంతకుడు 'త్రిపురాంత కోదండహరణ' మందును, శ్రీనాథ కవిసార్వభౌముడు 'శివరాత్రి మాహాత్మ్యము' లోను 'పల్నాటి వీరచరిత్ర' మందును స్వామిని స్తుతించుటయే గాక, స్వయముగా, అనేకమార్లు దర్శించి తరించినట్లు తెలియజేసినారు.

శ్రీశైలక్షేత్రము క్రీస్తుశకారంభములో ఇక్ష్వాకుల రాజ్యములో భాగమై ఎంతగానో ప్రగతిని సాధించినది. ఆ రాజవంశీకులందరు ఈ స్వామిభక్తులని నిరూపించుటకు, వారు తాము శ్రీపర్వతీయ ఆంధ్రులమని చెప్పుకొన్నారు. ఆచార్య నాగార్జునుడు చాలకాలము శ్రీశైలమందు నివసించి, ప్రయోగశాలను నడిపి సిద్ధులను బడసి సిద్ధనాగార్జునుడైనాడట. బౌద్ధుడైన నాగార్జునుడు ఇచ్చట నివసించుటచే ఈ పుణ్యక్షేత్రము బౌద్ధులకు కూడ పవిత్రస్థలమని చెప్పవచ్చు. ఆలయప్రాంగణమునందు లభ్యమగుచున్న శాసనములు క్రీ.శ. 6వ శతాబ్దము నుండి కధంబులు, పల్లవులు, చాళుక్యులు, హొయశాలులు స్వామిని సేవించినట్లు, అటుతర్వాత మహాశైవులైన కాకతీయులు ఈ స్వామిని కొలచినారు. వీరి కాలమందు ఈ క్షేత్రమెంతగానో అభివృద్ధి చెందినది. కాకతీయ చక్రవర్తి గణపతిదేవుని కాలములో శ్రీశైలమందు 64 నాట్యశాలలుండినట్లు తెలియుచున్నది. అలాగే గణపతిదేవుని మనుమడు ప్రతాపరుద్రుని కాలమందు ఆలయనిర్వహణ అరిశి శైవమతాధిపతి ఈశ్వరశివాచార్యులు కావించుచున్నట్లు, ఆలయనిర్వహణకై 70 గ్రామములు వున్నట్లు తెలుస్తూంది. ప్రతాపరుద్రుని ప్రధాని వేపటి కోమయ్య ఆలయానికి కొంత భూమిని దానమిచ్చినట్లు పేర్కొనబడినది.

కాకతీయుల తర్వాత కొండవీటి రెడ్డిరాజులు, ప్రోలయ వేమారెడ్డి, అనవేమారెడ్డి, పెదకోమటి ప్రభువులు ఆలయాభివృద్ధికి గొప్ప సేవ చేసినారు. ప్రోలయ వేమారెడ్డి శ్రీశైల ఆలయము నుండి పాతాళగంగ వద్దకు సోపానములు ఏర్పాటు చేయటమేగాక, మల్లికార్జునాలయశిఖరముపై బంగారుకలశాలను నిర్మించినాడు. అలాగే అనవేమారెడ్డి శ్రీశైలమందు వీర శిరోమండపమును నిర్మించినాడు. పెదకోమటి ఆలయప్రాంగణమందు ఎన్నో మండపాలను నిర్మించినాడు.

విజయనగరప్రభువుల కాలమందు, శ్రీశైలము మహోన్నత స్థితినాక్రమించినది. ఇందుకు నిదర్శనము ఆలయమందు లభ్యమయ్యే శాసనములు, అచ్చట నెలకొన్న శిల్పసంపదే. ఈ ప్రభువులలో మొదట ఆలయాభివృద్ధికి పూనుకొన్న ప్రభువు రెండవ హరిహరరాయలు, అటుపై బుక్కరాయలు, ప్రౌఢదేవరాయలు, వీరనరసింగదేవరాయలు ఆలయమును వృద్ధిచేసి, ఆలయనిర్వహణకు అనేక భూరి దానధర్మములు చేసినారు.

శ్రీకృష్ణదేవరాయలు తిరుమల వేంకటేశ్వరుని భక్తుడయ్యు, సర్వమతములు సమానమని భావించి, మల్లికార్జునుని సేవించి, స్వామికి అనేక గ్రామములను, వేలకొలది గోవులను, విలువకట్టలేనటువంటి బంగారు ఆభరణాలను సమర్పించుటయేగాక ఆలయమందు అనేక కట్టడములను నిర్మించినాడు. ఆలయమునందు తూర్పువైపుననున్న పెద్ద గోపురమును ఈ చక్రవర్తి నిర్మించుటచే దీనికి 'కృష్ణరాయగోపుర'మని పేరు కలిగినది. అంతేగాక రాయలు గజపతులను ఓడించి కొండవీటిని ఆక్రమించి తన అర్ధాంగులైన తిరుమలదేవి, చిన్నాదేవులను వెంటబెట్టుకొని, శ్రీశైలమునకేతెంచి స్వామిని సేవించినాడు. ఈ కాలమందే శ్రీశైలమందు వీరశైవుల ఆగడములు ఎక్కువగానుండుటచే వారిని అదుపులోనుంచుటకు కృష్ణరాయలు వెలుగోటి తిమ్మానాయుడనే సర్దారును నియమించినాడట!

శ్రీకృష్ణదేవరాయల తర్వాత మహారాష్ట్ర రాజ్య నిర్మాత ఛత్రపతి శివాజి క్రీ.శ. 1674 వ సం॥మందు శ్రీశైలమునకేతెంచి, స్వామిని, భ్రమరాంబను సేవించి, దేవినుండి ఖడ్గమును వరముగా స్వీకరించి, ఆలయప్రాకారమందు ఉత్తరము వైపున ద్వారముపై పెద్ద గోపురమును నిర్మించినాడు. అదే ఈనాటి శివాజి గోపురము. శ్రీశైలమునకు ముఖద్వారముగానున్న 'దోర్నాల' ప్రదేశమందు శివాజి శ్రీశైలమందు దేవినుండి వరప్రసాదముగా గైకొన్న ఖడ్గముతో తురుష్కుల తలలు నరికి తోరణములుగా కట్టినాడట! అందుచే ఈ గ్రామమును 'దోర్నకంబాల' అంటున్నారట! అదేకాకుండ రోహిల్లాలు శ్రీశైల ఆలయాన్ని దోపు తీయడానికి ప్రయత్నించగా శివాజి చెంచుల సాయముతో ఆలయాన్ని కాపాడినాడు.

కొంతకాలమునకు ఈ ప్రసిద్ధ శైవక్షేత్రము మహమ్మదీయుల స్వాధీనమవగా వారు ఆలయమందలి సంపదను కొల్లగొట్టుటేగాక, ఆలయమందలి శిల్పమును కూడా ధ్వంసము చేసినారు. వారిలో మున్వార్ ఖాన్ అనే సుల్తాను ఆలయద్వారములకు పొదిగిన బంగారు రేకులను సైతము పెకలించుకొని వెళ్ళగా, స్వామిని అచ్చట చెంచులు కాపాడుకొన్నారు. తిరిగి ఆంగ్లేయుల పాలనలో ఈ క్షేత్రము రాను రాను అభివృద్ధి చెంది పూర్వౌన్నత్యమును చేకూర్చుకొన్నది.

శ్రీశైలక్షేత్రమునకు నాలుగు వైపుల నాలుగు ప్రధాన ద్వారములున్నట్లు పురాణములు తెలుపుతున్నవి. ఆ ప్రధానద్వారములు తూర్పున త్రిపురాంతకము, పడమర అలంపురము, ఉత్తరమున ఉమామహేశ్వరము, దక్షిణమున సిద్ధవటము, ఈ నాలుగు పుణ్యక్షేత్రాలు శైవమతమునకు సంబంధించినవే.

**ఆలయవర్ణన :** శ్రీశైల మల్లికార్జున, భ్రమరాంబ ఆలయములు విశాలమైన ఆవరణమందు నిర్మింపబడినవి. ఆలయముచుట్టు 21 అ. ఎత్తు, 17 అ. పొడవు గల, ఎనిమిది రాతి దిమ్మెలను ఒకదానిపైనొకటి పేర్చి నిర్మించిన

దీర్ఘచతురస్రాకారమైయున్న బలిష్ఠమైన ప్రాకారమున్నది. ఈ ప్రాకారము 660 అ. పొడవు, 600 అ. వెడల్పును కల్గియున్నది. ఈ ప్రాకారమందు ఆలయప్రవేశమునకు నాలుగు ప్రవేశ ద్వారములున్నవి. తూర్పు, ఉత్తరము, దక్షిణ ద్వారములపై ఎత్తైన అధిష్ఠానముపై గోపురములు నిర్మింపబడి, ప్రవేశద్వారమునకిరువైపుల స్తంభముల సాయముతో నిర్మించబడిన మండపములున్నవి. గోపుర పై భాగము ఇటుకలతో నిర్మింపబడి నాలుగు అంతస్తులు కలిగియున్నది. ఇచ్చుట లభ్యమైన శాసనాలనుబట్టి ఈ గోపురనిర్మాణము క్రీ.శ. 1456లో ప్రారంభమైనట్లు తెలియుచున్నది. కాని స్థానికంగా దీనిని కృష్ణరాయలు నిర్మించినాడని పేర్కొంటున్నారు.

**దక్షిణవైపు గోపురము**

తూర్పుగోపురమువలెనే ఈ గోపురమునకిరువైపుల మండపములు నిర్మింపబడియున్నవి. ఈ గోపురాన్ని విజయనగర ప్రభువు రెండవ హరిహరరాయలు విస్తృతపరచినాడు. గోపురము అధిష్ఠానమునందు విజయనగరశిల్పములను కలిగిన స్తంభములున్నవి. ఈ గోపురమీనాడు శిథిలావస్థలో నుండుటచేత మరామత్తు కార్యక్రమములు జరుగుచున్నవి. ఉత్తరవైపుననున్న పెద్ద గోపురమును శివాజి నిర్మించుటచే దీనికి శివాజి గోపురమను పేరు వచ్చినది.

ఆలయముచుట్టూ నిర్మింపబడిన ప్రాకారముపై, ప్రపంచములో ఏ ఆలయగోడలపైన కానరానటువంటి శిల్పసంపద చోటుచేసుకొన్నది. ఈ శిల్పములు అన్ని మతాలకు సంబంధించినవై యుండుట విశేషము. ఈ కుడ్యశిల్పాలన్నియు అర్ధచిత్రాలే. ప్రాకార నిర్మాణమునకుపయోగించిన రెండవ వరుస రాళ్ళపై ఏనుగుల శిల్పములున్నవి. వీటిలో కొన్ని తమలో తాము పోరుచున్నట్లు, కొన్ని శివలింగమును అభిషేకించుచున్నట్లు, మరికొన్ని తొండాలతో కలువ పూవులను పైకెత్తి పట్టినట్లు మలచబడినవి. ఇచ్చుట ఒక శిల్పమందు రెండు ఏనుగులు కుండలతో నీటిని పైకెత్తి శివలింగము

పై పోయుట, శివుడా గజరాజముల భక్తి ప్రవర్తనలకు మెచ్చి లింగమును చీల్చుకొని వెలుపలికి వచ్చి వాటికి ప్రత్యక్షమగుట (లింగోద్భవమూర్తి) చూపబడినవి. ఈ శిల్పము ప్రక్కనే ఒక ఏనుగు కడవతో లింగముపై నీటిని పోయుచుండగా, ఇంకొక ఏనుగు కలువ పుష్పములతో స్వామిని పూజించుచున్నట్లున్న శిల్పమున్నది. బహుశా ఇది చంద్రావతీకథకు చెందినదై యుండవచ్చు. ఇంకొక రాతిపై రెండు బల్లులు లింగపూజ చేయుచున్న దృశ్యమున్నది. ఈ శిల్పాలనుబట్టి మానవులేగాక సృష్టిలోని ప్రతి జీవి సృష్టికర్త యెడ భక్తిప్రపత్తులను కలిగియుండెదరని నిరూపించుచున్నవి. పై శిల్పములేకాక, రామాయణ, మహాభారత, శివలీలాచిత్రములు ఈ రాతి వరుసలో చోటుచేసికొన్నవి.

ప్రాకారమందలి మూడవ రాతి వరుసలో గుఱ్ఱముల శిల్పములున్నవి. వాటియందు కొన్ని వేటలో పాల్గొనుచున్నట్లు, కొన్ని ఇనుప కవచములను ధరించి, వాటిపైన యోధులు కూర్చుండి యుద్ధభూమికి తరలుచున్నట్లు వున్నవి. కొన్ని గుఱ్ఱముల వెనుక వేటకుక్కలు అడవి జంతువులను తరుముచున్నట్లు చెక్కబడినవి. ఈ వరుసలోనే కొన్ని శిలలపై లతలు, హంసలు, కిన్నెర శిల్పాలు వున్నవి. ఈ ప్రాకారకుడ్యమందలి ఐదవ వరుస రాళ్ళపైన ఋషుల యోగాసనమును తెల్పు శిల్పములున్నవి. వాటిలో కొన్ని చిత్రవిచిత్రములై యున్నవి. ఒక శిల్పమందు స్త్రీలు వేసిన యోగదండము చూడముచ్చటగా యున్నది. ఇచ్చటి శిల్పాలలో కొన్నింటిని హంపి హజరారామస్వామి ఆలయములోను, అలంపురము ఆలయములందును చూడవచ్చు.

ఆలయము తూర్పుగోడపైన కథాఘట్టాలలో పేర్కొనదగిన శిల్పాలు శ్రీకాళహస్తిమాహాత్మ్యము, గిరిజాకళ్యాణము, కిరాతార్జునీయము, మార్కండేయుని కథ, గజాసురసంహారమూర్తి, చంద్రావతికథ, క్షీరసాగర మథనము, శిబిచక్రవర్తి కథ, దక్షయజ్ఞము, అంతఃపుర స్త్రీలు లింగపూజ

చేయుట, లింగోద్భవమూర్తి, మన్మథుడు చిలుకలచే లాగబడుచున్న రథముపై పయనించు దృశ్యము, భూదేవిని త్రాసులోపెట్టి తూచుచున్నట్లున్న దృశ్యాలు అపురూపమైయున్నవి. ఇచ్చట రెండు తలలు 22 చేతులు గల్గిన గండబేరుండ పక్షి శిల్పము పేర్కొనదగినది.

పడమటి గోడపైన చెప్పుకోతగ్గ శిల్పము కానరాదు. ఉన్నవాటిలో కోతి ఈతచెట్టునెక్కి కల్లుత్రాగే శిల్పము, ఒక మునిపుంగవుడు తన చేతిలోని యోగదండముతో నాగుపామును కొట్టుట, పులి, కొండచిలువల పోరాటము, నాలుగు మానవ శరీరాలకు ఒకే తల గల శిల్పము, దారుకావనఘట్టము, నవనారీకుంజరము, వృషభకుంజరము, ఉచ్ఛిష్ఠ గణపతి, పది చేతులను కలిగి దేవిని తొడపై కూర్చుండబెట్టికొనియున్నాడు. స్వామి తొండము దేవి యోనిలోనికి చొచ్చుకొని వెళ్ళినట్లు చెక్కబడియున్నది. బహుశా ఇటువంటి శిల్పము భారతదేశమునందు మరెచ్చటను కానరాదేమో!

పడమటి గోడకువలెనే ఉత్తరవైపు గోడయందుకూడ కొద్ది శిల్పాలేయున్నవి. వాటిలో అప్సరసలు, నాగినులు, గంధర్వులు, మూడుకాళ్ళతో నాట్యము చేయుచున్న భృంగి, కాలభైరవుడు, మహిషాసురమర్దని, శివతాండవము, పరమేశ్వరుని విశ్వరూపము, వాహనాధిపతియైన యమధర్మరాజు, చతుర్ముఖ బ్రహ్మ, భిక్షాటనమూర్తి, యోగీశ్వరమూర్తి శిల్పాలు చెప్పుకోతగ్గవి. ఈ గోడపైననే బోయదంపతుల వేట దృశ్యమున్నది. పెనిమిటి ముందు వెళ్ళుచుచుండగా, భార్యకు కాలిలో ముల్లు గ్రుచ్చుకొనగా, కాలు పైకెత్తి పట్టినది. కాలిలోని ముల్లును ఒక వ్యక్తి తీయుచున్నట్లు మలచిన శిల్పము అతి మనోహరముగను, వాస్తవానికి అతి సమీపములోను వున్నది.

ఆలయమందలి తూర్పు, పడమర, ఉత్తర ప్రాకారముల పైవున్న శిల్పములు ఒక ఎత్తు, దక్షిణవైపు ప్రాకారముపైనున్న శిల్పములు మరియొక

ఎత్తు. ఇచ్చట దక్షయజ్ఞము, శివపార్వతుల కళ్యాణము, అష్టదిక్పాలకులు, తాటకవధ, గజేంద్రమోక్షము, కిరాతార్జునీయము, శ్రీకాళహస్తిమాహాత్మ్యము, అర్జునతపస్సు, కన్నప్ప కండ్లూడపెరికి శివలింగమునకంటించు దృశ్యము, వరాహమూర్తి, పంచముఖలింగము, విలయతాండవశివుడు, ఆయనచుట్టూ బ్రహ్మ, విష్ణువు, దేవగణాల శిల్పాలు చెక్కబడినవి. పై శిల్పాలలో కొన్నింటిని లేపాక్షి వీరభద్రాలయనాట్యమండపమునందును, ముఖమండపమునందును చూడవచ్చు. ఇచ్చట ఇంకొక శిల్పమందు వీరశైవులు దేవుని అనుగ్రహము కొరకు తమ శిరస్సులను తామే ఖండించుకొనుచున్నట్లు చూపబడినది. ఇచ్చటవున్న వేణుగానలోలుడైన వినాయక శిల్పము పరమాశ్చర్యకరమైనది. అలాగే విష్ణుభక్తి ప్రధానమైన శిబిచక్రవర్తి కథ, గోపికావస్త్రాపహరణదృశ్యాలు కూడా శిల్పాంకితములైయున్నవి. ఈ ప్రాకారమునందే పెద్ద పెద్ద బాకాలువూదే మైలారుభటుల శిల్పాలు వున్నవి.

## ప్రధానాలయాలు

**మల్లికార్జున ఆలయము :** మల్లికార్జున ఆలయప్రవేశము, తూర్పువైపున సాగుచున్నది. ఆలయములోనికి ప్రవేశించగానే ఎదురుగా మల్లికార్జున ఆలయము కనపడుతుంది. ఈ ఆలయమందు గర్భగృహము, అంతరాళము, ముఖమండపము, రంగమండపము, వీరశిరోమండపములు వున్నవి. గర్భగృహమునందలి గోడలయందు ఎటువంటి శిల్పములు కానరావు. ముఖమండపము నాలుగేసి స్తంభములు కల్గిన నాలుగు వరుసల (16) స్తంభముల సహాయముతో 60 అ. చతురస్రాకారములో 6 అ. ఎత్తువున్న వేదికపై నిర్మింపబడినది. ఈ మండపాన్ని విజయనగరప్రభువు రెండవ హరిహరరాయలు క్రీ.శ. 1405వ సం॥లో నిర్మించినాడు. ఈ మండపమునందలి స్తంభములు హారతి పట్టిన స్త్రీలు (దీపకన్యలు) అధోముఖ పద్మములు, గజలక్ష్మి, సిద్ధిగణపతి, వీరభద్ర, కాళి శిల్పములతో అలరారుచున్నవి. మండపము యొక్క చూరు 24 గదులుగా విభజింపబడి

అనేక శిల్పములను కల్గియున్నది. మధ్యనవున్న గదిలో కమలము చెక్కబడినది. మండప మధ్యభాగమున రెండు లోహపు నటరాజ శిల్పములు ప్రతిష్ఠింపబడినవి.

గర్భగృహము పైభాగమున విమానము, దానిపైన శిఖరము, పైన కలశము వున్నవి. గర్భగృహమునందు చిన్న స్వయంభూ శివలింగమున్నది. ఈ లింగమే జగత్ప్రసిద్ధిగన్న మల్లికార్జునస్వామి. (ఈ లింగమును జ్యోతిర్లింగమని కూడా వ్యవహరిస్తారు.) గర్భగృహము వెనుక, ముందు రెండువైపుల ధ్వజస్తంభములున్నవి. స్వామికెదురుగా నంది మండపములో పెద్ద నందివిగ్రహమున్నది. ఈ నందిని 'శనగల బసవణ్ణ' అనికూడా పిలుస్తారు. నందిమండపమునకు సమీపమునందలి వీరశిరోమండపములో పూర్వము వీరశైవులు స్వామిని మెప్పించుటకై తలలు నరుకు (తెగవేసు) కొనేవారట. ఇచ్చటి స్వామిని భక్తులు కొండ ఎక్కగానే స్నానము చేయకుండా శరీరమునకు అంటిపెట్టుకొన్న ధూళితోనే దర్శనము చేసుకొంటారు. దీనిని 'ధూళిదర్శన'మని వ్యవహరిస్తారు. భక్తులు లింగమును చేతులతో తాకి తమ తలను లింగము పైభాగమునకు తాకించి ప్రార్థిస్తారు

స్వామి ఆలయమునకు సమీపములోనే పడమటివైపు, తూర్పుముఖాభిమానంగా నిర్మింపబడిన దేవి ఆలయమున్నది. ఈ ఆలయాన్ని భ్రమరాంబ ఆలయమంటారు. దీనిని కదంబరాజైన మయూరశర్మ నిర్మించినాడట! దేవి ఆలయమునందు గర్భగృహము, ముఖమండపము లున్నవి. ముఖమండపము నందలి స్తంభముల అడుగు భాగమున నాట్యకత్తెల శిల్పాలు, ఆయుధధారులైన యుద్ధవీరుల శిల్పాలు వున్నవి. ముఖమండపమునందు శ్రీచక్రము, దేవిపాదములు వేర్వేరు పీఠములపై శిల్పాంకితములైయున్నవి. ఇచ్చటనే దేవికి వివిధరకాలైన అర్చనలు, పూజలు చేయిస్తారు. స్వామి ఆలయములోవలె భక్తులు గర్భగృహము ప్రవేశించుటకు వీలులేదు. గర్భగృహమునకెదుట చిన్న మండపమందు, దేవి వాహనమైన

సింహమున్నది. గర్భగృహమందలి దేవి దుర్గ ఆకృతిని పోలియున్నది. ఈమెకు 'మాధవి' అనే పర్యాయ నామము కూడా కలదు. గర్భగృహముపై విమానము, శిఖరముపైన కలశము వున్నవి. దేవి ఆలయగోడలపైన సీతా, రామ, లక్ష్మణ, హనుమంత శిల్పములు చెక్కబడుటే గాక, రామాయణగాథలోని ముఖ్యమైన ఘట్టాలు శిల్పాంకితముచేయబడినవి. భ్రమరాంబ ఆలయము ప్రక్కనే సీతాసహస్రలింగమున్నది.

శ్రీశైలక్షేత్రమునందు భ్రమరాంబ మల్లికార్జునుల ఆలయములతో పాటు, పంచపాండవులచే ప్రతిష్ఠింపబడిన పంచ పాండవేశ్వర లింగము, కుమారస్వామి ఆలయము, నవబ్రహ్మ ఆలయము, అర్ధనారీశ్వరాలయము, అన్నపూర్ణ భవాని ఆలయము, వృద్ధ మల్లికార్జున ఆలయము, సిద్ధివినాయక ఆలయము, సీతాసహస్ర, శ్రీరామసహస్రలింగాలయములు, రాజరాజేశ్వర మొదలగు ఆలయములెన్నియో కలవు.

శైవమత పీఠములైన కేదారేశ్వర, వైరాగ్యపీఠము, కాశీ జ్ఞానపీఠము, ఉజ్జయిని సద్ధర్మపీఠము, రంభాపుర వీరశైవ పీఠముల యొక్క ఉపపీఠములు, శ్రీశైల సూర్య పండితారాధ్యపీఠము సమక్షమునందు నెలకొనియున్నవి. ఈ పంచ పీఠములేగాక పంచ మఠములైన విభూతి, రుద్రాక్షవాట, నందుల, ఘంటాకర్ణ, రుద్రాక్షమఠములు నెలకొనియున్నవి. ఇచ్చట ఆదిశంకరులచే స్థాపింపబడిన శంకరమఠము మరియు అనేక లింగములు ప్రజ్వరిల్లుతున్నవి.

## శ్రీశైల క్షేత్రమందలి ప్రసిద్ధ తీర్థములు

**పాతాళగంగ :** మల్లికార్జునస్వామి ఆలయము తర్వాత చెప్పుకోతగ్గ మహిమ గలది పాతాళగంగ తీర్థము. స్వామిని దర్శించుటకు పూర్వము (ధూళిదర్శనానంతరము) ఈ కొలనులో భక్తులు స్నానమాచరించి, పాత్రలో నీటిని తీసుకొని స్వామి ఆలయమునకెళ్ళి, ఆ జలముతో స్వామిని అభిషేకించి మ్రొక్కుబడులు ప్రసాదించి తమ తీర్థయాత్రలను పూర్తి చేసుకొంటారు.

పాతాళగంగ స్వామి ఆలయమునకు ఆరు కిలోమీట్ల దూరమున కొండకు 500 అ. లోతునయున్నది. ఇచ్చట పవిత్ర క్రిష్ణవేణినది రెండు కొండల మధ్యన సుళ్ళుగా తిరిగి పెద్ద కుండమువలె ఏర్పడుచున్నది. అందుచేత దీనిని పాతాళగంగ అని వ్యవహరిస్తున్నారు. ఈ జలాశయమునకు వెళ్ళుటకు కొండవీటి ప్రభువు అనవేమారెడ్డిచే నిర్మింపబడిన 900 సోపానములున్నవి. సోపానముల కిరువైపుల రెడ్డి రాజులు, విజయనగర ప్రభువులు నిర్మించిన అనేక మండపములున్నవి. ఇచ్చట జలాశయము నందు పాపాత్ములు తనలో స్నానము చేసి తన కంటబెట్టిన పాపములను గంగాదేవి స్నానముచేసి పాపవిముక్తురాలైనదట! గంగ స్నానముచేసినది కావున దీనికి 'పాతాళగంగ' అను పేరు వచ్చినదని స్థానికుల అభిప్రాయము.

పాతాళగంగతీర్థముతోబాటు, శ్రీశైలక్షేత్రమున గోగర్భము, పాపవినాశనము, బిందుతీర్థము, సిద్ధి రామేశ్వర తీర్థము, ఏనుగుల చెఱువు, రుద్రకుండము మొదలగు అనేకములైన పుణ్యతీర్థములున్నవి.

శ్రీశైలక్షేత్రమునందలి యుత్సవాలలో పవిత్రమైనది శివరాత్రి మహోత్సవము. ఈ పుణ్యదినాన, ఆంధ్రదేశమునుండే కాక యావత్ భారతము నుండి భక్తులు తండోపతండములుగా విచ్చేసి స్వామిని సేవించి ధన్యులవుతారు.

శ్రీశైలక్షేత్రము శ్రీశైలసరోవరనిర్మాణముతో నేడు మతకేంద్రముగానే కాక, సాంకేతిక పరిజ్ఞాన కేంద్రముగా కూడా విరాజిల్లుచున్నది.

* * *

## అహోబిలం - నరసింహస్వామి ఆలయము



అహోబిల నరసింహస్వామి ఆలయము రాయలసీమలో కర్నూలు జిల్లాయందు ఆళ్ళగడ్డకు ఇరవైఐదు కిలోమీటర్ల దూరములో దట్టమైన నల్లమల అరణ్యములందు నిర్మింపబడియున్నది. ఈ క్షేత్రము భారతదేశములోని ప్రఖ్యాతి పొందిన ముప్పదిరెండు నరసింహ క్షేత్రము లందు ప్రధానమైనది. ఈ ఆలయమున్న కొండను ఆదిశేషుడుగా పేర్కొంటారు. ఈ శేషుని తలపై వేంకటేశ్వరుడు, నడుముపై అహోబిల నరసింహస్వామి, తోకపై శ్రీశైల మల్లికార్జునుడు నివసిస్తున్నారు. అహోబిల ఆలయం చుట్టుపట్ల తొమ్మిది నరసింహస్వామి విగ్రహములున్నవి. వాటిలో ఉగ్రనరసింహస్వామే ప్రధానదైవము. ఈ స్వామియే (శ్రీమహావిష్ణువు) భక్తుడైన ప్రహ్లాదుని రక్షించడానికై ఉక్కు స్తంభమును చీల్చుకొనివచ్చి, ఉగ్రరూపమును దాల్చి హిరణ్యకశిపుని హతమార్చినాడు. ఈ ఆలయమునకు సమీపములో ఒక గుహయందు నరసింహస్వామి విగ్రహము, ప్రక్కనే ఒక స్తంభమున్నది. ఇదే ఉక్కు స్తంభమని, దానిని చీల్చుకొనే విష్ణుమూర్తి, నరసింహస్వామి రూపమున వెలుపలికి వచ్చి హిరణ్యకశిపుని వధించినాడని స్థానికుల నమ్మకము.

అహోబిల ఆలయమునందలి నరసింహస్వామి విగ్రహము శిల్పుల చేత మలచబడినట్లు కాక, భయంకరముగా, గరుకుగా వుండుటచేత స్వామి స్వయంభువు అంటున్నారు. ఇచ్చట స్వామి వీరాసనపద్ధతిలో ఆసీనుడై, కుడికాలును మడచిపెట్టి, ఎడమకాలును క్రిందికి జారవదలి పెట్టినాడు. స్వామి యొడిలో హిరణ్యకశిపుడు వెల్లకిలా పరుండగా, తన రెండుచేతులు

ఒకటి రాక్షసుని (హిరణ్యకశిపుని) తలను, మరొకటి వాని కాళ్ళను బంధించి ఉన్నాయి. వాస్తుశాస్త్ర ప్రకారం వీరాసనపద్ధతిలో వున్న నరసింహమూర్తికి వుండవలసిన, నాలుగు నుండి పదహారు చేతులు స్వామికి లేవు. ఉన్నవి రెండుచేతులే. తలపై కీర్తిమకుటము, ఎడమభుజము నుండి వ్రేలాడుతున్న పొడవాటి యజ్ఞోపవీతము, కుడిపాదమువద్ద ప్రహ్లాదుని విగ్రహము వున్నవి. ఈ విగ్రహమునందు విజయనగర వాస్తువు వుట్టిపడుచున్నది. ఆలయ సమీపములో జలాశయమునందలి నీరు ఎఱ్ఱగావున్నది. నరసింహుడు హిరణ్యకశిపుని చంపగా, ఆ రాక్షసుని రక్తము ఒక మడుగుగా ఏర్పడినదట! అదే ఈనాడు 'రక్తకుండ' మనుపేరున పిలువబడుచున్నది. భవాని అనే నది ఈ కొండలందే ఎచ్చటోపుట్టి అహోబిలము వద్దకు చేరగానే, దానిలోని నీరు ఎఱ్ఱగా మారునట. స్వామి రాక్షసుని చంపి, ఈ నదిలో చేతులు కడుగుకొనుటచే నదిలోని నీరు ఎఱ్ఱగా మారుతున్నవని భక్తులు విశ్వసిస్తారు.

**ఆలయము పేరు**

పూర్వము శ్రీమహావిష్ణువు ఉగ్రనరసింహావతారము ధరించి చండప్రచండుడై, హిరణ్యకశిపుని పట్టి తన తొడలపై వేసికొని, వానిని వధించగా, సకల దేవతలు, 'అహో ...బలం, అహో... బలం' అన్నారట. అనగా, 'ఆహా ఎంతబలము' అని అర్థము. ఆ పదమే కాలక్రమమున 'అహోబిలం'గా మారినది.

శ్రీశైలమల్లికార్జునుడు చెంచులకన్యను పెండ్లాడి చెంచుమల్లయ్యగా మారినట్లు, అహోబిలస్వామి కూడా చెంచుకన్యను వివాహమాడినాడు. శ్రీహరి హిరణ్యకశిపుని హతమార్చి నల్లమల అడవులలో విహరించుచుండగా. ఒక చెంచుకన్యను ప్రేమించి, పెండ్లాడి చెంచుల అల్లుడై వారి కోరికపై ఆ యడవియందే స్థిరపడినాడట! ఆనాటినుండి చెంచులకీ స్వామి కులదేవత యైనాడు.

విజయనగరరాజుల కాలమందు అహోబిలక్షేత్రమందు అహోబిల మఠము స్థాపింపబడినది. ఈ మఠస్థాపకుడు నారాయణ జియ్యరు. ఈ మఠాధికారుల నుండే పదకవితాపితామహుడైన తాళ్ళపాక అన్నమయ్య ఉపదేశమును స్వీకరించినాడు. పూర్వమీక్షేత్రమందు అహోబిల మఠముతోబాటు అనేక మఠములుండెడివట.

**ఆలయవర్ణన**

ప్రధాన ఆలయము చుట్టూ ఎత్తుగా, బలిష్ఠముగా నిర్మించిన ప్రాకారమున్నది. ఈ ప్రాకారమందు తూర్పు, పడమరల యందు రెండు గోపురములున్నవి. పడమటి గోపురమే ఈనాడు ఆలయప్రవేశద్వారముగా నున్నది. ఈ ద్వారము గుండా ఆలయములో ప్రవేశించి ఎడమవైపు ఉత్తరవైపుగా తిరిగి ఆలయ ప్రదక్షిణముచేసి ప్రధానాలయము చేరవచ్చును. ఆలయమందు గర్భగృహము, ముఖమండపము వున్నవి. ఈ ఆలయమందు అంతరాళము లేదు. ముఖమండపము వరుసకు నాలుగు స్తంభముల చొప్పున రెండు వరుసలలో ఏడు అడుగుల ఎత్తున్న స్తంభముల చేత నిర్మించబడినది. ముఖమండప స్తంభములు ఒకే కాలమునకు చెందినను రెండు రకములుగా నున్నవి. ముఖమండపమునకు ముందున గర్భాలయమున్నది. గర్భాలయద్వారమునకిరువైపుల గూళ్ళయందు ద్వారపాలకవిగ్రహము లున్నవి. గర్భాలయపు గోడలయందెటువంటి శిల్పములు కానరాక, మధ్యభాగమున నాలుగు అడుగుల ఎత్తుననున్న అధిష్ఠానముపై ఆసీన ఉగ్రనరసింహస్వామి, అతడి తొడలపై హిరణ్యకశిపుడు వున్న మూలబేర మున్నది. స్వామి పాదముల చెంత ప్రహ్లాదుని విగ్రహమున్నది.

అహోబిలమందలి నరసింహస్వామి విగ్రహము, అలంపురము, హంపి, పానగల్లు, నందికొండ, పాలంపేట, గుంటూరు మొదలగు ప్రదేశములందున్నట్లు నాలుగు నుండి పదహారు చేతులను, వాటిలో

మహావిష్ణువు యొక్క ఆయుధములైన శంఖ, చక్రము మొదలగునవి ధరించక, రెండు చేతులను మాత్రమే కలిగియుండి మానవాకృతిలో యున్నది.

ఆలయమునందు, ఆలయచరిత్రకు సంబంధించిన అనేక శాసనములున్నవి. అవన్నియు ఆయా రాజులు, ఆలయమునకు చేసిన దానధర్మములను తెలియజేస్తున్నవి. పశ్చిమ చాళుక్యభూపతి రెండవ విక్రమాదిత్యుడు (1078–1126) ఒక శాసనములో ఆలయమునకు దానధర్మములను చేసినట్లు, ఆ కాలమందు ఆలయములో మూలబేరము మాత్రమే పూజలందుకొనుచున్నట్లు తెల్పినాడు. కడపటి కాకతీయ ప్రభువు రెండవ ప్రతాపరుద్రుడు (క్రీ.శ. 1300–1325) బంగారముతో ఉత్సవ విగ్రహములను చేయించుటేగాక, స్వామి ఆలయములో సక్రమముగా పూజావిధులను ఏర్పాటు చేసినట్లు, విజయనగర చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు (1509–1529) తన దిగ్విజయ యాత్రల తరువాత అహోబిలమునకేతెంచి స్వామిని సేవించి, అతడికి వజ్రాలహారమును, బంగారుకాసులను సమర్పించి, ఆలయమందు మండపాలను, గోపురాలను నిర్మించినట్లు శాసనములు పేర్కొనుచున్నవి. తాళ్ళపాక అన్నమయ్య స్వామిని దర్శించి ఆయన మహిమలను, పాటలుగా పాడి వాటిని రాగిరేకులపై చెక్కించినాడు.

* * *

# మహానంది - మహానందీశ్వరాలయం



ఆంధ్రదేశమందలి పవిత్ర శైవ పుణ్యక్షేత్రములందు పేర్కొనదగినది మహానందీశ్వరాలయము. ఈ పుణ్యక్షేత్రము కర్నూలు జిల్లాలో నంద్యాలకు 10 మైళ్ళ దూరాన నల్లమల కొండలయందున్నది. ఇచ్చట ఆలయంతోబాటు శోభాయమానమైన ప్రకృతి రామణీయకత భక్తుల కళ్ళకు విందు చేస్తున్నది. మహానందీశ్వరునికి శ్రీశైలమల్లికార్జునునికి అవినాభావ సంబంధమున్నదనీ, అందుచేత భక్తులు ఒక ఆలయాన్ని దర్శించిన తర్వాత రెండవదాన్ని తప్పనిసరిగా దర్శించవలయునని ప్రజల విశ్వాసం.

మహానందీశ్వరాలయమందలి శివలింగము స్వయంభువు. ఈ ఆలయానికి చుట్టుపట్ల పదిమైళ్ళలోపల ఇంకా ప్రథమనంది, సోమనంది, సూర్యనంది, గరుడనంది, నాగనంది, విష్ణునంది, రుద్రనంది, బ్రహ్మానంది అనబడు ఎనిమిది నందీశ్వరాలయములు వెలసియున్నవి. మహానందీశ్వరునితో కలిపి వీటిని 'నవనంది' క్షేత్రాలంటారు. నంద్యాల పట్టణమందు ప్రథమనంది, సోమనంది, బ్రహ్మానందీశ్వరాలయాలున్నాయి. పేరుకు నందులన్నను ఇవన్నియు శివలింగములే.

**ఆలయానికి సంబంధించిన పౌరాణిక కథలు**

పూర్వము నందీశ్వరుడను మహర్షి శంకరుని గురించి వందలకొద్ది సంవత్సరాలు ఘోరతపస్సుచేయగా పరమేశ్వరుడతని భక్తికి మెచ్చి ప్రత్యక్షమై వరములను కోరుకొమ్మనగా నందీశ్వరుడు 'స్వామీ! యుగాంతరమువరకు నిన్ను నేను మోయవలయునన్న కోరిక వున్నది. కావున నీవు నాపై

శాశ్వతముగా నివాసమేర్పరచుకొమ్ము' అని వేడగా శివుడు భక్తుని కోరికను ఆమోదించాడు. వెంటనే నందీశ్వరుడు పర్వతరూపమును ధరించాడు. ఆ పర్వతముపై ఈశుడు లింగరూపమున నివాసమేర్పరచుకొన్నాడు. ఆనాటినుండి పర్వతాన్ని, శివలింగాన్ని కలిపి నందీశ్వరుని పేరున 'నందీశ్వరాలయ'మని వ్యవహరించుచున్నారు.

మరొక ఐతిహ్యం ప్రకారం పూర్వము శిలాధుడనే ఋషి పరమేశ్వరుని దర్శనం కోసం తపస్సు చేయగా కొంతకాలానికి భగవంతుడు ప్రత్యక్షమై, ఏమి వరములు కావలయునో కోరుకొమ్మనగా శిలాధుడు పరమేశ్వరునితో 'స్వామి, నేను తపస్సు చేసిన ఈచోట సర్వకాలములందు సమృద్ధిగా నీరుండవలయును. అంతేగాక పరమేశ్వరుడైన నీవు ఈ ప్రదేశమందు స్థిరనివాసమేర్పరచుకొనవలయును' అని కోరగా మహాదేవుడందుకొప్పుకొని అచ్చటనే లింగరూపమును దాల్చి, భక్తుడు కోరినట్లు ఎల్లకాలమందు తన క్రిందనుండి నీటిని ప్రవహింపజేస్తున్నాడట.

సామాన్యులు నందినోట నుండి జలము వచ్చుటచే ఈ క్షేత్రాన్ని మహానంది అను పేరున పిలుచు ఆచారము కూడా యున్నది.

**ఆలయనిర్మాణము**

మునుపెన్నడో కర్నూలు మండలాన్ని నందరాజనే భూపాలుడు పాలిస్తూండేవాడు. అతడికి పెద్ద ఆలమంద వుండేది. ఆలమందలోని ఒక



ఆవు రోజూ మేతకు వెళ్ళినపుడు అడవిలో ఒక పుట్టమీద తన పొదుగులోని పాలను కార్చివేసేది. ఇంటికి వచ్చిన పిదప గోపాలుడు పాలు పితికితే ఆ యావు పొదుగునుండి పాలు వచ్చేవి కావు. ఆ విషయం వారు రాజునకు విన్నవించుకోగా, రాజు గోపాలురతో ఆవు పొదుగులోని పాలు ఏమౌతున్నాయో కనిపెట్టమన్నాడు. మరుసటి రోజు రాజాజ్ఞానుసారం గోపాలురు అడవిలో ఆవును జాగ్రత్తగా కనిపెట్టి వుండగా, అదివెళ్ళి పుట్టమీద పాలు చిమ్మసాగినది. వెంటనే పశువుల కాపరి కట్టెతీసుకొని ఆవును కొట్టుటకు ఉరకగా, ఆవు బెదరి పుట్టమీద కాళ్ళుపెట్టగా కాళ్ళు పుట్టలోనికి దిగబడిపోయినవి. ఆ సాయంత్రం గోపాలురు అడవిలో జరిగిన ఉదంతం రాజునకు విన్నవించుకొన్నారు. ఆ రాత్రి పరమేశ్వరుడు నందరాజుకు కలలో కనిపించి తాను పుట్టలో స్వయంభూలింగముగా అవతరించియున్నానని, ఆ పుట్టచుట్టూ ఆలయం నిర్మించమని ఆదేశించి, ఆ ఆలయానికి నందీశ్వరాలయమని పేరుపెట్టమన్నాడు. రాజుగారు తెల్లవారి అనుచరులతో వెళ్ళి పుట్టను పరిశీలించగా శివలింగం కనబడినది.

పరమేశ్వరుని ఆజ్ఞమేరకు రాజు పుట్టచుట్టూ ఆలయం నిర్మించి దానికి మహానందీశ్వరాలయమని నామకరణం చేసినాడు. ఈ ఆలయంతోబాటు చుట్టుపట్ల ఇంకా ఎనిమిది నంది ఆలయాలు నిర్మించినాడు.

మహానందీశ్వరాలయమందు పరమాశ్చర్యకరమైన విషయం మహానందీశ్వరలింగం క్రిందిభాగమున నీటిబుగ్గ పుట్టి భూమి లోపల కొన్ని గజాలు పయనించి ఆలయ ప్రాంగణం ముందున్న కోనేరులు రుద్రకుండము విష్ణుకుండము, బ్రహ్మకుండములలోనికి పారుతుంది. ఏ ఋతువునందు కూడా ఈ నీటిపారుదల మట్టమందు హెచ్చుతగ్గులుండవు.

**ఆలయవర్ణన :** మహానందీశ్వరాలయం ఆగమశాస్త్ర నియమాలను పాటించి నిర్మాణం చేసినట్లు కానరాదు. ప్రధానాలయం చుట్టూ పెద్ద పెద్ద రాళ్ళను

ఒకదానిపై ఒకటి పేర్చి కట్టిన ప్రాకారమున్నది. ఈ కుడ్యమందే ఆలయ ప్రవేశానికి పడమటివైపున ప్రవేశద్వారము, దానిపై గోపురము వున్నవి. ఉత్తర దక్షిణవైపుల కూడా ద్వారములు, వాటిపైన గోపురములున్నవి. ఆలయ గోడలపైన ఎటువంటి శిల్పములు కానరావు. ప్రహరీగోడకు లోపలివైపున వెలుపలివైపు ఆలయం చుట్టూ స్తంభాల సాయముతో కట్టబడిన విశాలమైన మండపమున్నది. ఈ మండపమును 'తిరుమళాయమండప'మని అంటారు. ఆలయంలో ప్రవేశించగానే ముఖద్వారమునకెదురుగా కనపడేది స్ఫటికలాంటి స్వచ్ఛమైన నీటితో నిండిన కోనేరు (కుండ్రము). దీనిచుట్టూ రాతితో మలచిన కట్టడమున్నది. ఈ కోనేరులోనికి నీరు తూర్పువైపున అమర్చిన నంది నోటిలో నుండి ప్రవహిస్తూ వుంటుంది. ఇందులోని నీరు 5 అడుగులు దాటగనే వెలుపలికి తూములుగుండా పోయి ఆలయానికి ముందుభాగాన వున్న బ్రహ్మకుండము, విష్ణుకుండములలోనికి వెళ్ళి ఆపైన ఆ కోనేరుల నుండి ప్రవహించి చుట్టుప్రక్కల పంటపొలాల సాగుకు ఉపయోగపడుతున్నాయి. రుద్రకుండముచుట్టు స్తంభముల సాయంతో నిర్మించిన మండపమున్నది. ఈ మండపముల పైభాగమున ఉత్తర, దక్షిణ, పడమరవైపులందు చిన్న



గూళ్ళలాంటి గోపురములున్నవి. కోనేరు మధ్యభాగమున నాలుగు స్తంభాల సాయంతో కట్టిన మండపమున్నది. ఈ కోనేటి చుట్టూ మధ్యభాగానవున్న మండపాల్ని విట్టారెడ్డి అనే భక్తుడు క్రీ.శ.1912 సం॥ నిర్మించినట్లు తెలుస్తోంది. ఈ కోనేటి నీరు స్వచ్ఛంగా వుండుటచే ఏ చిన్న వస్తువునైనా పడవేసినచో అది స్పష్టంగా కనబడుతుంది. ఈ ఆలయాన్ని దర్శించిన యాత్రికులు ఈ రుద్రకుండమనే తీర్థమందు స్నానమాచరించి వారి పాపములు నశించి ముక్తిని పొందినట్లు పరవశిస్తారు. అంతేగాకుండా ఈ నీటిలో స్నానమాచరించుటచే దీర్ఘకాలరోగాలు నశిస్తాయని భక్తుల విశ్వాసము.

రుద్రకుండము నుండి ఆలయముఖమండపము వరకు సోపాన మార్గమున్నది. ప్రధానాలయమందు ముఖమండపము, అంతరాళము, గర్భగృహము వున్నవి. గర్భగృహమునకు దక్షిణవైపున ఉత్తరవైపున రెండు చిన్నగుళ్ళున్నవి. ఈ గుళ్ళను చుట్టి స్తంభములచే నిర్మించిన సన్నటి మండపమున్నది. అంతరాళమునకు, గర్భగుడికి మధ్యన 14 స్తంభాల సాయంతో నిర్మించిన దీర్ఘచతురస్రాకార మండపమున్నది. అంతరాళమునకు ముందుభాగమున 4 స్తంభముల సాయంతో నిర్మించిన ముఖమండపము మధ్యన వేదిక పై నంది విగ్రహములున్నవి. గర్భాలయముపైన వేసరపద్ధతిలో చాళుక్యులనాటి నాలుగంతస్తుల విమానము, అగ్రభాగాన అమలకశిఖరము, శిఖరముపైన కలశము వున్నవి. గర్భాలయగోడలపైన అపస్మారమూర్తి, నటరాజశిల్పములు చెక్కబడినవి.

గర్భాలయంలో పుట్ట ఆకృతిలోనున్న దిబ్బ నడుమన స్వయంభూ లింగమనబడు మహానందీశ్వరస్వామి లింగమున్నది. లింగము పైభాగాన ఆవుగిట్టలను పోలిన రంధ్రాలు అతి సహజంగా చోటు చేసుకొన్నాయి. ఈ రంధ్రాలలో చేతులు చాపవచ్చు. పుట్టపై పాలుగారినట్లున్నటువంటి తెల్లటి చారలున్నవి. ఈ లింగము అడుగు భాగము నుండి నీరు ఊరి

రుద్రకుండములోనికి ప్రవహిస్తుంది. లింగము శిల్పిచేత చెక్కబడినట్లు కాక ఎగుడుదిగుడుగా వుండుటచే స్వయంభూవని నిర్ధారణగా చెప్పవచ్చును. స్వామికి అభిషేకము చేసిన జలము మొత్తము లింగము క్రింది భాగముననున్న జలవూటలో కలసిపోవును.

ప్రధానాలయమునకు దక్షిణభాగమున పార్వతీదేవి ఆలయమున్నది. ఆలయంలో గర్భగృహము, అంతరాళము, ముఖమండపములున్నవి. గర్భగృహమందు దేవి విగ్రహము ప్రతిష్ఠింపబడియున్నది. ఈ ఆలయమందలి శిల్పకళాపద్ధతిని పరికించినచో ఇది కడపటి విజయ నగరరాజుల కాలమందు నిర్మించినట్లు పేర్కొనవచ్చును. దేవి ఆలయం చెంతనే రామాలయం, నటరాజాలయాలున్నవి.

మహానందీశ్వరాలయమున ఆలయనిర్మాణాన్ని గురించి తెలియజేసే శిలాశాసనములు కానరావు. ఒకచోట మాత్రము విడివిడిగా పడివున్న కొన్ని రాతిపలకములమీద క్రీ.శ. 8, 9 శతాబ్దములకు చెందిన కొన్ని శిథిలమైన శాసనములు కానవచ్చుచున్నవి. ఇవి ఆలయచరిత్రను తెలుసుకొనుటకు ఎంతమాత్రము ఉపయోగపడుటలేదు. నంద్యాల పట్టణమందు, చుట్టుపట్ల గ్రామాలలో లభ్యమయ్యే శాసనాలనుబట్టి ఈ ప్రాంతము క్రీ.శ. 7వ శతాబ్దమందు బాదామి చాళుక్య ప్రభువు మొదటి విక్రమాదిత్యుని (క్రీ.శ. 655-680) ఏలుబడిలో వున్నట్లు, అతడి కాలములోనే ఈ ఆలయనిర్మాణం ప్రారంభమైనట్లు తెలుస్తున్నవి.

* * *

## యాగంటి - ఉమామహేశ్వర ఆలయం



ఆంధ్రదేశచరిత్రలో కర్నూలు జిల్లాకు ఒక ప్రత్యేక స్థానము కలదు. ఈ జిల్లాలోనే ప్రసిద్ధ నల్లమల ఎర్రమల అరణ్యాలు కలవు. ఇచ్చటే ఆదిమానవుడి ఆవాసాలు లభ్యమైనాయి. వాటిలో ప్రపంచ ప్రసిద్ధి చెందిన బెలూన్ గుహలు వెలుగులోనికి వచ్చాయి. ఈ గుహలలోనే జైనులు, బౌద్ధులు నివసించేవారు. ఆ తర్వాత భారతదేశంలోనే మొట్టమొదటి చారిత్రక రాజవంశీకులైన మౌర్యులు ఈ జిల్లావరకు రాజ్యవిస్తరణ కావించినట్లు ఈ వంశ ప్రసిద్ధ చక్రవర్తి అశోకుడి శాసనం ఈ జిల్లా ఎర్రగుడి గ్రామం వద్ద కలదు. మౌర్యవంశం తరువాత ఈ ప్రాంతాన్ని వారి సామంతులైన ఆంధ్ర శాతవాహనులు, రాష్ట్రకూటులు, పశ్చిమ చాళుక్యులు, విజయనగర ప్రభువులు, మహారాష్ట్రులు, మొగల్ చక్రవర్తులు, నిజాం ప్రభువులు పాలించారు. ఈ ప్రాంతాన్ని ఆంగ్లేయులు దత్తమండలాలు అని పేర్కొనగా దీన్ని క్రీ.శ. 1953 సంవత్సరమందు ఈ జిల్లాలను తమిళనాడు నుండి విడదీసి ఆంధ్రరాష్ట్రం ఏర్పడినప్పుడు కర్నూలు పట్టణాన్ని ఆంధ్ర రాష్ట్రానికి రాజధానిగా నిర్మించారు. ఈ రాయలసీమనే పూర్వము దత్తమండలాలు అని పిలిచేవారు.

కర్నూలు జిల్లాలో ముఖ్యంగా నల్లమల, ఎర్రమల అటవీ ప్రాంతాలలో ఎన్నో ప్రాచీన ఆలయాలు నిర్మితమై ఉన్నాయి. వాటిలో అతి ప్రాచీనమైన శ్రీశైల శ్రీ మల్లికార్జున ఆలయం, యాగంటి ఉమామహేశ్వరాలయం ప్రముఖమైనవి. అలాగే వైష్ణవులకు అతి పవిత్రమైన అహోబిల శ్రీ నరసింహ

స్వామి ఆలయం. దీనికి అనుబంధంగా అనేక ఆలయాలు కలవు. మరో ముఖ్యమైన శివాలయం నంద్యాల పట్టణానికి సమీపంలో ఉన్న మహానందీశ్వర ఆలయం. కర్నూలు పట్టణానికి 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉమామహేశ్వర ఆలయం పవిత్రమైన ఆలయం. ఇది వింతలకు నిలయం. అంతేకాదు పర్యాటకులకు స్వర్గధామం. ఈ ఆలయం చుట్టూ అనేక గుహలు, పర్వతాలు కలవు. ఈ ప్రదేశం అత్యంత సుందరంగా, ఆకర్షణీయంగా కనులకు ఇంపుగా ఉంటుంది. ఈ ఆలయమందలి వింతలు, నిర్మాణ కౌశల్యము నేటి సాంకేతిక పరిజ్ఞానానికి సవాలుగా నిలిచి ఉన్నాయి.

యాగంటి అనే పేరు ఈ ప్రాంతమందు పూర్వం చిట్టెప్ప అనే శివ భక్తుడు ఉండేవాడు. ఒకరోజు అతడికి పరమేశ్వరుడు పులిరూపంలో కనబడగా చిట్టెప్ప పులిని పరమశివుడిగా భావించి గట్టిగా నేగంటి నేగంటి అని అరచినాడట అంటే నేను శివుడిని చూచినాను అని అర్థము. నేగంటి నేకంటి అనికాలక్రమంలో యాగంటిగా రూపుదిద్దుకొంది. ప్రస్తుతం ప్రధాన ఆలయం ప్రక్కనే చిట్టెప్ప గుహ ఉంది.

**ఆలయప్రశస్తి**

అగస్త్య మహర్షి దక్షిణదేశయాత్ర కావిస్తూ ఈ ప్రదేశానికి వచ్చి ఇచ్చటి ప్రకృతిరమణీయతకు ముగ్ధుడై అక్కడే శ్రీ వేంకటేశ్వరస్వామిని ప్రతిష్ఠించాలని



తానే స్వయంగా వేంకటేశ్వరస్వామి శిలావిగ్రహాన్ని రూపొందిస్తూ ఉండగా ఉన్నట్లుండి స్వామి కుడిపాదం బొటనవేలు విరిగిపోయింది. అంతేకాక విరిగిన వేలు నుండి రక్తం కారినదట. అగస్త్యులు తనవల్ల ఏదో అపరాధం జరిగినది అని భావించి విగ్రహప్రతిష్ఠ నిలిపివేసి ఇలా ఎందుకు జరిగినదో తెలుసుకోవాలని తన ఇష్టదైవమైన పరమేశ్వరుని ప్రార్థించగా, శివుడు ప్రత్యక్షమై శ్రీహరి మరో ప్రదేశంలో ప్రతిష్ఠింపబడి పూజలందుకుంటూ ఉన్నాడని తనకు ఈ క్షేత్రం కైలాసం వలే కనబడుచున్నందున తాను ఇచ్చట నివసించాలని తెలుపగా, అగస్త్య మహర్షి స్వామితో అయితే మీరు సతీసమేతంగా మానవరూపంలో ఇచ్చటే కొలువై ప్రజలను ఆదుకొని వారిని రక్షించాలని కోరగా స్వామి అందులకు అంగీకరించి మహర్షి కోరిక ప్రకారం పార్వతీపరమేశ్వరులిద్దరూ ఏకరూపులై అర్ధనారీశ్వరులుగా ఏకస్వరూపంతో ఉమామహేశ్వరస్వాముల పేర కొలువై భక్తుల కోరికలను తీరుస్తూ ఉండమని కోరగా పరమేశ్వరుడు అంగీకరించి అచ్చట కొలువైనాడు. అగస్త్య మహర్షి రూపొందించిన శ్రీ వేంకటేశ్వరస్వామి విగ్రహం సమీపంలోని ఒక గుహలో ప్రతిష్ఠింపబడ్డాడు. కొంతమంది ఈ వేంకటేశ్వరస్వామి విగ్రహం తిరుమల వేంకటేశ్వర విగ్రహం కంటే ప్రాచీనమైనది అంటారు. యాగంటి ఉమామహేశ్వరాలయం ఏకకాలంలో నిర్మించినట్లు చెప్పలేము.

ఆలయనిర్మాణంలో పల్లవ, రాష్ట్రకూట, పశ్చిమ చాళుక్యులు, కాకతీయుల నిర్మాణశైలిని బట్టి ఆయా కాలాల్లో నిర్మాణాలు ఆలయవిస్తరణ కొనసాగి విజయనగర రాజులు హరిహర బుక్కరాయల కాలం నుండి సదాశివరాయల కాలం నాటికి నిర్మాణాలు పూర్తయినట్లు తెలుస్తూ ఉంది. ఆలయమందు ఆలయనిర్మాణానికి చెందిన శాసనాలు కలవు. ఉమామహేశ్వరస్వామి ఆలయనిర్మాణం కొండగుహల మధ్య చదునుగా ఉన్న ఒక ప్రదేశంలో నిర్మింపబడినది. ఆలయమందు గర్భగృహము అంతరాళము, స్తంభాల మంటప సముదాయం కలవు. గర్భాలయమందు స్వామి అమ్మవార్ల విగ్రహం మానవరూపంలో చెక్కబడి ఉంది. స్వామి ఎడమతొడను ఆనుకొని దేవి కలదు. ఈ దేవేరులు వెనక మకరతోరణం

కలదు. వీరికి స్వర్ణకవచాలు అమర్చారు. ఆలయమందలి దేవేరులకు సకలాభరణాలు కలవు. వీరు పిలిస్తే పలికే దేవుళ్ళు. మామూలుగా శివుడు లింగరూపంలో అతడికి సమీపంలో దేవి స్థానకముద్రలో ప్రతిష్ఠింపబడి ఉంటారు. అయితే ఇచ్చట అరుదుగా అపూర్వమైన ఏకరూప మానవరూపంలో ఉన్నాడు.

స్వామి గర్భాలయం పైన విమానము ఆపైన కలశము కలవు. గర్భాలయం ముంగిట అంతరాళమందు ఉత్సవమూర్తులు, దానిముందు ముఖమండపము కలదు. ఈ మండప ప్రవేశద్వారం అపురూప శిల్పాలు కలిగి స్వర్ణతాపడం చేసినట్లు ఉన్నది. ఈ ముఖమండపం, మహామండపం కలిపి ఒకటిగా నిర్మింపబడినది. స్తంభాలన్నీ వివిధరకాల శైవ, వైష్ణవ దేవీ శిల్పాలతో అలంకరింపబడ్డాయి. ఈ మండపం ప్రక్కన మరో రెండు గృహాలయాలు ఉన్నాయి.

ముఖమండపానికి ప్రక్కన ఈశాన్యదిశలో అపురూపమైన నందిమండపం కలదు. ఈ మండపమందు విచిత్రంగా ఆసీనముద్రలో నందీశ్వరుడు కొలువై ఉన్నాడు. స్వామి ముక్కుతాడు కలిగి ఉన్నాడు. ఈ స్వామిని స్వయంభు అంటారు. ఈ స్వామి 15 అడుగుల పొడవు 10 అడుగుల వెడల్పు 8 అడుగుల ఎత్తు ఉన్నాడు. అందుకే స్వామి అందముగా లేడు. స్వామి విగ్రహం మెల్లమెల్లగా పెరుగుతూ ఉన్నదని తెలుస్తూ ఉంది. కొంతకాలం ముందు వరకు స్వామిచుట్టూ ప్రదక్షిణ చేయడానికి స్థలం ఉండేదట. అయితే ప్రస్తుతం ఆ స్థలాన్ని నందీశ్వరుడు పెరుగుతూ ఆక్రమించేశాడు. ఈ విషయాన్ని పురావస్తు శాస్త్రజ్ఞులు కూడా నిర్ధారించారు. ఇటీవల కాలంలో భక్తులు, పండితులు నంది కదులుతూ ఉన్నాడని, త్వరలోనే కలియుగం అంతమైపోతుంది అంటున్నారు. కదులుతూ ఉన్న నందీశ్వరుని చూచుటకు వేలాదిగా భక్తులు తరలి వస్తూ ఉన్నారట అందుచేతనో ఏమో దైవాంశసంభూతుడు కాలజ్ఞాన తత్వవేత్త అయిన శ్రీ పోతులూరి వీరబ్రహ్మం గారు తన కాలజ్ఞానతత్త్వాలలో ఒకదానియందు యాగంటి బసవన్న

అంతకంతకు పెరిగి కలియుగాంతమునందు రంకె వేసెను అన్నాడు. ఆ రంకె విన్నవారు నశిస్తారని మిగిలినవారు మాత్రమే మనుగడ సాగిస్తారని అన్నారు. శ్రీ పోతులూరి వీరబ్రహ్మం గారు ఈ పుణ్యక్షేత్రంలో కొంతకాలం తపస్సు చేసుకున్నాడట.

నందిమండపాన్ని ఆనుకొని కొన్ని చిన్న చిన్న మండపాలు కూడా కలవు. ఈ నంది మండప స్తంభాలు కాకతీయ వాస్తుశైలిలో మలచబడినాయి. ఆలయమందు ముందుభాగాన క్షేత్రపాలకుడైన వీరభద్రస్వామి కొలువై ఉన్నాడు. గర్భాలయం ముందు రాజగోపురం, వెనుక ధ్వజస్తంభము, బలిపీఠము ఉన్నాయి. ఆలయం ముందువైపు అయిదంతస్తుల మనోహరమైన రాజగోపురము కలదు. గోపురం మొత్తం దేవతాశిల్పాలతో అలంకరింపబడినది. గోపురం పైన ఐదు కలశాలు కలవు. ఈ గోపురాన్ని ఇటీవలే పునరుద్ధరించినట్లు తెలుస్తూ ఉంది. గోపురాన్ని ఆనుకొని ఉమామహేశ్వరాలయం సమీపంలో ఒక గుహాలయము కలదు. ఈ గుహలో శ్రీ వేంకటేశ్వరస్వామి నిలువెత్తు విగ్రహము ఉన్నది. మరో గుహలో పార్వతీదేవి ప్రతిమ కలదు.

శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయంలో ఎంతో అందంగా అపురూప శిల్పకళానైపుణ్యంతో అలంకారాలతో నిర్మింపబడిన పుష్కరిణి కలదు. ఈ



కోనేటిని అగస్త్యకోనేరు అంటారు. దీనిని ఆ స్వామి నిర్మించాడని ఇందులోనే అతడు స్నానపానాదులు నిర్వహించేవారని తెలుస్తుంది. ఈ కోనేటి జలంతోనే స్వామివార్లకు అభిషేకం చేస్తారట. పుష్కరిణి పైభాగాన తూర్పువైపు, కోనేటిలోనికి గొట్టము ద్వారా నీరు వస్తుంది. ఈ నీటిజారపై ముఖద్వారము, దానిపైన శిల్పాలతో అలంకరించిన ఎత్తైన గోపురము కలదు. అంతేకాక కోనేటికి నాలుగువైపులా నాలుగు చిన్నపాటి గోపురాలు నిర్మించారు.

ఆలయం కొండగుహల క్రింది భాగము నుండి ముచ్చర్ల అనే గ్రామం నుండి 15 మైళ్ళు అంతర్వాహినిగా ప్రవహించి ఒక గంగ నందీశ్వరుని నోటిద్వారా కోనేటిలోనికి చేరుతుంది. ఈ నీరు ఎంతో స్వచ్ఛంగా ఔషధగుణాలు కలిగి ఉండుటచేత భక్తులు ఈ నీటిలో స్నానంతో పాటు తీర్థంగా కూడా సేవిస్తారు. కోనేటిలో ఎల్లప్పుడూ దాదాపు 5 అడుగుల లోతు నీరు ఉంటుంది. కోనేటి లోపల నీటిపైన అంచుల పైభాగం మొత్తం శిల్పాలతో అలంకరించారు. వీటిలో కొన్ని శ్రీకాళహస్తీశ్వర, రావణబ్రహ్మ కైలాసాన్ని పెకలించుట, మార్కండేయ మహర్షి, ఉమామహేశ్వర, కుమారస్వామి, వినాయక ప్రముఖమైనవి. కోనేరు లోనికి దిగుటకు ఎక్కుటకు మెట్ల వరుసలు కలవు. ఆలయమెట్లవరసపై శిల్పాలు చెక్కినారు. ఉత్సవ కాలంలో దేవిదేవేరులు ఈ కోనేటిలోనే తెప్పలపై విహరిస్తారు. ఈ కోనేరు మధ్యన నాలుగు స్తంభాల సాయంతో నిర్మించిన నీరాళిమండపం, దానిమధ్యన వినాయక విగ్రహం కలవు. కోనేరు నిర్మాణం మొత్తం ఎర్రటి ఇసుక రాతితో నిర్మించారు.

యాగంటి క్షేత్రంలో మరో వింత ఏమిటంటే, ఈ కొండ కోనల్లో ఎచ్చట కాకులు కానరావు. దీనిని గురించి ఒక కథ ప్రచారమందున్నది. పూర్వం అగస్త్య మహర్షి ఇచ్చట పరమేశ్వరుని గురించి తపస్సు చేస్తూ ఉండగా కాకాసురుడు కాకిరూపంలో వచ్చి మహర్షితపస్సును భంగం చేయగా, అతడు కోపించి ఈ ప్రదేశంలో ఎప్పటికీ కాకులు రాకూడదు అని శపించాడట. అందుచేత ఇచ్చట కాకులు కానరావు. అంతేకాక కాకి

శనీశ్వరుడి వాహనం. ఆ వాహనం లేనిచోట స్వామిని పూజిస్తే శని ప్రభావం ఉండదని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అందుచేతనే శనీశ్వరుడు లేని ఈ క్షేత్రాన్ని భక్తులు అమితంగా పూజిస్తారు.

ఇచ్చట వేంకటేశ్వర, అగస్త్య, రోకళ్ళు, శంకరగుహలు ప్రముఖమైనవి శంకరగుహకు సమీపంలో వీరబ్రహ్మేంద్రస్వామి కొంతకాలం తపస్సు చేస్తూ గడిపాడట. ఈ సమయంలోనే ఆ స్వామి అచ్చమ్మ అనే భక్తురాలికి ఆమె భర్తకు జ్ఞానోపదేశం చేశాడట. ఈ ఆలయం కొండ ప్రాంతంలో నిర్మించినందువల్ల ఎత్తుపల్లాలుగా ఉంటుంది.

యాగంటి పట్టణంలో యాత్రికులకు వసతి బస ఏర్పాట్లు పుష్కలంగా కలవు. అలాగే ప్రయాణ సౌకర్యాలు కూడా ఉన్నాయి. యాగంటి ఉమామహేశ్వరస్వామిని ఆలయమందు శాసనాలు ఎంతగానో పేర్కొంటున్నాయి. శాసనపైగాలలో విజయనగర ప్రభువుల రాజముద్రిక వరాహము, తిప్పి పట్టిన కత్తి, పైన సూర్యచంద్రుల శిల్పాలు ఉన్నాయి. ఇందులో ఒక ముఖ్యమైన శాసనం ఆలయచరిత్రను, ప్రాశస్త్యాన్ని ఎంతగానో పొగుడుతూ ఉంది.

ఇచ్చట ఒక రాతి స్తంభంపైన పెద్ద పాత్రలో పుణ్యదినాలలో నిండుగా నూనె, నెయ్యి పోసి దారంతో లావుపాటి వత్తిని తయారుచేసి ఆ ప్రమిదలో ఉంచి వత్తిని వెలిగిస్తారట! దీనిని అఖండదీపం అంటారు. ఈ దీపం సాయంకాలం వెలిగిస్తే తెల్లవారి నూనె ఆవిరైపోయేవరకు ఎన్ని అవాంతరాలు, అవరోధాలు ఎదురైనా ఆరిపోకుండా వెలుగుతూ ఉంటుందట. ఆలయమందు తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయం వలె బ్రహ్మోత్సవాలు, అగస్త్య మహర్షి జన్మతిథి, రథసప్తమి, దీపావళి ఉత్సవాలు జరుగుతాయట. వీటిలో ప్రముఖమైనది శివరాత్రి ఉత్సవాలు. ఈ పవిత్రమైన రోజుల్లో లెక్క కట్టలేనంతమంది భక్తులు ఆలయానికి వచ్చి స్వామిని పూజించి ధన్యులవుతారు.

* * *

# ఊరుకొండ - లక్ష్మీనరసింహస్వామి దేవాలయం



ఊరుకొండ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం ఉన్న కర్నూలు జిల్లా కౌతాళం మండలంలో ప్రముఖ పుణ్య క్షేత్రం. ఇచ్చట అతిపురాతనమైన లక్ష్మీనరసింహస్వామి ఆలయం కలదు. ఈ ఆలయం ఏనాటిదో ఎవరు నిర్మించారో స్పష్టంగా తెలియదు. అంతేకాదు ఈ క్షేత్రమహిమ ఇచ్చట కొలువై ఉన్న దేవుని గురించి రకరకాల చిత్రవిచిత్రములైన కథలు ప్రాచుర్యంలో ఉన్నాయి. వీటిని ఎలా నమ్మాలో చెప్పలేము. ఇచ్చట వెలసిన స్వామి విష్ణు (శ్రీనరసింహ) శివుడు (వీరభద్రస్వామి) ఇద్దరూ ఏకరూపులు. వీరిని నరసింహస్వామి అని, వీరభద్రస్వామి అని, శ్రీలక్ష్మీనరసింహస్వామి అనీ లేక శివుని వీరన్న అని కొలుస్తారు.

స్థానికుల కథనం ప్రకారం ఈ గ్రామానికి 12 సంవత్సరాల బాలుడు ఒకమారు వచ్చి ఇచ్చటే ఉంటూ గ్రామప్రజల గోవులను అడవిలో మేపుతూ ఉండేవాడట, ఈ బాలుడి పేరు హిరణ్య, ఇతడు బాల బ్రహ్మచారి యోగి, సిద్ధుడు. ఎక్కువగా గ్రామం ముంగిట ఉన్న రావిచెట్టును దైవస్వరూపంగా భావించి పూజిస్తూ ఆ వృక్షఛాయనే నివసిస్తూ ఉండేవాడు. ఒకరోజు ఒక సిద్ధుడు ఆ రావిచెట్టు వద్దకు వచ్చి ఆ బాలుని చూచి అతడు దైవాంశ సంభూతుడు అని భావించి ఆ బాలునికి జ్ఞానోపదేశం చేశాడు. ఆనాటి నుండి ఆ బాలుడు (హిరణ్య) తరచూ యోగనిద్రలోనికి వెళుతూ అనేక

మహిమలు, అద్భుతాలు ప్రదర్శిస్తూ భక్తులకు జ్ఞానోపదేశం చేస్తూ వారిని భక్తిమార్గంలో నడిపి, నడవమని పలికేవాడు.

అలాంటి బాలుడు ఒకనాడు ఉన్నట్లుండి అదృశ్యమైనాడట. ఎన్ని రోజులకు అతడి జాడ ప్రజలకు తెలియలేదు ఆ బాలుడు అచ్చటే రావి చెట్టుకిందనే భూమిలోపల తపస్సు చేసుకుంటూ ఉండవచ్చని ప్రజలు భావించి చెట్టుకింద చుట్టూ త్రవ్వకాలు ప్రారంభించగా కొంత లోతున వారికి వీరభద్రస్వామి ప్రతిమ కనపడినదట. ఆ విగ్రహాన్ని ప్రజలు హిరణ్యగా భావించి పైకి తెచ్చి ప్రతిష్ఠించారు ఆ త్రవ్వకాలలో ఒకవైపు విష్ణు (లక్ష్మీనరసింహస్వామి) విగ్రహం కనబడగా ఆ విగ్రహాన్ని పైన ఉంచిన హిరణ్యవిగ్రహం ప్రక్కన ప్రతిష్ఠించారు. కాలగమనంలో హిరణ్య అనే పదమే ఈరన్నగా మార్పు చెందినదట. అనగా ఒకే ప్రదేశం అందు శివుడు హిరణ్య వీరభద్రస్వాములు విష్ణు కొలువై హరిహరులు వేరు కాదని వారు ఒకరే అని ప్రజలకు హరిహరాద్వైతాన్ని నిరూపించారు. ఆ రోజునుండి భక్తులు ఈ దేవుళ్లను భక్తితో పూజిస్తూ ఉన్నారు. అయితే ఆలయమందు ప్రజలు వీరశైవసాంప్రదాయపద్ధతిలో పూజలు కొనసాగిస్తూ ఉన్నారు. ఈ దేవుళ్ళు కొలువై ఉన్న ప్రదేశంలోనే రావిచెట్టు ఎన్ని శతాబ్దాల నాటిదో చెప్పలేము. ఈ దేవుళ్లకు ఒక ఆకారం అంటూ ఉన్నదని చెప్పలేము. పేరుకు లక్ష్మీనరసింహ స్వామి ఆలయం ఉంటున్నా వీరన్నస్వామి ఆలయం అనే ఆ ప్రాంతీయులు పేర్కొంటారు.

ఈ లక్ష్మీనరసింహస్వామి ఆలయం చుట్టూ ఎత్తైన ప్రహరీ అందులో నాలుగువైపులా గోపురాలు నిర్మించారు. ప్రధాన గోపురం తూర్పుముఖం కలిగి నిర్మింపపడింది. గోపురం ఐదు అంతస్తులను కలిగి ప్రతి అంతస్తు ఇరువైపులా సాయుధపాణులైన పాలకుల విగ్రహాలు ఉన్నాయి. గోపురం పైభాగాన ఏడు కలశాలు ప్రతిష్ఠించారు. గోపురం ముందు ఎత్తైన లోహంతో కప్పబడిన ఒక రాతిస్తంభము దానిముంగిట విశాలమైన స్తంభాల మండపము కలదు.

మండప స్తంభాలపైన ఎటువంటి శిల్పము కనబడరాదు. ఈ మండపంలోనే దేవుళ్ళు ఇద్దరు ఒకరి ప్రక్కన ఒకరు కొలువై ఉన్నారు. ప్రధానమూర్తులకు ముందు భాగాన ఉత్సవర్లు వెండి లోహపు కవచాలతో అలంకరింపబడి ఉన్నాయి. ఈ దేవుళ్ళు కొలువైన ప్రదేశంలో పైన ఎటువంటి ఆచ్ఛాదన లేదు. అందుచేత ప్రధాన ఆలయము మూసి ఉంచిన ప్రదేశంలోనే దేవతలను ఎటువైపునుంచినైనా దర్శించుకోవచ్చు. ఈ ఆలయంలో ఇదొక వింత. ఆలయంలోనే పూజారులు వీరశైవసిద్ధాంతాన్ని ఆచరిస్తూ పూజలు జరుపుతారు.

ఇచ్చటి నారసింహ వీరన్న దేవుళ్ళు పిలిస్తే పలికే స్వాములు. వీరన్న స్వామి ఈ క్షేత్రంలో అగ్ని ఆకారంలో భక్తులకు దర్శనమిస్తాడట. అంతేకాక ఆకాశంలో సంచరిస్తూ ఉన్నట్లు భక్తులు అనుభూతి చెందుతారు. ఈ దేవుళ్ళ వెనక గర్భాలయం నిర్మింపబడినది. ఇచ్చట అడుగుపెడితే భక్తులు ఏదో తెలియని భక్తిపారవశ్యంతో ముగ్ధులవుతారు. ఆ అనుభూతిని అనుభవించిన వారు తెలుపుతూ ఉంటే శరీరము గగుర్పొడుతూ ఉంటుంది. ఈ స్వామి ఆలయంలో కొబ్బరికాయలు కొట్టి అందులోని కొబ్బరిని తింటే వారు ఎప్పుడైనా తిరిగి ఆలయానికి వచ్చి దేవుళ్లను పూజించవలసినదే. అందుకే భక్తులు ఆలయంలో కొబ్బరికాయను కొట్టి కొబ్బరిని తినడానికి ఇష్టపడరు. అలా స్వామి కొబ్బరికాయను అందులోనే కొబ్బరిని సేవిస్తే వారు తప్పనిసరిగా తిరిగి ఈ ఆలయానికి రావలసినదే. అలా స్వామి ఆలయానికి రాకపోతే వారి కష్టాలు బాధలు చెప్పనలవి కావట. స్వామి నిప్పులాంటి మహిమ కలవారు.

ఒకమారు మంత్రాలయ పుణ్యక్షేత్రం శ్రీ రాఘవేంద్రస్వామి వారు ఈ మార్గంద్వారా కర్ణాటకకు వెళుతూ ఇచ్చట కొన్ని రోజులు నిలచినాడట. అప్పుడు ఆయనకు చెప్పలేనటువంటి దైవానుభూతి కలిగి తనకు తానే భక్తిలో మైమరచిపోయాడట. ఇచ్చటి వీరన్న లక్ష్మీనరసింహస్వాములను

ఆయన పూజించి కానుకలు సమర్పించినాడట. వీరన్న స్వామి ఆలయాన్ని దర్శించిన భక్తులు మెడలో వెండిహారాన్ని ధరిస్తారు.

ఊరుకొండ స్వామి ఆలయమందు శ్రావణమాసంలో ఒక నెలరోజులు రంగరంగ వైభవంగా ఉత్సవాలు జరుగుతాయి. ఈ ఆలయాన్ని సోమ, గురువారాల్లో ఎక్కువమంది భక్తులు దర్శించుకుంటారు. శ్రావణమాసంలో దాదాపు 25 లక్షల మంది ఈ స్వామిని దర్శిస్తారట. ఈ మాసంలో మూడవ సోమవారం నాడు విపరీతమైన భక్త సందోహం వస్తుందట. ఆ ఒక్క రోజే స్వామిని దాదాపు 3 లక్షల మంది దర్శిస్తారట. ఆ ఒక్క రోజునే స్వామివారికి దాదాపు 25 లక్షల రూపాయలు కానుకలు భక్తులు సమర్పిస్తారట ఈ ఒక్క మాసంలోనే స్వామివారి ఆదాయం రెండు కోట్లకుపైనే. శ్రావణమాసంలో ఆ తర్వాత కార్తీకమాసంలో కూడా భక్తులు ఎక్కువగా ఆలయానికి వస్తారు. భక్తులు తమకు స్వామి అగ్ని ఆకారంలో దర్శనమిస్తాడని ఆనంద పరవశులవుతారు. ఎందుచేతనంటే శ్రావణమాసంలో ఈ అడవిప్రాంతంలో వర్షాలు ఎక్కువ. భూమి మొత్తం బురదగా ఉంటుంది. అయితే భక్తులు స్వామికి పొంగళ్ళు పెట్టడానికి ప్రయత్నించగా, వారు పొంగలి పెట్టడానికి ఎంచుకున్నచోట నేల గట్టిగా, పొడిగా మారిపోతుందట. ఈ స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు పొంగళ్ళు స్వామికి నైవేద్యంగా సమర్పిస్తారు.

శ్రావణమాసం తిరుణాలలో కడపటి రోజు ఏటి తిరునాళ్లు ఉత్సవం ప్రశస్తమైనది. ఈ రోజు ఈ ఆలయానికి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న తుంగభద్రానదికి ఈ దేవుళ్ళ ఉత్సవవిగ్రహాలను మేళతాళాలు వాయిస్తూ తీసుకువెళ్లి అచ్చట కొలువు చేసి నదిలో స్నానం చేయించి తిరిగి ఆలయానికి చేర్చుతారు. ఈ ఉత్సవాల సమయంలో ఇచ్చట ఆటపాటలను మాటలతో వర్ణించలేము. ముఖ్యంగా పల్లెప్రజలు, గిరిజనులు స్వామి వీరన్నమీద పాడే పల్లెపదాలు బహురమ్యంగా ఉంటాయి. వారు చెప్పే కథలు వినవలసినదే కానీ మాటలలో చెప్పలేము. వారు వాయించే వాయిద్యాలు వాళ్లు కట్టే

వేషాలు అపురూపము. ఈ ప్రాంతంలో ప్రజలు ఈ స్వాములను కీర్తిస్తూ కొన్ని వేల పదాలను ప్రజలు తమ నిత్యజీవనంలో ప్రదర్శిస్తారు.

ఈ ఉత్సవాలలో ఎడ్లపందేలు, ఎడ్ల పోటీలు, పరుగు పందాలు అనేకరకాల పోటీలు జరుపుతారు. స్త్రీలు కోలాటాలతో సందడి చేస్తారు. ఇచ్చట ఆనాటి రాయలసీమ ఆటలపోటీలు భజనలు పద్యాలు వేషధారణ చూడవచ్చు. దాదాపు 30 సంవత్సరాల పూర్వంవరకు ఈ ఆలయం ఇంత అభివృద్ధి చెందలేదు ప్రాశస్త్యము లేదు.

అయితే ప్రస్తుతం కర్నూలు జిల్లాలో శ్రీశైలం తరువాత ఈ ఆలయమే చెప్పుకోదగ్గ రీతిలో అభివృద్ధి చెందుతూ ఉంది. ఇంత స్వల్పకాలంలో ఇంత గొప్ప అభివృద్ధి చెందిన ఆలయం ఈ ప్రాంతంలో ఇదేనేమో. ఈ ఆలయానికి స్వామివారి దర్శనం చేసుకోవటానికి ఆంధ్రదేశం నుండే కాక అటు మహారాష్ట్ర ఇటు కర్ణాటక నుండి భక్తులు విశేషంగా వస్తూ ఉంటారు. దాతలు ఆలయంలో అనేక నిర్మాణాలు చేపట్టి పూర్తి చేస్తూ ఉన్నారు. వచ్చే దాతలు స్వాములకు విరివిగా విరాళాలు అందజేస్తూ ఉన్నారు. వచ్చే యాత్రికులకు బస, వసతి, భోజన వసతి, ఆర్యవైశ్య సమాజం వారు, మరియు ఇంకా కొన్ని స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేస్తూ ఉన్నారు. ప్రస్తుతం ఈ ఆలయానికి ఏటా ఐదుకోట్ల రూపాయలు వరకు ఆదాయం లభిస్తూ ఉంది. ఈ ఆలయాన్ని చేరడానికి ఆదోని నుండి 50 కి.మీ. దూరం ఎమ్మిగనూరు నుండి 30 కిలోమీటర్ల దూరం ప్రయాణించి చేరవచ్చు.

* * *

## మద్దిలేటి - శ్రీ నరసింహస్వామి ఆలయం



కర్నూలు జిల్లాలో అనేక ప్రాచీన ఆలయాలు కలవు, వాటిలో మద్దిలేటి నరసింహస్వామి ఆలయం ఒకటి. ఈ ఆలయం బేతంచర్లకు దాదాపు 8 కిలోమీటర్ల దూరంలో, ఎర్రవాగు లేదా ఎర్రరంగాపురం సమీపంలో నిర్మింప బడింది. ఈ గుడి ఎర్రమల కొండలలో ప్రకృతిరమణీయతకు కేంద్రంగా ఉండే కొండగుట్టలు సెలయేర్లు, మహావృక్షాలు నడుమ నిర్మింపబడింది. ఈ ఆలయం ప్రక్కనే మద్దిలేరు అనే చిన్న వాగు ప్రవహిస్తూ ఉంది. అందుచేత, ఇచ్చట మద్ది వృక్షాలు ఎక్కువగా ఉండుట చేత, వీటి మధ్యన ఈ స్వామి కొలువై ఉండడం వల్ల శ్రీ మద్దిలేటి స్వామి అని పిలువబడుతున్నారు. ఈ ఆలయాలను కలుపుతూ ప్రస్తుతం యాత్రికుల ప్రయాణానికి సౌకర్యంగా 9 మైళ్ళ విశాలమైన దారిని నిర్మించారు. ఈ దారి తిరుపతి నుండి తిరుమలకు ఏర్పాటుచేసిన రోడ్లను తలపిస్తూ ఉంది.

ఈ ఆలయ నిర్మాణాన్ని గురించి ఒక ఐతిహ్యం ప్రచారంలో ఉంది. ఈ ప్రాంతాన్ని ఒకప్పుడు స్థానిక మోక్షపట్నం గ్రామ జమీందారు బోయదొర పాలించేవాడు. ఇతడి పేరు కన్నప్ప. ఈ బోయదొరకు వేట అంటే ఎంతో ఇష్టము. ఒకరోజు తన పరివారంతో తెల్లవారగానే అడవికి వేటకు వెళ్ళాడు. అడవినంతా గాలించినా, ఆరోజు ఒక జీవి కూడా ఇతడికి కనిపించలేదట. వేటలో విఫలుడైన కన్నప్ప దిగులుగా తన నివాసానికి తిరిగి వస్తూ ఉండగా, ఆశ్చర్యకరంగా ఒక ఉడుము బంగారువర్ణంతో తళతళ మెరుస్తూ ఒక పుట్టలోనికి వెళ్ళిందట. ఆ ఉడుమును పట్టి తెమ్మని పాళేగారు భటులను ఆజ్ఞాపించగా వారు ఎంత త్రవ్వి, వెదికినా పుట్టలో ఉడుము కనపడలేదు.

ఈ విషయం విని చింతాక్రాంతుడైన కన్నప్ప ఎందువల్ల ఇలా జరుగుతుంది, తాను వేటలో ఎందుకు విఫలుడైనాడు అని చింతిస్తూ తన గృహం చేరాడట. ఉడుము పుట్టలోనికి ప్రవేశించిన ప్రాంతాన్ని కోమలపణం అంటారు. ఒకరోజు సాయం సంధ్యవేళ కన్నప్పదొర ఏకాంతముగా కూర్చుని అన్యమనస్కుడుగా ఉండగా, తన ప్రక్కనే అశరీరవాణి దొరా, నేను ప్రహ్లాద వరదుడైన నారసింహుడిని, ఇచ్చటకు సమీపంలో ఒక పుట్టలో ఉన్నాను. నన్ను గుర్తించి, ఈ ప్రదేశమందే ప్రతిష్ఠించి పూజావిధులు నిర్వహించమని చెప్పాడట. కన్నప్ప చుట్టుప్రక్కల చూడగా ఏమీ కానరాలేదు.

ఇది లక్ష్మీనరసింహస్వామివారి ఆజ్ఞ అని తలచి, తెల్లవారి తన పరివారానికి జరిగిన విషయం అంతా వివరించి, అందరూ తప్పట్లు తాళాలు పలకలు, ఇతర వాయిద్యాలు మోగిస్తూ పుట్టవద్దకు వెళ్లి వెతకగా, అపురూపమైన వర్చస్సుతో పది సంవత్సరాల బాలుడు కనిపించాడు. భక్తులందరూ అతడే కదిరి నరసింహస్వామి అని తలచి, కన్నప్పదొర ఆ బాలుడిని భుజాలపై పెట్టుకుని తన గ్రామం పరిసరాలకు వచ్చి బాలుని క్రిందికి దించగా అనూహ్యంగా ఆ బాలుడు నరసింహస్వామి శిలావిగ్రహంగా మారిపోయాడట. స్వామి అభీష్టం అదేనని ప్రజలు భావించి, అతడిని మద్దిలేటి నరసింహస్వామిగా మద్దిలేటి కాలువ నరసింహుడుగా, వైకుంఠనాథునిగా, మద్దులయ్యగా, మద్దిలేటి స్వామిగా మరియు శ్రీ లక్ష్మీనరసింహస్వామి అని పిలుస్తారు.

**ఆలయనిర్మాణం**

శ్రీ మద్దిలేటి నారసింహస్వామి అవతారం, ఆలయనిర్మాణం గురించి ఒక కథ ప్రచారమందున్నది. పూర్వం, శ్రీ కదిరి నరసింహస్వామి, దేవేరి లక్ష్మీదేవి ఉల్లాసంగా పాచికలాడుతూ ఉండగా పరధ్యానంగా ఉన్న స్వామి ఓటమి చెందాడట. ఆ విజయానికి ఉబ్బితబ్బిబ్బైన లక్ష్మి, స్వామిని హేళన చేసిందట. దానిని అవమానంగా భావించిన స్వామి ఇల్లు వదలి ఎచ్చటెచ్చటో




తిరిగి యాగంటిక్షేత్రానికి వచ్చి అచ్చట ఉమామహేశ్వరస్వామిని తన నివాసానికి తగిన ప్రదేశము చూపమనగా ఉమామహేశ్వరుడు సమీపములోని అతి పవిత్రమైన ప్రదేశం కదిరి సమీపంలో ఎర్రమల కొండలలోని మద్దిలేటి ప్రదేశాన్ని చూపించి, అది పవిత్ర ప్రదేశమని చెప్పగా నారసింహ స్వామి అచ్చటే కొలువైనాడట, స్వామి ఆనాడు పాదం మోపినచోట అతడి పాదముద్రిక కలదు. దాని ముందు ఆతడి రెండు పాదముద్రికలు కూడా కలవు. ఇచ్చటే మద్దిలేరు అనే వాగు ప్రవహిస్తూ ఉంది.

శ్రీ లక్ష్మీనరసింహస్వామి కదిరి క్షేత్రము వదలి వెళ్ళిన తరువాత, లక్ష్మీదేవి దుఃఖిస్తూ గరుత్మంతుని తన స్వామి ఎచ్చట ఉన్నాడో తెలుసుకొని అతని వద్దకు తనను చేర్చమని గరుత్మంతుని కోరగా, ఆ గరుత్మంతుడు దేవిని తన భుజాలపై కూర్చుండబెట్టుకొని స్వామి వద్దకు చేర్చినాడు. ఆ సమయంలో స్వామి వేరొక స్త్రీతో దగ్గరగా ఉండుటచేత లక్ష్మీదేవికి కోపం వచ్చి నీవు ఈ చెంచులక్ష్మి తోనే మాంసము, మధ్యము సేవిస్తూ, తైతక్క లాడుతూ ఇచ్చటనే ఉండెదవా లేదా వీటన్నిటిని, ఆమెను వదిలిపెట్టి నాతో వచ్చెదవా అని చెప్పగా, స్వామి దేవి ఈమె ఒకరు నీవు ఒకరు కాదు, ఇద్దరూ ఒకే అంశతో ఉన్నారు అని దేవేరిని సంభాలించగా ఆమె ఒప్పుకొని స్వామితో ఉండుటకు నిశ్చయించినది. ఆ విధముగా నరసింహస్వామి లక్ష్మీనరసింహస్వామిగా పిలువబడుతున్నారు. అయితే ఆలయంలో స్వామి ఒక్కరి విగ్రహమే ప్రతిష్ఠింపబడి పూజింపబడుతూ ఉన్నది. దేవేరుల విగ్రహాలు విడివిడిగా ప్రతిష్ఠింపబడి పూజింపబడుతూ ఉన్నాయి.

ఆలయం కొండ ప్రాంతంలో ఉండుటచేత ఒక నిర్ణీత పద్ధతిలో లేదు. ప్రధాన ఆలయం ముంగిట మూడు అంతస్తుల రాజగోపురం ఉంది. ఈ

గోపురం కొంత ఎత్తులో ఉన్నందున పైకి మెట్లు ఏర్పాటు చేశారు. ఈ రాజగోపురం వెనుక రెండు ధ్వజస్తంభాలు ఉన్నాయి. ఈ రెండు ఒకే పీఠము పైన నెలకొల్పారు. వీటికి ముందు బలిపీఠము కలదు. వీటి ముందుభాగాన విశాలమైన స్తంభాల మండపము కలదు. ఈ మండపం గర్భగృహము, అంతరాళము, గరుత్మంతుని నిలయము ఉన్నాయి. ఆలయ రాజగోపురం పైన గాని మండపాల స్తంభాలపైన గాని చెప్పుకోదగ్గ శిల్పము కానరాదు.

గర్భాలయమందు మద్దిలేటి నరసింహస్వామి ఉగ్రరూపంలో ఆసీనుడై ఉన్నాడు. స్వామి నోటినుండి వెలుపలికి వచ్చిన ఎర్రటి నాలుక, ముందుకు పొడుచుకొని వచ్చినట్లు ఉన్న కండ్లు, వెడల్పాటి ముక్కుపుటాలు, తలపైన, మెడ చుట్టూ దట్టమైన జూలు వెంట్రుకలు ఉంటూ స్వామి వెనుక భాగాన వెడల్పాటి మకరతోరణం కలదు. స్వామి చతుర్భుజుడు. స్వామికి తరచూ పంచామృతాలతో అభిషేకం జరుపుతూ ఉంటారు. స్వామి విగ్రహం పైన స్వర్ణ తాపడం చేసిన కవచము, కిరీటము, గోపురం పైన బంగారు కలశం ఏర్పాటు చేశారు.

గర్భాలయం ముందు మండపస్తంభాలపైన కొన్ని వైష్ణవ శిల్పాలు కలవు. మండపంలోని గరుత్మంతుడు అంజలి ఘటిస్తూ గర్భగుడిలోనే స్వామిని పూజిస్తూ ఉన్నాడు. మండపం ముందరి ధ్వజస్తంభాలలో ఒకటి పురాతనమైనది, మరొకటి ఇటీవల కాలంలో నెలకొల్పబడినది అంటున్నారు. బాలాలయం ముందు స్వామివారి రెండు పాదముద్రికలు కలవు. ప్రజలు ఈ పాదములను భక్తితో పూజిస్తారు. ఇచ్చట నెలకొల్పిన అఖండ దీపస్తంభం వద్ద భక్తులు కొబ్బరికాయలు స్వామికి నివేదిస్తారు.

ఆలయం చుట్టూ అనేక ఉపమండపాలు కలవు. వీటిలో అనేక ఉత్సవమూర్తులను భద్రపరచినారు. ప్రస్తుతం స్వామివారికి నిత్యపూజలు ఎడతెరిపి లేకుండా జరుగుతూ ఉన్నాయి. పూర్వం ఈ విధంగా కాకుండా

ఎప్పుడో ఒకప్పుడు మాత్రమే పూజలు జరిగేవట. మద్దిలేటి స్వామి ఆలయానికి దిగువన మద్దిలేటి వాగు కలదు. ఈ వాగు చుట్టూ ప్రహరీ నిర్మించి ఇందులోని నీటిని కుంటలు, కుంటలుగా విభజించినారు. ఈ కుంటలలో నీటిని నింపి ఉంచుతారు. భక్తులు ఆలయంలో ప్రవేశించేముందు ఈ నీటిలో స్నానమాచరించి స్వామిని కొలుస్తారు.

మద్దిలేటి స్వామి ఆలయానికి శుక్ర, శనివారాల్లో అధికసంఖ్యలో భక్తులు వస్తారు. ఆలయ నిర్మాత కన్నప్ప శనివారాల్లోనే వేటకు వెళ్లేవాడట. భక్తులు శుక్రవారం ఆలయ ప్రాంతానికి వచ్చి రాత్రి నిద్రచేసి, శనివారం స్వామిని పూజిస్తారు. ఆలయంలోనికి భక్తులు నిర్ణీత సమయంలో వెళ్లి కొలిచే ఆచారం పూర్వం ఉండేది. ఈ భక్తులకు పూజారులు సంకల్పం చెప్పి తలపై చెడారు ఉంచుతారు. భక్తులు తెచ్చిన పుష్పాలు స్వామి పాదాలవద్ద ఉంచుతారు. భక్తుల కోరికలు నెరవేరుతాయి అని భావిస్తే స్వామి పాదాలవద్ద ఉంచిన పుష్పాలలో ఒక పుష్పం క్రింద పడుతుందట. అంటే భక్తుని కోరిక నెరవేరిందని నమ్మకం. అందుకే స్వాములు భక్తులు ఆచరించవలసిన వ్రతాలు, పూజలు వారికి తెలియజేస్తారు.

స్వామి ఆలయమందు మూడు రోజులపాటు వైకుంఠ ఏకాదశి సమయంలో కళ్యాణోత్సవాలు వైభవంగా జరుపుతారు. ఇదే రోజు గర్భాలయం చుట్టూ వైకుంఠ ద్వారం ఏర్పాటుచేసి భక్తులకు వైకుంఠ ద్వారదర్శనం కలిగిస్తారు. ఈ ఉత్సవాల కాలంలో లక్ష్మీకళ్యాణం, భూదేవి శ్రీదేవి ఉత్సవమూర్తులు ఆలయం చుట్టూ ఊరేగుతారు. ఈ ఆలయమందు ముఖ్యంగా వివాహం కాని కన్యలు తమకు కొందరగా వివాహాలు కావాలని, సంతానహీనులు సంతానవంతులు కావాలని రోగపీడితులు, మతిహీనులు నీటికుంటలో స్నానమాడి, తడిబట్టలతో స్వామి ముంగిట సాగిలపడతారు. స్వామి వారు వారిని అనుగ్రహించాలని ప్రార్థిస్తారు. కోరికలు నెరవేరిన వారు ఆలయంలో స్వామికి తలనీలాలు సమర్పిస్తారు.

కొంతమంది స్త్రీలు అచ్చటే ఉన్న ఒక వృక్షానికి ఉయ్యాలను, ముదుపు దారాలను కట్టుతారు. ఈ స్వామి ఆటవీకుల దైవమని, ఆటవీక తెగలవారు స్వామి ఉత్సవాల సమయంలో స్వామిని కీర్తించి ఆలయానికి వచ్చి శిశువుల తలనీలాలు సమర్పించే సాంప్రదాయం కలదు. ఈ ఉత్సవాల సమయంలో వారు స్వామిని స్తుతిస్తూ అనేక పల్లెపదాలు పాడుతూ ఉంటే వాయిద్యగాళ్లు తమ వాయిద్యాలను, ముఖ్యంగా పలకలను వాయిస్తూ నాట్యం చేస్తారు. కొంతమంది పూనకంతో ఊగిపోతారు. ఈ స్వామిని బుడగ జంగాల వారు తమ కులదైవము అంటారు. స్వామి ఆలయం పక్కనే లక్ష్మీదేవి మందిరము కలదు. దేవి చతుర్భుజ. ఈమె భక్తుల కొంగుబంగారము.

స్వామి ఆలయమందు ఉత్సవకాలంలో ఒక రాతిస్తంభము పైన అఖండదీపము వెలిగిస్తారు. ఈ దీపదర్శనం సకల శుభప్రదమైనది. శ్రీ మద్దిలేటి స్వామి ఈ క్షేత్రానికి ఫాల్గునమాసం శుద్ధ పౌర్ణమి రోజున వచ్చి కొలువైనాడట. అందుచేత ఆరోజు ఆలయంలో వైభవంగా జాతర చేస్తారు. ప్రస్తుతం ఆలయమందు భక్తులకు వసతి, భోజన సౌకర్యాలు మెరుగు పరచడమేకాక, ఆలయనిర్మాణాన్ని శీఘ్రంగా పూర్తి చేస్తూ ఉన్నారు.

* * *

# శివపురం - కొలను భారతీదేవి ఆలయం

భారతదేశంలో త్రిమూర్తులలో మహా విష్ణువు, మహేశ్వరుడు మొదలగు దేవతలకు అనేక ఆలయాలు కలవు. అయితే బ్రహ్మదేవునికి దేశంలో ఒకచోట మాత్రమే ఆలయముందట. అలాగే పార్వతి, లక్ష్మీదేవిలకు అనేక ప్రదేశాలలో ఆలయాలు ఉన్నా సరస్వతిదేవికి మాత్రం దేశంలో దాదాపు పది ఆలయాలే ఉన్నవట. ఈ దేవిని పూర్వకాలం నుండి జైనులు, బౌద్ధులు మరియు ఇతర ఈజిప్టు దేశస్థులు కూడా పూజించేవారు. అటువంటి సరస్వతి దేవికి రెండు తెలుగు రాష్ట్రాలలో ఒకటి తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లా బాసర క్షేత్రం, రెండోది రాయలసీమ కర్నూలు జిల్లాలో నల్లమల అడవులలో ఉన్న కొలను భారతి క్షేత్రము ముఖ్యమైనవి.

ఈ నల్లమల అడవులలో అనేక పుణ్యక్షేత్రాలు కలవు. శ్రీ కొలను భారతీదేవి ఆలయం, కర్నూలు జిల్లా, ఆత్మకూరు మండలం, కొత్తపల్లి గ్రామ సమీపంలో వెంకటాపురం దగ్గరలోనే శివపురం అనేచోట దట్టమైన అడవుల మధ్య నిర్మితమైనది. ఈ ఆలయం అతిపురాతనమైనదని ఇచ్చటి శాసనాలు తెలియజేస్తూ ఉన్నాయి. ఆలయనిర్మాణాన్ని బట్టి శాసనాలను పరిశీలిస్తే ఈ ఆలయం పశ్చిమ చాళుక్య రాజుల కాలంనాటిదనే చెప్పవచ్చు.



ఈ ఆలయాన్ని చాళుక్య రాజు నల్లభూపతి పునరుద్ధరించినట్లు శాసనంలో చెప్పబడినది.

ఆలయాన్ని చేరుటకు ఆత్మకూరు నుండి కొత్తపల్లి గ్రామం మీదుగా రహదారిపై వెళ్లవచ్చు. ఈ కొత్తపల్లికి పడమరగా 20 కిలోమీటర్లు

ప్రయాణిస్తే ప్రముఖ పుణ్యక్షేత్రమైన సంగమేశ్వర స్వామి ఆలయం వస్తుంది. అదేవిధంగా ఇచ్చట ఉన్న మధ్య వేంకటాపురంలో యాత్రికులు ఇచ్చట ఉన్న మల్లికార్జున స్వామిని పూజించి అడవి మార్గంద్వారా నడచి శ్రీశైలక్షేత్రానికి వెళ్ళుతారు. ఈ కొత్తపల్లికి సమీపంలోనే చిన్న గ్రామం శివపురం అనేచోట కొలను భారతీదేవి ఆలయము కలదు. ఈ ఆలయాన్ని డోర్నకంబాల నుండి కూడా చేరవచ్చు.

**ఐతిహ్యము**

శ్రీ కొలను భారతీదేవి ఆలయచరిత్ర అగమ్యగోచరం. కొందరీ క్షేత్రం భారతదేశాన్ని పాలించిన మొట్టమొదటి ప్రభువు భరతుడు ఇచ్చటి దేవిని ప్రతిష్ఠించాడని పేర్కొంటారు. మరికొందరు ఈ ఆలయం కృతయుగము నాటిదని అప్పుడు సప్త ఋషులు అచ్చట యజ్ఞం చేయతలచి సరస్వతి దేవిని తాము చేయబోయే యజ్ఞానికి ఎటువంటి ఆటంకము కలగకుండా కాపాడమని వేడుకొన్నారట. దేవి అంగీకరించి సప్త ఋషుల యజ్ఞాన్ని నిర్విఘ్నంగా పూర్తయినట్లు సహకరించినదట. సప్త ఋషులు దేవి తమకు చేసిన సహాయానికి గుర్తుగా ఆమెను అచ్చటనే కొలువై భక్తులను కాపాడవలెనని కోరగా భారతీదేవి అందులకు అంగీకరించి అచ్చటనే కొలువై భక్తులను కాపాడుతూ ఉన్నది.

సప్త ఋషులు దేవికి ఒక అపూర్వమైన ఆలయాన్ని నిర్మించగా దేవి ఆలయంలో కొలువై ఉన్నది. ఈ దేవి స్వయంభు. అంతేకాక ఋషులు అమ్మవారు తమ కోరిక మేరకు అచ్చట కొలువైనది. కావున ఆమె ఆలయానికి ఇరువైపులా తాము కూడా నివసించాలని అచ్చటనే స్థిరనివాసము ఏర్పరుచుకున్నారట. వారు నివసించే ఆలయాలని సప్త మహర్షుల ఆలయాలని, సప్తలింగేశ్వర ఆలయాలని సప్త మాతృకల ఆలయాలని పేర్కొంటారు. సప్తఋషుల స్థానంలో, శివలింగాలు వారివెనుక దేవి ప్రతిమలు ప్రతిష్ఠింపబడినాయి. కొలను భారతీదేవిని భక్తులు శారదాంబ

అనీ, శ్రీచక్రస్వరూపిణీ అనీ, జ్ఞానస్వరూపిణీ అని పుస్తకపాణి అని, అంతర్వాహిని అని, సూక్ష్మరూపిణి అనీ జలదేవత పేర్లతో పూజిస్తారు.

ఇచ్చటి దేవిరూపం ఒక ప్రత్యేక ఆకారంలో ఉన్నది. చేతిలో వీణలేదు. ఈ దేవి ఒక చేతిలో పుస్తకాన్ని, ఎడమచేయి అభయ హస్తముగాను, ఇంకొక చేతిలో శూలము కలిగి మరోచేతిలో పాషాంకుశములు కలిగి ఉన్నది. నుదుటపై పసుపు రాసుకుని మధ్యలో కుంకుమ బొట్టు కలదు. దేవి ఒత్తయిన జుట్టును కలిగి ఉన్నది. ఈమె చతుర్భుజ. ఈమె మహాశక్తివంతురాలు. దేవిని మహాలక్ష్మి, మహాకాళి, మహాసరస్వతి అని కొలుస్తారు. దేవి మెడలో హారములను కలిగి ఉన్నది.

పూర్వము ఆంగ్లేయుల కాలంలో 12 సంవత్సరాల లోపు బాల బాలికలకు ఏవైనా గ్రహదోషములు, ఆరోగ్య సమస్యలు ఎదురైనచో ఇచ్చట నదిలో 40 రోజులు స్నానము చేయించి, ఆ నీటిని తీర్థముగా త్రాగించి రోజు ఐదుమార్లు దేవిచుట్టూ తిరిగితే వారికి స్వస్థత చేకూరేదట! ఈ విషయాన్ని పూజారి తమ ఇంట్లో ఉన్న గ్రంథములో ఉండినట్లు తెలిపాడు. ప్రస్తుతం ఆ గ్రంథము శిథిలమైపోయినదట.

ఇచ్చటి వింతైన విషయము ఏమిటంటే కొంతదూరం నుండి అమ్మవారి చెంతవరకు ఒక నది ప్రవహిస్తుంది. అమ్మవారి వద్దకు వచ్చిన తర్వాత ఆ నది అంతర్ధానం అవుతుంది. ఆ నీరు ఎచ్చటికి వెళ్ళుతాయో, నది ఏమవుతుందో ఎవరికి అంతుపట్టదు. నదిలో ఎల్లప్పుడు మోకాటి లోతు మాత్రమే నీరు ఉండేది. ఎంతటి వర్షాకాలమైనా వాగులు వంకలు పొర్లి పారుతున్న ఈ నదిలో నీరు మాత్రము మోకాటిలోతు ఉండేది. ఈ వింతను నేటికీ ఎవరు కనుగొనలేక పోతున్నారు. ఈ నదిలోని నీరే దేవికి అభిషేక జలము. విగ్రహము ముందు భాగాన ఆదిశంకరాచార్యులు ప్రతిష్ఠించిన శ్రీ చక్రము కలదు. ఈ దేవి చెంత పారేనదిని చారుగోష్ఠిని అంటారు.

ఈ దేవికి కొలను భారతి అనే పేరు ఎలా వచ్చినది అంటే కొంతమంది ఈ నల్లమల అడవులలో ఎక్కువగా కొండజాతి వారు నివసిస్తూ ఉన్నారని

వీరిని కొల్లంలు అంటారని కొల్లం అంటే ఆటవీకులు. కావున కొల్లం ప్రజలు పూజించే దేవిని కొల్లం భారతి అంటారట. కొంతమంది ఈమెను ప్రక్కన ఉన్న చిన్న కోనేరు పేరు కొలను కావున కొలను భారతి అనికూడా అంటారట. దేవి సమీపంలో ఉన్న గ్రామాన్ని శివపురం అంటారు. ఇచ్చట ప్రతి ఇంటి ముందు, ప్రతి వీధిలో అనేక శివలింగాలు ప్రతిష్ఠించబడినాయి. శివలింగాలు ఉన్న ఊరు కాబట్టి శివపురం అని పేర్కొంటారేమో. కొంతమంది ఈ దేవి ఒకప్పుడు కొండజాతి ప్రజల కులదైవమని ఆమెకు బలులు కూడా సమర్పించే ఆచారము ఉండేదేమో అంటారు.

పూర్వము అమ్మవారి జన్మ నక్షత్రమైన వసంత పంచమినాడు మాఘమాసం శుభదినంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరుపబడేవి. అయితే అవి కాలక్రమంలో నిలిచిపోయాయి. ప్రస్తుతం ఆ ఉత్సవాలను తిరిగి ప్రారంభిస్తున్నారు. ఈ ఉత్సవకాలంలో ప్రతి ఏటా అమ్మవారికి శ్రీశైలం మల్లికార్జునస్వామి ఆలయం నుండి పట్టువస్త్రాలు సారెగా పంపబడుతూ ఉండేవి. ఈ దేవికి ప్రతిరోజు ఒక చీరను ధరింపచేస్తారు. ఒకరోజు ధరించిన చీరను మరోరోజు ధరింపచేయరు. ఈ సాంప్రదాయము 25 సంవత్సరాలుగా నిరంతరంగా కొనసాగుతూ ఉంది.

ఇచ్చటి అమ్మవారి ఆలయం మరియు సప్త ఋషుల ఆలయాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోగా 2011 సంవత్సరం ప్రభుత్వం వారు కోటి రూపాయలు ఆలయ అభివృద్ధికి సమర్పించారు. ఆ మొత్తంతో ఆలయం అభివృద్ధి చెందుతూ ఉంది. 2016వ సంవత్సరంలో కృష్ణా పుష్కరాల కాలంలో ఇచ్చటి ఆలయాలను పునరుద్ధరించే కార్యక్రమాన్ని సమీపంలోనే కాశీనాథుని నాయనమ్ గారి మఠం స్వీకరించినది. వీరు అతిశీఘ్రంగా ఈ ఆలయాల పునరుద్ధరణ కావించుటేకాక యాత్రికులకు సందర్శకులకు కావలసిన సౌకర్యాలను కలుగచేస్తూ ఉన్నారు.

**ఆలయప్రశస్తి**

కొలను భారతీదేవి ఆలయనిర్మాణాన్ని పరిశీలిస్తే విస్మయం. ఒకనాడు ఈ ఆలయసముదాయం అత్యున్నత స్థాయిలో ఉన్నా, ప్రస్తుతం ఆలయాలను కుదించి అతి చిన్నవిగా, ఉన్నతంగా నిర్మించినారు. రోజు ఆలయానికి ఎన్నో వ్యయప్రయాసలను ఓర్చి యాత్రికులు ఆలయానికి వచ్చి దేవిని పూజిస్తారు. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ బిడ్డలకు అక్షరాభ్యాసం చేయించడానికి ఇచ్చటికి వచ్చి అమ్మవారి సన్నిధిలో ఆమె ఎదుట తమ సంతానానికి అక్షరాభ్యాసము చేయిస్తారు. బియ్యము రాశిగా పోసి దానిపై ఓంకారము లెక్కింపజేసే బిడ్డల నాలుకపై కూడా ఓంకార బీజాక్షరాన్ని దిద్దుతారు. ఇలా ఇచ్చట అక్షరాభ్యాసము చేసిన బిడ్డలు భావికాలంలో గొప్ప విద్యావంతులుగా, విజ్ఞానవంతులుగా, ఉద్యోగస్థులుగా ఎదుగుతారని వారి నమ్మకము. అలాగే మతిహీనులు, సంతానహీనులు, అవివాహితులు, ఆలయానికి ఏతెంచి ఆ దేవిని తమను అనుగ్రహించమని ప్రార్థిస్తారు. అలా దేవి కృపవల్ల వారి కోర్కెలు నెరవేరితే అమ్మవారికి వడిబాలు కట్టుతారు. దేవి దర్శనానికి వచ్చిన ప్రతివారు ప్రక్కన ఉన్న కొలనులో స్నానమాచరించి తడిబట్టలతో దేవుని పూజిస్తారు.

**ఆలయసముదాయము**

శివపురం గ్రామంలో దేవికొలను భారతి మరియు ఏడుగురి సప్త ఋషుల, సప్త మాతృకల ఆలయాలు కలవు. మధ్యలో దేవిమందిరం కలదు. ఇది నూతనంగా నిర్మించినది-ఇందులో గర్భాలయము, ముఖమండపము ముందున నూతనంగా ఏర్పాటు చేసిన పెద్ద మందిరము కలదు. గర్భాలయం లోపల మధ్యలో దాదాపు మూడు అడుగుల ఎత్తు ఉన్న అరుగుపై దేవి ఆసీనముద్రలో కొలువై ఉంది. ఈమె ముగ్గురమ్మల మూలపుటమ్మ. గర్భాలయం పైన గోపురం, క్రింద రాతి దూలాలతో ఏర్పాటు చేసిన స్వస్తిక

గుర్తు చాలా అపురూపంగా ఉన్నది. దేవి ముందర పూజాసామాగ్రి దానిముందు ఇనుపపెట్టె ప్రతిష్ఠించారు. గర్భాలయం పైన పొడవాటి గంట ఆకారంలో పిరమిడ్ ఆకారంలో నిర్మించిన ద్వితల గోపురము, కలశము కలదు. గోపురం మొత్తం బంగారువర్ణపు రంగుతో మెరసిపోతూ ఉంది. గర్భాలయం వెలుపలివైపు గోడలు ఏనుగులు, హంసలు చిత్రాలతో అలంకరింపబడినాయి.

ఆలయ వెలుపలి గోడలు మొత్తం అనేక శిల్పాలతో అలంకరింపబడి ఉన్నాయి. ఈ గర్భాలయ గోడలు నల్లటి గ్రానైట్ రాతితో నిర్మించారు. ఆలయప్రవేశద్వారం బంగారురేకుతో అలంకరింపబడినది. క్రిందివైపు ఇరువైపులా లక్ష్మీదేవి ప్రతిమలు కలవు. ప్రవేశద్వారంపైన లోహపు మకరతోరణం కలదు. ఇచ్చటి మిగతా ఏడు ఆలయాలు కూడా ఇదే రూపంలో ఉన్నాయి. ఈ సప్త ఋషుల ఆలయాలలో దేవతలకు అష్ట భుజములు, మరికొంతమందికి సప్త భుజములు, కొందరికి చతుర్భుజములు కలవు. ఇలా ఒక్కో గుడిలో ఒక్కోరకంగా దేవి ప్రతిమలు. ఈ ప్రతిమలు చూడటానికి ఎంతో పవిత్రంగా గోచరిస్తాయి. ఇచ్చటే కొన్ని మండపాలలో సూర్యభగవానుడు మరియు ఇతర స్వాముల విగ్రహాలు ప్రతిష్ఠింపబడి పూజించబడుతున్నారు.



ఈ ఆలయాలలో ఇటీవల కాలంలో మరో ఆలయాన్ని నిర్మించారు. ఈ ఆలయమే శ్రీదేవి, భూదేవి సమేత జనార్ధనస్వామి ఆలయం. ఇచ్చట ప్రత్యేకత ఏమిటంటే ఈ 8 ఆలయాలకు ఒకే ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేయడం. అదేవిధంగా ఒకే నందీశ్వరుడు ఉండడం. ధ్వజస్తంభము క్రింద నాలుగువైపులా దేవత ప్రతిమలతో అలంకరింపబడి స్తంభం పైన లతలతో, పుష్పాలతో అలంకరింపబడినది. అదేవిధంగా నందీశ్వరుడు అతి గంభీరంగా ఉంటూ ఎత్తైన మూపురంతో పైభాగమంతా గంటలతో, ఆభరణాలతో తల ముందుభాగాన మెడలో హారాలను కలిగి ఎంతో గంభీరంగా ఉన్నాడు. ఈ నంది ఆసీనముద్రలో ఉంటూ తన స్వాములందరినీ చూస్తూ ఉన్నాడా అనిపిస్తాడు. ఈ ఆలయాల ప్రాంగణమందు నవగ్రహాలు ప్రతిష్ఠించబడినాయి. ఈ నవగ్రహాలు కూడా ఎంతో అందముగా తీర్చిదిద్దినారు. కాలభైరవ, విఘ్నేశ్వర, ఆంజనేయ ప్రముఖంగా నాగపడగ శిల్పాలు ప్రతిష్ఠింపబడినాయి. సంతానం లేని స్త్రీలు ప్రక్కన కొలనులో స్నానము చేసి ఈ నాగప్రతిమలను భక్తితో పూజిస్తారు.

ప్రస్తుతం ఈ ఆలయం వద్ద ఆర్యవైశ్య సమాజం వారు ఒక సత్రం ఏర్పాటు చేసి, వచ్చే యాత్రికులకు ఉచిత అన్నదానము చేయుచున్నారు. యాత్రికులు ఉదయము నుండి సాయంత్రం వరకు ఈ సత్రంలో ఉచితముగా సేద తీరవచ్చు. అయితే రాత్రులందు ఇచ్చట ఎవ్వరు ఉండడానికి ఆర్యవైశ్య సంఘము వారు కానీ, ప్రభుత్వము వారు కానీ భద్రతదృష్ట్యా అనుమతి లేదు. ఈ ఆర్యవైశ్య సత్రంవారు తమ విధిని సక్రమంగా నిర్వర్తిస్తూ భక్తులకు ఎంతో సహాయపడుతూ ఉన్నారు. ఆలయమందు వంశపారంపర్య పూజారి తమ కర్తవ్యాన్ని నిష్ఠగా నిర్వహిస్తూ ఉన్నారు.

* * *

## కదిరి - లక్ష్మీనరసింహస్వామి ఆలయము



అనంతపురము జిల్లాలో కదిరి తాలూకా కేంద్రము. ఇది ధర్మవరము, పాకాల రైల్వేమార్గమందున్నది. అనంతపురము, హిందూపురముల నుండి బస్సు సౌకర్యములు కలవు. ఈ గ్రామమందు 14వ శతాబ్దమున నిర్మించిన విజయనగరరాజుల కాలంనాటి ఆలయమున్నది. ఈ ఆలయాన్ని 'లక్ష్మీనరసింహస్వామి ఆలయ'మనుచున్నారు. పూర్వమీ గ్రామములో పొదలు, పొదలుగా ఖదిరి వృక్షాలు వుండుటచేతను లక్ష్మీనరసింహస్వామి విగ్రహము ఖదిరి పొదలో దొరకుటచేతను ఈ గ్రామమునకు 'కదిరి' అనుపేరు సార్థకమైనది. ఖదిరి పొదలలో లభ్యమైన విగ్రహమునకు రంగరాయుడనే భక్తుడు ఆలయము నిర్మించి తన జన్మను సార్థకపరచుకొని స్వామిలో లీనమైనాడని స్థానిక ప్రజల విశ్వాసము. 'ఖ' అనగా విష్ణుపాదం, 'అద్రి' అనగా కొండ. విష్ణుపాదము వున్న కొండకావున ఈ గ్రామమునకు కదిరి అనిపేరు వచ్చినదని కూడ అంటారు.

పురాణముల ప్రకారము, విష్ణువు నరసింహావతారము దాల్చి, హిరణ్యకశిపుని వధించినతర్వాత కదిరిలో ఉగ్ర నరసింహావతారముతోనే శిలగా రూపుదాల్చినాడు.

నరసింహస్వామి ఆలయము గ్రామ మధ్యభాగమున విశాలమైన ఆవరణలో నిర్మించబడినది. ఆలయానికి చుట్టూ ప్రహరీగోడ యున్నది. ఆలయప్రవేశానికి ఈ ప్రహరీగోడయందు నాల్గువైపులా నాలుగు గోపురములతో అలంకరించబడిన ద్వారములున్నవి. ఆలయము

తూర్పుముఖముగా నిర్మించబడి యున్నది. తూర్పున ఉన్న ప్రధానగోపురము మిగతా వాటికంటే ఎత్తైనదేగాక, అలంకారప్రాయముగానున్నది. దక్షిణ దిశలోని గోపురము బాగా శిథిలమైయున్నది. తూర్పువైపు గోపురము ఇటుకలతో నిర్మింపబడి నాల్గు తలములు కల్గియున్నది. వెడల్పయిన శిఖరముపై కలశములు వరుసగా వున్నవి.

తూర్పు గోపురద్వారముగుండా ఆలయము ప్రవేశించగానే భక్తులకు కనబడునది ఆంజనేయస్వామి మండపము. దీని ముఖద్వారము ఉత్తరపువైపున వున్నది. గర్భగృహములో అంజలి ఘటించిన ఆంజనేయ స్వామి విగ్రహమున్నది. ఈ మందిరానికి పడమటివైపున, అనంతశాయి ఆకారములో విష్ణువు రూపుదిద్దుకొన్నాడు.

**కళ్యాణమండపము**

నరసింహస్వామి ఆలయప్రాంగణములో అతిరమణీయమైన కట్టడము కళ్యాణమండపము. ఈ మండపము రెండు భాగాలుగా విభజింపబడియున్నది. మొదటిభాగం క్రింది వైపునను, రెండవభాగం కొంత ఎత్తులోను నిర్మించబడినాయి. క్రిందిభాగాన ఉన్న ఆరు స్తంభాలు చోళ శైలిని ప్రతిబింబిస్తున్నవి. క్రింది భాగమునుండి పైభాగానికి వెళ్ళడానికి కొన్ని మెట్లవరుసలున్నవి. ఈ మెట్లకిరువైపులా ఏనుగుల శిల్పాలు చెక్కిన రెండు శిలాఫలకములున్నవి. మండపము పైభాగాన విమానము, వేసరక్రమానికి చెందిన శిఖరము వున్నాయి. ఈ మండపములోని ప్రతి అణువు శిల్పకళాసమన్వితమై యున్నది. కళ్యాణమండపానికి సమీపంలో నాలుగు స్తంభాల సాయముతో నిర్మించబడిన ఉయ్యాల మండపమున్నది.

**ప్రధానాలయము**

ఈ ఆలయము ఆవరణ మధ్యభాగములో తూర్పుముఖంగా నిర్మించబడినది. ఇందు గర్భగృహము, ప్రదక్షిణాపథముతో కూడిన

అంతరాళము, ముఖమండపము, మహామండపములున్నవి. ఆలయానికెదురుగా చిన్న మండపమునందు అంజలి ఘటిస్తున్న గరుడ విగ్రహమున్నది. ధ్వజస్తంభము, బలిపీఠము, గరుడమండపమునకు వెనుకభాగంలో వున్నవి. ప్రధానాలయము పొడవు 155 అడుగులు. గర్భగృహముపైన కూట, పంజర, శాల నమూనాలున్న ఏకతల విమానమున్నది. విమానానికి నాల్గువైపులా నాలుగు ఆసీన సింహములు అంజలిఘటిస్తూన్న నాలుగు గరుడ విగ్రహాలు వున్నవి. మూలబేరం (ప్రధానదైవం) పద్మపీఠముపై వీరాసన పద్ధతిన ఆసీనుడైయున్నాడు. స్వామి ఎనిమిది చేతులనుకల్గి, నోటిలో భయంకరమైన కోరలతో చేతులందు హిరణ్యకశిపుని పట్టియున్నాడు. దేవునికి వెనుకభాగములో అంజలి ఘటిస్తున్న ప్రహ్లాదుడు నిలుచుని వున్నాడు. ఆలయమునందు మరొక (మిశ్రమ లోహపు) స్వామి విగ్రహమున్నది. ఇందులో స్వామి కుడికాలు వదులుగా వదలి, ఎడమకాలు మడచిపెట్టినాడు. ఎడమ తొడపై దేవి ఆసీనమైయున్నది. స్వామికి నాలుగు చేతులున్నవి. పైభాగములోని కుడిచేతియందు చక్రము, ఎడమచేతిలో శంఖము, దిగువ కుడిచేయి అభయముద్రలో, ఎడమచేయి దేవి భుజముపైన ఉన్నాయి. దేవునికి కిరీటము, కంఠహారములతోబాటు అనేక ఆభరణాలున్నవి. దేవికి కరండ మకుట అలంకారమున్నది. భక్తుడైన



భృగుమహర్షికి, శ్రీదేవి, భూదేవిల సమేత లక్ష్మీనరసింహస్వామి ఉత్సవమూర్తి విగ్రహాలను స్వామి ఒక పేటికలో పెట్టి యిచ్చి నిత్యపూజకు ఉపయోగించ మన్నాడట. ఈ ఆలయమందలి స్వామిని 'వసంత మాధవులు' లేక 'వసంతవల్లభుడనే పేరున కూడా పూజిస్తారు.

**దేవీమందిరము**

దేవి ఆలయము స్వామి ఆలయానికి సమీపాన ఉత్తరదిశలో తూర్పు ముఖమును కల్గి నిర్మించబడిన గర్భగుడి, అంతరాళము, ముఖమండపము, మహామండపములను కల్గియున్నది. గర్భగృహము పైభాగమున ఏకతల విమానము, పైన శిఖరము, లోహపు కలశము వున్నవి. గర్భగృహమందు లక్ష్మీదేవి పద్మాసనములో కూర్చొని (ఆసీనమూర్తి ) వున్నది. ఈమె నాలుగు చేతులను కల్గి పై రెండు చేతులలో పుష్పములను, క్రింది కుడిచేయి అభయముద్రలోను, ఎడమచేయి వరదముద్రలోను వున్నవి. ఈ ఆలయములందు పూజావిధులు వైఖానసపద్ధతిలో పూర్వము జపించెడివారు.

కదిరి నరసింహస్వామి ఆలయ సమీపంలో పారే మద్దిలేరునదిని 'అర్జుననది' అంటారు. ఈ నదీ తీరమందు పూర్వము అర్జునుడు తపమాచరించుటచే ఈ నదికి 'అర్జుననది' అను పేరు వచ్చినదట! ఈ నదిలో శ్వేతతీర్థం, భవనాశనీ తీర్థం, భృగుతీర్థం, లక్ష్మీతీర్థం, గంగాతీర్థం, గరుడతీర్థం అనే ఆరు తీర్థాలు వున్నాయి.

ఆలయములో లభ్యమయ్యే కొన్ని శాసనాలు, ఆలయ నిర్మాణ వివరాల్ని తెలియజేస్తున్నవి. అందులో క్రీ.శ. 1352 సం॥ నాటి శాసనము ఆలయాన్ని విజయనగర సామంతుడైన నాయకుడొకరు నిర్మించినట్లు తెల్పుతూంది. అలాగే క్రీ.శ 1353వ సం॥ నాటి శాసనము రెండవ కుమార కంపరాయుని ఆస్థానాధికారి స్వామికి ఒక బంగారపు ఆభరణాన్ని సమర్పించినట్లు, అలాగే క్రీ.శ. 1530 సం॥ నాటి శాసనము కృష్ణరాయల

బంధువొకరు స్వామి ఆలయములో నైవేద్యమునకై కొంత భూదానమును కావించినట్లు తెలుపుచున్నవి.

ఆలయములో బ్రహ్మోత్సవము ఫాల్గున శుద్ధ పాడ్యమి నుండి పది రోజులు కన్నులపండువుగా జరుగుతుంది. రథోత్సవమునాడు భక్తులు రథముపైనున్న 'ఉత్సవమూర్తి'పై మిరియాలుచల్లి క్రిందపడిన మిరియాలను ఏరుకొని భుజిస్తారు. ఈ మిరియాలు భక్తులను దీర్ఘరోగాల నుండి విముక్తి పరుస్తాయని అనాదిగా వచ్చెడి విశ్వాసము.

కదిరి నేడు పవిత్రమైన పుణ్యస్థలముగానేగాక, ప్రముఖ వ్యాపార కేంద్రముగాను, అంతకుమించి హిందూ, ముస్లిమ్ మతాల సంస్కృతికి కేంద్రముగా విరాజిల్లుతూంది.

* * *

# గోరంట్ల - మాధవరాయస్వామి ఆలయము



అనంతపురము జిల్లాలో అత్యంత ప్రసిద్ధి గాంచిన వైష్ణవ ఆలయములలో ప్రముఖమైనది గోరంట్ల గ్రామములో నెల కొన్న మాధవ రాయస్వామి ఆలయము. గోరంట్ల గ్రామము హిందూపురం తాలూకాలో కదిరి, హిందూపురం మార్గమందు, కదిరిపట్టణమునకు ముప్పదిమైళ్ళ దూరముననున్నది.

మాధవరాయస్వామి ఆలయము విజయనగర రాజుల కాలమందు నిర్మింపబడినట్లు అచ్చట లభ్యమైన శాసనములు, ఆలయనిర్మాణపద్ధతి, ఆలయగోపురములపైనున్న రాజముద్రికలనుబట్టి నిర్ణయించబడినది.

**ఆలయనిర్మాణము**

మాధవరాయస్వామి ఆలయము విశాలమైన ఆవరణములో ఎత్తైన ప్రహరీగోడ లోపలిభాగమందు నిర్మింపబడినది. ఆలయప్రవేశద్వారము



తూర్పువైపున వున్నది. ఈ ప్రవేశద్వారముపైన ఎత్తైన గోపురమున్నది. గోపురము ప్రస్తుతము శిథిలావస్థలోయున్నది. గోపురము యొక్క అధిష్ఠానము కొంత భూమిలో పూడియున్నది. అధిష్ఠానము పైని శిల్పాలంకరణ ప్రస్తుతింపదగినది. ఇచ్చట విజయనగర ప్రభువుల రాజముద్రిక (వరాహము-త్రిప్పిపట్టిన కత్తి) చెక్కబడియున్నది.

ఆలయము గర్భగృహము, అంతరాళము, ముఖమండపము మహామండపములను కల్గియున్నది. ఆలయము పొడవు 85 అడుగులు. గర్భగృహము 12 అడుగుల చతురస్రాకారనిర్మాణము. అంతరాళము 12 × 6 అడుగుల దీర్ఘచతురస్రాకారముగా యున్నది. ముఖమండపము 37 అ; మహామండపము 30 అ. నిడివితో చతురస్రాకారనిర్మాణములు. ఈ ఆలయమండపములు పెద్ద రాతిదిమ్మెల సాయముతో నిర్మించబడినవి. గర్భగృహముపైన విమానము, కూట, సాల, పంజర అంగములనుగల్గి నాగరపద్ధతి శిఖరమును కల్గియున్నది. మహామండపమున కెదురుగా, స్వామిని చూస్తున్నట్లు మలచబడిన అతిసుందరమైన గరుడ విగ్రహమున్నది.

మహామండపమునందలి పది స్తంభములు వైవిధ్యమును కలిగి, అత్యంత శోభాయమానముగానున్నవి. ఈ స్తంభములన్నియూ పూర్తిగా విజయనగర రాజుల శిల్పకళారీతిలో చెక్కబడినవి. మహామండప ప్రవేశద్వారమున కిరువైపులనున్న రెండు స్తంభములు కొంత వైవిధ్యాన్ని కలిగియున్నవి. స్తంభము క్రిందిభాగములో తొండాన్ని చాచిపట్టిన ఏనుగులు, ఏనుగుల వెనుక నాలుగు కాళ్ళను చాచి భయంకరముగా నోరుతెరచిన సింహములు చెక్కబడినవి. ముఖమండపము ప్రవేశద్వారమునకిరువైపుల



వున్న స్తంభములపై ఏనుగులమీద స్వారి చేస్తున్న సింహములున్నవి. ద్వారబంధముపైన లక్ష్మీకరమైన గజలక్ష్మి శిల్పము, ఇరువైపుల ద్వారపాలకుల విగ్రహములు వున్నవి. గర్భగృహమునందు దివ్యమంగళకరమగు విష్ణువు (మాధవరాయస్వామి) విగ్రహమున్నది.

ఆలయమునందు ఆసక్తి కలిగించే కొన్ని శాసనములున్నవి. క్రీ.శ. 1354 సం॥ నాటి శాసనము ఈ ఆలయాన్ని, విజయనగర చక్రవర్తి సాళువ నరసింహుడు నిర్మించినట్లు తెలుపుతున్నది. క్రీ.శ. 1524 సం॥ నాటి శాసనము వాకిటి ఆదెప్పనాయుడు ఆలయములో ప్రతినెలా దశమి వుత్సవములను నిర్వహించుటకుగాను కొంత మాగాణిని దానమిచ్చినట్లు క్రీ.శ. 1530 సం॥లో వాకిటి మల్లప్పనాయుడు గోరంట్ల సీమను నాయంకరముగా ఇచ్చినట్లు, అలాగే క్రీ. శ. 1533 సం॥నాటి శాసనము వాకిటి మల్లప్పనాయుడి కుమారుడు తిమ్మప్పనాయుడు స్థానిక ప్రజలను స్వామి ఆలయమందు నిర్లక్ష్యముచేయబడిన ఊరేగింపు ఉత్సవాలను యథాతథముగా కొనసాగించమని ఆజ్ఞ ఇచ్చినట్లు తెల్పుచున్నది. క్రీ.శ. 1610వ సం॥నాటి శాసనము చిక్క వేంకటప్పనాయుడు కొన్ని పన్నులను గోరంట్ల సీమలో స్వామి గౌరవార్థము మినహాయించినట్లు సూచిస్తుంది. పై శాసనములనుబట్టి వాకిటి వంశస్థులవారు ఈ ప్రాంతాధికారులై యుండినట్లు చెప్పవచ్చు.

అలనాడు వైభవోపేతముగా సకల ఐశ్వర్యములతో విరాజిల్లిన ఆలయము ప్రస్తుతము శిథిలావస్థలో నున్నది. ఆనాటి విజయనగర ప్రభువుల త్యాగనిరతికి, కళాభిరుచికి, ప్రతిభకు నిదర్శనముగా ఈ ఆలయము నిర్మింపబడియున్నది.

* * *

## లేపాక్షి - వీరభద్రాలయము



లేపాక్షి గ్రామము రాయలసీమ యందలి అనంతపురం జిల్లా, హిందూపురమునకు తొమ్మిదిమైళ్ళ దూరములో నున్నది. ఈ గ్రామమును విజయనగర రాజుల కాలమందు 'లేపాక్షినగర' మనెడి వారు. స్కందపురాణమీ గ్రామమును భారతదేశములోని 108 శైవ క్షేత్రములలో ఒకటిగా పేర్కొన్నది. ఈ గ్రామమునకు 'పాపనాశేశ్వర క్షేత్ర'మని, 'కూర్మశిల' యనికూడా పేర్లు ఉన్నవి. ఈ గ్రామమును అగస్త్యముని పవిత్ర కూర్మశిలపై నిర్మించి నాడని ప్రతీతి. ఈ గ్రామమందే జగత్ ప్రసిద్ధిగన్న వీరభద్రాలయము నిర్మించబడి నది. ఈ ఆలయము కూర్మశిలయను కొండమీద నిర్మితమైయున్నది. ఈ ఆలయ ప్రాంగణములో పాపనాశేశ్వర, రఘునాథేశ్వర, రామ, కాళి మొదలగు ఆలయములున్నవి. చరిత్రకారుల అంచనా ప్రకారము ఈ ఆలయము విజయనగర చక్రవర్తి అచ్యుత దేవరాయల కాలములో నిర్మితమైనది. కాని ఇటీవల ఆలయములో లభ్యమైన శాసనము ప్రకారము సాళువ నరసింహరాయలు ఆలయ జీర్ణోద్ధరణ కావించినట్లు తెలియుచున్నది. కాన అచ్యుత దేవరాయల కాలంలో ఆలయమును విస్తృతపరచినట్లు చెప్పవచ్చు.

### పేరు

లేపాక్షి పేరును గూర్చి ఒక ఐతిహ్యము ప్రచారమందున్నది. సీతారాములు అరణ్యవాసములోనుండగా రావణుడు సీతనపహరించుకొని

వెళ్ళుచుండగా, ఈ ప్రదేశములో జటాయువు రావణునితో పోరి, రెక్కలు తెగి, రాముని రాకకై వేచియుండి వారికి సీతాపహరణవృత్తాంతము తెలియజేయగా, దయార్ద్రహృదయుడైన రాముడా పక్షివీపు నిమరి 'లేపక్షి' అన్నాడనీ, వెంటనే రెక్కలు తెగి పడుండిన ఆ పక్షి లేచి నిలబడినదనీ, కావున ఈ ప్రదేశాన్ని 'లేపక్షి' అన్నారని, కాలగమనంలో లేపక్షి 'లేపాక్షి'గా మారినదని ప్రజల విశ్వాసము.

మరికొందరి ప్రకారము 'లేపాక్షి' అనగా లేపములు గల అక్షులు గలది. ఇచ్చటి వర్ణచిత్రములందు స్త్రీల నయనములు లేపముతో తీర్చిదిద్దినట్లుండుటచే ఈ గ్రామమునకు లేపాక్షి అనే పేరు వచ్చినదట.

**ఆలయనిర్మాణము**

అచ్యుత దేవరాయలు విజయనగర సామ్రాజ్యమేలునపుడు, పెనుగొండ కోశాధికారి విరూపణ్ణ. ఇతడు మొదట విజయనగర ఆస్థానమందు ద్వారపాలకుడుగా నుండి తన ప్రజ్ఞాపాటవములతో, స్వామి భక్తితో, చక్రవర్తి మెప్పును పొంది కోశాధికారి పదవినలంకరించెను. ఇతడు గొప్ప శివభక్తుడు. ఇతడికి ఒకమారు వీరభద్రుని విగ్రహము లభించినదట! చక్రవర్తితో తనకున్న సాన్నిహిత్యాన్ని పురస్కరించుకొని ప్రభువు ఆనతిలేకనే వీరభద్రుని విగ్రహమునకు ఆలయనిర్మాణము కావించి, నిర్మాణము



పూర్తికాగానే దాన్ని చక్రవర్తికి చూపించి, ప్రభువును ఆశ్చర్యచకితుణ్ణి చేయవలయుననుకొన్నాడు. ఆలయనిర్మాణము పూర్తి కాబోవు సమయానికి విరూపణ్ణ అంటే గిట్టనివారు అతడిపై కక్షసాధించుటకదే మంచి తరుణమని భావించి ప్రభుత్వధనాన్ని ఖర్చుపెట్టి విరూపణ్ణ ఆలయనిర్మాణము కావించుచున్నాడని చాడీలు చెప్పగా, చెవులేకాని, కండ్లులేని ప్రభువు నిజానిజాలు పరిశీలించక విరూపణ్ణను దోషిగా నిర్ణయించి ఆయనకు కండ్లూడ పెరికించమన్నాడట. ఆ విషయం విన్న విరూపణ్ణ రాజాజ్ఞను తానే అమలుపెట్టనెంచి, తన కండ్లను తానే ఊడపెరికి ఆలయము గోడపైకి విసరివేసినాడట.

ఈనాడు దక్షిణ ముఖద్వారమునకు లోపల పడమటి గోడపైనున్న రెండు ఎఱ్ఱటి చారలు, వాటిపైనున్న రెండు రంధ్రములు, విరూపణ్ణ కన్నులు విసరివేయగా ఏర్పడిన గుర్తులంటారు. అంతేకాక ఆలయములోని అపూర్వమైన కళ్యాణమండపనిర్మాణము విరూపణ్ణ మరణముతోటే ఆగిపోయినదంటారు. అయితే ఈ కథ సత్యదూరమని చెప్పవచ్చు. కారణము అచ్యుతరాయల కాలమునాటి శాసనములు అతడు, అతడి ఆస్థానమందలి కొందరు ప్రధానోద్యోగులు, వ్యాపార సంస్థలు ఆలయమునకు చేసిన అనేక దానధర్మములను తెలియజేస్తున్నవి. ఉదా – అచ్యుతరాయలు క్రీ.శ. 1533 సం॥ మందు కాంచీపురము నుండి తన ఎత్తు సువర్ణాన్ని వీరభద్రాలయానికి 'కాంచనమేరు' అనుపేరున దానమిచ్చినట్లు, క్రీ.శ. 1537వ సం॥ నాటి శాసనము రాయలు రెండు గ్రామాల్ని హంపి విట్ఠలస్వామి సన్నిధినుండి ఈ ఆలయమునకు దానమిచ్చినట్లు తెలుపుచున్నవి. అచ్యుతరాయలు అటు గజపతులతోను, ఇటు బహమినీ సుల్తానులతోను, ఎడతెగని యుద్ధాలలో మునిగియుండుటచేత ఆర్థికమైన ఇబ్బందులకు గురియై ఆలయనిర్మాణము కొనసాగించలేక పోయివుండవచ్చు, లేదా రాజ్యాధికారమును చేజిక్కించుకొన్న అళియరామరాయలకు, అచ్యుతరాయలకు నమ్మినబంట్రైన విరూపణ్ణకు

విభేదములేర్పడుటచేతనైనా విశిష్టమైన కళ్యాణమండప నిర్మాణము ఆగిపోయి వుండవచ్చు.

ప్రస్తుతమీ ఆలయము మరీ ఎక్కువగా క్షీణించిపోవుటకు కారణము ఆనాటి రాయలసీమ జిల్లాల ప్రధాన 'కలెక్టరు'గారైన మన్రో దొరయే. ఒకమారు ఆయన లేపాక్షి ఆలయమును సందర్శించి, ఆలయమందలి దేవుడు తల్లి మరణమునకు కారకుడైన వీరభద్రుడని విని, ఆలయమునకు క్రొత్తగా మాన్యములు ఏర్పాటు చేయకపోవడమేకాక, పూర్వమున్న మాన్యములన్నింటిని ప్రభుత్వ స్వాధీనముచేసినాడట. ఆనాటినుండి వీరభద్రాలయము బాటసారులకు, బిక్షగాళ్ళకు నిలయమై తనలోని శిల్ప, చిత్రకళలను కొంతవరకు రూపుమాపుకొన్నది.

ఆలయ నిర్మాత 'విరూపణ్ణ' తండ్రి నంది లక్కిసెట్టి, తల్లి ముద్దమ్మ. ఇతడి సోదరులు విరూపణ్ణయ్య, చిక్కమల్లప్ప నాయకులు నాయంకరులేగాక, మంచి దైవభక్తులు కూడా. ఈ విరూపణ్ణ క్రీ.శ. 1541వ సంవత్సరమునందు నారాయణవనమందలి కళ్యాణ వేంకటేశ్వరాలయమును నిర్మించుటేగాక, శ్రీకాళహస్తి, తిరుమల వేంకటేశ్వరాలయములకు అనేకదానధర్మములు కావించినాడు.

### ఆలయవర్ణన

వీరభద్రాలయము కూర్మశైలమనే చిన్న తిప్పపైన నిర్మించబడినది. ఆలయము చుట్టూ బలిష్ఠముగా కోటగోడలవలె నిర్మింపబడిన రెండు ప్రాకారములున్నవి. మొదటి ప్రాకారమందు, తూర్పు, పడమర, ఉత్తర దిక్కులందు మూడు ప్రవేశద్వారములున్నవి. వాటిలో తూర్పు, పడమర ద్వారములు మూయబడి, ఉత్తరద్వారము మాత్రమే తెరువబడియున్నది. ఈ ద్వారముమీద గోపురము నిర్మించబడియున్నది. ఇటుకలతో నిర్మించిన గోపురపైభాగము శిథిలావస్థలో యున్నది. రెండవ ప్రాకారము నాల్గువైపుల

స్తంభముల సాయముతో నిర్మించబడిన మండపమున్నది; ఈ ప్రాకారమందే ఉత్తర, దక్షిణ దిశలందు రెండు ద్వారములుండగా ప్రస్తుతము దక్షిణద్వారము మూయబడినది. ఈ ప్రాకారము లోపలే ఆలయము నిర్మింపబడియున్నది.

ఆలయము ప్రవేశించగానే భక్తుల మనస్సులనాకట్టుకొనే సప్తఫణి నాగేంద్రుడి శిల్పము. ఈ నాగేంద్రుడు మూడు చుట్టలుగా చుట్టుకొని ఏడు పడగలను కల్గి మధ్య శివలింగమును పానవట్టాన్ని కల్గియున్నాడు. ఈ నాగేంద్రుడి నిర్మాణము విచిత్రముగా జరిగినదట! ఒకరోజు ఆలయ నిర్మాణములోని శిల్పులు మధ్యాహ్నపు భోజనమునకు వెళ్ళగా, భోజనము వండే స్త్రీ వంట తయారగుటకు ఇంకా గడియకాలమవుతుందనగా, శిల్పులు ఊరకుండుటెందుకని ప్రక్కనే ఉన్న పెద్ద బండరాతిని సప్తఫణి నాగేంద్రుడిగా మలచినారు. వంటవండి, వెలుపలికివచ్చిన స్త్రీ అక్కడవున్న అద్భుతమైన నాగేంద్రుని శిల్పమును అలాగే రెప్పవాల్చక చూసినదట! ఆమె చూపుల వాడి (దృష్టి) కి నాగేంద్రుడి శిల్పము మధ్యన చీలిపోయినదట. ఈనాడా చీలినచోటున పూతపూసియుంచినారు. ఈ నాగేంద్రుడి నిర్మాణము ఆనాటి



ఆంధ్రశిల్పుల కళానిపుణతకు ప్రతీక. ఈ నాగేంద్రుడి సమీపమునందే ఆసీన వినాయకవిగ్రహమున్నది.

వీరభద్రాలయము రెండవ ప్రాకారములోపల మధ్య భాగమందు నిర్మింపబడినది. అందులో గర్భగృహము, అంతరాళము, ప్రదక్షిణాపథము, ముఖమండపము, నాట్యమండపములున్నవి. ఇందులో గమనించదగ్గ విషయము వీరభద్రాలయము ఉత్తరాభిముఖముగా నిర్మించియుండుట. ఇది వాస్తుశాస్త్రానికి విరుద్ధము. వీరభద్రాలయమునకు సమీపములోనే పాపనాశేశ్వర, రామ, దుర్గ, విష్ణు, రామలింగ, హనుమలింగ, భద్రకాళి ఆలయములున్నవి. పాపనాశేశ్వరాలయము పశ్చిమాభిముఖముగా నిర్మించియుండుటచేత, వీరభద్రాలయముకంటే ఇది పురాతన ఆలయమని అంటున్నారు.

**నాట్యమండపము**

ఆలయనిర్మాణమందు అత్యున్నత స్థానమును ఆక్రమించినది నాట్యమండపము. దీని నిడివి 81’ × 42’ అ. ఈ మండపము 70 స్తంభాల సాయముతో నిర్మింపబడినది. లోపలనున్న పన్నెండు స్తంభముల మధ్యన ఆస్థానమున్నది. ఈ స్తంభములపై మలచబడ్డ నిలువెత్తు నాట్యకత్తెల



అభినయాలు, పద్మినీజాతి స్త్రీల అంగసౌష్టవాలు, గంధర్వకన్నెల నాట్య విన్యాసాలు, వింతవింత సొగసులను కుమ్మరించే ఈ శిలాసాలభంజికలు చూచేవాళ్ళ కళ్ళల్లో వెన్నెలలు కురిపిస్తాయి. వీటిలో ముఖ్యంగా చూడదగిన దృశ్యము రంభాశివుల నాట్యవిన్యాసము. బ్రహ్మ మద్దెల మ్రోయిస్తుంటే, సూర్యుడు సన్నాయి వూదుతుంటే, నందికేశ్వరుడు 'తకిటతధిగిణత' అంటూ డమరుకం వాయిస్తుంటే, చంద్రుడు రాగాలాపన మొదలిడగా నాట్యాచార్యులు తాళము వేస్తుండగా వారి తాళములకు అనుగుణముగా రంభా నటరాజులు మైమరచి నాట్యముచేస్తున్నారు. మరికొన్ని స్తంభములపై, భిక్షాటనమూర్తి, కాలభైరవ, గణపతి, గజాసుర, నటరాజ శిల్పాలున్నవి. ఈ మండపములోనే అత్యంత ఆశ్చర్యకరమైన, భూమిమీద ఎటువంటి ఆధారము లేకుండా, కప్పును మాత్రమే ఆధారముగాజేసికొని నిలిచియున్న స్తంభమున్నది. దీనిని అంతరిక్ష స్తంభమంటారు. భూమికి స్తంభమునకు మధ్యనున్న స్థలములో చేతిరుమాలును ఒక వైపునుండి మరొక వైపునకు లాగవచ్చు. ఈ స్తంభ నిర్మాణము ఎలాసాగినదో ఈ 20వ శతాబ్దపు విజ్ఞానవేత్తల మేధస్సులకు కూడా అంతుదొరకుట లేదు. ఈ మండపము పైకప్పు పూర్తిగా చిత్రకళతో నిండియున్నది.

**ముఖమండపము**

ముఖమండపము లోపలిభాగమున పన్నెండు రకములైన స్తంభములున్నవి. ఇవన్నియు విజయనగర శిల్పకళారీతినే మలచబడినవి. ఈ మండప స్తంభములపైన 4 అ. ఎత్తువుండే దుర్గ, గజాసురసంహారమూర్తి, కాలారిమూర్తి, పద్మినీజాతి స్త్రీ, పాంచాల, పురుష (వాస్తుపురుష) శిల్పములు మలచబడినవి. పద్మినీజాతి స్త్రీ వంపుసొంపులు, కొనదేలిన ముక్కు, విశాలమైన నయనాలు, వాటిపైన తుమ్మెదరెక్కలవంటి కనురెప్పలు, వయ్యారపు చూపు, పటుత్వమైన కుచద్వయము వీక్షించేవారి కండ్లకు మత్తెక్కించును. ఇచ్చటనే మూడవ పాదమును కల్గిన భృంగి శిల్పమున్నది.

**కళ్యాణమండపము**

లేపాక్షి కళ్యాణమండపము, దక్షిణ భారతదేశ కళ్యాణ మండపాలన్నింటిలోకి అపురూపమైనది. ఈ మండపము ముప్పైఎనిమిది పెద్ద పెద్ద స్తంభాల సాయముతో నిర్మించబడినది. ఈ స్తంభములపైన ముఖ్యమైన దేవతలు, అష్టదిక్పాలకులు, ఋషులు, ధన్వంతరి శిల్పములు అత్యున్నతమైన రీతిలో మలచబడినవి. వీరందరు పార్వతీపరమేశ్వరుల కళ్యాణమహోత్సవమును తిలకించుటకై ఏతెంచినట్లు చూపబడినారు. ఆదిదంపతుల కళ్యాణఘట్టము అతి మనోహరముగా చూపబడినది. కళ్యాణమండపమునకు ఆనుకొని 42 స్తంభముల సాయముతో నిర్మితమైన మండపమే లతామండపము. ఈ మండపము స్తంభములపై నాలుగువైపుల లతలు, వాటిపైన పూలు, పండ్లు, వాటినారగించడానికై వచ్చిన పక్షులు శిల్పి ఊహకు గొప్ప నిదర్శనము.

**నంది**

ఆలయమునకు సమీపమందు సప్తఫణి నాగేంద్రుడికి 200 గజాల దూరమున 15 అ. ఎత్తు, 23 అ. పొడవుగల్గి, లేత్రాయముతో అలరారే నంది శిల్పమున్నది. ఇది ఏకరాతితో మలచబడినది. ఇది భారతదేశమందలి పెద్ద నంది విగ్రహములలో ఒకటి. దీని పొట్టి కొమ్ములు, పాలపొండ్లు, కుదించిపట్టిన మూతి, పొట్టి తల, ఎత్తైన మూపురము, అమాయకపు చూపులు, శిల్పి సజీవ కల్పనాచాతుర్యమునకు నిదర్శనము. దూరం నుండి చూస్తే ఇది నిజమైన నందియేమోనని భ్రాంతి కలిగిస్తుంది.



కళాకారుల గుండెలను కదలించిన ఈ నందిని చూచే 'లేపాక్షి బసవయ్య లేచిరావయ్య' అని అడవి బాపిరాజుగారు ప్రబోధగీతాన్ని ఆలపించారు. ఈ బసవణ్ణ పూర్తి కాకపోవడానికి కారణమేమిటో చరిత్రకందడము లేదు.

**చిత్రకళ**

లేపాక్షి ఆలయమందు శిల్పమేకాక చిత్రకళ కూడా అత్యున్నత స్థాయిలోనమరినది! చిత్రకళ భారతదేశములో అనాదిగా ఆచరణలో నుండిన వృత్తి. అజంతా, ఎల్లోరా, బాగ్, ఎలిఫెంటా, సిత్తల్, నహసల్, తంజావూరు, కంచి ఈ చిత్రకళకు ప్రసిద్ధి. అలాగే విజయనగరరాజులు తాము నిర్మించిన దేవాలయాలలో చిత్రకళను చొప్పించారు. అయితే పై తెలిపిన ప్రదేశాలలో రాణించినట్లుగా విజయనగరచిత్రకళ రాణించలేదేమో అనిపిస్తున్నది. విజయనగరచిత్రాలు, హంపి విరూపాక్షాలయమందును, తాడిపత్రిలోని బుగ్గ రామలింగేశ్వర, చింతల వేంకటరమణాలయమందును, సోమపాళెం, పుష్పగిరి చెన్నకేశవాలయములలోను చోటుచేసుకొన్నాయి. ఈ చిత్రకళతో మానవుల మనస్సుల మరుగుపడుచుండిన పౌరాణిక గాథలు, దేవతామూర్తులు వెలుగులోనికి వచ్చినవి.

లేపాక్షి వీరభద్రాలయమందలి నాట్యమండపము, అర్ధమండపము, రఘునాథాలయ పైకప్పులు రకరకాలైన చిత్రాలతో నిండియున్నవి. నాట్యమండపము పైకప్పుమీద అర్జునుడు మత్స్యయంత్రాన్ని భేదించుట, ద్రౌపదిని పాండవులు వివాహమాడుట, విరూపణ్ణ వీరభద్రుని కొలుచుట, శ్రీరామపట్టాభిషేకము, శివపార్వతులు చదరంగమాడడము మొదలగు దృశ్యములేగాక, భిక్షాటనమూర్తి, నటరాజ, అంధకాసుర, అర్ధనారీశ్వర, ఆనందతాండవ, కళ్యాణసుందర వర్ణచిత్రాలు అత్యంతరమణీయము. మరొక చిత్రమందు ఋషులు, దిక్పాలకులు, విష్ణువు మొదలగువారు తిలకిస్తూవుండగా, బ్రహ్మ శాస్త్రోక్తముగా శివపార్వతుల కళ్యాణము జరిపిస్తున్నాడు. మరొక కమనీయ దృశ్యము కిరాతార్జునీయము. ఈ

చిత్రములో కిరాతునిచే తరుమబడిన వరాహము పరిగెడుతున్నది. అడవిలో చెలరేగిన కలకలముతో కుందేళ్ళు, జింకలు భీతితో పారిపోతున్నవి. రెండు చిలుకలు ఒకదానినొకటి ఆనుకొని ఓ చెట్టు కొమ్మమీద నిశ్చలముగా ఒదిగి కూర్చొనివున్నవి. ఈ కమనీయ దృశ్యము కళ్ళకుకట్టినట్లు రచింపబడినది.

**మనుచోళుని కథ**

మనుచోళుడు (మాధవవర్మ) నీతికి, నిజాయితీకి ప్రతీకయైన ప్రభువు. ఒకరోజు రాజకుమారుడు రథముపైన పయనిస్తూ ఉండగా ఒక ఆవుదూడ అతడి రథచక్రముక్రిందపడి మరణిస్తుంది. దూడను కోల్పోయినవ్యక్తి రాజుగారికి తన బాధను విన్నవించుకొంటాడు. ధర్మబద్ధుడైన ప్రభువు నిందితుడు తన కుమారుడైనప్పటికిన్ని లెక్కచేయక అతడినికూడా రథచక్రం క్రింద పడవేసి చంపమని తీర్పునిస్తాడు. పార్వతీపరమేశ్వరులు రాజు ధర్మనిరతికి మెచ్చి సాక్షాత్కరించి దూడను, రాజకుమారుణ్ణి బ్రతికిస్తారు. ఈ దృశ్యమందు రథము క్రింద పడియున్న దూడను ఆవు నాకుతున్నట్లు, ఐతిహ్యమందలి వివరములనన్నింటిని చిత్రకారుడు తన కుంచెతో రంగరించి, హృదయాలను కదలించినాడు.

రసజ్ఞుల దృష్టిని ఆకట్టుకొనే మరొక చిత్రము నాట్యమండపములోని వటపత్రశాయి అయిన చిన్నికృష్ణుడు. నీలమేఘవర్ణుడైన ఈ చిన్నికృష్ణుడు వటపత్రముపై పరుండి కుడిచేతితో తన ఎడమపాదమును లాగి నోటిలో పెట్టుకొనుచున్నాడు. ఈ చిన్నికృష్ణుని ముగ్ధమోహన రూపం, అతడి తలపైన కదలాడే పింఛము, మొలలోని గజ్జెలు ఒడలంతా నిండిన ముత్యాల సరాలు చూపరుల కళ్ళకు మిరుమిట్లు కొల్పుతాయి.

కథాచిత్రాలలో అతి రసవత్తరమైనది దారుకావనఘట్టము. ఈ చిత్రమందు ఒక స్త్రీ శివుని చేతిలోనున్న భిక్షాపాత్రలో భిక్ష వేస్తూండగ, వక్షస్థలము పైనుండు పైటకొంగు తొలగిపోయినది. ఆమె వక్షస్థలము,

ఆమెలోని సంపూర్ణ స్త్రీత్వాన్నే చూపిస్తుంది. ఆమె అర్ధ నిమీలిత నయనాలు భక్తిపారవశ్యాన్నే తెలుపుతున్నాయి. అమలిన భగవద్భక్తితో జీవుడుపొందే మధురానుభూతి యిది.

పులివేట చిత్రము కళాత్మకమైనది. ఇందు వేటగాళ్ళు కాళ్ళకు చెప్పులు ధరించియున్నారు. పులి శరీరములో దిగిన బాకునుండి చిమ్మే రక్తము, వేటగాని తలను పట్టుకొన్న పులినోరు వాస్తవానికి చేరువలోనున్నవి.

వీరభద్రాలయము ముఖమండపమునందు చోటుచేసుకొన్న వీరభద్రుని చిత్రములలో చిత్రకారుడు తనకు అందుబాటులో వున్న రంగులనన్నింటిని ఉపయోగించినాడు. ఈ చిత్రము విజయనగర రాజుల కాలమునాటి చిత్రాలన్నింటిలోకి అతిపెద్దదేగాక అత్యుత్తమమైనదీను. ఈ చిత్రమునకు ఒకవైపు విరూపణ్ణ, మరొకవైపు అతడి భార్య అంజలి ఘటిస్తున్నారు.

చిత్రకారుడు కథాచిత్రాలను సన్నివేశానికనుగుణముగా తీర్చిదిద్దినాడు. జంతువుల, లతల, పక్షుల చిత్రీకరణలో అతిజాగరూకత, మెళుకువ కనపరచినాడు. అయితే ఎందుచేతనో ఈ చిత్రాలయందలి స్త్రీ, పురుష ముఖములు కోలగా సృష్టించినాడు. ఈ చిత్రరచనలో వీలైనంతవరకు ఆనాటి చిత్రకారులు స్థానికముగా లభ్యమైన ధాతువులు, రసాయనాలు, ఆకులు, పసుపు, కుంకుమ, సున్నముల కలయికతో రంగులనే వాడినారు. ఈ చిత్రాలనుండి ఆనాటి ఆంధ్రదేశములోని ప్రజల అలవాట్లు, స్త్రీల కట్టు, బొట్టు, అలంకరణములన్నింటిని తెలుసుకొనవచ్చును.

లేపాక్షి చిత్రముల దుస్తులయందలి నమూనాలను అహ్మదాబాదు గుడ్డలమిల్లులవారు "ప్రభుత్వ చేనేత" పరిశ్రమవారు కాపీ చేయించి తాము తయారుచేయు దుస్తులందు ఆ నమూనాలను ముద్రిస్తున్నారు.

* * *

# తాడిపత్రి - బుగ్గ రామలింగేశ్వరాలయము, చింతల వేంకటరమణాలయం

తాడిపత్రి అనంతపురము జిల్లాలో తాలూకా కేంద్రము. ఒకనాడిది చిన్న గ్రామమైనా నేడు ప్రసిద్ధిగాంచిన వ్యాపార కేంద్రము. ఇచ్చట పవిత్ర పినాకినీ నది ఉత్తరదిక్కుగా ప్రవహించుటచేతను, ఈ విజయనగర కాలమునాటి రెండు ప్రసిద్ధ దేవాలయములుండుటచేతను ఈ గ్రామము పవిత్రతను సంపాదించుకొన్నది. ఇచ్చట నెలకొన్న ఈ రెండు ఆలయములలో మొదటిది బుగ్గ రామలింగేశ్వరాలయము రెండవది చింతల వేంకటరమణాలయము. ఈ రెండు ఆలయాలు విజయనగరరాజుల మత సహనమునకు, ఆనాటి వారి కళాతృష్ణకు నిదర్శనాలు.

### గ్రామనామము

పూర్వము తాడిపత్రి గ్రామమును భాస్కరక్షేత్రమనెడివారు. ఇచ్చట తాటిమ్రానులు విస్తారముగానుండుటచేత పరిసర గ్రామస్తులు తాటి పత్రి (ఆకు) ని ఇండ్లు కప్పుకొనుటకు తీసికొని వెళ్ళేవారని, అందుచేత ఈ గ్రామాన్ని తాళం పత్రి మరియు తాటిపత్రి అనెడివారని. నాటి తాటిపత్రే నేడు తాడిపత్రిగా రూపం దాల్చినదని స్థానిక ప్రజల కథనం.

## 1) బుగ్గ రామలింగేశ్వరాలయము

### ఆలయనిర్మాణము

ప్రస్తుతం బుగ్గ రామలింగేశ్వరాలయమున్నచోట, పూర్వము పరశు రాముడు తపస్సుచేసి శివుని లింగాకృతితో పూజించి స్వామిచేత వరాలను పొందినాడట. అందుచేత ఈ ప్రదేశాన్ని రామపాదము అని పిలిచేవారు. ఆలయనిర్మాణము స్థానిక విజయనగర సరదారుడైన పెమ్మసాని రామలింగనాయుడు నిర్మించినాడు. ఐతిహ్యం ప్రకారము, రోజూ



రామలింగనాయుడి ఆవులు అడవికి మేతకు వెళ్ళేవట. వాటిలో ఒక ఆవు రోజూ ఒక పుట్టపై పాలు వదిలేదట. ఒకరోజు పశువుల కాపరి చాటున పొంచియుండి ఆవు పుట్టపై పాలు వదిలేటప్పుడు దానిపైకి గొడ్డలి విసరివేశాడు. ఆ రాత్రి రామలింగనాయుడి కలలో పరమేశ్వరుడు కన్పడి, పుట్టలో తను లింగాకృతిలోనున్నట్లు తెలిపి ఆ పుట్టపై ఆలయము నిర్మించమన్నాడు. ఉదయం రామలింగనాయుడా విషయము అధికారులకు తెలిపి వారిని వెంటబెట్టుకొని పుట్టయున్న ప్రదేశమునకు వెళ్ళి చూడగ పుట్టలో శివలింగము ప్రత్యక్షమైనది. ఆ విషయం విజయనగర చక్రవర్తులకు తెలియజేసి, ప్రభువుల ఆనతితో రామలింగనాయుడు శివుని కోరికమేరకు ఆలయమును అత్యద్భుతముగా నిర్మించినాడు.

రామలింగేశ్వరస్వామి ఆలయం చుట్టూ ఉత్తర, దక్షిణ, పడమర దిక్కులందు మూడు గోపురములున్నవి. ఎందువల్లనో తూర్పు వైపున గోపురము నిర్మింపలేదు. ఈ ఆలయగోపురములు ప్రత్యేకమైన నల్లటి రాతితో కట్టబడి గలగలపారే ఉత్తర పినాకినీ నదిలో అద్భుతముగా ప్రతిబింబించెడివట. క్రీ.శ. 1851 సంవత్సరమందు పెన్నానదికి ఉధృతమైన వరదలు వచ్చుటతో దక్షిణ గోపురము శిథిలమగుటయే కాక, ఆలయ పునాదులుకూడ దెబ్బతిన్నవి. దక్షిణవైపు గోపురము దెబ్బతిన్నా ఇది ఆనాటి శిల్పుల పనితనానికి సాక్ష్యము. ఈ గోపురమే ప్రస్తుతము ఆలయ ముఖద్వారముగా ఉపయోగపడుచున్నది. ఈ గోపురమందలి ప్రతి అణువు శిల్పమే. ఆనాటి శిల్పుల ఊహకు, ప్రతిభకు ఇది నిదర్శనము. ఈ గోపుర అధిష్ఠానముపైననే ఆలయనిర్మాత రామలింగనాయుడి ప్రతిమ చెక్కబడియున్నది. దక్షిణ

గోపురమునకు ఏమి తీసికట్టుకాదంటు ఉత్తర గోపురనిర్మాణము సాగినది. ఇది శోభాయమానమైన మహిషాసురమర్దని, గంగాదేవి, భూతగణాలు, మకర తోరణములు, ఏనుగులు, సింహములు, శివలీలాశిల్పములతో అలరారుచున్నది. పడమటి గోపురము పైరెండు గోపురములకంటే ఆకారమునందును, శిల్పసంపదలోను సాటిరాదు.

## గర్భగుడి

దక్షిణగోపురద్వారము ద్వారా ఆలయము ప్రవేశించగానే ప్రధానాలయము గోచరించును. ప్రధానాలయము గర్భగుడి, అంతరాళము, ముఖమండపము అను భాగములుగా విభజింపబడియున్నది. గర్భాలయ మందలి స్వామి తూర్పుదిక్కుగా చూస్తున్నట్లు నిర్మాణము జరిగినది. గర్భగుడిపై గుండ్రని ఆకారములో నిర్మించబడ్డ ద్వితల విమానమున్నది. గర్భగుడి మధ్యభాగమున సోమసూత్రముపై శివలింగమున్నది. ఈ లింగము నున్నగా లేక గరుకుగా వుండుటచే దీన్ని "స్వయంభూ" వనుచున్నారు. లింగము క్రింది భాగమున పూర్వము అహర్నిశలు బుగ్గ (నీరు)



పూరుచుండుటచేతను, రామలింగనాయుడిచే నిర్మింపబడ్డ ఆలయమగుట చేతను, దీనికిబుగ్గ రామలింగేశ్వరాలయమని పేరుకల్గినది. గర్భగుడి గోడలపైన అనేక శిల్పములున్నవి. అందులో ఒక స్త్రీ తనకుడిచేతితో శివలింగముపై తులసి మాలను వేయుచున్నది. ముఖమండపమున కిరువైపుల ద్వారపాలకుల విగ్రహములున్నవి.

ముఖమండపము లోకప్పు మధ్యభాగమున అద్భుతముగా మలచబడ్డ శిల్పమున్నది. అంతరాళమునకు ఎదుట నంది విగ్రహమున్నది. ఈ మండపమందలి గోడలు శివలీలాగాథలతోను, శివుని ప్రతిరూపాలైన ఆసీన, ఉమామహేశ్వర, సకాసన, నృత్య, అర్ధనారీశ్వర, వృషభారూఢ, గజాసుర సంహార, భిక్షాటన శిల్పములతోనేగాక, వినాయక, కుమార, పార్వతి, దుర్గ, లక్ష్మి, సూర్య, సరస్వతి, దిక్పాలక శిల్పాలతో నిర్మింపబడియున్నవి. మండపానికి సమీపమున నవగ్రహములు ప్రతిష్ఠింపబడినవి.

స్వామిగర్భగుడికి దక్షిణదిశలో శ్రీరామునకు, పార్వతీదేవికి ప్రత్యేక మందిరములున్నవి. ఈ రెండు మందిరములకు ఒకే ముఖమండపమున్నది. దేవి ఆలయములో వేదికపై అత్యంత రమణీయముగా అలంకరించబడిన పార్వతీదేవి విగ్రహము ప్రతిష్ఠింపబడినది. రామాలయములోని వేదికపై శ్రీరామ, సీత, లక్ష్మణ స్వాములవారి నిలువెత్తు విగ్రహములున్నవి. ఈ ఆలయముల ముఖమండపము లోకప్పు తొమ్మిది గూళ్ళుగా విభజింపబడి, వాటియందు ఆసీన వీరభద్ర, శివ, వాహనసహిత కుమార, గణపతి మొదలగు శిల్పాలేగాక పద్మములు కూడ మలచబడియున్నవి.

ఆలయములో అనేక శాసనములు ఆలయ నిర్మాణమునకు సంబంధించిన కొన్ని వివరములను తెలియజేయుచున్నవి. క్రీ.శ. 1507వ సం॥నాటి శాసనము ప్రకారము గుత్తి సీమలో స్వామి గౌరవార్థము విజయనగర ప్రభువు వీరనరసింహరాయలు పెండ్లి సుంకాలను రద్దు చేసినట్లు క్రీ.శ. 1509 సం॥లో విజయనగర రాజ్యప్రధాని సాళువ తిమ్మరుసు

ఆలయములోని భోగమండపమును, గోపురమును, ప్రాకారములను నిర్మించినట్లు, అదే సంవత్సరమందు, తిమ్మరుసు చక్రవర్తి గౌరవార్థము స్వామికి నేలదళపాడు అనే గ్రామమును దానము చేసినట్లు, క్రీ.శ. 1513 సం॥లో తిమ్మరుసు తమ్ముడు సాళువ గోవిందయ్య ఆలయమునకు కొంత భూమిని దానము చేసినట్లు, క్రీ.శ. 1531 సం॥ నాటి శాసనము అచ్యుతరాయలు దేవుని నైవేద్యముకొరకు భూదానము చేసినట్లు తెలియజేయుచున్నవి.

స్వామివారికి ప్రతిఏటా మాఘ బహుళ అష్టమిమొదలు ఫాల్గునశుద్ధ తదియవరకు (పదకొండు రోజులు) ఫిబ్రవరి, మార్చి మాసాలయందు బ్రహ్మోత్సవమును వైభవముగా జరిపెదరు. ఈ ఉత్సవములకు సమీప ప్రదేశముల నుండి భక్తులు తండోపతండములుగా వచ్చి స్వామిని కొలిచెదరు.

## 2. చింతల వేంకటరమణాలయము

చింతల వేంకటరమణాలయము బుగ్గ రామలింగేశ్వరాలయమునకు మూడు కిలోమీటర్ల దూరమున ఊరికి మధ్యలో నిర్మించబడినది. ఐతిహ్యం



ప్రకారము ప్రస్తుతమీ ఆలయమున్న చోట పూర్వమొక చింతతోపు ఉండెడిదట! ఒకరోజు ఆ తోపులోని ఒక చెట్టు రెండు భాగములుగా చీలి చెట్టు మధ్యభాగమున వేంకటరమణుని విగ్రహము వెలుపలికివచ్చినదట. ఈ విషయము విన్న ఎఱ్ఱా తిమ్మానాయుడు చింతతోపు వద్దకు వెళ్ళి విగ్రహమును దర్శించి, స్వామి ఆనతి మేరకు, విజయ నగర చక్రవర్తుల అనుమతితో ఆలయ నిర్మాణం కావించినాడు. చింతతోపులో

వెలసిన రాయుడు కాబట్టి చింతలరాయుడని, భక్తుల వేదనలను, చింతలను పోగొట్టె వేంకటరమణుడు కావున, చింతల వేంకటరమణుడని, తిరువేంగళనాథుడని ఈ స్వామిని పిలుస్తున్నారు.

చింతల వేంకటరమణాలయము చుట్టూ పెద్ద పెద్ద నల్లటి రాళ్ళతో పొందికగా నిర్మించబడిన ప్రాకారము, ఇందులో మూడు ప్రవేశద్వారములు వున్నవి. తూర్పుదిశలోనున్న ప్రవేశ ద్వారముపై పెద్ద గోపురము, తక్కిన ద్వారములపై చిన్న శాలలు నిర్మించబడినవి. ఈ తూర్పుగోపుర నిర్మాణమున క్రిందపీఠమునకు రాతిని, తక్కిన అంతస్తుల నిర్మాణమునకు ఇటుక, కొయ్యలనుపయోగించినారు. గోపురము, అధిష్ఠానము మీద వైష్ణవ భక్తుల శిల్పములు, లతలు, కోలాటదృశ్యము, దీపకన్యల శిల్పములు చెక్కబడినవి. గోపురపైభాగము పిడుగుపాటుచే కూలిపోగా, ఇందులోని శిల్పములు మహమ్మదీయుల చేతులలో పడి, అంగవికలములై, తమ ఔన్నత్యమును కోల్పోయినవి. ఈ గోపురనిర్మాణము కాశినుండి ప్రత్యేకముగా రప్పింపబడిన ఎల్లమాచార్యుడను శిల్పాచార్యుడు కావించినాడట. గోపురమునకు ఎదురుగా ఉయ్యాల ఉత్సవానికిగాను తులామండపమును నిర్మించినారు. దీనికి సమీపములో అశ్వత్థ వృక్షమున్నది.

ఆలయము ప్రవేశించగానే భక్తుల దృష్టిని ఆకర్షించునవి వరుసగా ధ్వజస్తంభము, బలిపీఠము, ఏకరాతితో మలచిన అద్భుతమైన రథము. ఇది హంపి విట్ఠలస్వామి ఆలయమునందలి రాతిరథమును పోలియున్నది. రథము మధ్యభాగమున మూలబేరమును నమస్కరించుచు ముకుళిత హస్తాలతో ఉన్న గరుడ విగ్రహమున్నది. రథము పైకప్పు ఆలయశిఖరమును పోలియుండి అనేక శిల్పాలతో అలంకరింపబడియున్నది. రథములో ఏర్పరచిన రెండు చిన్న రంధ్రాలద్వారా సూర్యకిరణములు ప్రవేశించి సంవత్సరానికి రెండు రోజులందు స్వామి పాదాలను స్పృశించును.

### ప్రధానాలయము

ప్రధానాలయము గర్భగృహము, అంతరాళము, ముఖమండపము, మహామండపములను కలిగియున్నది. దీని పొడవు 137 అడుగులు, మహామండపమును ప్రవేశించుటకు మెట్లు అమర్చినారు. ఆలయములోని ప్రతి భాగము వైష్ణవశిల్పాలతోను, రామాయణశిల్పాలతోను అలంకరించినారు. వాటిలో దశరథుని పుత్రకామేష్ఠియాగము, సీతాకళ్యాణము, అరణ్యవాసము, సీత అగ్నిగుండప్రవేశము, రాముడు సీతను పరీక్షించి స్వీకరించు దృశ్యము, లంకలో రావణ, హనుమంతులు ఆసీనులై వాగ్వివాదము, వామనావతారుడైన మహవిష్ణువు బలిచక్రవర్తి శిరస్సుపై ఒక పాదమునుంచిన శిల్పము, ఉగ్ర నరసింహశిల్పము, కృష్ణలీలాశిల్పాలు భక్తుల హృదయములకు రసానుభూతిని కలుగచేస్తున్నవి.

భాగవత, రామాయణ గాథాశిల్పములకుతోడు హంసలు, నర్తకీమణులు, కీర్తిముఖతోరణములు, కుంభపంజరములు. కుడ్య స్తంభాలు, ప్రతిమానికేతనములతో అలంకరించినారు. గర్భగుడి మధ్యభాగమున తిరువేంగళనాథుని (కళ్యాణ వేంకటేశ్వరుని) దివ్యమంగళరూప విగ్రహమున్నది. గర్భగుడిపై ద్వితల విమానము, శిఖరము, దానిపై కలశము వున్నవి. గర్భగుడికి ముందుభాగమున ద్వారమున కిరువైపుల ద్వారపాలకులున్నారు.



మహామండపము 60'×45' (అడు గుల) నలభై (40) స్తంభాల సహాయముతో నిర్మించిన సమకోణ నిర్మాణము.

ముఖమండపము నాలుగు స్తంభాల సాయముతో 38' (అడుగులు) సమ చతురస్రాకారంలో నిర్మింపబడినది. ఈ మండపమొక అపూర్వ కళాసృష్టి. వీనియందు లోపలివైపుననున్న నాలుగు స్తంభములు, హంపి విఠ్ఠలస్వామి ఆలయములోని సంగీత స్తంభాలను పోలియున్నవి. అచ్చటివలెనే ఈ స్తంభములను మీటితే 'సప్తస్వరాలు' పలుకును. ఈ మండపము పై కప్పులో పెద్ద పద్మము మలచబడినది. పద్మము యొక్క రేకులపై నాట్యకత్తెల విన్యాసములు మలచబడియున్నవి. పూర్వమీ పద్మము సదా చక్రమువలె తిరిగెడిదట! ముఖమండపమునకు సమీపమందు వర్తులాకారంలో ఏకాంత మందిరమున్నది. ఇటువంటి మందిరము ఏ ఇతర విజయనగర దేవాలయములలోను కానరాదు.

స్వామి ఆలయమునకు సమీపములో దేవి ఆలయమున్నది. ఈ ఆలయముతోపాటు, వరాహ, రామాంజనేయ, లక్ష్మీనారాయణ, చెన్నకేశవాలయాలు అంగాలయాలుగా ఉన్నవి. ఆలయ ఆవరణమందు కన్నులకింపైన కళ్యాణమండపము నిర్మించబడియున్నది.

ఆలయము యొక్క గోడలపైన ఆలయ నిర్మాణమునకు సంబంధించిన కొన్ని శాసనములున్నవి. క్రీ.శ. 1551 సం॥ ఎనమల చింతల గ్రామమును ఎఱ్ఱా తిమ్మానాయుడు అళియ రామరాయల గౌరవార్థం, స్వామికి దానమిచ్చినట్లు, క్రీ.శ. 1564 సం॥మున మాధవదాసుడనే భక్తుడు కొంత భూమిని స్వామి నైవేద్యఖర్చులకై సమర్పించినట్లు, క్రీ.శ. 1578 సం॥ పెమ్మసాని తిమ్మానాయుడు మూడు పుట్ల భూమిని స్వామి కర్పించినట్లు, క్రీ.శ. 1585 సం॥లో, మరియు 1587 సం॥మందు స్థానిక ప్రజలు, స్వామి ఆలయంలో నిత్యార్చనకై భూదానములు చేసినట్లు క్రీ.శ.1663 సం॥ తిమ్మానాయనంగారు అనే భక్తుడు, 1664 సం॥మందు లింగన్న అనే భక్తుడు స్వామికి భూదానములు చేసినట్లు తెల్పుచున్నవి.

స్వామి బ్రహ్మోత్సవము ఏటేట ఆశ్వయుజ శుద్ధ అష్టమి నాటినుండి (సెప్టెంబరు అక్టోబరు మాసాలలో) పదిరోజులు జరుగును. ఈ పుణ్యదినములందు స్వామిని భక్తితో పూజించినచో వారి చింతలు తొలగునని భక్తుల ప్రగాఢ విశ్వాసము.

బుగ్గ రామలింగేశ్వర, చింతల వేంకటరమణాలయములందు పూర్వము చిత్రరచనలుండెడివి. ప్రస్తుతం రామలింగేశ్వరాలయమందలి చిత్రములు పూర్తిగా మాసిపోగా, వేంకటరమణాలయమందు మాత్రము వాటి ఛాయలు గోచరమగుచున్నవి. వీటిలో ముఖమండపము పైకప్పుమీద చిత్రించిన విష్ణువు, అతడి దేవేరులు, మరియు ఒక ఋషిచిత్రము లీలగా కనిపించుచున్నవి. వీటితోపాటు అచ్చటచ్చట, అస్పష్టమయిన చిత్రముల జాడలు కనబడుచున్నవి. ఈ చిత్రములన్నియు విజయనగర ప్రభువు అళియ రామరాయలకాలములో ఎఱ్ఱా తిమ్మానాయుడు చిత్రింపజేసినాడట. ఈ ఆలయమందలి చిత్రాలకు, లేపాక్షి వీరభద్రాలయమందలి చిత్రాలకు సాదృశ్యము గోచరించును. ఉదా – వేంకటరమణుని ఆలయమందలి విష్ణువు చిత్రములోని రేఖావిన్యాసములకు, లేపాక్షి వీరభద్రాలయమందలి వీరభద్రుని చిత్రమునకు పోలికలున్నవట! కాబట్టి లేపాక్షి, తాడిపత్రి ఆలయములందలి చిత్రరచన దాదాపు ఒకే కాలమునందు సాగియుండవచ్చునని చరిత్రకారులు భావించుచున్నారు.

* * *

## పామిడి - శ్రీ భోగేశ్వరస్వామి ఆలయం

రాయలసీమలోని అనంతపురం జిల్లా రాళ్లకు రప్పలకు కొండలకు వజ్రవైఢూర్యాలకు రాజవంశాలకు మహారాజులకు చెక్కుచెదరని కోటలకు తుదకు రాజకీయచైతన్యానికి పుట్టినిల్లు. అంతేకాదు ఈ జిల్లాలో అనేక కోటలు, ఆలయాలు ఉన్నాయి. అటువంటి ఆలయాలలో గుత్తి తాలూకా పామిడి గ్రామంలో నెలకొన్న శ్రీ భోగేశ్వరస్వామి ఆలయం ప్రాచీనమైనది. ఈ గ్రామంలో నెలకొన్న స్వామి స్వయంభు. స్వామి లింగము నాగుపాము చేత చుట్టబడి బయటపడినందువల్ల స్వామిని శ్రీ భోగేశ్వరుడు అంటున్నారు. భోగము అనగా సర్పము. సర్పము చుట్టి కనిపించినందువల్ల స్వామి భోగేశ్వరుడైనాడు. ఈ ఆలయం సింహగిరి పర్వతాల స్థానంలో నిర్మింపబడి ఉంది.

పూర్వమీ క్షేత్రాన్ని శేషగంధిపురం అనేవాళ్ళు. ఈ ఆలయమందలి స్వామిని సాక్షాత్తు పరశురాముడు ప్రతిష్ఠించి పూజించినాడట. అలాగే అగస్త్యముని ఋష్యశృంగుడు కొలిచినారట. శ్రీ భోగేశ్వరస్వామి ఆలయం ఏకకాలంలో నిర్మింపబడినది కాదు. క్రీస్తుశకం ఆరంభము నుండి 21వ శతాబ్దం వరకు ఈ ఆలయ ఆవరణమునందు అనేక ఉపఆలయాలు, మందిరాలు, మండపాలు, విగ్రహప్రతిష్ఠాపనలు జరుగుతూనే ఉండేవట. పేరుకు శైవక్షేత్రమైన ఇచ్చట దేవి, విష్ణు, గణేశ, నాగులు ప్రతి ష్ఠింపబడి పూజింపబడు తున్నారు.



శ్రీ భోగేశ్వరాలయము చుట్టూ ప్రహరీ, అందులో

ముందుభాగాన ప్రవేశద్వారం కలదు. ఇందులో గర్భగృహము, అంతరాళము ముఖమండపాలను కలిగి ఉంది. గర్భాలయమందు కన్నులకు విందు చేసే పరమేశ్వరుడు లింగరూపమున కొలువై దర్శనమిస్తూ ఉన్నాడు. స్వామి లింగము 5 అడుగుల ఎత్తున పానవట్టముపై కొలువై ఉన్నాడు. స్వామి నుదుట 3 అర్ధనామాలు మధ్యన స్వామి నిలువు నేత్రము చెక్కింపబడినది. స్వామి వెనుకవైపు సప్తఫణి నాగేంద్రుడు పడగవిప్పి స్వామి పైభాగాన ఆయనను సేవిస్తూ ఉన్నాడు. నాగేంద్రుడు పంచలోహ విగ్రహము. స్వామి శిరస్సు పైభాగాన ధారాపాత్ర ఉన్నది. స్వామి వెనుకభాగాన పెద్ద మకరతోరణం కలదు. ఈ తోరణం పై కూడా కొన్ని శిల్పాలు చెక్కినారు. స్వామి అభిషేక సమయంలో ఆ నీరు అతడి ముందు ఉన్న మరొక చిన్న లింగముపై పడి వెలుపలికి వెళ్ళుతాయి. ఈ విధమైన ప్రయోగము ఎందుకు అని చెప్పలేము. స్వామి అభిషేకప్రియుడు కావున నిరంతరము స్వామికి అభిషేకం చేస్తూనే ఉంటారు. ఎక్కువగా స్వామిని పంచామృతాలతోనూ బిల్వపత్రాలతోనూ నారికేలపానీయంతోను అభిషేకిస్తారు. ఇతడికి మారేడు పుష్పాలంకరణ అంటే ఎంతో ప్రీతి.

స్వామి గర్భాలయం పైన ద్వితల విమానము గుండ్రని శిఖరము పైన లోహపు కలశము కలవు. ఈ విమానం కూడా అనేకమార్లు పునరుద్ధరింపబడినది అనుటలో సందేహము లేదు. అందుచేతనే ఆలయం పైన పూర్వపు శిల్పఛాయలు కానరావు. గర్భాలయం ముందు సన్నటి అంతరాళము, అందులో ఉత్సవమూర్తులు కొలువై ఉన్నారు. అంతరాళం ముందు స్తంభాల సాయంతో నిర్మించిన ముఖమండపము కలదు. ఈ మండపం మధ్యన అతి పెద్ద ఆసీన నందీశ్వరుడు కొలువైనాడు. ఆలయం లోపల స్వామిని దర్శించుకున్నాక భక్తులు ఈ నందీశ్వరునికి మొక్కి అతడి రెండు కొమ్ముల మధ్యన నుండి గర్భాలయం అందలి స్వామిని దర్శిస్తారు. ఈ ముఖమండపం కుడివైపున ఎత్తైన అధిష్ఠానము దానిపై నవగ్రహాలు

ప్రతిష్ఠింపబడినారు. ఈ మండపం పురాతనమైనది. ఈ నవగ్రహమూర్తులు ఎంతో ఆకర్షణీయంగా ఉన్నారు. ప్రధాన ఆలయం వెనుక చిన్న శివలింగము ఎదురుగా ఆసీన నంది కొలువై ఉన్నారు. ఈ ప్రతిమలు చాలా పురాతనమైనవి. ఇవి ఎంతో ఆకర్షణీయంగా మలచబడినాయి. ఆలయం వెలుపలి గోడలు మండపాలు, గోపురాలు రంగురంగులతో అలంకరింపబడుట చేత వాటి ప్రాచీనతను కోల్పోయినాయి.

స్వామివారి ఆలయం ముందువైపు ఒక గదిలో పార్వతీదేవి విగ్రహం ఆమెప్రక్కన శ్రీ చక్రము ఏర్పాటు చేయబడినది. ఈ దేవి చాలా ఆకర్షణీయంగా, విశాలమైన నేత్రాలతో నుదుట పెద్ద కుంకుమబొట్టుతో ముఖమంతా పసుపు రాసుకున్నట్లు స్థానకముద్రలో ఉంది. దేవేరులకు చతుర్దశినాడు కుంకుమ పూజ అనివార్యం. దేవి వెనకవైపు ఆమె వాహనం మృగరాజు కలదు. పార్వతీదేవి ఎడమవైపు శ్రీ వేంకటేశ్వర స్వామి, శ్రీదేవి భూదేవి సమేతంగా నిలబడి ఉన్నారు. స్వామి నుదుట తిరునామాలు కలవు. వేంకటేశ్వరస్వామి వెనుకభాగంలో మకరతోరణాలు ఏర్పాటు చేయబడినాయి. పార్వతీదేవి 'శ్రీచక్ర దేవి' అని కూడా పూజిస్తారు. ఈ మందిరాల సమీపంలోనే వినాయక మందిరం కలదు. స్వామికి చాటచెవులు, ఏకదంతము, ముందువైపు మూషికము ఉన్నాయి. స్వామిచుట్టూ భక్తులు ప్రదర్శన చేసి తమ కోర్కెలు తీర్చమని గుంజిళ్ళు తీస్తారు. ఈ మందిరాల సమీపంలోనే వైష్ణవీదేవి మందిరము కూడా కలదు. ఇందులో మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతీ దేవి ఇటీవల కాలంలో ప్రతిష్ఠింపబడినారు.

ఈ ఆలయమందు పేర్కొనదగ్గ మరో పెద్ద విషయం ఇచ్చటి శ్రీ వేణుగోపాలస్వామి విగ్రహం.ఇతడిని ఇచ్చట ఎందుకు ప్రతిష్ఠించి పూజింపబడుతున్నారో ఎవరు చెప్పలేరు. ఈ స్వామి చెంత హనుమాన్, గరుడ, శంఖ, చక్రాలు కలవు. మందిరం పైభాగాన అందముగా అలంకరింపబడ్డ విమానము, పైన శిఖరము కలశము కలవు. విమానం

నాలుగువైపులా గరుడ ఆసీన విగ్రహాలతోపాటు అనేక వైష్ణవశిల్పాలు కలవు. ఇచ్చట భోగేశ్వరస్వామి ఆలయమందు ప్రతిష్ఠింపబడ్డ వేంకటేశ్వర, వేణుగోపాల మరియు ముగ్గురమ్మల మండపాలను గమనిస్తే ఈ ఆలయ నిర్మాతలు శైవ, వైష్ణవ శక్తి దేవతలకు భేదభావం లేదని వారందరూ ఒకటే అని చెప్పడానికి ప్రయత్నించినారు అనవచ్చు.

ఈ ఆలయమందు ప్రాచీన శమీవృక్షము కలదు. ఇచ్చట అనేక నాగుల శిల్పరాళ్లు ప్రతిష్ఠింపబడినాయి. ఇచ్చట ఉన్న వృక్షపుఛాయలో రెండు అపురూపమైన నాగుల శిల్పాలు కలవు. ఒక శిల్పమందు రెండు నాగులు ఒకదానితో ఒకటి పెనవేసుకుని సయ్యాటలాడుతూ ఉన్నాయి. మరొక శిల్పమందు ఒకే సర్పము పడగవిప్పి నాట్యం చేస్తూ ఉంది. ఈ సర్పాలకు ప్రజలు ఎందుచేతనో పూజలు చేస్తూనే ఉంటారు. ప్రభాతవేళ దగ్గరలోని గంగిరెడ్డి కాలువ వద్దకు వెళ్లి ఆ చెరువు నుండి కాలువలోనికి వచ్చే నీటిని పెద్ద పాత్రలతో నింపి పవిత్రంగా తెచ్చి ఈ నాగేంద్రులను అభిషేకిస్తారు.

స్వామి ఆలయానికి వచ్చే భక్తులు తలనీలాలు సమర్పించుకుంటారు. నూతన వధూవరులు పసుపు బట్టలు, పెండ్లి అలంకారముతోనే భోగేశ్వరస్వామి ఆలయానికి వచ్చి స్వామిని తమకు తొందరలోనే సంతానప్రాప్తి కలగాలని వేడుకొంటారు. స్వామి ఆలయమందు తరచు కళ్యాణాలు జరుపుకుంటూ ఉంటారు. ఈ ఆలయంలో పెండ్లిండ్లు భోజనపు ఏర్పాట్లు చేసుకొనుటకు పొంగళ్ళు పెట్టుకొనుటకు ఆలయాధికార్లు అన్ని ఏర్పాట్లు కల్పిస్తారు. ఆలయానికి వచ్చే యాత్రికులకు భోజన వితరణ కూడా చేస్తారు.

ఇక ప్రతి ఏడు శ్రీశైల మల్లికార్జునుని దర్శనానికి వెళ్లే భక్తులు శివమాలలు ధరించి మొదట ఇచ్చట భోగేశ్వరస్వామిని దర్శించి పూజించి బాకాలు, శంఖాలు ఊదుతూ డమరుకాలు వాయిస్తూ, మెడలో

రుద్రాక్షమాలలు ధరించి హరో హర అంటూ శ్రీశైలానికి వెళ్తారు. విజయదశమి, నాగులచవితి, దసరా పుణ్యదినాలు ముఖ్యంగా ఆచరిస్తారు. శివరాత్రి ఉత్సవాలు అమిత వైభవంగా జరుగుతాయి. ఆలయంలో దేవేరుల ప్రీతికోసం సహస్ర ఘటాభిషేకం జరిపిస్తారు. ఈ సహస్ర ఘటాభిషేకం జరిపిన ఈ ప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురుస్తాయట! ఇది ఈ ప్రాంతవాసుల ప్రగాఢ విశ్వాసము. ప్రతి సోమవారం స్వామిని సర్వాలంకారభూషితుని చేసి పూజిస్తారు. మాఘమాసంలో బిల్వ, మారేడు, పుష్పాలతో, కార్తికమాసంలో తుమ్మిపూలతో, శివరాత్రి పర్వదినాలలో లక్ష దీపారాధన జరుపుతారు. ఇంతటి మహిమాన్వితమైన సకల దేవతాక్షేత్రం ఎందుచేతనో బహుళ ప్రచారములోనికి రాలేక ఉన్నది.

* * *

# ఉరవకొండ పెన్న అహోబిలం - లక్ష్మీనరసింహస్వామి ఆలయం



ఆంధ్రప్రదేశ్ చరిత్రలో రాయల సీమ జిల్లాలకు ప్రత్యేక స్థానము ఉన్నది. అందులో అనంతపురం జిల్లా ఒకటి. ఇచ్చటి పెనుగొండ విజయనగర రాజ్యానికి రెండవ రాజధాని. ఈ జిల్లాలోనే ప్రపంచ ప్రసిద్ధి చెందిన తిమ్మమ్మ మర్రిమాను, ఆధ్యాత్మిక కవి మరియు ప్రయోక్త యోగివేమన సమాధి, కటారుపల్లెలో కలవు. ఈ జిల్లాలోనే అతిపెద్ద ఏకశిల నందివిగ్రహం, ఆయా నేటి పరిశోధకుల మేధస్సుకే సవాలుగా నిలిచి ఉన్న అంతరిక్ష స్తంభము లేపాక్షి ఆలయమందు కలవు. ఆధునిక కాలంలో ఈ అనంతపురం పట్టణాన్ని దత్త మండలాల ప్రధాన జిల్లా కేంద్రంగా ఆంగ్లేయులు ఏర్పాటు చేసి పాలించారు. ప్రపంచ ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పుట్టపర్తి కూడా ఈ జిల్లాలోనే ఉంది. అనంతపురం జిల్లా రతనాలసీమగా కూడా ప్రసిద్ధి. ఇచ్చట రామగిరి బంగారుగనులు, వజ్రాల గనులు ప్రపంచ ప్రసిద్ధి కేంద్రాలు.

అనంతపురం జిల్లా రాయలసీమలో నరసింహ క్షేత్రాలు అధికము. కర్నూలు జిల్లా అహోబిలం నరసింహస్వామి స్వస్థలము. ఇచ్చటి నల్లమల అడవులలోని నవ నరసింహ క్షేత్రాలు ఆతడి నివాసాలుగా పేర్కొంటారు. అనంతపురం జిల్లాలో లేపాక్షి ఆలయంతో పాటు అనేక పుణ్యక్షేత్రాలు కలవు. అటువంటి ఆలయాలలో ఉరవకొండ పట్టణంలో నిర్మింపబడిన శ్రీ లక్ష్మీ సమేత నరసింహస్వామి ఆలయం ప్రముఖమైనది. ఈ ఆలయాన్ని పెన్న అహోబిలం ఆలయం అంటారు. ఈ పెన్న అహోబిలం అనంతపురం

బళ్ళారి రహదారిలో అనంతపురం 40 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ దారికి ఇరుపక్కల చిన్న చిన్న రాతిగుట్టలు చెట్లు సెలయేర్లు మనసునకు ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తాయి.

పురాణాల ప్రకారం పెన్న అహోబిలం ఆలయ క్షేత్రచరిత్ర ఈ క్రింది విధంగా పేర్కొనబడినది. పూర్వం శ్రీమహావిష్ణువు, శ్రీ నారసింహ అవతారము దాల్చి హిరణ్యకశిపుడనే రాక్షసుని అతిక్రూరంగా సంహరించి భక్తుడైన ప్రహ్లాదునికి మోక్షాన్ని ప్రసాదించాడట. స్వామి ఆ ఉగ్రరూపంలోనే గర్జిస్తూ అడవులలో సంచరిస్తూ ఒక పాదాన్ని (ఎడమ పెన్నా) పెన్నానది గట్టుపై మరో కుడిపాదాన్ని అహోబిల కొండపై ఉంచాడట. ఈనాటికీ ఈ పాదాన్ని ప్రత్యేకంగా పూజిస్తూ ఉన్నారు. స్వామి పాదముద్రగ చెప్పబడే ఈ ముద్ర ఐదు అడుగుల పొడవు మూడు అడుగుల వెడల్పుతో ఒక సొరంగంలో ఉన్నది. ఈ సొరంగాన్నే భిలం అని, గుహ అనికూడా అంటారు. అలాగే మరియ గుహ అనికూడా పిలుస్తారు.

ఈ బిలం భూమి క్రిందభాగాన కొంతదూరము కొనసాగి పెన్నానదిలో కలుస్తుంది. ఇచ్చట శతాబ్దాలుగా ఈ పాదానికి ఇటీవల ప్రతిష్ఠించిన శ్రీ లక్ష్మీనరసింహస్వామికి కలిపి పూజలు చేస్తూ ఉన్నారు. ఈ స్వామికి



పూజాసమయంలో సమర్పించే అభిషేక తీర్థాలు బిలం ద్వారా వెళ్లి పెన్నా నదిలో కలుస్తాయి. అందుచేత కూడా ఈ క్షేత్రాన్ని పెన్న అహోబిలం అంటారు. కొంతకాలం క్రితం కొంతమంది పరిశోధకులు ఈ స్వామి పాదం క్రింద బిలం ఎంతదూరము వెళుతుందో పరీక్షించుటకు బిలం క్రింద త్రవ్వకాలు ప్రారంభించగా కొంతదూరంలో గుట్టలు గుట్టలుగా వెంట్రుకలు అడ్డుపడి ఉండటం గమనించి ఇక ముందుకు త్రవ్వకాలు కొనసాగించుట వీలుకాక ఆ ప్రయత్నాలను విరమించుకున్నారట.

ఆలయనిర్మాణం శ్రీ లక్ష్మీనరసింహాలయానికి కొంతదూరంలో ముందువైపు అతి భయంకరంగా స్తంభాన్ని చీల్చుకుని వస్తూ ఉన్న ఉగ్ర నరసింహమూర్తి విగ్రహం కలదు. స్వామి పొడువాటి గడ్డం విరబోసిన తల వెంట్రుకలు మీసాలు ఎండిన తల నోరు నాలుక కోరలు సాక్షాత్తు నరసింహ స్వామిని తలపిస్తూ ఉంది. స్వామి పాదాల క్రింద ఒకవైపు హిరణ్యకశిపుడు మరోవైపు ప్రహ్లాదుడు నిలుచుని స్వామికి నమస్కరిస్తూ ఉన్నారు. ఈ విగ్రహాన్ని ఇటీవలే పునర్నిర్మించి రంగులు అద్దినారు.



ఈ క్రింది కథనం ప్రకారం ఈ విధంగా ఆలయనిర్మాణం కొనసాగించినదట. పూర్వం ఈ ప్రాంతంలో గొల్లపల్లి అనే గ్రామం ఉండేది. ఆ పల్లెలో నుండి పశువుల కాపర్లు సమీపంలోని అడవిలోనికి గోవులను మేతకు తోలుకొని వెళ్లేవారట. ఆ పశువుల మందలో ఒక ఆవు ప్రతిరోజు మిగతా ఆవుల నుండి దూరంగా వెళ్లి ఒక పొదలో పాలు వదలి వచ్చేదట. ఈ విషయాన్ని

పశువుల కాపరి గమనించి తన అధికారికి విషయాన్ని తెలియచేశాడట. ఆ అధికారికి నరసింహస్వామి కలలో కనపడి ఆ గోవు తనకే పాలు సమర్పిస్తూ ఉన్నదని చెప్పాడట. తెల్లవారి అతడు ఆ గ్రామ ప్రజలు స్వామి చెప్పిన ప్రదేశానికి వెళ్లి వెతకగా స్వామి విగ్రహం కనబడగా ఈ విషయం అతి తొందరగా చుట్టుప్రక్కల గ్రామాలకు చేరి వారు ఆ ప్రాంతమున ఆలయనిర్మాణం చేసి తండోపతండాలుగా వచ్చి విగ్రహాన్ని పూజించినారు.

ఈ స్వామి విగ్రహం లభించిన చోటు ప్రక్కనే శ్రీ మహాలక్ష్మి అమ్మవారి విగ్రహం కూడా కనబడినదట. ఈ స్వామిని పూర్వం ఉద్దాలక మహర్షి పూజించాడట. ఈ స్వామి దేవేరి విగ్రహాలను స్వామి పాదముద్రిక చెంతనే ప్రతిష్ఠించారు. అయితే ఈ ఆలయం చాలాకాలం వరకు ఎటువంటి అభివృద్ధి చెందలేదు. స్వామి మహత్యాన్ని తెలుసుకొని విజయనగర ప్రభు సదాశివరాయలు స్వామిని దర్శించి అతడి రూపానికి ఆలయనిర్మాణానికి పూజావిధులకు ఆలయంచుట్టూ 2300 ఎకరాల భూమిని మాన్యంగా సమర్పించి ఆలయనిర్మాణ అభివృద్ధిని కొనసాగించే బాధ్యతను ఆ ప్రాంతానికి పాలేగారు ఉద్దిరప్ప, అప్పకొండ పాలేగారుకి అప్పగించారట. ఈ బృహత్కార్యంలో ఉద్దిరప్ప కొండనికి సహాయంగా గుత్తి రాజ్యాధికారి మురారి రాయలు కూడా తోడ్పడినట్లు చెప్పబడింది. స్వామివారి ఆలయం తొందరగా పూర్తి కావడంతో భక్తులు తండోపతండాలుగా స్వామి దర్శనానికి వచ్చేవారు.

పెన్న అహోబిలం చిన్న కొండపైన చదునైన ప్రదేశంలో నిర్మింపబడినది. ఆలయమందు ముఖమండపము మహామండపాలు కలవు. గర్భాలయంలో స్వామిపాదం చెంత ఇటీవలనే శ్రీ లక్ష్మీనరసింహస్వామి విగ్రహం ప్రతిష్ఠింపబడినది. స్వామి కుడితొడపై లక్ష్మీదేవి ఆసీనమై ఉన్నది. స్వామి నుదుట తిరునామం పొడవాటి గడ్డం మీసాలు విశాలమైన నేత్రాలు నాలుక కలిగి ఉన్నాడు. స్వామి కిరీటాన్ని ధరించి ఉన్నాడు. ఇతను చతుర్భుజుడు. స్వామి దేవేరి ఇద్దరూ కిరీటాలను ధరించి ఉన్నారు. స్వామి

దేవేరుల వెనుకవైపు వెడల్పాటి మకరతోరణం కలదు. గర్భాలయం పైన ఏకతల విమానం, శిఖరము పైన కలశం కలవు. గర్భాలయ శిఖరం పైన మొత్తము శిల్పాలతో అలంకరింపబడి ఉంది. నాలుగువైపులా అంజలి ఘటిస్తూ ఉన్న ఆసీన గరుడ ప్రతిమలు కలవు.

గర్భాలయం ముందున అంతరాళమందు ఉత్సవాల పూజాసామాగ్రి ఉన్నాయి. దీనిముందు స్తంభాల సాయంతో నిర్మింపబడిన ముఖమండపము, మహామండపాలు కలవు. ముఖమండపం ద్వారానికి ముందు ఇరువైపులా ద్వారపాలకులు కలరు. మండపం మొత్తం స్తంభాలు విజయనగర వాస్తు రీతిలో మలచబడి అందమైన శిల్పాలతో అలంకరించినారు. ఈ మండపాలపైన చుట్టూ అలంకార మందిరాలు కలవు. ఈ మహామండపం ముందున గరుడమండపం అందులో ఆసీన గరుడాళ్వారు, అంజలి ఘటిస్తూ స్వామిని కొలుస్తూ ఉన్నాడు. మండపానికి ఒకవైపు రెండు నిలువాటి ధ్వజస్తంభాలు ప్రతిష్ఠించారు. స్తంభాల పైన ఎత్తైన అధిష్ఠానాలను కలిగి మొత్తం రాతిస్తంభాలు అలంకరింపబడి ఉన్నాయి.

వీటిప్రక్కన కుడివైపు అమ్మవారి సన్నిధి కలదు. ఈ అమ్మవారి గర్భాలయంలో దేవి ఎంతో మనోహరంగా రాజ్యలక్ష్మి అమ్మవారి పేరుతో పూజలందుకుంటూ ఉన్నది. ఈ అమ్మవారు గొల్లపల్లి ప్రజలకు స్వామి పొదలందు కనబడినప్పుడే ప్రక్కన మరో ప్రదేశమందు ఈ అమ్మవారు లభించారట. గరుడమండపానికి ఒకవైపు రెండు నిలువాటి రాతిస్తంభాలు ప్రతిష్ఠించినారు. ఇవి ఎందుకు చెప్పలేము? ఈ ఆలయం ముందు నూతనంగా ఏర్పాటు చేసిన మరో చిన్న ధ్వజస్తంభము పైన పతాకపటము గంటలు కలిగి ఉంది. ఈ ధ్వజస్తంభం వెనుక బలిపీఠము కలదు. ఈ మండపాలకు ఎడమవైపు 16 స్తంభాల సాయంతో నిర్మించిన కళ్యాణ మండపము కలదు. ఆలయంచుట్టూ ప్రహరీ కలదు. ప్రహరీలో తూర్పుభాగాన 5 అంతస్తుల రాజగోపురం కలదు.

ఆలయం వెలుపల ఒక పుష్కరిణి ఆనాడు నిర్మించారు. అయితే అది ఈనాడు దాదాపు శిథిలావస్థకు చేరుకుని నీరు అపరిశుభ్రంగా ఉంటున్నది. ఇంత చరిత్ర కలిగిన ఆలయము రాను రాను శిథిలమైపోతూ ఉండగా మండపాలు గుడిలో కోనేరు తమ దుస్థితికి దిగులు చెందుతూ ఉండగా ప్రజలు స్థానిక శాసనసభ్యులు పయ్యావుల కేశవ్ గారిని ఆశ్రయించగా ఆయన రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖవారి నుండి ఆలయ పరిరక్షణకు పునర్నిర్మాణానికి 25 లక్షల రూపాయలు ఇప్పించారట. దీనితోపాటు స్థానికులు ముఖ్యంగా దండవారి కుటుంబీకులు ఈ ఆలయ పునర్నిర్మాణానికి ఎంతో సహకరిస్తూ ఉన్నారు. ప్రస్తుతం ఆలయం దినదినాభివృద్ధి చెందుతూ ఉన్నది. పెన్న అహోబిల క్షేత్రమందు స్వామి అమ్మవార్లను "ఓం ఉగ్ర నరసింహస్వామినే నమః" అంటూ ప్రార్థిస్తే స్వామి ప్రసన్నుడై భక్తులను ఆదుకొంటాడట. ఈనాటికీ ఆలయంలోని దేవేరులకు అభిషేకం కావింపబడే తీర్థం బిలంద్వారా పెన్నానదిలోనికి వెళ్లడం వింతగానే ఉంది. ఈ ఆలయాన్ని అనంతపురం నుండి బస్సుమార్గం ద్వారా, కదిరి పట్టణం నుండి, బళ్లారి నుండి కూడా చేరుకోవచ్చు.

* * *

## నెట్టికంటి - ఆంజనేయస్వామి ఆలయం



రాయలసీమ జిల్లాలలో ఆంజనేయ స్వామి ఆలయాలు చాలా ఎక్కువే. ఈ ఆలయాలలో ప్రతిదానికి ఒక ఐతిహ్యము ఉంటుంది. అంతేకాక ప్రతి ఆలయంలోని స్వామికి ఎన్నో మహత్యాలు కలవు. అటువంటి ఆలయాలలో అనంతపురం జిల్లా గుంతకల్లు పట్టణానికి సమీపంలోని కసాపురం అనే గ్రామంలో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయం. ఆలయంలోని స్వామి మహామహిమాన్వితుడు. ఈ ఆలయం విజయనగర కాలంనాటిదని చరిత్రకారుల అంచనా. ఈ స్వామినే విజయనగర చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయల రాజగురువు వ్యాసతీర్థులవారు ప్రతిష్ఠించారు. ఈతడు ముగ్గురు విజయనగర ప్రభువులకు చంద్రగిరి నేలిన సాలువ నరసింహుడు, శ్రీకృష్ణదేవరాయలు అచ్యుత రాయలవారికి గురువు. ఇతడు కొంతకాలం అనగా 12 సంవత్సరాలు తిరుమల కొండపైనే ఉండి అర్చకుల మధ్య ఆలయంలో నెలకొన్న అలజడులను అణుచుటకు పూజావిధులు క్రమబద్ధీకరించుటకు కృష్ణరాయలు పంపినారు. ఇతడికి సంబంధించిన అనేక శాసనాలు విజయనగర రాజ్యమందు ముఖ్యంగా తిరుమలలో లభిస్తూ ఉన్నాయి. కసాపురం ఆలయమందలి ఆంజనేయస్వామి ప్రతిష్ఠాపనకు చెందిన ఒక ఐతిహ్యం ప్రచారంలో ఉంది.

శ్రీకృష్ణదేవరాయలకు ప్రాణగండం ఉన్నదని ఆస్థాన పండితులు జ్యోతిష్యులు తెలుసుకుని తమ ప్రభువుని ఎలాగైనా కాపాడుకోవాలని, దీర్ఘంగా ఆలోచించుకొనుచుండగా దుష్టగ్రహాల కలయిక వల్ల ప్రభువు సర్పకాటుకు బలి కావచ్చు అని ఈ సర్పగండాన్ని కుహూగండము అని దీని నుండి

తమ ప్రభువును కాపాడమని దేవుడిని ప్రార్థిస్తూ ఉండగా వ్యాసతీర్థులవారు ప్రభువును కాపాడే బాధ్యతను తాను స్వీకరించి ప్రభువు సింహాసనాన్ని, అధికారాన్ని నాకు నాలుగు ఘడియలు స్వాధీనం చేయండి. నేను మిమ్మల్ని కుహూగండము నుండి కాపాడెదను అనగా ప్రభువు సంతోషంగా ఒప్పుకున్నాడు. అంతేకాక అతడికి తన రాజముద్రికను అప్పగించాడు. కొత్త రాజు వ్యాసతీర్థులు చక్రవర్తిని తన మందిరం వదిలి వెళ్ళమని, అతడు రాయలవారి శయన మందిరములోనికి వెళ్లి తన ఇష్టదైవమైన ఆంజనేయస్వామికి పూజలు చేసి ఎలాగైనా తన ప్రభువుని కాపాడమని ప్రార్థించి చక్రవర్తి పడకపై పవళించి తాను పైన సింధూరపు వర్ణపు అంగవస్త్రాన్ని శరీరం మొత్తం కనబడకుండా కప్పుకొని పవళించి సర్పం రాకకై ఎదురు చూడసాగాడు.

శాస్త్రజ్ఞులు తెలిపిన సమయానికి బుసలు చిమ్ముతూ నాగేంద్రుడు రాచమందిరంలోనికి వస్తూ ఉండగా వ్యాసతీర్థులు ఎటువంటి ఆలస్యము చేయకుండా తన శరీరంపై ఉన్న సింధూరపు వర్ణ వస్త్రాన్ని ఆ సర్పం పైకి విసిరాడు. కోపంతో ఊగిపోతున్న ఆ సర్పం ఆ వస్త్రాన్ని కాటు వేసిందట. వెంటనే ఆ సింధూరపు వస్త్రం దగ్ధమైపోయిందట. తాను వచ్చిన కార్యం పూర్తయినదని నాగేంద్రుడు తిరిగి వెళ్ళిపోయాడు. మరుసటి రోజు ఉదయం ఎంతో ఆత్రంగా ఎదురుచూస్తూ ఉన్న రాజోద్యోగులు వచ్చి తీర్థులవారు తమ ప్రభువుకు ఆవహించిన కుహూగండము తొలగిపోయినదని తన ప్రభువును ఆ ఆంజనేయ స్వామి కాపాడినాడని తెలియజేయగా రాయలు వ్యాసతీర్థులు తనకు చేసిన సహాయానికి సంతోషపడి అతడికి ఏమి కావాలో కోరుకోమన్నాడు. తాను సర్వసంగపరిత్యాగినని, ఆశలు లేవని అయితే తాను నాలుగు ఘడియలు (10 గంటలు) రాజ్యాధికారాన్ని పొందినందువల్ల, తనను ఇకమీదట వ్యాసతీర్థులు అనిగాక, వ్యాసరాయలు అని పేర్కొనవలయునని విన్నవించగా, కృష్ణరాయలు సంతోషంతో తీర్థుల వారిని

'వ్యాసరాయ' అని పేర్కొంటూ కౌగిలించుకున్నాడు. అంతేగాక రాయలవారిని ప్రాణాపాయం నుండి కాపాడిన ఆంజనేయస్వామి ఆలయాలను తమ రాజ్యమంతటా నిర్మించుటకు అనుమతి పొందినారు.

రాయలవారి సహాయ సహకారాలతో రాజ్యమంతటా వ్యాసతీర్థుల వారు 356 ఆంజనేయస్వామి ఆలయాలు నిర్మించాడు. అతడు నిర్మించిన ఆంజనేయస్వామి తోక వెనకవైపు నుండి అతడి తలవైపుగా వెళ్లి పైభాగాన ఒక గంటను కలిగి ఉంటుంది. దీనికి నిదర్శనంగా తిరుపతి తిరుమల పరిసరాల్లోనే దాదాపు 20 ఆంజనేయస్వామి ఆలయాలు కలవు. అంతేగాక నాటి రాయలసీమ జిల్లాలైన బళ్లారి, కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాలలో ఈ ఆలయాలు కనపడతాయి. ఈ ఆలయాల స్థాపన వ్యాసరాయలు కాంచీపురం నుండి ప్రారంభించాడట. ఈ ఆలయాలలో అనంతపురం జిల్లాలోని కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయం ప్రసిద్ధమైనది.

వ్యాసరాయలవారు ఒకమారు పుణ్యక్షేత్రాల దర్శనార్థమై బయలుదేరి కర్నూలు జిల్లాలోని చిప్పగిరికి వెళ్లి అచ్చట కొంతకాలం ఉండగా, ఒకరోజు అతడి కలలో ఆంజనేయస్వామి సాక్షాత్కరించి నేను కసాపురం గ్రామంవద్ద మట్టి దిబ్బక్రింద పడి ఉన్నానని, ఆ దిబ్బపైన ఒక ఎండిపోయిన నిమ్మచెట్టు ఉన్నదని ఆ చెట్టు నిన్ను చూడగానే పచ్చటి కొమ్మలు ఆకులతో చిగురించునని అలాగే నీవు నేను ఉన్న ప్రదేశాన్ని గుర్తించి వెలుపలికి తీసి అచ్చటే నన్ను ప్రతిష్ఠించమని చెప్పి అంతర్ధానమైనాడట. అలా స్వామివారి ఆజ్ఞతో వ్యాసరాయలు పరివార సమేతంగా కసాపురం వెళ్లి తనకు ఆంజనేయస్వామి ఆనతిచ్చిన విషయాన్ని అచ్చటి వారికి తెలియజేయగా గ్రామస్తులు సంతోషంగా వ్యాసతీర్థుల వెంట వెళ్లి స్వామి సెలవిచ్చిన విధంగా అతడు ఉన్న ప్రదేశాన్ని కనుగొని అపురూపమైన స్వామివిగ్రహాన్ని వెలికి తీశారు. ప్రజలు వ్యాసరాయలతో విగ్రహాన్ని అచ్చటే ప్రతిష్ఠించమని కోరగా అతడు

చేయవలసిన పూజావిధులు అన్నింటిని నిర్వహించి ఆంజనేయస్వామిని ఆ ప్రదేశమందే ప్రతిష్ఠించారు. స్వామివిగ్రహం అతిసుందరమైనదే కాక, అతడు అమిత శక్తివంతుడు.

**ఆలయనిర్మాణం**

కసాపురం ఆంజనేయస్వామి ఆలయం ఏ ఒక్క రాజవంశం కాలంలోనూ నిర్మించినది కాదు. అప్పుడప్పుడు కొంత కొంత ఆలయ భాగాన్ని నిర్మిస్తూ వచ్చినారు. అయితే స్వామిఆవిష్కరణ, ఆలయనిర్మాణం క్రీ.శ. 1524 – 1528 మధ్య ప్రతిష్ఠింపబడి ఉండవచ్చు. ఆలయమందు తరచూ అనేక మండపాలు నిర్మితమవుతూ వచ్చినాయి. స్వామి ప్రధానాలయం విశాలమైన ఆవరణ యందు నిర్మించారు. ఆలయం చుట్టూ ప్రహరీ కలదు. ప్రహరీకి వెలుపల వాయువ్యదిశలో ఆలయపుష్కరిణి కలదు. ప్రహరీలో నాలుగువైపులా గోపురాలు కలవు. తూర్పుదిశలో ప్రహరీయందు ఆలయప్రవేశద్వారము దానిపైన ఐదు అంతస్తుల రాజగోపురము కలదు. ఈ గోపురం కూడా తరచూ పునర్నిర్మితమై ఉండేది. ప్రస్తుతం ఆలయంలో మరో ప్రవేశద్వారం కలదు. ఈ ద్వారం పక్కనే ఆలయ కార్యాలయము కలదు. ఈ కార్యాలయం పక్కనే మరో దారి ఆలయ ప్రవేశ ద్వారంగా ఉపయోగపడుతూ ఉంది. ఈ కార్యాలయం పక్కన మరో రెండు గదులు కలవు.



కార్యాలయం ప్రక్క ఉత్తరదిశలో ప్రధాన గోపురము కలదు. ఈ గోపురం మొత్తం రామాయణశిల్పాలతో అలంకరించారు. గోపురం పైన ఐదు కలశాలు కలవు. ప్రస్తుతం ఈ గోపురం ఎదురుగా పొడవాటి వీరాంజనేయస్వామి గదాధారియై నిటారుగా నిలబడి ఉన్న అపురూప శిల్పము కలదు. స్వామి కిరీటాన్ని ధరించి ఉన్నాడు. రాజగోపురద్వారం నుండి ఆలయంలోనికి ప్రవేశించగానే ఉత్తర దిశలో కొన్ని మండపాలు కలవు. వాటిని ప్రస్తుతం కార్యాలయాలుగా వాడుకుంటూ ఉన్నారు. వాటిపక్కన మరో ద్వారం కలదు. ఆ దారి ప్రస్తుతం ఆలయప్రవేశద్వారంగా అప్పుడప్పుడూ ఉపయోగించుకుంటూ ఉన్నారు. ప్రహరీ ఉత్తరం వైపున ఆలయం మధ్యభాగాన స్వామివారి ప్రధానమందిరము కలదు. ఇందులో గర్భగృహము, అంతరాళము, ముఖమండపము, మహామండపాలు కలవు. గర్భాలయంపై త్రితల గోపురము, విమానము, గుండ్రని శిఖరము, వాటిపై కలశము కలవు. ఈ విమానం మొత్తం రామాయణశిల్పాలతో అలంకరింపబడి ఉంది. గర్భాలయం మధ్యన అతి పెద్దది ఆకర్షణీయమైన పది అడుగుల ఆంజనేయస్వామి విగ్రహము కలదు. అతడి పాదాల చెంత కొన్ని దుష్టశక్తుల ప్రతిమలు కలవు. ఈ స్వామి దక్షిణవైపుగా నడుస్తూ ఉన్నట్లు ప్రతిష్ఠింపబడినాడు. ఈ స్వామి ఆశ్చర్యకరంగా పొడవాటి కోడికత్తి లాంటి కోర మీసాలను గదను కలిగి ఉన్నాడు. ఇతడు కిరీటాన్ని పుష్పమాలలను ధరించినాడు. అంతేకాదు విచిత్రంగా స్వామి ఒకే కంటిని చూపుతూ నుదుట తిరునామాలతో దర్శనమిస్తూ ఉన్నాడు.

కన్నడ భాషలో నెట్టికంటి అంటే (ఏకాక్షుడు) ఒక కన్ను కలవాడు. స్వామి ఒంటినేత్రంతో కనబడుట చేత ఈయనను నెట్టికంటి ఆంజనేయుడు అన్నారు. స్వామి కనుగుడ్లు అతి పెద్దవిగా ముందుకు వచ్చినట్లు ఉన్నాయి. తన ఎడమచేతిలో గదను పట్టి కుడిచేతిని అభయముద్రలో ఉంచి కౌపీనాన్ని ధరించి ఉన్నాడు. స్వామి పాదాలచెంత చిన్న చిన్న క్షుద్రశక్తుల శిలలు

కలవు. స్వామి వెనుకభాగాన పెద్ద లోహపు మకరతోరణం ఏర్పాటు చేశారు. గర్భాలయం ముందువైపు అంతరాళము, అందులో ఉత్సవవిగ్రహాలు అమర్చినారు. అంతరాళము, ముందు నాలుగు స్తంభాల సహాయంతో నిర్మించిన ముఖమండపము, దాని ముందు విశాలమైన స్తంభాల మహామండపము కలవు. మహామండపద్వారం ముందు ధ్వజస్తంభము బలిపీఠము ఉన్నాయి. మహామండపంలో ఒక గదిని ఏర్పాటు చేసి అందులో సీతారామలక్ష్మణ మరియు హనుమాన్ పంచలోహవిగ్రహాలు ఉంచారు.

ఈ గదికి ప్రక్కనే ఒక కొయ్య ఆధారాన్ని (మంచే) ఏర్పాటుచేసి, దానిపైన చర్మంతో చేసిన పాదరక్షలు (పాదుకలు) ఉంచారు. భక్తులు ఆలయం వెళ్లి ఆ పాదుకలను తమ శరీరంలోని అన్ని భాగాలకు తాకించుకొంటూ చేతులతో పట్టుకొని ఆలయగర్భగృహం చుట్టూ ప్రదక్షిణ చేస్తారట. ఇలా చేయడం వల్ల భక్తులకు శరీరరుగ్మతలు, మతిస్థిమితము మరియు శరీర అవయవ సంబంధి నొప్పులు తొలగిపోతాయట! ఇచ్చట గ్రహపీడిత భక్తులు పూనకం వచ్చి ఊగుతూ ఉండడం చూడవచ్చు.

తమ బాధల నుండి విముక్తులైన కొందరు భక్తులు స్వామివారికి పాదుకలను కానుకలుగా సమర్పిస్తారట. స్థానికుల కథనం మేరకు పూర్వం ఎన్నడో స్వామివారికి ఒక భక్తుడు చర్మంతో తయారు చేసిన చెప్పులను సమర్పించుకొన్నాడట. మరుసటిరోజు ఆ భక్తుడు తాను సమర్పించిన పాదుకలను చూడగా అవి కొంతమేర అరిగిపోయి ఉండి, సంవత్సరానికి చెప్పులు పూర్తిగా అరిగిపోయాయట. ఆనాటి నుండి మొదటి పాదుకలను సమర్పించిన కుటుంబీకులే స్వామివారికి ప్రతిఏటా పాదుకలను సమర్పిస్తూ ఉన్నారట.

ఈ నెట్టికంటి ఆంజనేయస్వామి భక్తులు దర్శనానికి, తరచూ వస్తూ ఉంటారు. ఈ స్వామి వారికి ఆకుపూజ అంటే అమిత ఆనందం. భక్తులు

తమ కోర్కెలు తీరగానే స్వామిని తమలపాకు ఆకులతో అలంకరించి పూజించి కానుకలు సమర్పించుకుంటారు. ఈ స్వామిని దర్శించడానికి ప్రముఖంగా సంతానహీనులు, అంగవైకల్యం కలవారు, బుద్ధిమాంద్యులు వస్తారు. వీరు స్వామివారి కోనేటిలో స్నానం చేసి ఆలయంలో స్వామికి అంగపూజ చేస్తారు. ఎక్కువగా సంతానహీనులు ఆలయానికి తండోపతండాలుగా వచ్చి స్వామిని తమకు సంతానం కలగజేయమని ప్రార్థిస్తారు.

ప్రతిరోజు ఆలయ అధికారులు దేవుళ్ళ ఉత్సవవిగ్రహాలైన సీతా రామ లక్ష్మణ ఆంజనేయులను ఆలయం చుట్టూ ప్రదక్షిణ కావిస్తారు, ఈ ఉత్సవాన్ని ప్రాకార ఉత్సవం అంటారు. ఈ ప్రదర్శన సమయంలో భక్తులు, స్థానికులు స్వామికి హారతులు సమర్పిస్తారు. ఆలయమందు ప్రతిరోజు వివిధ పూజలు జరుగుతూ ఉంటాయి. ముఖ్యంగా వైశాఖమాసంలో బ్రహ్మోత్సవాలు ఏటా పది రోజులపాటు అంగరంగ వైభవంగా జరుపుతారు. ఉగాది, శ్రీరామనవమి, హనుమత్ జయంతి, గురుపూర్ణిమ ఉత్సవాలు ఇచ్చట ఘనంగా జరుపుతారు.

స్థానిక ప్రజలు అర్చకులు దైవాంశ సంభూతులు చెప్పడం ఏమిటంటే ఆంజనేయస్వామి రోజు నడిరాత్రి సమయంలో గ్రామంచుట్టూ తిరుగుతారట. అందుచేతనే గ్రామంలో ఎటువంటి గ్రహపీడలు, ఉపద్రవాలు, కష్టాలు ప్రజలకు కలగవట. స్వామి అలా తిరగడం వల్లనే అతడు ధరించే పాదుకలు అరిగిపోతాయట. ఎందుచేతనో చాలాకాలం ఈ అద్భుత ఆలయం నిరాదరణకు గురై ప్రస్తుతం ప్రభుత్వ ఆదరణతో దినదినాభివృద్ధి చెందుతూ ఉంది. ఆలయంలో ఎప్పుడు ఏదో ఒక అభివృద్ధి కార్యక్రమం జరుగుతూ భక్తులకు కావలసిన సకల సౌకర్యాలు కలుగజేస్తూ ఉన్నారు.

* * *

## హేమావతి - సిద్ధేశ్వరస్వామి ఆలయం



హేమావతి అనే నేటి చిన్న పట్టణం ఒకనాడు మహాసామ్రాజ్యానికి ముఖ్య పట్టణం. క్రీ.శ. 710 శతాబ్దాల మధ్య దక్షిణ భారతదేశంలో నేటి కర్ణాటక, ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రాలలోని 32 వేల గ్రామాలను పాలించిన నొలంబ రాజవంశ రాజధాని. ప్రస్తుతం ఈ గ్రామం అనంతపురం జిల్లా అమరాపురం మండలంలో కర్ణాటక రాష్ట్రానికి సరిహద్దు ప్రాంతంలో ఉన్నది. నొలంబ రాజవంశం పరిపాలించిన కాలంలో ఈ పట్టణం భారతదేశాన్నంతటినీ కాక ఇతర ప్రాంతాలను కూడా ఆకర్షించింది. ఇటీవల త్రవ్వకాలలో ఆనాటి కోటనిర్మాణము, శిథిలభవనాలు, ఆలయాలు ఎన్నో వెలుగులోనికి వస్తున్నాయి. వారి రాజ్యం పతనమైన తరువాత చోళులు ఈ రాజ్యభాగాన్ని కొంత ఆక్రమించి పాలించారు. వీరిని నొలంబ పల్లవులు అనికూడా అంటారు. ఈ హేమావతి పట్టణాన్ని ఆనాడు హంజేరి అనేవారు. దానిని ఆనాడు నలంబవాడి అనేవారు.

ఈ నొలంబ పల్లవులు తమ రాజధాని హేమావతిలో అనేక ఆలయాలు నిర్మించారు. వాటిలో నేటికీ ఐదు ఆలయాలు ఎంతో వైభవంగా నిర్వహింపబడుతూ ఉన్నాయి. అవన్నీ శివాలయాలే. ఈ ఆలయాలు దాదాపు 15 ఎకరాల విస్తీర్ణంలో నిర్మింపబడినాయి. వాటిలో నాలుగు ఆలయాలు చుట్టూ ప్రహరీ కలదు. ఒక ఆలయం మాత్రము ప్రహరీ బయట ఉన్నది. ఈ ఆలయాలలో ప్రముఖమైనవి సిద్ధేశ్వరాలయం, విరూపాక్షస్వామి ఆలయం, సోమేశ్వర ఆలయం, దొడ్డేశ్వర ఆలయం. ఐదవ ఆలయం,

హంపన్న ఆలయం గ్రామానికి దూరంగా ఉన్నది. హంపన్న గొప్ప శివ భక్తుడు హఠయోగి. ఇతడికి కూడా ఆలయం నిర్మింపబడి ఉన్నది. ఈ హంపన్న సాక్షాత్తు రుద్రుడువలె పెద్ద మీసాలు. కనుబొమ్మలు కలిగి యోగముద్రలో ఉన్నాడు.

మరో ప్రదేశంలో ఇంకా కొన్ని ఆలయాలు మండపాలు కలవు. ఈ ఆలయాలను నొలంబ పంచారామాలు అంటారట, ఈ ఆలయాలన్నీ క్రీ.శ. 7, 9 శతాబ్దాల మధ్య నిర్మించినట్లు శాసనాలు తెలుపుతూ ఉన్నాయి. అంతేకాక ఈ ఆలయాలలో పల్లవ చోళ నిర్మాణశైలి కూడా చూడవచ్చు. ఈ ఆలయనిర్మాణాల గురించి ఒక కథ ప్రచారమందు ఉన్నది. ఈ రాజ్యంలో సోమేశ్వరుడు, సిద్ధేశ్వర అనే రాజ సోదరులు ఉండేవారు. ఈ సోమేశ్వరుని చిత్రశేఖరస్వామి అని కూడా అనేవారు. వీరికి సంతానము లేదని తమ ఇష్టదైవమైన పరమేశ్వరుని తమకు సంతానము కలుగజేయమని ప్రార్థించగా స్వామి సిద్ధేశ్వరుని కలలో కనబడి తనకు ఆలయం నిర్మించమని అతడికి సంతానప్రాప్తి కలుగునని, అంతేకాక దేశం సుభిక్షంగా వర్ధిల్లునని సెలవిచ్చినాడట. సోమేశ్వరుని రాజమహేంద్రుడు అని కూడా అనేవారట. పరమేశ్వరుడు చెప్పినట్లుగానే ఈ సిద్ధేశ్వరునికి కుమార్తె జన్మించినది. అందుచేత స్వామికి సోమేశ్వరుడని, సిద్ధేశ్వరుడని పేర్లు పెట్టినారు.

అంతకుపూర్వం ఈ స్వామి పేరు ఏమిటో తెలియదు. తనకు జన్మించిన కుమార్తెకు హేమావతి అనే పేరు పెట్టి తన రాజధానికి అంతపూర్వము ఉన్న 'హింజేరి' అనే పేరును రద్దుచేసి హేమావతిపురం అని పేరు పెట్టినారు. క్రీస్తు శకం 720వ సంవత్సరంలో సిద్ధేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించారట. ఈ నగరం పేరు తన కుమార్తె పుట్టిన నామకరణం రోజునే నిర్ణయించారు. ఆలయం అనేక వింతలకు నిలయముగా ఉన్నది. ఆలయంలో వెలుపల స్తంభాల పైన అనేక శాసనాలు కలవు. అంతేకాక వారు తమ శాసనాలలో వారి రాజ్యవిస్తరణ గురించి సవివరముగా మరియు

వారు పాల్గొన్న యుద్ధాలు, జయించిన రాజ్యాలు గురించి తెలియజేసే అనేక శాసనాలు కలవు. ఈ వంశ రాజులు ఒకప్పుడు తమ రాజ్యంలో అనేక శివలింగాలను నందులను ప్రతిష్ఠించారట. అందుచేత ఈ పట్టణాన్ని కోటిలింగేశ్వరం, నందీశ్వరపట్టణం అంటారు.

**సిద్ధేశ్వర ఆలయనిర్మాణం**

భారతదేశంలో అనేకమంది దేవుళ్ళు, దేవతలు కలరు. వారిలో ఒక్కొక్కరికి ఒక్కో రూపం, ఒక్కో నామం, అలంకారం ఉంటాయి. అలాగే ఆ పేర్లకు, రూపాలకు కూడా ప్రాముఖ్యత ఉంటుంది. అలాంటి ఆలయాలలో హేమావతిలోని సిద్ధేశ్వరాలయం ప్రముఖమైనది. సాధారణంగా శివుడు లింగరూపంలో ఉంటాడు. అతడి పక్కనే మరో మందిరమందు పార్వతీదేవి స్వామికి ఎదురుగా నంది కొలువై ఉంటారు. దేశంలో ఏదో ఒకటి రెండు ప్రదేశాలలో మాత్రమే పరమశివుడు మానవరూపంలో కనిపిస్తాడు. ఉదాహరణకు చిత్తూరు జిల్లాలోని సురుటుపల్లిలోని నీలకంఠేశ్వరస్వామి (పల్లికొండేశ్వర స్వామి) ఒకరు. ఇచ్చటి స్వామి మానవాకారంలో పవళించి ప్రజలకు దర్శనమిస్తూ ఉన్నాడు.

ఈ ప్రాంతంలోని సిద్ధేశ్వర ఆలయంలో స్వామి మానవాకారంలో శిరస్సుపై గంగను దాల్చి నాలుగు చేతులు కలిగి జటాజూటాన



సూర్యచంద్రులను అలంకరించి ఎడమచేతిలో బ్రహ్మ కపాలాన్ని, మెడలో కపాలమాలను, కుడిచేతిలో జపమాలను, మరో చేతిని అభయముద్రలో ఇంకో చేతిలో పాశాన్ని ఒక ప్రక్కన అక్షయపాత్రను మరో ప్రక్కన శూలాన్ని కలిగి ఉన్నాడు. అర్ధనిమీలితనేత్రాలతో ఆసీనమూర్తిగా ఎత్తైన పీఠముపై ఆసీనుడై ఉన్నాడు. ఒక ప్రక్కన అక్షయపాత్ర మరోవైపు త్రిశూలం, మెడలో రుద్రాక్షలు కలిగి ఉన్నాడు. ఈ స్వామి కుడికాలును క్రిందికి దించి, ఎడమ కాలును వంచి కుడి మోకాటిపై ఉంచుకొని ఉన్నాడు. స్వామి తలపై ధారాపాత్ర కలదు.

స్వామి మౌనముద్రలో ఉన్నాడా! అనిపిస్తుంది. స్వామి అర్ధనిమీలిత నేత్రాలతో ఆసీనమూర్తిగా పీఠముపై సదాసీనుడై ఉన్నాడు. అందుచేతనే ఈయనను సిద్ధేశ్వరుడు అనీ, ఈ ఆలయాన్ని సిద్ధేశ్వరాలయం అని అంటారేమో. అక్షయపాత్రను కలిగి ఉండుటచేత ఇతడిని భిక్షాటనమూర్తిగా చెప్పవచ్చు. మెడలో రుద్రాక్షమాలలు కనబడుతున్నాయి. స్వామి రూపం అపురూపంగా ఉంటూ భక్తులను ఇట్లే ఆకర్షిస్తాడు. ఆయన నుదుట విభూతిరేఖలు కలవు. స్వామి నాగాభరణుడు.

అంతేకాక స్వామి భైరవరూపంలో అచేతనమూర్తిగా ఉండుటచేత స్వామిని మౌనసిద్ధుడని, యోగమూర్తి, కపర్ది అని, హఠయోగి అని, నొలంబేశ్వరుడని కూడా పేర్కొంటారు. మరియు ఎన్జీరప్ప అని కొంతమంది భిక్షాటన మూర్తి అని, స్వామిని లింగి అని, నీలకంఠుడు అనికూడా భావిస్తారు. స్వామి గర్భాలయం ముందు అంతరాళము, ముఖమండపము, మహామండపము కలవు. సిద్ధేశ్వరాలయం ముందువైపున ఎత్తైన ఆలయ గోపురము, గోపురం పైన మూడు అలంకార గూళ్ళు కలవు. వీటిలో శివుని ప్రతిమలు ప్రతిష్ఠింపబడి ఉన్నాయి. ఈ గోపుర ద్వారాన్ని ఆనుకునే ఆలయంచుట్టూ ఎత్తైన జగతిపై అనేక స్తంభాలతో నిర్మించిన లోపలివైపుగా ఉన్న వసారా కలదు.

ఈ వసారాలలో కొన్ని గదులు ఏర్పాటు చేసుకున్నారు. ఆలయం ప్రవేశించగానే మొదట ధ్వజస్తంభము కలదు. ఈ స్తంభము ఎంతో అపురూపంగా మలచబడినది. స్తంభము క్రిందిభాగాన శివుని ప్రతిమ కలదు. ఈ ధ్వజస్తంభం ముందువైపు అతిపెద్దదైన నంది మండపం కలదు. ఇందులో నంది స్వామివైపునకు కాకుండా తలను మరొకవైపునకు మరల్చుకుని ఉన్నాడు. దీన్నిబట్టి నందికి స్వామి మీద కోపము కలిగినదేమో అనవచ్చు. ఈ నందీశ్వరుడు సర్వాలంకారభూషితుడు.

ఈ ఆలయమండపం మొత్తము రకరకాల శిల్పాలతో జనరంజకముగా అలంకరింపబడినది. ఇచ్చటి నర్తకీమణుల సౌందర్యం మాటలతో వర్ణింపలేము. ఇచ్చట కొన్ని స్త్రీల నగ్నశిల్పాలు కూడా కనబడుతున్నాయి. సోమేశ్వర ఆలయం గర్భగృహముపై మూడు అంతస్తుల రాజగోపురం కలదు. మొత్తం గోపురం నాగరశైలిలో నిర్మింపబడి ,శిల్పాలతో అలంకరింపబడినది. గోపురం పైభాగాన గుండ్రటి శిఖరము పైన కలశము గూళ్ళలోశైవశిల్పాలు కలవు. గర్భాలయ వెలుపలి గోడలు ఎంతో ఆకర్షణీయంగా ఉంటూ ఎంతో అపురూపంగా ఉన్న దేవతాశిల్పాలు కలవు. ఈ వెలుపల గోడల దక్షిణవైపున దక్షిణామూర్తి, పశ్చిమదిశ గోడపై మహావిష్ణువు, మరొకవైపు దుర్గా, గణేశ శిల్పాలు చెక్కబడి ఉన్నాయి.

ఈ ఆలయకుడ్యాలపై చిత్ర విచిత్రమైన శిల్పాలు ఎన్నో మరెన్నో కలవు. ఈ శిల్పాలను చూచి వర్ణించవలసినదే కానీ వాటి గొప్పతనాన్ని ఊహించలేము. గర్భాలయంలోని శివయ్య మామూలు మానవుని వలె కనిపిస్తాడు. ఎందుచేతనో ఆనాడు ఆ రాజులు ఈ మూర్తిని ఇలా సృష్టించారని చెప్పలేము. అంతేకాదు ఏ శిల్పశాస్త్రము స్వామిని ఇలా రూపొందించవచ్చు అని పేర్కొన్న దాఖలాలు లేవేమో. గర్భాలయ గోడలో ఒకవైపు పొడవాటి ప్రణాలము కలదు. దీనిద్వారా స్వామికి చేసిన అభిషేక జలము వెలుపలికి వస్తుంది. ఈ ప్రణాలము కూడా అందముగా చెక్కినారు.

ఈ ఆలయ వెలుపలి గోడలపై రామాయణ భారత భాగవత కథలు శిల్పాల రూపాన్ని ధరించాయనవచ్చు. ఇచ్చటి నర్తకీమణుల సోయగం వర్ణనాతీతం. ఈ ఆలయ ముఖద్వారం పశ్చిమ దిశగా ఏర్పాటు చేశారు. ఈవిధమైన ఆలయ పశ్చిమ ద్వారనిర్మాణము చాలా అరుదు. దేశంలో కొన్ని ప్రాంతాలలో మాత్రమే ఇటువంటి దక్షిణ ముఖద్వార ఆలయాలు కలవు. ఈ స్వామి ఈ రాజవంశీకుల కులదేవత.

ఈ ఆలయం ప్రక్కనే అతిపురాతనమైన ఒక పుష్కరిణి కలదు. ఒకప్పుడు ఇది పుష్కలంగా నీటితో నిండి ఉండేదట. దీని నీమధ్య కోనేరు అనేవారట. ఇందులో నీరు గంట  గంటకు ఏడుమార్లు రోజురంగు మారేదట. అందుకే ఈ కోనేటిని సప్తవర్ణ జలకోనేరు అనేవారట. పూర్వం ఆలయానికి వచ్చిన ప్రతివారు తమ కష్టాలు రుగ్మతలు తొలగిపోవాలని ఈ కోనేటినీటిలో స్నానంచేసి సిద్ధేశ్వరస్వామిని భక్తితో కొలిచేవారట.

ఈ ఆలయాలలో చెప్పుకోతగ్గది 200 సంవత్సరాలకు పూర్వము హంపన్న అనే అవధూత ఉండేవాడు. ఇతడు దైవాంశసంభూతుడు, మహాశక్తి సంపన్నుడు. ఈ భక్తుడి కథ చాలా విచిత్రమైనది. ఇతడు హఠయోగి. ఒకమారు ఆ ప్రాంతంలో వర్షాభావము ఏర్పడి ప్రజలు తిండి నీళ్లులేక అనేక కష్టాలు పడుతూ ఉండగా హంపన్న తన ఇష్టదైవమైన సోమేశ్వరస్వామిని నీవు ప్రస్తుతం ప్రజలను వెంటనే వారి కష్టాలను నుండి కాపాడవలయును. రాజ్యంలో నీవు వర్షము కురిపించి ఈ ప్రజలను ఆదుకోకపోతే తెల్లవారే లోపల నేను ఈ కత్తితో తల నరుకుకొనెదను అని ప్రతిజ్ఞ చేయగా నడిరాత్రి ఉరుములు మెరుపులతో కుండపోతగా వర్షము కురిసి చెరువులు, బావులు, కుంటలు, నదులు నీటితో పొంగి పొరలినాయట. ఆ భక్తుడి జ్ఞాపకార్థం ఇచ్చట ఆలయము నిర్మింపబడినది. ఇతడు సాక్షాత్తు వీరభద్రుడి ఆకారంలో ఉన్నాడు. ప్రధాన ఆలయ గర్భగృహం ముందు విశాలమైన అంతరాళము కలదు. అందులో స్వామి పూజసామాగ్రి మరియు

ఉత్సవరులు ఉంచబడినారు. అంతరాళం ముందర ముఖమండపం, మహామండపం కలవు.

**ఆలయనిర్మాణం**

హేమావతి నగరంలో ఆలయాలు విశాలమైన విస్తీర్ణంలో నిర్మింపబడి ఉన్నాయి. వీటిలో ఒక ఆలయం దొడ్డేశ్వరస్వామి ఆలయం. ఇది ప్రధానాలయం వెలుపల ఉన్నది. ఈ ఆలయం సోమేశ్వరస్వామి ఆలయం తరువాత చెప్పుకోదగ్గ నిర్మాణము. ఈ ఆలయంలో కూడా అనేక శిల్పాలు ముఖ్యంగా నందివిగ్రహం కలవు. ఈ ఆలయద్వారం క్రింద ఇరువైపుల ఆలయంచుట్టూ స్తంభాలసాయంతో నిర్మించిన వసారా కలదు. ఆలయం ముందు చిన్న అలంకార మండపం, అందులోని గూళ్ళలో శైవశిల్పాలు కలవు. ద్వారానికి ఇరువైపులా ద్వారపాలకులు కలరు. ఆలయంలోనికి ప్రవేశించగానే ఆరు స్తంభాల సాయంతో నిర్మించిన నందిమండపం కలదు. ఈ మండపం మధ్యన అపురూపమైన నందీశ్వరుడు ఆసీనుడై ఉన్నాడు. ఇటువంటి పెద్ద నందీశ్వరుడు ఈ ప్రాంతంలో కానరాదు. ఆలయంలోనే ఈ నందీశ్వరుడు 8 అడుగుల పొడవు ఆరడుగుల ఎత్తు, నాలుగు అడుగుల వెడల్పుతో ఆసీనుడై ఉన్నాడు. ఈయన సర్వాంగసుందరంగా సర్వాభరణాలతో అలంకృతుడై ఉన్నాడు.

ఈ ఆలయంలోని స్తంభాలు వైవిధ్యభరితంగా ఉంటూ హంపి విఠ్ఠలస్వామి ఆలయ సంగీతభరిత స్తంభాలను జ్ఞప్తి చేస్తూ ఉన్నాయి. ఆ స్తంభాల మాదిరే ఈ ఆలయస్తంభాలు మీటితే ఒక్కొక్క స్తంభము ఒక్కొక్క శబ్దాన్ని పలికిస్తాయట. ఈ స్వామి ఆలయకుడ్యాలపై అపురూపమైన శిల్పాలు చెక్కినారు. ఈ ఆలయంలో గర్భగృహం, అంతరాళం కలవు. గర్భాలయంలో ఆరు అడుగుల పొడవైన అపురూపమైన శివలింగము కలదు. స్వామికి నిత్యము ఆలయంలోని కోనేటి నీటితోనే అభిషేకం చేస్తారు. ఈ ఆలయం మామూలు మిద్దె ఆకారంలో నిర్మింపబడినది. ఆలయ పైభాగాన ఎటువంటి

గోపురాలు. మంటపాలు లేవు. అయితే అచ్చటచ్చట శిల్పాలు కలవు. శిల్పాలతోపాటు శాసనాలు కూడా కలవు.

ప్రధాన ఆలయాలతోపాటు ఇచ్చట మరో మూడు శివాలయాలు ఉన్నాయి. వీటిలో స్వామి లింగరూపమున పూజలు అందుకుంటున్నాడు. ప్రతి ఆలయం ముందు స్వామికి ఎదురుగా నందీశ్వరులు కొలువై ఉన్నారు. విశేషమేమంటే వీరికి చెవులు లేవు. ఎందుచేతనంటే పూర్వపు రాజులు తమలో తాము దండయాత్రలు చేసుకుంటూ వారు ఈ నందీశ్వరుల చెవులు కోసి వేశారట. ఆలయాల ముందర ధ్వజస్తంభం కలదు. ప్రధాన ఆలయ ప్రహరీ లోపల విశాలమైన, అందముగా ఉద్యానవనము కలదు. ఈ ఆలయాలు ఇచ్చటి ప్రకృతి సౌందర్యం భక్తులను ఎంతగానో ఆనందింపచేస్తాయి.

ప్రహరీకి దూరంగా గ్రామంలో మరొక శివాలయము ఉన్నది. ఇచ్చటే నూతనంగా నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయం కూడా కలదు. ఒకమారు చోళ చక్రవర్తి రాజేంద్రచోళుడు సిద్ధేశ్వరాలయానికి వచ్చి సిద్ధేశ్వర సోమేశ్వర ఆలయాలలోని శిల్పసంపదకు ముగ్ధుడై ఇచ్చట ఉన్న అపురూపమైన 40 స్తంభాలను తనవెంట తన రాజ్యానికి తీసుకువెళ్లి తన రాజ్యంలో మరెచ్చటో ప్రతిష్ఠించాడట. ఇచ్చటి రాళ్ళను నాటి శిల్పులు వెన్నముద్దల వలె కరిగించి తమకు ఇష్టమైన శిల్పాలను తయారు చేసుకున్నారా? అనిపిస్తుంది. ఈ ఆలయంలో అందమైన శిల్పాలేకాక కాలభైరవ, వినాయక, షణ్ముఖ దేవి, ఆంజనేయ, నాగపడగలు గల శిల్పాలు మరియు పంచలింగాలు కలవు.

**ఉత్సవాలు**

హేమావతి సిద్ధేశ్వర స్వామి ఆలయమందు సంవత్సరం పొడవునా పూజలు, ఉత్సవాలు, వేడుకలు జరుగుతూనే ఉంటాయి. ముఖ్యంగా ఆది, సోమవారాల్లో స్వామిని భక్తులు అధికసంఖ్యలో దర్శించి పూజిస్తారు.

ఆలయంలో నిత్యార్చన, నైవేద్యం, అభిషేకం తప్పనిసరి. అమావాస్య రోజులలో స్వామికి ప్రత్యేక పూజలు జరుపుతారట. కార్తీకమాసంలో ఈ ఆలయంలో 45 రోజులు పూజలు నిర్వహిస్తారు. మిగతా శివాలయాల్లో 30 రోజులు మాత్రమే పూజలు జరుగుతాయి. ఈ కార్తీకమాసంలో అమావాస్య రోజున ఆలయమందు లక్ష దీపారాధన జరుగుతుంది. వీటితోపాటు సిరిమానోత్సవం, ముత్యాలహారతి, పుష్పోత్సవము మొదలగునవి జరుగుతాయి.

ఈ ఆలయమందు శివరాత్రి ఉత్సవం ప్రత్యేక ఆకర్షణ. ఈ శివరాత్రి జాతర ఫిబ్రవరి, మార్చి నెలలో ప్రతిఏటా ఎనిమిది రోజులు జరుగుతుంది. ఉత్సవంలో రెండవ రోజు మరియు 8వ రోజు జరిగే రథోత్సవములు ప్రముఖమైనవి. రెండవ రోజు ఆలయం ముందు రెండు అగ్నిగుండాలు ఏర్పాటుచేసి అగ్నిదేవుడు ప్రజ్వలిస్తూ ఉండగా, ప్రజలు తాము పండించిన పంటలో కొంత ధాన్యాన్ని తీసుకొని వచ్చి ఈ అగ్నిగుండాలలో స్వామికి ఆహుతి చేస్తారు. ఇలా చేయడం వల్ల తమ పంటలు అనేక రెట్లు అధికమౌతాయని, తమ పంటలు సమృద్ధిగా పండుతాయని వారి ప్రగాఢ విశ్వాసం. ఈ తిరునాళ్లలో 8వ రోజు రథోత్సవం జరుగుతుంది. ఆనాడు ఆలయానికి ప్రజలు వేలసంఖ్యలో ఆంధ్ర, తమిళ, కర్ణాటక రాష్ట్రాల నుంచి వచ్చి స్వామి రథయాత్రలో పాల్గొని రథాన్ని లాగుతారు.

ఈ తిరునాళ్ల సమయంలో భక్తులు అనేక వేషాలు ధరించి ముఖ్యంగా వీరభద్రుని వేషాలు కట్టి, కత్తులు చేతబట్టి నాటి రాజుల దుస్తుల వంటివి ధరించి యుద్ధం చేస్తూ ఉన్నట్లు నటిస్తారు. ఈ విన్యాసాలతోపాటు ఊహించనటువంటి ఆటపాటలు, నాట్యాలు, కీర్తనలు, పులివేషాలు, కొయ్యరథాల గుర్రాలు అధిరోహించి మైమరచి నాట్యమాడుతారు. అమావాస్యనాడు సాయంసంధ్య వేళలో సోమేశ్వరస్వామి నుదుటిపై సూర్యకిరణాలు ప్రసరిస్తాయట. ఈ వైభవాన్ని స్వామి మహత్యాన్ని ఆ రోజు

దర్శించడానికి ఎచ్చటెచ్చటి నుంచో లక్షలసంఖ్యలో భక్తులు తండోప తండాలుగా వచ్చి ఆ దృశ్యాన్ని చూచి మైమరచి తమ ముడుపులు చెల్లిస్తారు.

ఆలయం ఆంధ్రరాష్ట్రంలో ఉన్నా ఈ ఆలయానికి కన్నడ భక్తులే ఎక్కువ సంఖ్యలో వస్తారు. అంతేకాక పూజలు స్వామి సుప్రభాత కీర్తన మరియు అభిషేక సమయంలో స్వామిని స్తుతించే వేదసంగీత పఠనాలు, స్వామి నామజపాలు, పూజవిన్యాసాలు మొత్తము కన్నడములోనే పూజారులు ఎక్కువగా జపిస్తారు. ఈ సమయంలో భక్తులు రథం పైకి కొన్ని తృణధాన్యాలను పైసల రూపంలో డబ్బులు ముఖ్యంగా మిరియాలు చల్లుతారట. ఈ ఎనిమిది రోజులు ఈ ఆలయ పరిసరాలు ఎంతో సందడిగా ఉంటాయి.

దూరప్రాంతాల వారు చిన్న చిన్న అంగళ్లు పెట్టి వ్యాపారాలు చేసుకుంటారు. చిన్నపిల్లలు ఆడుకొనుటకు, తినుబండారాలు తీసుకొనుటకు ఏర్పాట్లు చేయబడతాయి. వీటన్నిటిని ఆలయ ట్రస్ట్‌వారు పర్యవేక్షిస్తారట. ఆలయంలో భక్తులకు రోజు అన్నదానం చేస్తారు. ప్రస్తుతం ఆలయ నిర్వహణ పురావస్తుశాఖ వారి ఆధీనంలో ఉంది. ముఖ్యంగా వారు ఆలయచరిత్రను సమగ్రంగా క్రోడీకరించి ప్రజలకు తెలియపరచటం ఎంతో అవసరము. కొంతమంది ఈ ఆలయం కర్ణాటక రాష్ట్రంలో ఉన్నదని భావిస్తూ ఉండడం గమనించదగ్గ అంశము. ప్రస్తుతం ఎవరు కానీ ఈ మహోన్నత ఆలయ చరిత్ర ఇది అని ఖచ్చితంగా చెప్పలేకపోతున్నారు. ప్రభుత్వం ఈ ఆలయ నిర్వహణపై ఇంకొంత శ్రద్ధ వహిస్తే ఈ ప్రసిద్ధ చారిత్రక పుణ్యక్షేత్రం మరెంతగానో అభివృద్ధి చెందుతుంది అనుటలో సందేహము లేదు.

* * *

# శ్రీ మాలకొండ స్వామి ఆలయం



శ్రీ మాలకొండ స్వామి ఆలయం ప్రస్తుతం ప్రకాశం జిల్లా పల్లేటివారి పల్లె మండలం తీర్థదేవి పల్లె సమీపాన నల్లమల అటవీ ప్రాంతంలో ఉంది. అసలు నల్లమల అడవులు అంటేనే ఆల యాలకు ముఖ్యంగా నారసింహ స్వామి ఆలయాలకు ప్రసిద్ధి. ఇచ్చట ఒక్కో ఆలయానికి ఒక్కో ఐతిహ్యము కలదు. ఈ ఆలయం దట్టమైన అడవుల మధ్య, కొండగుహల సమూహంలో నిర్మింపబడి ఉన్నది. ఈ ఆలయం ఎప్పుడు ఎవరిచేత నిర్మింపబడినదో తెలియదు. స్థానికుల ప్రకారం శ్రీ మహావిష్ణువే ఇచ్చట స్వయంగా దేవీ సమేతంగా అవతరించాడట. ఈ స్వామిని క్రీస్తుశకం ప్రారంభము నుండి ప్రజలు కొలుస్తూ ఉన్నట్లు కొంతమంది భావిస్తారు. అంతేకాక శాతవాహనులు, కాకతీయులు, విజయనగర ప్రభువులు పూజించినట్లు ప్రజలు భావిస్తారు. అయితే చరిత్రకారులు ఈ ఆలయాన్ని ధరణికోట ప్రాంతాన్ని పాలించిన రెడ్డి రాజులు మరియు ఈ ప్రాంతాన్ని ఏలిన తెలుగు చోళులు చాలా అభివృద్ధి చేశారు అంటున్నారు. వీరి కాలంలోనే ఆలయం ఎంతో అభివృద్ధి చెందినది.

**ఆలయప్రస్తావన**

ఒకమారు శ్రీమహావిష్ణువు, లక్ష్మీదేవి పాలసముద్రంలో ఆదిశేషునిపై ఆసీనులై ఉల్లాసంగా ఉండు సమయంలో శ్రీహరి, లక్ష్మీ ఈ సంతోష సమయంలో నీకు ఏదైనా వరము కావలయును అనుకుంటే కోరుకో. అన్నాడట లక్ష్మి స్వామి మీరే నా భర్తగా ఉండగా నాకు వేరే వరములు

ఎందుకు అంటూ అయినా మీరు అడిగినారు కావున భూలోకంలో మనము ప్రశాంతముగా గడుపుటకు ఒక నిర్జన ప్రదేశాన్ని చూపించమనగా, స్వామి తన మెడలో మాలరూపంలో ఉన్న భక్తురాలు వనమాలిని తీసి 'మాల, నువ్వు భూలోకమునకు వెళ్లి ఎచ్చట ప్రశాంత వాతావరణము ఉండునో ఆ ప్రదేశాన్ని చూపించు' అనగా, మాల భూలోకమునకు వచ్చి తానే కొండరూపము దాల్చి స్వామిని, దేవిని తనపై ఆసీనము కమ్మని కోరినదట. అందువల్ల ఈ ప్రాంతాన్ని మాలకొండ అన్నారట.

మరొక కథనము ప్రకారము లక్ష్మీదేవి తమ నివాసానికి అనువైన ప్రదేశాన్ని చూపమని స్వామిని కోరగా, అతడు తన వాహనం గరుత్మంతుని 'గరుడ నీవు వెళ్లి భూలోకంలో మాకు సేద తీర్చుకొనుటకు అనువైన ప్రదేశాన్ని కనుగొనుము' అన్నాడట. అలా గరుత్మంతుడు భూమిపైకి వచ్చి నల్లమల అడవులలో ఒక ప్రశాంత ప్రదేశాన్ని ఎంచుకొని తన ప్రభువుకు తెలియజేయగా శ్రీహరి, లక్ష్మీ సమేతంగా ఈ ప్రాంతానికి వచ్చి కొలువైనారట. మరికొందరు స్వామిని వదిలి ఉండలేక ఆతడు తనను మెడనుంచి తీసివేసినాడు కావున వారు నాపైనే కొలువై ఉండమని వనమాలి కోరినదట! ఒకమారు అగస్త్య మహర్షి స్వామిని జ్వాలారూపంలో దర్శించి ఆ రూపమునకు ముగ్ధుడై, స్వామిని, స్వామి మీరు దేవీసమేతంగా ఇచ్చటే కొలువై మమ్ములను ఆశీర్వదించండి అనగా అగస్త్యుల ప్రార్థనను మన్నించి అచ్చటే స్వామి జ్వాలానరసింహులుగా కొలువైనాడు. ఈ నల్లమల ప్రాంతంలో నవ నరసింహులు కలరు. వారిలో ఈ జ్వాలానరసింహుడు ప్రముఖుడు. మరో కథనం ప్రకారం ఒకమారు మార్కండేయ మహర్షి స్వామిని దర్శించి స్వామి నీవు ఇచ్చటే స్థిరనివాసం ఉండమని కోరగా స్వామి అంగీకరించి అచ్చటే స్థిరనివాసము ఏర్పరచుకొన్నాడట.

## లక్ష్మీదేవి అలక

ఒకమారు శ్రీహరి, లక్ష్మీదేవి కొండపై ఆసీనులై ఏదో ఒక అంశముపై చర్చించుకుంటూ, పందెము కాచుకొన్నారట. అందులో దేవి ఓడిపోగా స్వామి నవ్వినాడట. ముక్కోపి అయిన లక్ష్మీదేవి స్వామిని వదిలి దూరంగా వెళ్ళసాగినదట. ఆమెకు ఎదురుగా ఒక పెద్ద కొండ ఉగ్రురాలై వస్తూ ఉన్న లక్ష్మీదేవిని చూచి ఆ కొండ రెండుగా చీలి దేవికి దారి కల్పించినదట! ఆ దారినే దేవి వెళ్లి సమీపంలో ఒక కొండపై స్వామికి దూరంగా కొలువైనదట. కొండ చీలిన ప్రదేశము చూచుటకు అతిభయంకరముగా కనబడుతుంది. స్వామి, దేవి కొలువైన ఈ క్షేత్రము దాదాపు పది చదరపుమైళ్ళ విస్తీర్ణం కలిగి ఉంటుంది. ఇచ్చట కొన్ని రాతిగుట్టలు, గొడుగు ఆకారంలో ఉన్న రాతిబండలు, మహావృక్షాలు అన్నిటికీమించి గుహాలయాలు కలవు. ఈ గుహాలయాలలోనే వందలకొద్దీ వచ్చే యాత్రికులు సేదతీరుటేకాక, వంటావార్పులు చేసుకుంటూ రోజంతా ఆహ్లాదంగా గడుపుతారు. ఈ గుట్టలలో ఒక విశాలమైన బండరాయి భూమి పైభాగాన గొడుగువలె విస్తరించి ఉన్నది. దీనికి ఆధారంగా క్రింద కొన్ని చిన్న చిన్న రాళ్లు మాత్రమే కలవు. దీనికింద దాదాపు 200 మంది తలదాచుకోవచ్చు. ఇచ్చటి గొడుగు కొండ ఒక మహా వింత.

ఒకమారు ఒక స్థానిక పాలకుడు స్వామిదర్శనానికై వచ్చి ఆలయం వద్ద ఎవరు కానరాకపోవుట చేత స్వామి ఎచ్చట ఉన్నాడు అని చెప్పుటకు పూజారి కూడా లేకపోవుటతో అతడు ఆహారము, నీరు తీసుకోకుండా ఆ క్షేత్రం సమీపంలోనే పడి ఉన్నాడట. మరుసటిరోజు బ్రహ్మదేవుడు, విష్ణుమూర్తిని చూచుటకు రాగా శ్రీహరి బ్రహ్మతో చూడు, ఆ భక్తుడు నా దర్శనంకోసం ఎలా పడికాపులు కాస్తూ ఉన్నాడు. కావున మానవులకు కూడా నా దర్శనభాగ్యం కలిగే ఏర్పాటు చేయండి అనగా, బ్రహ్మ, తండ్రి వారంలో ఆరురోజులు మాకు, ఒకరోజు మానవులకు, నీ దర్శనభాగ్యం

కల్పించమని నా విన్నపం. అనగా స్వామి సరే! అని వారంలో ఆరు రోజులు దేవతలకు ఏడవ రోజు శనివారం ప్రజలకు నా దర్శనం కల్పిస్తాను. అనీ తెలియజేశాడు. ఆనాటినుండి మానవులకు వారానికి ఒకరోజు అనగా శనివారం నాడు వారు రావచ్చు అని వారికి సహాయము చేయుటకు ఒక పూజారిని నియమించి నీవు ప్రతి శనివారము భక్తులకు ఈ మాలకొండ స్వామి దర్శనం చేయించు అని బ్రహ్మదేవుడు ఆజ్ఞాపించాడు. ఆ పూజారి పేరు నరసింహాచారి అంటారు. అతని వంశస్తులే ఈనాడు కూడా ఆలయంలో పూజావిధులు నిర్వహిస్తూ ఉన్నారట.

ఆలయం ప్రకాశం జిల్లా ఒంగోలు నుండి సింగరాయకొండ నుండి మాలకొండ స్వామి సన్నిధికి మెట్లమార్గము కలదు. ఈ మెట్ల ముఖద్వారం వద్ద ఒక మంటపము, అందులో గోడలపైన, ద్వారంపైన నరసింహ, విష్ణు, లక్ష్మీదేవి ప్రతిమలు కలవు. అంతేకాక కందుకూరు నుండి 30 కిలోమీటర్లు పయనించి ఈ కొండ చేరవచ్చు. కందుకూరు సమీపం నుండి ఆలయానికి మెట్లదారి ప్రారంభమవుతుంది. పాత మెట్లదారి, ప్రయాణం ప్రజలకు కొంత కష్టంగా ఉండుటచేత ఈ ప్రాంత రాజు ఇటీవల కాలంలో క్రొత్త మెట్లదారి ఏర్పాటు చేసినాడు. ఈ కొత్త దారినుండే భక్తులు ఎక్కువగా ఆలయం చేరుతారు. దారిలో భక్తులు సేద తీర్చుకొనుటకు అచ్చటచ్చట సిమెంటు బెంచీలు ఏర్పాటు చేశారు. ఈ రెండు మెట్లదారులలో ఉన్న రాతిమెట్లను పసుపు కుంకుమలతో పూర్తిగా అలంకరించినారు. ఈ మెట్లు అలంకరించిన తీరు ఎంతో ఆకర్షణీయం. ప్రజలలో ఈ అలంకరణ భక్తిభావాన్ని, వారి మదిలో ఏర్పరుస్తుంది. ఈ మెట్లదారులు మాలకొండేశ్వర స్వామి ఆలయం వరకు ఉన్నాయి.

ఈ దారిలోనే మొట్టమొదట యాత్రికులు ముందురోజే అనగా శుక్రవారం వచ్చి బస చేయుటకు ఒక పెద్ద సత్రము, అందులో అనేక గదులు కలవు. ఈ మెట్లదారులేకాక ఇటీవల విశాలమైన సిమెంటు రోడ్డు

కూడా వెలసినది. దీనిద్వారా వాహనాలలో వెళ్లేవారు సులభముగా వెళ్లవచ్చు. దారిలో ఉన్న సత్రము దాటగానే, ఎవరైనా కొత్త వాహనాన్ని కొని పూజ చేసుకొనుటకు ఒక మండపము ఏర్పాటు చేసినారు. దీనిప్రక్కన ఆలయ గోశాల, కళ్యాణమండపము, కేశఖండనమండపము కలవు. ఇందులో మ్రొక్కులు ఉన్నవారు వెంట్రుకలు స్వామికి సమర్పిస్తారు. ఆ తరువాత, యాత్రికులకు అన్నదానము చేయుటకు నిత్యాన్నదానమండపము కలదు.

ఇచ్చట ఎంతమంది భక్తులు వచ్చిన ప్రసాద వితరణ జరుగుతుంది. ఇచ్చట శనివారం రోజు వందలమంది వచ్చి భోజనము స్వీకరిస్తారు. ఈ మండపాల ముందు స్వామి మందిరానికి ఎదురుగా నాలుగు స్తంభాలతో నిర్మించిన ఆస్థాన మండపం ఎంతో అందముగా నిర్మింపబడినది. దీనిముందర ప్రధానాలయముఖద్వారమందిరము కలదు.

స్వామి ముఖద్వారమందిరము చాలా విశాలంగా ఉంటూ మధ్యన విశాలమైన దారి, దానికి ఇరువైపులా రెండు చిన్నద్వారాలు కలవు. పెద్ద ద్వారం ఎప్పుడు మూతపడి ఉంటుంది. ఒక చిన్న ద్వారం నుండే భక్తులు ఆలయం లోనికి ప్రవేశిస్తారు. స్వామి మందిరానికి ఈ మండపద్వారానికి కొంతదూరము ఉండుటచేత భక్తులు మెట్లమీద నడచి వెళ్ళవలె, ఎండకు భక్తులు కష్టపడుదురని ఈ దారిపై పందిరి ఏర్పాటు చేశారు. ఆలయం ప్రవేశించగానే భక్తులు గోవిందా, గోవిందా అంటూ స్వామి నామాన్ని స్మరిస్తూ ఆలయప్రవేశం చేస్తారు. భక్తులు ఎక్కువగా ఉండినచో వారు వేచి ఉండుటకు కొన్ని గదులు ఏర్పాటుచేసి, వాటి నుండి భక్తులను ఆలయంలోనికి వరుసలోపంపుతారు. ప్రధాన ఆలయం ఒక గుహవలె ఉన్నది. ఆలయం గర్భగృహమందు, స్వామి దేవీసమేతంగా ఒక వేదికపై ఆసీనులై శ్రీ లక్ష్మీసమేత నరసింహస్వామి పేరా పూజలు అందుకుంటూ ఉన్నారు. స్వామి విగ్రహం అపురూపంగా మెరిసిపోతూ ఉంటుంది.

దేవి స్వామి తొడపై ఆసీనురాలై పసుపుబట్టలను ధరించి ఉన్నది. వీరి సోయగం మాటలతో వర్ణింపలేము. గర్భాలయం పైన శిఖరము, పైన కలశము కలవు. ఆలయగోడలు శిల్పాలతో అలంకరింపబడి ఉన్నాయి. భక్తులు స్వామిదర్శనం తరువాత మరొక మార్గంలో వెలుపలికి వస్తారు. స్వామి మహాశక్తిసంపన్నుడు.

స్వామి ఆలయం వెలుపల ఒక పెద్ద కొండ గొడుగు ఆకారంలో ఉన్నది. దీనిని గోవర్ధనగిరి అంటారు. దీనికింద వందలమంది భక్తులేకాక అనేకమంది స్త్రీలు స్వామివారికి పొంగళ్ళు వండుతారు. ఆలయపాలకులే వంటకు కుమ్మర పొయ్యి, కట్టెలు, వంటసామాగ్రి అందజేస్తారట! స్వామికి నైవేద్యం సమర్పించిన పిదప భక్తులకు స్వామిప్రసాదాన్ని ఇస్తారు. ఈ స్వామికి పిండి దీపారాధన అంటే మహాప్రీతి. అందుచేత ఈ వంటనే ఎక్కువగా వండుతారు. గోవర్ధనగిరి ప్రక్కన మరో కొండరాతిపై మధ్యన తిరునామాలు, ఇరువైపులా శంఖ, చక్రాలు చిత్రీకరించి గోవిందా, గోవిందా అని రాశారు. స్వామి ఆలయం ముందర కోనేరు కలదు. ఇది చాలా చిన్నది. ఇందులో నీరు ఎప్పుడు ఒకే స్థాయిలో ఉంటుందట. దీని ప్రక్కన మరో గుహలో పార్వతీదేవి విగ్రహం ప్రతిష్ఠించారు.

స్వామి ఆలయదర్శనం తర్వాత భక్తులు దూరంగా కొండపై ఉన్న దేవి ఆలయానికి కొండ చీలి సన్నటి మార్గం ఏర్పడిన ద్వారం దారి నుండి ఒక్కొక్కరుగా దేవి ఆలయానికి వెళ్ళుతారు. ఎంతటి లావుపాటి వారైనా ఈ సన్నటి ద్వారం ద్వార ఎటువంటి అవరోధము లేకుండా అమ్మవారి సేవకు వెళ్లడం మరొక వింత. దేవి ఎత్తైన కొండపై చదునైన ప్రదేశంలో కొలువై ఉన్నది. ఈ దేవి మందిరము కొంత పెద్దదిగా ఉన్నది. ఆలయం గర్భగృహం, ముఖమండపాలను కలిగి ఉన్నది. గర్భగృహమందు అమ్మవారు లక్ష్మీదేవి పేరున ఆసీనముద్రలో కొలువై భక్తుల పూజలను గ్రహిస్తూ, వారిని అనుగ్రహిస్తూ ఉన్నది. దేవి సర్వాంగసుందర అలంకారభూషితయై పసుపు

పచ్చటి దుస్తులు ధరించిఉన్నది. భక్తులు అమ్మవారి దర్శనంతో తమ జన్మ ధన్యమైనదని భావిస్తూ మైమరచిపోతారు. గర్భాలయం పైన చిన్న విమానము, శిఖరము పైన కలశం కలవు.

ఆలయ గోడలు కూడ శిల్పాంకితమై ఉన్నాయి. ఆలయం వెలుపల దేవేరికి సమర్పించుటకు కొబ్బరికాయలు, చీరలు, రవికలు, పసుపుకుంకుమ మొదలగునవి విక్రయించుటకు లెక్కలేనన్ని అంగళ్లు ఉంటాయి. కొబ్బరికాయల విక్రయం వేలలో ఉంటుంది. అమ్మవారి ఆలయం నుండి వస్తూనే ఆవరణలో అనేక వృక్షాలు కలవు. వాటిని సంతానవృక్షాలు అంటారు. చాలాకాలం వివాహం కాని కన్యలు, పిల్లలు కలగని వారు, శరీరరుగ్మతలు కలవారు ఈ వృక్షాలను పూజించి భక్తితో తమ కష్టాలను తొలగించమని ముఖ్యంగా సంతానం కలుగచేయమని చెట్టు కొమ్మలకు ఉయ్యాలలు కడుతారు. దేవి మందిరం దాటి రాగానే మధ్యలో చిన్నచిన్న గుహలలో ఒక దానిలో శివలింగము, మరో దానిలో దత్తాత్రేయులు, మరో దానిలో వేంకటేశ్వరస్వామి, మరికొన్ని గుహల్లో వీరభద్రుడు, అగస్త్యేశ్వరుడు ప్రతిష్ఠింపబడ్డారు. అయితే ఒక గుహనుండి మరో గుహలోనికి వెళ్లడం మహాకష్టం. అన్నిటికంటే ముఖ్యంగా ఇచ్చటి సంతానవృక్షాలు, మరికొన్ని వృక్షాల క్రింద, నాగప్రతిమల శిలలు కలవు. ఈ నాగప్రతిమలను స్త్రీలు ఎంతో భక్తిగా పూజిస్తారు. ఇచ్చటగల చిన్న కోనేటిలోనికి మార్కండేయ నదినుండి నీరు వస్తుంది అంటారు. ఈ నదినే మున్నేరునది అంటారట.

ఈ ప్రాంతంలో ప్రతి పదిమందిలో ఒకరికి ఈ స్వామి పేర మాల్యాద్రి, మల్లమ్మ, మాలమ్మ, కొండమ్మ, కొండ మల్లమ్మ మాలకొండడు, కొండలరాయుడు, కొండడు, మాలతి అని పేర్లు ఉంటాయి. ఈ స్వామిని దర్శించటానికి వచ్చే యాత్రికులకు వారికి కావలసిన పూజావస్తువులు విక్రయించుటకు క్రింద ఆలయముఖద్వారం వద్ద శుక్రవారం రోజు వందలకొద్ది అంగళ్ళు ఏర్పాటు చేస్తారు. వీటిలో స్వామి పూజకు కావలసిన

వస్త్రాలు, పూజాద్రవ్యాలు, కొబ్బరికాయలు, అలంకార వస్తువులు, కర్పూరం పసిబిడ్డలకు ఆటవస్తువులు, తినుబండారాలు. తుదకు షికారీలు కూడా తమ వస్తువులను ఇచ్చట విక్రయిస్తారు. ఈ మాల్యాద్రి స్వామిని శనివారం తప్ప మిగతా రోజులలో దర్శించడం కుదరని పని. ఎంతోమంది మిగతా రోజులలో ఈ ఆలయానికి వెళ్ళుటకు ప్రయత్నించి విగత జీవులైనారట! గర్వంతో ఆలయానికి వెళ్ళడానికి ప్రయత్నిస్తే ఆలయముఖద్వారం నుండే విషసర్పాలు, తేళ్లు, క్రూర జంతువులు, పిశాచాలు కనపడని కొన్ని క్రూరశక్తులు వీరిని వెంటాడుతాయట. అందుచేత ఇంతవరకు శనివారం తప్ప మిగతా రోజులలో ఈ ఆలయపరిసరాలకు ఎవ్వరు వెళ్లలేదు. అలా వెళ్ళడానికి కూడా సాహసించరు.

శ్రీ లక్ష్మీనరసింహస్వామి జన్మనక్షత్రం వైశాఖమాసం శనివారం రోజున వస్తుందట. ఒకవేళ శనివారం రాకపోతే మరుసటి శనివారం స్వామి తిరునాళ్లు జరుపుతారు. ఈ స్వామిని కీర్తిస్తూ ఈ ప్రాంతంలో ప్రజలు పాడే కీర్తనలు, పాటలు, గ్రామీణ పల్లెపదాలు స్త్రీల పాటలు, కోకొల్లలు. ఉత్సవ రోజులలో స్వామివారిని వేలకొద్దీ భక్తులు వచ్చి దర్శించుకుంటారు. ప్రస్తుతం ఈ కొండ క్రింద ఉండిన అటవీప్రాంతం రాను రాను వ్యవసాయ భూములుగా మారుతూ ఉన్నాయట.

ఇలాంటి అపురూపమైన ఆలయం భారతదేశంలో మహా అరుదు అంటారు.

* * *

## మార్కాపురం - చెన్నకేశవస్వామి ఆలయము



మార్కాపురం కర్నూలు జిల్లాలో తాలూకా కేంద్రము. ఈ పట్టణము చారిత్రకముగా ప్రసిద్ధి గాంచుటేగాక, నేడు పలకల పరిశ్రమకు ముఖ్య కేంద్రముగా నున్నది. ఈ పట్టణమందలి చెన్నకేశవస్వామివారి ఆలయము అతిపురాతనమైనది. పూర్వకాలమందు గుండ్లకమ్మనదీతీరమందు గజారణ్యమనే గొప్ప అడవివుండేది. మార్కండేయ మహర్షి ఆ యడవియందు ఒక ఆశ్రమము నిర్మించుకొని నిష్ఠతో తపస్సు చేసుకొంటూ వుండేవాడు. ఒకరోజు మహర్షులవారు తపమాచరించుచుండగా 'కేసి' అనే రాక్షసుడు ఆ ప్రదేశమునకేతెంచి, మహర్షి తపస్సును భంగముచేసి అతనిని బాధించసాగినాడు. మార్కండేయ మహర్షి రాక్షసుని బాధలుపడలేక మహావిష్ణువును ప్రార్థించినాడు. భక్తుని ఆర్తనాదము విని, శ్రీహరి రాక్షసుని సంహరించుటకై ఆదిశేషుని పంపినాడు. శేషుడు 'కేసి'ని చంపగానే మహావిష్ణువు ఆ రాక్షసుని తన చేతియందు చక్రరూపంలో ధరించాడట. తన ఆపదను పోగొట్టినందుకు మార్కండేయ మహర్షి, స్వామిని శాశ్వతంగా తన ఆశ్రమంలో నివాసమేర్పరచుకొని తనచేత పూజలందుకోమన్నాడట. ఆ ఋషీశ్వరుని కోరికను కాదనలేక మహావిష్ణువు ఆశ్రమంలో స్థిరపడినాడు. ఈ కారణంచేత ఈ క్షేత్రానికి మార్కండేయక్షేత్రమని పేరువచ్చినది.

కలియుగమునందు మార్కండేయ మహర్షి ఆశ్రమము శిథిలావస్థలోనికి మారినది. ఆశ్రమపరిసరములన్నియు పెద్ద అడవిగా మారి, పొదలు, చెట్లు, పుట్టలు దట్టముగా పెరగసాగి, మానవసంచారానికి వీలులేనంత భీకరముగా తయారైనది. మార్కండేయస్వామి కోర్కెతో

ఆశ్రమంలో శిలారూపమును దాల్చిన విష్ణువు (చెన్నకేశవస్వామి) విగ్రహం చుట్టూ పెద్ద పుట్ట పెరిగి, విగ్రహం కనబడకుండాపోయినది.

కొంతకాలం తర్వాత, ఆ అడవి ప్రాంతమందు కొన్ని చిన్న గ్రామములు వెలసినవి. వాటిలో ఒకటి గొల్లపల్లి. ఈ గొల్లపల్లిలో 'మార' అనే పురుషుడు, 'మారిక' అనే స్త్రీ దంపతులుండేవారు. మారిక ప్రతిరోజు ఇంటిలో పాలుపితికి, చుట్టుప్రక్కలనున్న గ్రామాలకెళ్ళి పాలు, పెరుగు అమ్ముకొని వస్తూవుండేది. ఒకరోజు మారిక యథావిధిగా పాలు తీసుకొని వెళ్ళుతూ వుండగా ఒక పుట్టసమీపంలో 'దాహం దాహం' అనే శబ్దం ఆమెకు వినబడినది. ఆమె దాహం అని ఎవరు అరిచినది అని బిగ్గరగా అడిగినది. కాని జవాబు రాలేదు. మారిక ఆ శబ్దం ఏవైపునుండి వచ్చినదో జాగ్రత్తగా పరిశీలించి, పుట్టవద్దకు వెళ్ళి, పుట్టలో తనవద్దనున్న పాలను కుమ్మరించినది. పాలనైతే కుమ్మరించినది కాని, ఆపైన ఆమెకు ఇంట్లోవాళ్ళు డబ్బులడిగితే ఏమి చెప్పాలో తోచక, భయపడసాగినది. ఆమె భయమును చూచి పుట్టలోనున్న చెన్నకేశవస్వామి, 'దాహం' అని అరచినది తానేనని, పాలు పుట్టలో పోసినందులకు ఆమెకు ఎటువంటి అపాయము కలుగదని అభయమిచ్చినాడు. స్వామి అభయమును స్వీకరించిన మారిక రోజూ పాలుతెచ్చి, పుట్టలో పోసి, స్వామి ఆజ్ఞమేరకు గుండ్లకమ్మ నదినుండి బుట్టనిండా ఇసుక తీసుకెళ్ళి, ఇంట్లో ఒక మూల ధాన్యపుకొట్టులో పోస్తూవుండేది. ఈ విషయం మెల్లమెల్లగా ఊర్లోవారి కంటబడి, మారిక ఇంటివాళ్ళ చెవినపడినది. పెద్దలు మారికను దండించగా, ఆమె జరిగిన విషయమంతా పూసగుచ్చినట్లు చెప్పి, వారిని తాను రోజూ పాలుపోయుచున్న పుట్టవద్దకు తీసుకొనివెళ్ళినది. అంతట స్వామి తేజోమూర్తియై పుట్టనుండి వెలుపలికి వచ్చి సాక్షాత్కరించెను. ఆయన తేజస్సును ఎదుట నిలబడి చూడలేక మారిక తప్ప మిగిలినవారు మూర్ఛిల్లినారు. కొంతసేపటికి స్వామి అదృశ్యమైన తర్వాత అందరు తమ తప్పిదములను తెలుసుకొని మారికను,

స్వామిని పూజింపసాగినారు. స్వామి మారిక భర్తకు కలలో కనబడి వారి ధాన్యపుకొట్టులో మారిక పోసిన ఇసుకనుపయోగించి తనకు ఆలయం నిర్మింపమని సెలవిచ్చాడు. ఆలయనిర్మాణ కార్యక్రమమును చేపట్టి, మారిక దంపతులు ధాన్యపుకొట్టు తెరువగా, అందులోని ఇసుక మొత్తము బంగారముగా మారియుండినది. వారు ఆ సొమ్మునుపయోగించి స్వామివారికి ఆలయము నిర్మించి, అందులో పుట్టలోవున్న చెన్నకేశవస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించిరి. ఆ పుణ్యదంపతులిరువురి శిల్పములు ఆలయ గర్భగృహమునందు స్వామివారివద్ద ప్రతిష్ఠింపబడినాయి. స్వామివారికి ఇంకొకవైపున మార్కండేయ మహర్షి విగ్రహము చోటుచేసుకొన్నది. ఈ క్షేత్రానికి 'మార' పేరున మార్కాపురమని, మార్కండేయమహర్షి తపమాచరించిన క్షేత్రము కాబట్టి, మార్కండేయక్షేత్రమని పిలుస్తున్నారు.

**ఆలయనిర్మాణము**

ఈ ఆలయము ఎప్పుడు ఎవ్వరు నిర్మించిరో ఇచ్చట లభ్యమయ్యే శాసనములద్వారా తెలియుటలేదు. ఈ ఆలయమందు లభ్యమయ్యే శాసనాల్లో మొదటిది క్రీ.శ. 1533 సం॥ నాటిది. ఆలయంలోని వాస్తుశిల్పము విజయనగర దేవాలయాల శైలిలో వున్నది. అందుచేత ఈ ఆలయనిర్మాణము 16వ శతాబ్ది ప్రారంభమునందు జరిగి యుండవచ్చును. ఆలయానికి రెండు ఆవరణములున్నవి. మొదటి ఆవరణమును చేరటానికి ద్వారము, దానిపైన ఎత్తైన గోపురము వున్నది. గోపురము శిథిలమైపోగా పురజనులు క్రీ.శ. 1935 సం॥మందు జీర్ణోద్ధరణ గావించినారు. గోపుర నిర్మాణానికి ఇటుక, సున్నము విశేషంగా వాడబడినది. గోపురద్వారం గుండా ఆలయంలోని మొదటి ఆవరణము చేరగానే గరుడమండపము, ధ్వజస్తంభము, బలిపీఠము ఎదురౌతాయి. రెండవ ఆవరణమందు ప్రధానాలయమైన చెన్నకేశవస్వామి ఆలయం నిర్మితమైయున్నది. ఇందులో గర్భగృహము, అంతరాళము, ముఖమండపము, మహామండపములు వున్నవి. గర్భగృహము,

అంతరాళముల యొక్క లోపలిగోడలు, కోష్ఠములు, కూటములతో అలంకరించబడినవి. ముఖమండపము నాలుగు స్తంభముల సాయముతో నిర్మింపబడినది. మహామండపము తూర్పుపడమరలుగా 48 అడుగుల పొడవు, ఉత్తర దక్షిణములుగా 40 అడుగుల వెడల్పుగల్లి, నలభై స్తంభములతో దీర్ఘచతురస్రాకారముననున్నది. ఈ మండపమునందు స్వామికి ఎదురుగా గరుడవిగ్రహము ప్రతిష్ఠింపబడియున్నది.

గర్భగృహము పైభాగమున ఏకతల విమానము, వేసరజాతి శిఖరము, శిఖరముపైన లోహపు కలశము ఉన్నవి. గర్భగృహములో మధ్యభాగమున స్వామి విగ్రహమున్నది. స్వామికివున్న నాలుగు చేతులలో శంఖ, చక్ర, గద, శేషచక్రములున్నవి.

ప్రధాన మందిరమునకు ఎడమవైపు లక్ష్మీదేవి మందిరమున్నది. ఈ మందిరములోకూడ గర్భగృహము, అంతరాళము, ముఖమండపము, మహామండపములున్నవి. గర్భగృహముపైన ఏకతల విమానము, వేసరజాతికి చెందిన గుండ్రని శిఖరము, పైన కలశము వున్నవి. గర్భగృహములో ఆసీనమూర్తియైన లక్ష్మీదేవి విగ్రహమున్నది. ఈ దేవి ఆలయానికి సమీపమందు తొమ్మిది స్తంభాల సాయంతో నిర్మింపబడిన కళ్యాణ మండపము, ఆళ్వారుల మండపములున్నవి.

రాయలసీమలో ప్రఖ్యాతిగాంచిన వైష్ణవ ఆలయములలో మార్కాపురం చెన్నకేశవస్వామి ఆలయం ప్రముఖమైనది.

* * *